సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 18+20 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 332

గురువారం 22-2-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'నా అక్కలూ.. చెల్లెళ్లు.. తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



వేలిముద్రే బ్యాంక్ ఖాతా

టెక్నాలజీ ఆధారంగా గ్రామాల్లో బ్యాంక్ సేవలు.. ఐడీఎఫ్‌సీ బ్యాంక్ ఈడీ -బిజినెస్‌లో




బిల్లీ గ్రాహమ్ కన్నుమూత

లక్షలాది మంది క్రైస్తవుల అభిమానం పొందిన ఎవాంజలిస్ట్ -5లో

'మక్కళ్ నీది మయ్యం'

కొత్త పార్టీ పేరును ప్రకటించిన కమల్‌హాసన్



- ఐకమత్యం ప్రతీకగా జెండా రూపకల్పన
- ప్రజల చేతుల్లో ఆయుధాన్నని స్పష్టీకరణ
- అధికారంలోకి వస్తే పేదరికాన్నే పేదది చేస్తానని వ్యాఖ్య
- మదురైలో బహిరంగ సభ
- హాజరైన ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్
- కొత్త పార్టీపై వ్యంగ్యాస్త్రాలు సంధించిన డీఎంకే, ఏడీఎంకే

5 లో

నేను శక్తి — సాక్షి

ఫ్యామిలీలో..

గుండె బరువైంది

ఎద లోతుల్లో ఉన్న బాధను ఆడపిల్లలు బయటపెట్టకపోతే.. మగాళ్ల వికృత బుద్ధికి హద్దే లేకుండా పోతుంది! భార్య ఆకారాన్ని వెక్కిరించి సొమ్ము చేసుకోవాలని చూశాడు అతడు. మహిళ శక్తిని మించిన అందం లేదని.. ఆమె నిరూపించింది.

వెబ్‌సైట్‌లో..

పురుషాధిపత్య సమాజంలో మహిళలు సామాజిక అణచివేతకు, లింగ వివక్షకు గురవుతున్న ఘటనలపై తాజాగా ఐక్యరాజ్య సమితి (ఐరాస) విడుదల చేసిన నివేదిక మరింత ఆందోళనకు గురిచేసింది. వివక్ష తోడు కులం కూడా కాటేస్తున్నట్టు తెలియజేస్తున్న నివేదిక వివరాలను... www.sakshi.comలో చదవండి.

89,409 రైల్వే కొలువులు | పోస్టులు, అర్హతలు, ఎంపిక, దరఖాస్తు తదితర పూర్తి వివరాలు - భవితలో

నేషనల్ పూల్‌లోని సీట్లకు కేంద్రమే కౌన్సెలింగ్

పీజీ వైద్యసీట్లపై కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయం



- మొదటి, రెండో కౌన్సెలింగ్‌లో సీటు తీసుకోకపోతే తదుపరి కౌన్సెలింగ్‌కు నో ఎంట్రీ
- ఇకపై సూపర్‌స్పెషాలిటీ కోర్సుల్లో ప్రతి సబ్జెక్టుకూ ప్రత్యేక ప్రవేశ పరీక్ష
- అన్ని రాష్ట్రాలకూ కేంద్రం ఆదేశాలు

సాక్షి, అమరావతి: నేషనల్ పూల్‌లో ఉన్న పీజీ వైద్య సీట్లకు కేంద్రమే కౌన్సెలింగ్ నిర్వహించనుంది. ఈమేరకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని రాష్ట్రాల అధికారులకూ తెలియజేసింది. పీజీ వైద్యసీట్ల భర్తీకి జాతీయస్థాయిలో నిర్వహించిన అర్హత పరీక్ష (నీట్) ఫలితాలు ఇటీవలే విడుదల య్యాయి. జమ్మూ- కశ్మీర్ మినహా అన్ని రాష్ట్రాలు ఈఏడాది జాతీయ పూల్‌లోకి వచ్చాయి. ఇందులో

మిగతా 2వ పేజీలో ▶

ఉద్యోగులకు ఒక డీఏ

రాష్ట్ర మంత్రిమండలి భేటీలో పలు నిర్ణయాలు

- పోలవరం కాంక్రీట్ పనులు చేపట్టే నవయుగకు రూ.1,244.38 కోట్లు
- ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుకు స్వయంప్రతిపత్తి బిల్లు
- విశాఖ, తిరుపతిలో ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ కేంద్రాలు
- ఏసీబీలో 350 పోస్టుల నియామకానికి ఆమోదం

- వివరాలు 3లో

హోదాకు అడ్డెవరు?

నాలుగేళ్లుగా ఉద్యమాలపై నిర్బంధం మోపి.. హోదా కన్నా ప్యాకేజీయే మేలని ప్రచారం చేసిన సీఎం

- తప్పుడు గణాంకాలతో ఏపీ వాదనను బలహీన పరిచారు..
- ప్రత్యేక హోదాను ఆర్థిక సంఘం వద్దనలేదు
- పలుమార్లు స్పష్టం చేసిన చైర్మన్, సభ్యులు
- అదే విషయాన్ని అనేకసార్లు చెప్పిన వైఎస్సార్‌సీపీ
- ఉద్యమాలు ఉధృతమౌతుండడంతో బాబులో కలవరం
- ఇన్నాళ్లూ అడ్డుపడి... ఇపుడు హోదాకు సానుకూలమని లీకులు
- తాను కూడా అనుకూలమన్న అభిప్రాయం కలిగించే ప్రయత్నం
- అధికారిక ప్రకటన లేదు.. చంద్రబాబు మాట్లాడిందే లేదు
- ప్రభుత్వ విధానం గానీ, పార్టీ వైఖరి గానీ చెప్పరు..
- ఇప్పటికైనా సీఎంకు కనువిప్పు కలగాలంటున్న ప్రజానీకం

సాక్షి, అమరావతి

''ప్రత్యేక హోదా కుదరదు. ఇక ఏ రాష్ట్రానికీ హోదా ఉండదు అని 14వ ఆర్థిక సంఘం చెబుతోంది కాబట్టి మనకు హోదా ఇవ్వలేకపోతున్నట్లు కేంద్రం చెప్పింది. కానీ ఆ రాష్ట్రాలలో ఇప్పటికీ ప్రత్యేక హోదా కొనసాగుతున్నపుడు ఏపీకి కూడా ప్రత్యేకహోదా ఇవ్వడానికి ఆటంకం ఏమిటి?'' ఇదీ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం తర్వాత సీఎం చంద్రబాబు అన్నట్లుగా ప్రచారంలో ఉన్న లీకు వార్త సారాంశం. చంద్రబాబు కూడా ప్రత్యేక హోదాకు అనుకూలంగా ఉన్నారని ప్రచారం కల్పించడమే ఈ వార్త ప్రధాన ఉద్దేశం. అయితే ఆర్థిక సంఘం వద్దనలేదు అన్న విషయాన్ని కనుక్కోవడానికి ముఖ్యమంత్రికి నాలుగేళ్లు పట్టిందా అని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. నాలుగేళ్లుగా ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ సాక్ష్యాలతో సహా చెబుతున్నది అదే కదా అని జనం చర్చించుకుంటున్నారు. అయినా ఐదు కోట్ల ఆంధ్రులకు సంజీవని వంటి ప్రత్యేక హోదాపైన స్పష్టమైన వైఖరిని ప్రకటించకుండా లీకువార్తలతో పొద్దు పుచ్చడంలోనే ముఖ్యమంత్రి ఉద్దేశమేమిటో అర్థమౌతున్నదని విశ్లేషకులంటున్నారు. తాను హోదాకు వ్యతిరేకం కాదనే అభిప్రాయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికే ముఖ్యమంత్రి ప్రత్యేక హోదాకు అనుకూలంగా మాట్లాడారనే లీకులు మీడియాకు అందించారని వారు పేర్కొంటున్నారు. అసలు ఈ నాలుగేళ్ల ప్రత్యేక హోదాకు అడ్డం పడిందెవరు? ప్రత్యేక హోదా

మిగతా 2వ పేజీలో ▶







యూపీలో డిఫెన్స్ కారిడార్



- ప్రకటించిన ప్రధాని మోదీ
- రూ. 20 వేల కోట్ల పెట్టుబడులు, 2.5 లక్షల ఉద్యోగాలొచ్చే అవకాశం

- వివరాలు 5లో



బుధవారం ప్రకాశం జిల్లా కె.అగ్రహారంలో అక్కచెల్లెమ్మలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

నవరత్నాలతో పేదలకు భరోసా

మా అన్న చెప్పాడని అందరికీ చెప్పండి.. పాదయాత్రలో అక్కచెల్లెమ్మలతో ప్రతిపక్ష నేత జగన్

- మన ప్రభుత్వం రాగానే పేదలందరినీ ఆదుకుంటాం
- ఉన్నత చదువులకు ఎంత ఖర్చు అయినా భరిస్తాం
- చిట్టి పిల్లలను బడికి పంపే తల్లికి ఏటా రూ.15 వేలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు 45 ఏళ్లకే పింఛన్
- డ్వాక్రా మహిళలు, రైతులకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని వైఎస్ జగన్ హామీ

- వివరాలు 6లో

టీడీపీ పెద్దల వేధింపులు భరించలేకపోతున్నా..

ఓ దళిత సర్పంచ్ వ్యథ

- 6లో

- ప్రతిపక్ష నేత జగన్‌తో గోడు వెళ్లబోసుకున్న వైనం
- పార్టీ వీడుతున్నట్టు వెల్లడి.. వైఎస్సార్‌సీపీలో చేరిక

3.30 గంటలు.. రూ.500 చార్జి

హైదరాబాద్ - విజయవాడ మధ్య ప్రైవేట్ కార్ల హవా

- ప్రైవేటు బస్సుల తరహాలో స్టేజి క్యారియర్ల అవతారం
- దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్ నుంచి ప్రయాణికుల రవాణా
- నెల రోజుల నుంచి మొదలైన దందా
- భారీ డిమాండ్.. గంటకు 15 కార్ల వరకు పరుగులు
- అర్ధరాత్రి పూట మూడు గంటల్లోనే గమ్యానికి..
- ప్రమాదాలు జరిగే అవకాశం.. పట్టించుకోని రవాణా శాఖ



18 లో

టెట్‌కు తొలిరోజు హాజరు 92.56%

టెట్ కన్వీనర్ సుబ్బారెడ్డి వెల్లడి
స్వల్ప అవాంతరాలు మినహా పరీక్ష ప్రశాంతం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్-2018) బుధవారం నుంచి ప్రారంభమైంది. స్వల్ప అవాంతరాలు మినహా రాష్ట్రంలోని అన్ని కేంద్రాల్లోనూ తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని టెట్ కన్వీనర్ ఎ.సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేపర్-1కు సంబంధించి ఉదయం సెషన్‌కు 24,671 మంది హాజరు కావలసి ఉండగా 22,369 (90.67 శాతం) మంది పరీక్ష రాశారన్నారు. రెండో సెషన్‌లో 24,267 మందికి గాను 22,929 (94.49 శాతం) మంది హాజరయ్యారని

మిగతా 2వ పేజీలో ▶

మీ ఫోన్ నంబర్లు మారడం లేదు

- ఫోన్ నంబర్లను 10 నుంచి 13కి పెంచే యోచన లేదు
- సోషల్ మీడియా ప్రచారాన్ని ఖండించిన డీవోటీ
- ఎం2ఎం నంబర్లకు మాత్రమే 13 నంబర్ల వర్తింపు



సాక్షి, అమరావతి: ఫోన్ నంబర్లను కేంద్రం మారుస్తోందంటూ జరిగిన ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ప్రస్తుతం 10 సంఖ్యలుగా ఉన్న మొబైల్ నంబర్‌ను 13 సంఖ్యలకు మారుస్తున్నట్టు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమైంది. దీంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డీవోటీ) రంగంలోకి దిగి ఈ ప్రచారం అవాస్తవమని తెలిపింది. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కూడా మొబైల్ నంబర్లను 13 సంఖ్యలకు మార్చే యోచన లేదంటూ ట్వీట్ చేసింది. కేవలం 13 నంబర్లు మెషిన్ టు మెషిన్ (ఎం2ఎం) సిమ్‌లకు మాత్రమే వర్తిస్తాయని, సాధారణ సిమ్‌లకు అమలు చేయడం లేదని స్పష్టం చేసింది. మరింత భద్రత కోసం వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎం2ఎం సిమ్‌లలో 13 సంఖ్యల నంబర్లను జూలై 1 నుంచి జారీ చేయాలని డీవోటీ అన్ని టెలికాం కంపెనీలను జనవరిలో ఆదేశించింది. ప్రస్తుతం 10 నంబర్లు ఉన్న ఎం2ఎం నంబర్లను 13 సంఖ్యల్లోకి మారడానికి అక్టోబర్ 1 నుంచి అనుమతిస్తారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వెహికల్ ట్రాకింగ్, అసెట్ ట్రాకింగ్, ఎక్విప్‌మెంట్ ట్రాకింగ్ వంటి సేవలకు ఎం2ఎం సిమ్‌లను వినియోగిస్తారు. సాధారణ సిమ్‌లతో పోలిస్తే వీటిలో డేటా స్టోరేజ్ సామర్థ్యం కూడా ఎక్కువగా ఉంటుంది.

మంత్రి ఆది అనుచరులు బెదిరిస్తున్నారు

సచివాలయం ముందు బాధితుడు శ్రీనివాసరెడ్డి ఆవేదన

సాక్షి, అమరావతి బ్యూరో/తుళ్లూరు రూరల్: తనకు మంత్రి ఆదినారాయణరెడ్డి అనుచరుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి వాపోయారు. కేశవరెడ్డి యాజమాన్యం నుంచి తనకు రావాల్సిన మొత్తం కోసం అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడం లేదన్నారు. బుధవారం ఆయన తన భార్య హైమావతి పిల్లలు పవన్‌కుమార్ (8), తులసి (6), సురేష్ (4)లతో కలిసి సచివాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ విషయాన్ని ఇంతలోనే పసిగట్టిన పోలీసులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరించడంతో ఆది అనుచరులు హెచ్చరిస్తున్నారని, తనకు న్యాయం చేయకపోతే కుటుంబసమేతంగా ఆత్మహత్యకు పాల్పడతానన్నాడు. ఇందుకు మంత్రి ఆది బాధ్యత వహించాలని బాధితుడు చెప్పాడు. 2015లో రూ.5 లక్షల మొత్తాన్ని కేశవరెడ్డి యాజమాన్యానికి మధ్యవర్తి ద్వారా అందజేశానని, దీనిపై మంత్రి ఆదినారాయణరెడ్డి కాళ్లు పట్టుకుని న్యాయం చేయాలని ప్రాధేయపడినా ఆయన కనుకరించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పదిహేను రోజుల కిందట సచివాలయం వద్ద కుటుంబంతో సహా ఆందోళన చేసి సీఎం చంద్రబాబును కలిసినా న్యాయం జరగలేదని, అధికారులు స్పందించట్లేదని కన్నీటి పర్యంతమయ్యాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

బీజేపీ విజయానికి ఇదే సమయం: అమిత్‌షా

సాక్షి, బెంగళూరు: కర్ణాటక సీఎం సిద్దరామయ్య అవినీతి, దౌర్జన్య పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, బీజేపీ విజయానికి ఇదే సమయమని భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా అన్నారు. కర్ణాటకలోని తీర ప్రాంత జిల్లాల పర్యటనలో భాగంగా రెండో రోజు బుధవారం ఆయన ఉడుపిలోని కృష్ణ ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. కాగా, అమిత్‌షా 102 డిగ్రీల తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. సోమవారం రాత్రి మంగళూరుకు చేరుకున్నప్పటి నుంచే ఆయనకు జ్వరంగా ఉండటంతో.. చికిత్స అందిస్తున్నట్టు వెన్‌లాక్ వైద్యుల బృందం తెలిపింది.

స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేయండి

- మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానా విధించండి
- అధికారులకు సీఎస్ దినేశ్‌కుమార్ ఆదేశం



రోడ్డు భద్రతపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ దినేశ్‌కుమార్

సాక్షి, అమరావతి: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై భారీ జరిమానా విధించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. అతివేగం నివారణకు స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో హోం, ఆర్ అండ్ బీ, వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో జిల్లాల వారీగా జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలను సీఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల శ్రీకాకుళం, విజయనగరం, వైఎస్సార్ జిల్లాల్లో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు వారు తెలిపారు. ఈ ప్రమాదాలకు సంబంధించిన ఫొటోలను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎస్ ఆదేశించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారితో పాటు మద్యం తాగి వాహనం నడిపేతే భారీ ఎత్తున జరిమానా విధించాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, శిథిలమైన రోడ్లను మరమ్మత్తులు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. రోడ్డు సేఫ్టీ ఫండ్ కింద రూ.10 కోట్లు కేటాయించేందుకు సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ నిధులను ప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాల కొనుగోలుకు వినియోగించనున్నారు.

టెట్‌కు తొలిరోజు హాజరు 92.56%

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పారు. రెండు సెషన్లలో కలిపి 48,939 మందికి గాను 45,298 మంది (92.56 శాతం) హాజరయ్యారని వివరించారు. ఉదయం సెషన్లో కొన్ని కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు ఏర్పడగా వాటిని సరిచేశాక పరీక్ష ప్రారంభించారు. గుంటూరు జిల్లాలోని చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ క్యాంపస్ పరీక్ష కేంద్రం విషయంలో కొంత గందరగోళం ఏర్పడింది. అదే పేరుతో అక్కడ రెండు క్యాంపస్‌లు ఉండడంతో అభ్యర్థులు అటుఇటు పరుగులు తీశారు. తరువాత ఒకింత ఆలస్యమైనా వారిని పరీక్షలకు అనుమతించినట్లు అధికారులు వివరించారు. హైదరాబాద్‌లోని పరీక్ష కేంద్రం విషయంలోనూ కొంత గడబిడ నెలకొంది. ఉన్నతాధికారులు కల్పించుకొని అక్కడ సమస్యను సర్దుబాటు చేయించి పరీక్ష సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక హోదాకు అడ్డెవరు?

▶ మొదటి పేజీ తరువాయి

శుద్ధ దండగ అని వాదించిందెవరు? ప్రత్యేక హోదాతో ఏం వస్తుంది అదేమన్నా సంజీవనా అని ప్రశ్నించిందెవరు? హోదా కన్నా ప్యాకేజీ మెరుగైనదని ప్రచారం చేసిందెవరు? అని గతంలో బాబు చేసిన వ్యాఖ్యలను వారు గుర్తుచేస్తున్నారు.



ప్రభుత్వ వైఖరిగానీ, పార్టీ వైఖరిగానీ చెప్పరా..

ప్రత్యేకహోదా కోసం నాలుగేళ్లుగా ప్రతిపక్షనేత అలుపెరుగకుండా జరుపుతున్న పోరాటం మరింత ఉధృతరూపం తీసుకుంది. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రజలు ఎక్కడికక్కడ ఉద్యమిస్తున్నారు. రోడ్లెక్కి వచ్చి నినదిస్తున్నారు. మేధావులంతా సదస్సులు, సమావేశాలు జరుపుతున్నారు. భవిష్యత్ కార్యాచరణకు అటు ప్రజలు, ఇటు రాజకీయపార్టీలు, వివిధ ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సన్నద్ధమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో ప్రత్యేకహోదాపైనా, అందుకోసం జరుగుతున్న పోరాటాలపైనా బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న చంద్రబాబు స్పష్టమైన వైఖరి చెప్పకుండా లీకువీరుల ద్వారా పై విషయాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలలో తనపట్ల వ్యక్తమౌతున్న వ్యతిరేకతను తప్పించుకునేందుకే ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారు తప్ప రాష్ట్ర ప్రయోజనాలపై చిత్తశుద్ధితో కాదన్న విమర్శలున్నాయి. కీలకమైన సమన్వయ కమిటీ సమావేశాలు జరుపుతుండడంతో ప్రభుత్వం తరఫున అధికారిక ప్రకటన చేస్తారనుకున్న వారికి నిరాశే ఎదురయ్యింది. ప్రజలలో పెరుగుతున్న భావోద్వేగాలను గమనించి తాను హోదాకు వ్యతిరేకం కాదనే లీకులిస్తూ తాను కూడా వాళ్లలో ఒకడిలా చూసుకోవడమే ఆయన ఎత్తుగడలా కనిపిస్తున్నదని జనం చర్చించుకుంటున్నారు. ప్రజలంతా ప్రత్యేకహోదా కోసం పోరాడుతుండడంతో తానూ అందు కోసం కృషి చేస్తున్నాను అనే భావన కల్పించడం కోసమే మీడియాకు లీకులిస్తున్నారని విశ్లేషకులంటున్నారు.

మన వాదనను బలహీన పరిచినదెవరు?

కలిసి పోటీచేసిన కేంద్ర ప్రభుత్వంతో అధికారాన్ని పంచుకుంటూ ప్రత్యేకహోదా కోసం ముందుండి పోరాడాల్సిన సీఎం పోరాడేవాళ్లను అడ్డుకుంటూ కేవలం ప్యాకేజీని స్వాగతించడం పట్ల అప్పట్లో తీవ్రస్థాయిలో నిరసనవ్యక్తమయ్యాయి. సాధించాల్సిన స్థానంలో ఉండి సాధించకపోగా హోదాను ప్రజల మనసుల్లోంచి తీసేసే ప్యాకేజీయే ఉత్తమం అనే భావనను చొప్పించేందుకు స్వయంగా ఆయనే ప్రయత్నించడం పట్ల కూడా విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ప్రత్యేక హోదా కోసం ముందుండి పోరాడవలసిన సీఎం చంద్రబాబు ఆ పని చేయకపోగా నిజానికి మన వాదన బలహీన పడడానికి కారణమయ్యారని అంటున్నారు. జీఎస్‌డీపీ గణాంకాలను పెంచి చూపించారు. దేశంలోనే జీడీపీ 6.7శాతం వృద్ధి ఉంటే ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీ 12శాతానికి పైగా వృద్ధి ఉందని ప్రచారం చేశారు. రెండు భాగస్వామ్య సదస్సులు నిర్వహించి రూ.15 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చేశాయని ముఖ్యమంత్రి ప్రచారం చేశారు. ఇలా పెంచి ప్రచారం చేస్తున్న గణాంకాలు ఎడాపెడా అప్పులు చేయడానికి ఉపయోగపడ్డాయి. ఈ తప్పుడు గణాంకాల వల్ల మనకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. ప్రత్యేకహోదాను అడ్డుకుంటున్నామన్న స్పృహ ముఖ్యమంత్రికి లేకుండా పోయిందని విశ్లేషకులంటున్నారు. ప్యాకేజీ కోసం, అదనపు అప్పులకోసం మాత్రమే ఆయన పనిచేశారు. ప్యాకేజీతో వచ్చే నిధుల నుంచి కమీషన్లు, అంచనాలు పెంచుకొని తీసుకోవాలనుకోవడం మాత్రమే ఆలోచించారు. అంతేగానీ న్యాయంగా, ధర్మంగా మనకు రావలసిన ప్రత్యేక హోదా కోసం వత్తిడి చేసి సాధించాలన్న ఆలోచన చేయలేదు. పైగా పలు సందర్భాల్లో అనేక రకాలుగా వ్యాఖ్యానాలు చేసి మన వాదనను బలహీన పరిచారు.

14వ ఆర్థిక సంఘానికి సంబంధమేమిటి?

14వ ఆర్థిక సంఘం చెబుతోంది కాబట్టి ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేకపోతున్నట్లు కేంద్రం చెప్పిందని అంటున్నారు. అయితే 14వ ఆర్థిక సంఘానికి ఎలాంటి సంబంధమూ లేదని, తాము అలాంటి సిఫార్సులేవీ చేయలేదని 14వ ఆర్థిక సంఘం చైర్మన్ వైవీ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్థిక సంఘం సభ్యుడు అభిజిత్‌సేన్ లిఖిత పూర్వకంగా కూడా వివరించారు. అసలు 14వ ఆర్థిక సంఘానికి ఏపీ ప్రత్యేక హోదాకు ఎలాంటి సంబంధమూ లేదు. 2015 ఏప్రిల్‌లో ఏర్పడిన 14వ ఆర్థిక సంఘం 2020 మార్చి 31 వరకు అమలులో ఉంటుంది. పార్లమెంటులో హామీ ఇచ్చిన మేరకు ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడానికి సంబంధించి 2014 మార్చి 2న నాటి కేంద్రకేబినెట్ తీర్మానం చేసింది. ఆ రోజున 13వ ఆర్థిక సంఘం పనిచేస్తోంది. ఆ తీర్మానాన్ని అమలు చేయాల్సిందిగా ఆదేశిస్తూ నాటి ప్రణాళికా సంఘానికి కేబినెట్ పంపించింది. ఆ తర్వాత 14వ ఆర్థిక సంఘం అమలులోకి వచ్చే వరకు దాదాపు ఏడునెలల పాటు ఆనాటి ప్రణాళికా సంఘం వద్ద ఈ ప్రత్యేక హోదా ఫైలు పెండింగ్‌లో ఉంది. అంటే 14వ ఆర్థిక సంఘం ఆవిర్భావానికి ముందే కేంద్ర కేబినెట్ సిఫార్సు చేయడం కూడా జరిగిపోయింది. కనుక ఆర్థిక సంఘం అడ్డుచెప్పిందన్న వాదన తప్పు అని అర్థమౌతోంది.

హోదాపై పూటకోమాట

ఐదుకోట్ల మంది ఆంధ్రుల భవితవ్యానికి సంబంధించిన ప్రత్యేక హోదాపై కేంద్రంపై ఒత్తిడి చేయడానికి గానీ, దానిని సాధించడానికి గానీ చంద్రబాబుకు మనసొప్పలేదు. చంద్రబాబు చేసినన్ని విరుద్ధమైన ప్రకటనలు మరెవరూ చేసి ఉండరు. ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదా సంజీవని అన్నారు. ప్రత్యేక హోదా పదేళ్లు కూడా సరిపోదు.. పదిహేనేళ్లు కావాలని ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్ర మోదీ సాక్షిగా సభలలో డిమాండ్ చేశారు. తమ కూటమి గెలిస్తే ఏపీకి పదిహేనేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామన్నారు. ఎన్నికలు ముగిసిన వెంటనే చంద్రబాబు మాటమార్చారు. 14వ ఆర్థిక సంఘం కుదరదన్నది.. నీతి ఆయోగ్ వద్దంటోంది.. అంటూ హోదాకు మంగళం పాడేశారు. ప్రత్యేకహోదా ఇవ్వడానికి ఆర్థికసంఘం, నీతిఆయోగ్‌లకు సంబంధంలేదని, జాతీయఅభివృద్ధిమండలి చైర్మన్ హోదాలో ప్రధానమంత్రి ఒక్క సంతకం చేస్తే ఏ రాష్ట్రానికైనా ప్రత్యేకహోదా ఇవ్వవచ్చని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ పలుమార్లు చెబుతూ వచ్చింది. అయితే ప్రత్యేకహోదాకు వీలుకాదని, హోదాకు సమానంగా కేంద్రం నిధులు ఇస్తానంటోందని, ప్రత్యేక హోదాతో వచ్చేవన్నీ ఇస్తున్నందుకే ప్యాకేజీకి ఒప్పుకున్నామని ఇలా చంద్రబాబు రకరకాల సాకులు చెప్పారు. హోదా ఏమన్నా సంజీవనా అని ప్రశ్నించారు. హోదాతో ఏం వస్తాయి? అని అడిగారు. హోదా కన్నా మెరుగైన ప్యాకేజీ ఇస్తామంటే వద్దంటామా అని అంటూ కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా అని ఎద్దేవా చేశారు.

హోదా ఉద్యమంపై అంతులేని నిర్బంధం..


ప్రత్యేకహోదా కోసం తాను ముందుండి పోరాడవలసిన ముఖ్యమంత్రి పోరాటం చేస్తున్నవారిపై నిర్బంధం ప్రయోగించారు. ముఖ్యంగా ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ప్రత్యేక హోదా కోసం అనేక రూపాలలో పోరాడింది. ధర్నాలు, రాస్తారోకోలు, కలెక్టరేట్ల ముట్టడి, రాష్ట్రబంద్‌లు నిర్వహించింది. ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ నుంచి గల్లీ వరకు పలుమార్లు నిరసన దీక్షలు నిర్వహించారు. చివరకు ఆమరణ నిరాహార దీక్ష కూడా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రత్యేక హోదా కోసం ఏ పోరాటానికి పిలుపునిచ్చినా పార్టీ ముఖ్యనాయకులందరినీ పోలీసులు హౌస్ అరెస్టులు చేశారు. బైటకనిపిస్తే అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. లాఠీచార్జీలు జరిపారు. ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుని మరీ బంద్‌లు విఫలమయ్యేట్లు చేసేవారు. బస్సులను బలవంతంగా తిప్పించి బంద్ ప్రభావం లేకుండా చేసేవారు. ప్రత్యేక హోదా భావన సజీవంగా ఉండడానికి, యువతలో హోదా పట్ల చైతన్యం రగలడానికి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ముఖ్య పట్టణాలలో నిర్వహించిన యువభేరి కార్యక్రమాలు విశేషంగా దోహదపడ్డాయని, అయితే ఆ సదస్సులు జరక్కుండా చేయడానికి రాష్ట్రప్రభుత్వం అనేక రకాలుగా ప్రయత్నించిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడొకరు వివరించారు. చివరకు యువభేరి సదస్సులకు హాజరైతే విద్యార్థులపై పీడీయాక్టు ప్రయోగిస్తామని కూడా స్వయంగా చంద్రబాబు బెదిరించారని ఆయన గుర్తుచేశారు.

మనమే ఎక్కువ సాధించామన్నారు..

ప్రత్యేకహోదా కన్నా ప్రత్యేక ప్యాకేజీ ఎంతో మేలైనదని చంద్రబాబు ప్రచారం చేశారు. మనమే ఎక్కువ సాధించామని, ఏ రాష్ట్రానికైనా ఇంతకన్నా ఎక్కువ రాలేదని నాలుగేళ్లుగా చంద్రబాబు చెబుతూ వచ్చారు. ప్రత్యేక హోదాతో వచ్చేవన్నీ ఇస్తున్నందునే ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్నామన్నారు. హోదాలో పరిశ్రమలకు రాయితీలు లేవన్నారు. కేంద్రానికి ధన్యవాదాలు చెబుతూ అసెంబ్లీలో తీర్మానాలు చేశారు. ప్యాకేజీలో లేనిదేంటి? హోదాతో జరిగే మేళ్లేమిటి? అని ప్రశ్నించారు. అలా ప్యాకేజీ గురించి ప్రచారం చేస్తూ ప్రత్యేక హోదా వాదనను బలహీనపరిచేందుకు చంద్రబాబు ప్రయత్నం చేశారు. ప్రత్యేక హోదా రాకపోవడానికి నాలుగేళ్లు కారణమైనది చంద్రబాబే. కేబినెట్ సమావేశంలో, సమన్వయ కమిటీలో ప్రత్యేక హోదా మంచిదేనని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించినట్లు లీకులు వస్తున్నాయి. అవి నిజమైతే సంతోషమేనని ప్రజలు భావిస్తున్నారు. దీనికి సంబంధించి ఆయనే స్వయంగా మాట్లాడతారా.. లేకపోతే ఏదైనా ప్రకటన చేస్తారా అన్నది చూడాల్సి ఉంది. దీంతోపాటు హోదాను విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలను ఆయన వెనక్కు తీసుకుంటారా అన్నది కూడా చూడాల్సి ఉందని విశ్లేషకులంటున్నారు.

ప్రత్యేక హోదాపై వివిధ సందర్భాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలివీ..

18.5.2016	హోదాతో ఏం వస్తుంది? హోదా ఇచ్చి నిధులు ఇవ్వకపోతే ఏం లాభం? ఈశాన్యరాష్ట్రాలు ఏం బాగుపడ్డాయి?
19.5.2016	హోదాతోనే అంతా కాదు. హోదా సంజీవని కాదు. అందుకే ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని ప్రధానికి విన్నవించా.
11.9.2016	ప్రత్యేక హోదావస్తే ఏం వస్తుంది? ప్యాకేజీ వద్దంటే అభివృద్ధి పనులకు ఆటంకం.
16.9.2016	హోదాతో పరిశ్రమలు రావు. పారిశ్రామికరాయితీలకు హోదాకు సంబంధం లేదు.
18.9.2016	ప్రత్యేక హోదాతో ప్రయోజనం సున్నా. దానివల్ల పారిశ్రామిక రాయితీలు రావు. వస్తాయని నిరూపిస్తే దేనికైనా సిద్ధం
23.9.2016	హోదాకన్నా మెరుగైన ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. ప్యాకేజీపై విస్తృత ప్రచారం చేయండి.
4.2.2017	హోదా వేస్ట్, ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలలో పరిశ్రమలకు ప్రోత్సాహకాల్లేవు
16.2.2017	ప్రత్యేక హోదాతో ప్రయోజనం సున్నా. హోదాతో వచ్చేవన్నీ ప్యాకేజీలో ఇస్తామన్నారు.



బాబు డ్రామాలన్నీ ప్రజలు చూస్తున్నారు

- సొంత ప్రయోజనాల కోసమే ప్యాకేజీ
- సరైన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారు
- హోదా కోసం రాజీనామాలకు, అవిశ్వాసానికి వైఎస్సార్‌సీపీ సిద్ధం
- చంద్రబాబుకు దమ్ముంటే కలసి రావాలి
- ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు డ్రామాలన్నీ జనం చూస్తున్నారని, సరైన సమయంలో బుద్ధి చెప్తారని ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. స్వప్రయోజనాల కోసం హోదాను వదిలేసి ప్యాకేజీ తీసుకొని చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చేస్తున్న ప్రజా సంకల్పయాత్రలో పాల్గొన్న ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. దివంగత ఎన్టీఆర్ తెర మీద నటిస్తే, బాబు నిజ జీవితంలో నటించటంలో ఆయన్ను మించిపోయాడని దుయ్యబట్టారు. టీడీపీ తాజాగా చేయించుకున్న సర్వేలో ప్రత్యేక హోదా విషయంలో ఎన్డీఏ, టీడీపీ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో విఫలమయ్యాయని, ప్రజలు విలన్లుగా చూస్తున్నారని తేలిందన్నారు. దీంతో చంద్రబాబు మళ్లీ కొత్త డ్రామాలాడుతున్నారన్నారని విమర్శించారు. 14వ ఆర్థిక సంఘం చెప్పడం వల్లే హోదాను పక్కనపెట్టి ప్యాకేజీని ఒప్పుకున్నామని చంద్రబాబు చెబుతున్నాడని, ఇంత అనుభవం కలిగిన ముఖ్యమంత్రి ఇలా మాట్లాడటం విడ్డూరమన్నారు. నిజానికి ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వబోమని గానీ, ఇవ్వొద్దని గానీ 14వ ఆర్థిక సంఘం ఎక్కడా చెప్పలేదన్నారు. ఈ విషయం చైర్మన్ అభిజిత్ సేన్ ఎప్పుడో చెప్పారని గుర్తు చేశారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సాధించుకునే అవకాశం ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు హోదా సంగతి పట్టించుకోలేదని ఎంపీ విమర్శించారు. కేంద్రంలో మంత్రి పదవుల కోసం బేరసారాలు చేసుకున్నారా? అందుకోసమే వారు చెప్పిందల్లా ఒప్పుకున్నారా? అని ప్రశ్నించారు. అమరావతి రాజధాని ఎంపిక, అమరావతిలో భూములు దండుకునే కార్యక్రమం జరిగి రైతులు గగ్గోలు పెట్టినా అఖిలపక్షం వేయలేదు.. హోదాను తాకట్టు పెట్టే సమయంలోనూ అఖిలపక్షం సలహా తీసుకోలేదు. ఇప్పుడు కొత్తగా అఖిలపక్షం అంటూ తప్పించుకునే ప్రయత్నానికి దిగడంపై ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవిశ్వాసం పెట్టి తీరుతాం..

అవిశ్వాసం విషయంలో వైఎస్సార్‌సీపీ తరఫున 184 నోటీస్ ఇచ్చామని ఎంపీ వైవీ తెలిపారు. దాని మీద పార్లమెంట్‌లో మార్చి 5 నుంచి 20వ తేదీ వరకు చర్చ జరిగేలా స్పీకర్‌తో మాట్లాడతామన్నారు. బీఎస్ఈ సమావేశంలో స్పీకర్‌పై ఒత్తిడి తెస్తామని, చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే 184కు మద్దతు తెలపాలన్నారు. దీంట్లో సఫలీకృతం కాలేకపోతే మా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ చెప్పిన మేరకు 21వ తేదీన ఎవరు మద్దతు ఇచ్చినా.. ఇవ్వకపోయినా అవిశ్వాస తీర్మానం పెట్టి రాష్ట్ర ప్రయోజనాల కోసం చిత్తశుద్ధిని నిరూపించుకుంటామని స్పష్టం చేశారు. అప్పటికీ హోదా గురించి ప్రకటన రాకపోతే ఏప్రిల్ 6న మా ఎంపీ పదవులకు రాజీనామా చేస్తామని ప్రకటించారు.

టీడీపీని బీజేపీలో విలీనం చెయ్యి

- చంద్రబాబుపై ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి నాని
- ఓటుకు కోట్లు కేసుతో కేంద్రం చేతిలో బొమ్మగా మారావు
- ప్రజలను గందరగోళంలోకి నెట్టేందుకు చంద్రబాబు, పవన్ కుట్ర



విజయవాడ సిటీ: ఓటుకు కోట్లు కేసుతో కేంద్రం చేతిలో కీలుబొమ్మగా మారి వాళ్లు ఏది చెబితే దానిని ముందుకు తీసుకెళ్లే చంద్రబాబు తన తెలుగుదేశం పార్టీని బీజేపీతో విలీనం చేయాలని గుడివాడ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే కొడాలి నాని సూచించారు. ఆయన బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ... తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనలతో చంద్రబాబుకు దిమ్మదిరిగి ఏం చేయాలో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. కేసులకు భయపడి ప్రత్యేక హోదా అంశాన్ని తాకట్టుపెట్టిన చంద్రబాబు... ఇప్పుడు కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. ప్రత్యేక హోదా సాధన కోసం జగన్ ఎంపీలతో రాజీనామా ప్రకటన, అవిశ్వాస తీర్మానం, ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. దీంతో నాలుగేళ్లుగా నాటకాలు ఆడుతున్న చంద్రబాబుకు ఏం చేయాలో అర్థం కావడం లేదన్నారు. అందుకే తన భాగస్వామి పవన్‌కల్యాణ్‌ను తెరపైకి తీసుకువచ్చి ప్రజలను గందరగోళంలోకి నెట్టే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నాడని దుయ్యబట్టారు. "ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తిత్వం వైఎస్ జగన్‌ది. చంద్రబాబుకు కుట్రలు, కుతంత్రాలు చేయడం వెన్నతోపెట్టిన విద్య. ఆయనను ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరు. అన్యాయంగా రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే టీడీపీకి కూడా పడుతుంది'' అని వ్యాఖ్యానించారు. అధికారం కోసం ఆయన ఎంతవరకైనా దిగజారుతాడని విమర్శించారు. టీడీపీని మోడీ చేతిలో పెడితే రాష్ట్రానికి నిధులొస్తాయన్నారు.

నేషనల్ పూల్‌లోని సీట్లకు కేంద్రమే కౌన్సెలింగ్

▶ మొదటి పేజీ తరువాయి

భాగంగా ఆంధ్రప్రదేశ్ 50 శాతం సీట్లను నేషనల్ పూల్‌కు ఇవ్వాలి. మిగతా రాష్ట్రాలు ఇచ్చే 50 శాతం పీజీ వైద్య సీట్లకూ మన అభ్యర్థులు పోటీ పడవచ్చు. కాగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వచ్చే నేషనల్ పూల్ సీట్లకు కేంద్రమే కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేయాలని నిర్ణయించింది. మిగతా 50 శాతం సీట్లను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే భర్తీ చేసుకుంటాయి. ఇందులో కూడా కొన్ని నిబంధనలు విధించారు. మొదటిసారి కౌన్సెలింగ్‌కు వచ్చిన అభ్యర్థి సీటు ఎంపిక చేసుకోకపోయినా రెండోసారి కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చు. రెండో సారి కూడా సీటు ఎంపిక చేసుకోకపోతే ఆ అభ్యర్థిని తదుపరి విడతల్లో కౌన్సెలింగ్‌కు అనుమతించరు. సీటు ఎంచుకున్న అభ్యర్థి ఐదు రోజుల్లోగా కళాశాలలో చేరకపోతే సీటు రద్దు చేస్తారు. వీలైనంత త్వరలో రాష్ట్ర ర్యాంకులు వెల్లడిస్తామని కేంద్ర అధికారులు తెలిపారు.

సూపర్ స్పెషాలిటీకి ప్రత్యేక పరీక్ష

సూపర్ స్పెషాలిటీ (బ్రాడ్ స్పెషాలిటీ) ప్రవేశాలకు సంబంధించి ఇకపై ప్రతి సబ్జెక్టుకూ ప్రత్యేక ప్రవేశ పరీక్ష నిర్వహించాలని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఉదాహరణకు గతంలో పీజీ జనరల్ మెడిసిన్ చేసిన అభ్యర్థులు సూపర్ స్పెషాలిటీ సీటుకు పోటీపడితే ఎండీ న్యూరాలజీ కానీ, ఎండీ కార్డియాలజీ కానీ, ఇలా నాలుగైదు సబ్జెక్టుల్లో ఏదో ఒకటి తీసుకునేవారు. అదే ఎంఎస్ జనరల్ సర్జరీ అర్హతతో సూపర్ స్పెషాలిటీకి పోటీపడిన వారు న్యూరో సర్జరీకి గానీ, కార్డియో థొరాసిక్ సర్జరీకి గానీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీకి గానీ పోటీ పడేవారు. ఇకపై ఇలా కాకుండా సూపర్ స్పెషాలిటీ విభాగంలో ప్రతి కోర్సుకూ ప్రత్యేక ప్రవేశ పరీక్ష నిర్వహించి అడ్మిషన్లు ఇవ్వాలని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ప్రస్తుత పద్ధతిలో చాలామంది ప్రాధాన్యమున్న కోర్సుల్లో చేరడం వల్ల ప్రాధాన్యం లేని కోర్సులు ఖాళీగా ఉండేవని, దీనివల్ల గతేడాది చాలాసీట్లు మిగిలిపోయినందున ఈ నిబంధన తెరమీదకు తెచ్చినట్లు కేంద్ర అధికారులు తెలిపారు. వాస్తవానికి ఈ పద్ధతి గతంలో ఉండేదని, దీన్ని తిరిగి మళ్లీ అమల్లోకి తీసుకువస్తున్నట్టు వైద్యవిద్యా శాఖ అధికారులు చెప్పారు.

దేశవ్యాప్తంగా 22,038 పీజీ సీట్లు

దేశవ్యాప్తంగా మొత్తం 22,038 పీజీ వైద్య సీట్లు ఉన్నట్టు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్ధారించింది. ఇందులో ప్రభుత్వ కళాశాలల్లో 14202 సీట్లు ఉన్నాయి. తాజాగా భారతీయ వైద్య మండలి మరికొన్ని సీట్ల కేటాయించడంతో సీట్లు పెరిగే అవకాశం ఉంది. మన రాష్ట్రానికి సంబంధించి ప్రస్తుతం 1681 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ కళాశాలల్లో 781 పీజీ వైద్యసీట్లు ఉన్నాయి. ఇందులో 391 సీట్లు జాతీయ పూల్‌లోకి ఇవ్వాల్సి ఉంది. మొదటి కౌన్సెలింగ్ లోగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు పెరిగితే అవికూడా అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

ప్రైవేటు సీట్లూ నీట్ ర్యాంక్ ఆధారంగానే...

రాష్ట్రవ్యాప్తంగా 11 ప్రైవేటు కళాశాలల్లో ఉన్న సుమారు 900 సీట్లను నీట్ ర్యాంకుల ఆధారంగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ భర్తీ చేస్తుంది. ఇందులో మూడు కేటగిరీలు ఉంటాయి. కన్వీనర్‌కోటా కింద 50 శాతం సీట్లు ఉంటాయి. వీటికి ఫీజు ఏడాదికి రూ.6.90 లక్షలు ఉంటుంది. యాజమాన్య కోటాకింద 25 శాతం సీట్లు ఉంటాయి. దీనికి ఏడాదికి రూ.24 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రవాస భారతీయ కోటా సీట్లు 15 శాతం ఉంటాయి. వీటికి ఏడాదికి యాజమాన్యకోటా సీట్లకు చెల్లించే ఫీజుకు 3 రెట్లు మించకుండా వసూలు చేసుకోవచ్చు. మరో 10 శాతం యాజమాన్యాల ఇష్టాయిష్టానికి భర్తీ చేసుకోవచ్చు. ఇది కూడా యాజమాన్యకోటా ఫీజులో 3 రెట్లు మించకుండా వసూలు చేసుకోవచ్చు. ఈ మూడు కేటగిరీల సీట్ల భర్తీ కూడా నీట్ ర్యాంకుల ఆధారంగానే భర్తీ చేస్తారు. ప్రతి ఏడాదీ ఫీజు 5 శాతం పెరుగుతుందనేది తెలిసిందే.

ఏపీలో పీజీ వైద్యసీట్ల వివరాలు ఇలా

రీజియన్	సీట్లు
ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో	435
ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో	356
సిద్ధార్థ వైద్యకళాశాల	089
ఏయూ కన్వీనర్ కోటా	253
ఏయూ యాజమాన్య	314
ఎస్వీయూ కన్వీనర్	106
ఎస్వీయూ యాజమాన్య	128

ఇదండీ సంగతి



మీ గన్‌మెన్ కాద్సార్!
మన సీఎస్.. ఆత్మరక్షణ కోసమట!!

ఉద్యోగులకు ఒక డీఏ మంజూరు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక విడత కరువు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం తాత్కాలిక సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి కాల్వ శ్రీనివాసులు మీడియాకు వెల్లడించారు.

2017 జనవరి 1 నుంచి వర్తింపు

ఉద్యోగులకు 2015 వేతన సవరణ మేరకు డీఏ 22.008 శాతం నుంచి 24.104 శాతానికి పెంచారు. 2.096 శాతం మేర పెరిగిన కరవు భత్యం 2017 జనవరి 1 నుంచి వర్తిస్తుంది. యూజీసీ స్కేల్ వర్తించే వారికి డీఏ 132 నుంచి 136 శాతానికి పెరగనుంది. పాత బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలో జమ చేస్తారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులకు మార్చి నెల వేతనంతోపాటే పెంచిన డీఏ మొత్తం అందనుంది. కరవు భత్యం పెంపు వల్ల ప్రతి నెలా రూ.69.91 కోట్లు, ఏడాదికి రూ.838.87 కోట్ల చొప్పున ప్రభుత్వంపై భారం పడనుంది. గ్రామ సహాయకుల(వీఆర్ఏ)కు తాత్కాలికంగా నెలకు రూ.300 చొప్పున పెంచారు. దీనివల్ల ఏడాదికి మరో రూ.6.57 కోట్ల భారం పడనుంది.

ఇవీ ఇతర నిర్ణయాలు..

- పోలవరంలో నామినేషన్ పద్ధతిపై కాంక్రీట్ పనులు చేపట్టే నవయుగ ఇంజనీరింగ్ కంపెనీకి రూ.1,244.36 కోట్లు మంజూరు చేసేందుకు అనుమతులిస్తూ నిర్ణయం.
- ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుకు స్వయం ప్రతిపత్తి కల్పించే డ్రాఫ్టు బిల్లుకు ఆమోదం. ఏపీ ఈడీబీ చట్టం–2018 అనుసరించి స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు, స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీలకు కూడా స్వయం ప్రతిపత్తి కల్పించేలా బిల్లు రూపొందించారు.

రాష్ట్ర మంత్రిమండలి భేటీలో పలు నిర్ణయాలు


మంత్రివర్గ భేటీలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రులు

- విశాఖ, తిరుపతిలో ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్ల(సినిమా, వినోదం) ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం. విశాఖ(జీవీఎంసీ)లో 2.7ఎకరాల్లో, తిరుపతి(తుడా) అన్నమయ్య సర్కిల్‌లో 3.72 ఎకరాల్లో 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన రూ.25 కోట్లు చొప్పున పీపీపీ పద్ధతిలో రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ఒప్పందం కుదుర్చుకోనున్నారు. 23 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కన్వెన్షన్ సెంటర్, 80 వేల చదరపు అడుగుల్లో ఫుడ్ కోర్టులు, వాణిజ్య సముదాయం ఏర్పాటు చేస్తారు. 6 మల్టీప్లెక్స్ స్క్రీన్లతో ఐమ్యాక్స్ థియేటర్, 3 స్టార్ హోటల్ నిర్మిస్తారు. ఖర్చులను ఏపీటీడీసీ భరించి పర్యాటక ప్రాజెక్టుగా దీన్ని నిర్వహిస్తుంది.
- రాష్ట్రంలో 42 నాన్ అమృత్ పట్టణాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మంత్రిమండలి నిర్ణయం. ఎక్స్‌టెర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టుల క్రింద ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) చేపట్టిన అన్ని ప్రాజెక్టులకు పబ్లిక్ హెల్త్, మెడికల్ ఇంజనీరింగ్ విభాగాన్ని సింగిల్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా నియమించేలా నిర్ణయం. రూ.4,188.71 కోట్ల ప్రాజెక్టు వ్యయం కోసం పరిపాలనా ఆమోదం. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,116.99 కోట్లు, పురపాలక సంస్థలు రూ.465.41 కోట్లు, ఎక్స్‌టర్నల్ ఏజెన్సీల నుంచి రూ.2,066.31 కోట్లు చొప్పున ప్రాజెక్టుకు ఫైనాన్సింగ్ చేస్తాయి. ఆంధ్రప్రదేశ్ అర్బన్ వాటర్ సప్లై అండ్ సెప్టేజ్ మేనేజ్మెంట్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్ (ఏపీయూడబ్ల్యుఎస్ఎస్ఎంఐపీ) కింద ఈ ప్రాజెక్టు చేపడతారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను నోడల్ ఏజెన్సీగా నియమిస్తూ, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టరుకు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంటు బ్యాంకుతో వివిధ ఒప్పందాలను చేసుకునే బాధ్యతను అప్పగిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది.
- అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)లో కొత్తగా 350 పోస్టుల భర్తీకి మంత్రిమండలి ఆమోదం. 300 ఖాళీలను నేరుగా, 50 ఖాళీలను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. రూ.24.41 కోట్లు జీతాల కింద చెల్లిస్తారు. ఏసీబీలో జాయింట్ డైరెక్టర్ స్థాయి నుంచి కంప్యూటర్ ప్రోగ్రామర్ వరకు వివిధ స్థాయిల్లో ఈ నియామకాలను ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది.
- కృష్ణా జిల్లా గన్నవరం అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టు కోసం కొత్తగా 25 పోస్టులు మంజూరు. సీనియర్ సివిల్ జడ్జి, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర పోస్టుల భర్తీ కోసం ఏడాదికి రూ.1.46 కోట్లు వ్యయం కానుంది
- శాసన సభాపతి కోసం పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్‌వో) నియామకానికి వీలుగా ఒక పోస్టును సృష్టిస్తూ మంత్రివర్గం నిర్ణయం.
- విజయవాడ విద్యాధరపురంలో వార్డు నెంబర్ 13లో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటుకు 0.92 సెంట్లను కేటాయిస్తూ మంత్రిమండలి నిర్ణయం.
- శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం సంచాం గ్రామంలో 44.97 ఎకరాల ప్రభుత్వ భూమి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోం ఏపీఐఐసీకి ఉచితంగా కేటాయింపు.

మూడింటికి ఒకటిస్తారా?

మూడు కరువు భత్యాలు (డీఏ) పెండింగ్‌లో ఉండగా ఒక్కటి మాత్రమే ఇవ్వాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడంపై ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మూడు డీఏలు ఇవ్వాల్సి ఉంటే ముష్టి విదిల్చినట్లు ఒక్క డీఏ విడుదల చేయాలని నిర్ణయించడం ఎలా సబబని ప్రశ్నిస్తున్నారు. 'మొత్తం మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. కరువు భత్యం విడుదల చేయాలని ఉద్యోగులు వినతిపత్రాలిచ్చినా ఒక్క డీఏ మాత్రమే విడుదల చేయాలని నిర్ణయించడం అన్యాయం' అని నేతలు విమర్శిస్తున్నారు. మరోవైపు పదో పీఆర్సీకి ఇక నాలుగు నెలల గడువు మాత్రమే ఉంది. జూలై 1 నుంచి 11వ పీఆర్సీ అమల్లోకి రావాలి. ఇప్పటికే నాలుగున్నరేళ్లు గడిచినా రూ.4,500 కోట్లకు పైగా పీఆర్సీ బకాయిలను చెల్లించలేదు. 11వ పీఆర్సీ ఛైర్మన్ నియామకం విషయంలోనూ సర్కారు నాన్చుడు ధోరణి అనుసరించటంపై ఉద్యోగులు మండిపడుతున్నారు.

భూ కబ్జాలు, సైబర్ నేరాలు పెరిగాయి

ఆన్‌లైన్‌లో రౌడీషీటర్ల ఫొటోలు: సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భూ కబ్జాలు, సైబర్ నేరాలు పెరిగినట్లు సీఎం చంద్రబాబు అంగీకరించారు. ఆడపిల్లలపై అసభ్యంగా ప్రవర్తించడం, ర్యాగింగ్ మంచిది కాదన్నారు. సీసీ కెమేరాలతో దొంగలు చిక్కుతున్నారని, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే దొరికిపోతారని హెచ్చరించారు. రౌడీషీటర్ల ఫొటోలు ఆన్‌లైన్‌లో పొందుపరిచే వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు. బుధవారం సాధికార మిత్రలనుద్దేశించి సీఎం మాట్లాడారు. మనిషికి శారీరక కష్టం అవసరమే కానీ ఆలోచన కూడా కావాలని సీఎం చెప్పారు. సాధికారమిత్రలు ఒక్కొక్కరు గ్రామల్లో 35 కుటుంబాల పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు.

మూడున్నరేళ్లుగా కేంద్రం సహకరించటం లేదు

రాష్ట్రంలో ప్రతి కుటుంబ సమాచారం తన దగ్గర ఉంటుందని సీఎం చెప్పారు. విభజన అనంతరం మూడేళ్ల తర్వాత సమీక్షించుకుంటున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మూడున్నరేళ్లగా ఏమీ సహకరించడం లేదన్నారు. 14వ ఆర్థిక సంఘం సిఫారసులలో ప్రత్యేక హోదా లేదన్నారని, ప్రత్యేక హోదాకు బదులు ప్యాకేజీ ఇస్తామంటే అంగీకరించానని తెలిపారు. మనకు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం ఉందని, పరిశ్రమలు రావాలన్నారు.

ఫ్లోరిడా వర్సిటీతో త్వరలో ఒప్పందం

సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి వ్యవసాయ, ఉద్యాన రంగాలలో సుస్థిర వృద్ధి సాధించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో ఒక కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఫ్లోరిడా వర్సిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జాక్ పేనే చెప్పారు. అమరావతి సందర్శనకు వచ్చిన ఆయన బుధవారం సచివాలయంలో సీఎంను కలిసి ప్రతిపాదన చేశారు. ఫ్లోరిడా వర్సిటీ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి ఒప్పందం చేసుకుందామని సూచించారు.

ఢిల్లీలో సీఎస్‌ల సమావేశం వాయిదా

సాక్షి, అమరావతి: విభజన చట్టంలోని అంశాల అమలుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులతో ఈ నెల 23న జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. ఈ సమావేశానికి రావాలని కేంద్ర హోంశాఖ రెండు రాష్ట్రాలకు సంబంధించిన అధికారులకు సమాచారం ఇచ్చింది. కానీ తెలంగాణ అధికారులు బడ్జెట్, ఇతర పనులుండడం వల్ల ఆరోజు సమావేశానికి రాలేమని చెప్పడంతో కేంద్ర హోంశాఖ దాన్ని వాయిదా వేసింది. మళ్లీ సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించాలనే విషయాన్ని తర్వాత చెబుతామని కేంద్ర హోంశాఖ రాష్ట్ర అధికారులకు తెలిపింది. ఢిల్లీలో ఈ సమావేశం ఉండడం వల్ల అదేరోజు జరగాల్సిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని బుధవారమే నిర్వహించారు.

విజయసాయిరెడ్డి ఆరోపణల్ని ఖండించిన ఐఏఎస్ అధికారుల సంఘం

ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్రపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణల్ని ఐఏఎస్ అధికారుల సంఘం ఖండించింది. ఈ మేరకు సంఘం కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు.

24న 'విశ్వభారతి' స్వర్ణోత్సవాలు

పాఠశాల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ వెల్లడి



గుడివాడ: కృష్ణా జిల్లా గుడివాడ విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ స్వర్ణోత్సవాలు ఈ నెల 24న వానపాముల గ్రామంలోని విశ్వభారతి వైజ్ ఉడ్ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని విశ్వభారతి పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1968లో 70 మంది విద్యార్థులతో ప్రారంభమైన పాఠశాల నేడు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. దేశ విదేశాల్లో తమ విద్యార్థులు జయకేతనం ఎగురవేస్తుండడం గర్వకారణమని పేర్కొన్నారు. పాఠశాల పురోభివృద్ధికి ఎంతోమంది సహాయ సహకారాలు అందించారని చెప్పారు. మారుతున్న విద్యావిధానానికి అనుగుణంగా 2005లో విశ్వభారతిలో ఐఐటీ ప్రోగ్రామ్ ప్రారంభించామని, 2011 నాటికి దీని ఫలితాలు అందుకోగలిగామని వివరించారు. తమ విద్యార్థి పృథ్వీ తేజ 2011లో ఐఐటీలో స్టేట్ ఫస్టు ర్యాంకు సాధించాడని చెప్పారు. మరో విద్యార్థి సందీప్‌రెడ్డి 2013లో ఐఐటీ, ఎంసెట్‌లలో స్టేట్ ఫస్టు ర్యాంకు సాధించాడని పేర్కొన్నారు. కాగా, 24న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ స్వర్ణోత్సవాలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్, సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కొసరాజు వీరయ్య చౌదరి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, లావు రత్తయ్య హాజరవుతారని తెలిపారు.

'కారుణ్య' సాంకేతికత అద్భుతం

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రుపాలా


సదస్సును ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పురుషోత్తం రుపాలా

కోయంబత్తూరు: కోయంబత్తూరులోని కారుణ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో ఉపయోగించే సాంకేతికత అత్యాధునికంగా, అత్యద్భుతంగా ఉందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి పురుషోత్తం రుపాలా కొనియాడారు. బుధవారం ఆయన కారుణ్య కళాశాలలో 'ఎమర్జింగ్ సినర్జీస్ ఇన్ అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ బయోటెక్నాలజీ'పై జరుగుతున్న మూడు రోజుల సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 శాతం మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడిన దేశంలో ఈ రంగానికి ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. వ్యవసాయంలో జీఐఎస్, జీపీఎస్, ఐవోటీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగించుకోవాలన్నారు. భారత్–ఇజ్రాయెల్ భాగస్వామ్య ఒప్పందం ప్రకారం 27 ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా వాటిలో 15 కేంద్రాల ఏర్పాటు ఇప్పటికే పూర్తయిందని వివరించారు. అనంతరం కారుణ్య కళాశాల వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మన్నార్ జవహర్, ఇజ్రాయెల్ ప్రొఫెసర్ ఇతామర్ గ్లాజర్, దేశ విదేశాల్లోని వివిధ వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు మాట్లాడారు. వివిధ దేశాల నుంచి 500 మందికి పైగా ప్రతినిధులు పాల్గొననుండగా, 300 పరిశోధనా పత్రాలు సమర్పించనున్నారు.

బాబుకు మానసిక స్థితి సరిగా లేదు: పీసీసీ

'ఛలో పార్లమెంట్'లో పాల్గొనాలని అన్ని పార్టీలకు రఘువీరా లేఖ



సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా విషయంలో సీఎం చంద్రబాబు మాటలు మారుస్తున్న తీరు గమనిస్తే ఆయన మానసిక స్థితి మీద అనుమానం కల్గుతోందని పీసీసీ నేతలు ఆరోపించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శులు గిడుగు రుద్రరాజు, జంగా గౌతం, ఎస్.రాజాలు బుధవారం హైదరాబాద్‌లోని ఇందిర భవన్‌లో మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్లుగా హోదా విషయంలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ ప్రజలను మభ్య పెడుతూ ఆఖరుకు చేతులెత్తేసి ప్రజలను మోసం చేశారన్నారు. హోదాతో పాటు రాష్ట్ర విభజన చట్టంలోని అంశాల సాధనకు కాంగ్రెస్ చేపట్టనున్న పోరాటానికి కలిసి రావాలని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి బుధవారం రాజకీయ పార్టీ నేతలకు లేఖ రాశారు. 'చలో పార్లమెంట్' పేరిట ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మార్చి 6, 7, 8 తేదీల్లో ఢిల్లీలో చేపడుతున్న ఉద్యమ కార్యాచరణలో పాల్గొనాలని ఆహ్వానిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీడీపీ కిమిడి కళావెంకట్రావు, బీజేపీ అధ్యక్షుడు కె.హరిబాబు, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు, జనసేన పవన్‌కు లేఖ రాశారు. కాగా, హోదా సాధన కోసం కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం చిత్తూరు ఆర్డీవో ఆఫీసు వద్ద చేపట్టనున్న దీక్షలో పాల్గొంటున్నట్లు రఘువీరా తెలిపారు.

ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే: మంత్రి సోమిరెడ్డి

సాక్షి, అమరావతి: నీతి ఆయోగ్‌ను సాకుగా చూపి ప్రత్యేకహోదా ఇవ్వకపోవడం సరికాదని, కేంద్రం మాట తప్పి, మోసం చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మిగిలిన రాష్ట్రాలకు హోదా కొనసాగిస్తున్నప్పుడు తమకూ ఇవ్వాలన్నారు. సచివాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హోదాతో సమానంగా ప్యాకేజీకి ఇస్తామంటేనే ఒప్పుకున్నామని తెలిపారు. 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా పొడిగించారని, కాబట్టి ఏపీకి కూడా ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనన్నారు.

రాజకీయాలపై ఆచితూచి..

మంత్రివర్గ భేటీలో ఆ ప్రస్తావన రాకుండా జాగ్రత్త పడ్డ సీఎం

సాక్షి, అమరావతి: సమావేశం ఏదైనా రాజకీయాల గురించి సుదీర్ఘంగా మాట్లాడే ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం మంత్రివర్గ భేటీలో మాత్రం ఆ ప్రస్తావన రాకుండా జాగ్రత్త పడినట్లు సమాచారం. ఇద్దరు బీజేపీ సభ్యులు మంత్రివర్గంలో కొనసాగుతుండటంతో వారి ఎదుట తాజా రాజకీయ పరిణామాల గురించి మాట్లాడలేదని, అజెండాకే పరిమితమయ్యారని టీడీపీ వర్గాలు తెలిపాయి. కేంద్ర బడ్జెట్ అనంతరం టీడీపీ, బీజేపీ విమర్శలకు దిగిన సంగతి తెలిసిందే. రాజీనామాకు సైతం వెనుకాడబోనని మంత్రి మాణిక్యాలరావు బీజేపీ పదాధికారుల సమావేశంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన పాల్గొన్న మంత్రివర్గ సమావేశంలో చంద్రబాబు రాజకీయాలపై చర్చించలేదని తెలిసింది. మరో మంత్రి కామినేని శ్రీనివాస్‌తో టీడీపీకి పెద్దగా ఇబ్బంది లేకున్నా రాజకీయ అంశాలను సీఎం ప్రస్తావించలేదు. కొందరు మంత్రులతో సీఎం విడిగా మాట్లాడిన సమయంలో మాత్రం ప్రత్యేక హోదా గురించి మాట్లాడాలని సూచించినట్లు తెలిసింది.

అ, ఆలు నేర్చుకోకుండా ఉన్నత విద్య చదువుతున్నారు

- ఏపీలో పరిస్థితులపై ఆవేదన వ్యక్తం చేసిన యార్లగడ్డ
- తెలుగు భాషను పరిరక్షించాలని ఏపీ సర్కారుకు సూచన



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ తీరు వల్ల అ, ఆ అక్షరాలు నేర్చుకోకుండా ఉన్నత విద్యను అభ్యసించే పరిస్థితులు ఏర్పడ్డాయని కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తెలుగు భాషను, సంస్కృతిని పట్టించుకోని వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. శిలాఫలకాలపై తెలుగు తప్పనిసరి అని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. విజయవాడలో సచివాలయానికి వెళ్లే మార్గంలో ఏపీ పోలీస్ హెడ్క్వార్టర్ అని పెద్ద అక్షరాలతో ఆగ్లంలో ఉందని, అలాగే సచివాలయానికి వెళ్లే దారి సూచనలు కూడా ఆంగ్లంలోనే ఉన్నాయని చెప్పారు. రాజరాజనరేంద్రుడు, శ్రీకృష్ణదేవరాయలు, ఆధునిక కాలంలో ఎన్టీరామారావు భాషకు ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల వారు చరిత్రలో నిలిచారని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలుగు భాష వాడకం తగ్గుతున్న పరిస్థితిలో రాబోయే రోజుల్లో తెలుగు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని యునెస్కో హెచ్చరించదని చెప్పారు. ఏపీలో అంగన్‌వాడీల్లో కూడా ఆంగ్లం తప్పనిసరి చేసిన ప్రభుత్వం తెలుగును పక్కన పెట్టడం గర్హనీయమన్నారు. తెలుగు భాష పరిరక్షణకు 12వ తరగతి వరకు తెలుగును తప్పనిసరి చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలను యార్లగడ్డ ప్రశంసించారు. ఏపీ ప్రభుత్వం కూడా తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.

వడదెబ్బ మరణాల నియంత్రణకు బహుముఖ వ్యూహం

జాతీయ వర్క్‌షాప్‌లో నిపుణులు



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న నిపుణులు

సాక్షి, అమరావతి: వడదెబ్బ మరణాల నియంత్రణకు బహుముఖ వ్యూహం అనుసరించాలని, ఇందుకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని నిపుణులు పిలుపునిచ్చారు. వడగాడ్పులకు సంబంధించి ముందస్తు హెచ్చరికలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ప్రజలను చైతన్య పరచడం, వేడి ప్రభావం తగ్గించే చర్యలు తీసుకోవడం, బాధితులకు తక్షణ వైద్యం అందించడానికి ఆస్పత్రులను సన్నద్ధంగా ఉంచడం ద్వారా వడదెబ్బ మరణాలను పూర్తిగా తగ్గించవచ్చని వివరించారు. 'వడగాడ్పులను ఎదుర్కోవడంపై సన్నద్ధత – ఉపశమన చర్యలు' అంశంపై జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ), రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్‌డీఎంఏ), యునిసెఫ్ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో ప్రారంభమైన జాతీయ సదస్సులో పలువురు నిపుణులు మాట్లాడారు. వేసవిలో వడగాడ్పు బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున వారికి వైద్యం అందించడానికి వీలుగా ఆరోగ్య కేంద్రాలను ముందే సన్నద్ధం చేయాలని ఎన్‌డీఎంఏ సభ్యుడు ఆర్‌కే జైన్ సూచించారు. ఎన్‌డీఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.తిరుప్పగ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ దిలీప్ మౌలాంకర్, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు, నాగ్‌పూర్‌లోని విశ్వేశ్వరరాయ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ రాజశ్రీ కోటర్కర్, యునిసెఫ్ ప్రతినిధులు తదితరులు మాట్లాడారు.

విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయలేం

- అధికారుల కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం నిర్ణయం!
- కమిటీ సిఫారసులు కంటితుడుపు చర్యలకే పరిమితం
- మండిపడుతున్న 24 వేల మంది సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కర్నూలు: విద్యుత్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. వీరు రెగ్యులర్ ఉద్యోగులతో సమానమైన పనిచేయడం లేదని, రెగ్యులర్ ఉద్యోగులకు వీరు సహాయంగానే ఉంటారని స్పష్టం చేసినట్టు తెలిసింది. వారికి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనం, రెగ్యులరైజ్ చేయాల్సిన అవసరం కానీ లేదని చెప్పినట్లు తెలిసింది. విద్యుత్ సంస్థలు నియమించిన అధికారుల కమిటీ చేసిన సిఫారసులకే ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 24 వేల మంది విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు నష్టం వాటిల్లనుంది. అయితే, అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి కాకుండా నేరుగా ఉద్యోగుల అకౌంట్లలోకే వేతనాలు వేయాలని కమిటీ సిఫారసు చేసింది. కమిటీ ఇచ్చిన నివేదికపై విద్యుత్ సిబ్బంది మండిపడుతున్నారు. ఇప్పటికే సమ్మెలో ఉన్నవారు సమ్మె కొనసాగించేందుకే నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

ఎక్కడా రెగ్యులరైజ్ చేయలేదు!

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని పేర్కొన్న ప్రభుత్వం ఇప్పుడు మాట మారుస్తోంది. పక్కనున్న తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులోని విద్యుత్ ఉద్యోగులతోపాటు రాష్ట్రంలోని ఏపీఎస్ఆర్టీసీలో అమలవుతున్న విధానాలను కూడా ఈ కమిటీ పరిశీలించింది. ఎక్కడా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయలేదని కమిటీ పేర్కొంది. తెలంగాణలో రెగ్యులరైజ్ చేసే ప్రయత్నాలను సుప్రీంకోర్టు నిలిపేసిందని, అందువల్ల ఇక్కడ కూడా చేయాల్సిన అవసరం లేదని తెలిపింది. అయితే, సమ్మె చేస్తున్న విద్యుత్ ఉద్యోగులను చల్లబరిచేందుకు కొన్ని కంటితుడుపు చర్యలకు సిఫారసు చేసింది. అవి..

- అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు కాకుండా నేరుగా ఉద్యోగులకే వేతనాల చెల్లించాలి
- నామమాత్రంగా వేతనాలు పెంచాలి
- ఏపీఈఆర్సీ రెగ్యులేషన్ 2/2017 ప్రకారం ఎక్స్‌గ్రేషియా చెల్లించవచ్చు.
- గ్రూప్ బీమా సౌకర్యం, వైద్యం కల్పించాలి.
- ఉద్యోగి చనిపోయినప్పుడు కుటుంబానికి ఇచ్చే పరిహారం పెంచాలి.

కమిటీలోని అధికారులు వీరే..

ఈ కమిటీని గతేడాది డిసెంబర్ 4న ఏర్పాటు చేశారు. ఏపీ ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ (హెచ్ఆర్) ఛైర్మన్‌గా వ్యవహరించిన ఈ కమిటీలో ఈపీడీసీఎల్ హెచ్ఆర్ డైరెక్టర్, జెన్‌కో హెచ్ఆర్ డైరెక్టర్, జెన్‌కో జాయింట్ సెక్రటరీ, ఏపీ ట్రాన్స్‌కో లీగల్ సలహాదారులు సభ్యులుగా ఉన్నారు. ట్రాన్స్‌కో అడిషనల్ సెక్రటరీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించారు.

'లూలూ' పేరుతో 500 కోట్ల లూటీ


అఖిలపక్ష భేటీలో చర్చిస్తున్న నేతలు. చిత్రంలో మాజీ మంత్రి బాలరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు అమర్‌నాథ్, విజయప్రసాద్, శ్రీనివాస్, పాత్రికేయుడు రమణమూర్తి, సీపీఐ, సీపీఎం నేతలు

- అడ్డగోలు భూకేటాయింపులపై సీబీఐ దర్యాప్తు చేయాలి
- అఖిలపక్ష భేటీలో వివిధ పార్టీల నేతలు

సాక్షి, విశాఖపట్నం: ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ పేరుతో లూలూ సంస్థకు రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ధారాదత్తం చేయడం ద్వారా సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌కు రూ.500 కోట్ల ముడుపులు ముట్టాయని అఖిలపక్ష నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు సమన్వయకర్త వంశీకృష్ణ శ్రీనివాస్ అధ్యక్షతన విశాఖలో జరిగిన సమావేశంలో నిబంధనలకు విరుద్ధంగా జరిపిన ఈ భూకేటాయింపులపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని నేతలు డిమాండ్ చేశారు. భూకేటాయింపులను అడ్డుకునేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని నిర్ణయించారు. 23న విశాఖలోని ఉడా కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టాలని, దశల వారీగా ప్రజా ఉద్యమం చేయాలని తీర్మానించారు. వైఎస్సార్‌సీపీ విశాఖ నగర అధ్యక్షుడు మళ్లా విజయప్రసాద్ మాట్లాడుతూ కన్వెన్షన్ సెంటర్లను ప్రభుత్వం నిర్మించాలని, ప్రైవేటు సంస్థల ద్వారా చేపట్టకూడదని, వాటి వల్ల సామాన్యులకు ప్రయోజనం ఉండదన్నారు. పర్యాటకులను ఆకట్టుకుంటున్న విశాఖ బీచ్ రోడ్డును ఇలాంటి కన్వెన్షన్ సెంటర్ల ద్వారా నాశనం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ 9.12 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం టెండర్లు పిలిస్తే 13 ఎకరాలను ఏ విధంగా లూలూ సంస్థకు కేటాయించారని ప్రశ్నించారు. లూలూ సంస్థ అధినేత ఇంటికి వెళ్లి సీఎం, ఆయన తనయుడు లోకేశ్ భోజనం చేశారని, దీని వెనుక ఏ స్థాయిలో అవినీతి జరిగిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని ప్రముఖ పాత్రికేయుడు వి.వి.రమణమూర్తి అన్నారు. ప్రభుత్వ భూములని ప్రభుత్వమే నోటిఫై చేసిన దసపల్లా భూములను సైతం కాపాడుకోలేక పోయారని, ఇప్పుడు రూ.1500 కోట్ల విలువైన భూములను అడ్డగోలుగా ఇచ్చేశారని వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరోపించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు కోలా గురువులు, తిప్పల నాగిరెడ్డి, సనపల చంద్రశేఖర్, పసుపులేటి ఉషాకిరణ్, సత్తి రామకృష్ణారెడ్డిలతోపాటు మాజీ మంత్రి పి.బాలరాజు, లోక్‌సత్తా, సీపీఐ, సీపీఎం, ఆప్, ఏఐటీయూసీ, సీఐటీయూ, విద్యార్థి, యువజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

సీఎస్, సంక్షేమ శాఖల ముఖ్యకార్యదర్శులకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు విచారణకు స్వీకరించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వెనుకబడిన, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులకు ఉమ్మడి హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. కాకినాడకు చెందిన ఐ.సూర్యనారాయణ దాఖలు చేసిన ఈ వ్యాజ్యాన్ని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, జస్టిస్ కొంగర విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం విచారించింది. కుమారి మాధురి పాటిల్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులోని మార్గదర్శకాలు ఏపీలో అమలు కావడం లేదని, వాటిని అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల కులధ్రువీకరణ పత్రాల జారీలో అవకతవకలు నివారించవచ్చునని పిటిషనర్ తరపు న్యాయవాది జె.సత్యప్రసాద్ వాదించారు. సుప్రీంకోర్టు తీర్పును అన్ని రాష్ట్రాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించిన ధర్మాసనం ప్రతివాదులు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ వారికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మార్చి 20కి వాయిదా వేసింది.

సాక్షి
గురువారం, ఫిబ్రవరి, 22

‘ప్రసారభారతి’ తిరుగుబాటు

అప్పుడప్పుడు కొన్ని ఊహించని పరిణామాలు జరుగుతుంటాయి. దూరదర్శన్, ఆకాశవాణి సంస్థల వ్యవహారాలను పర్యవేక్షించే ప్రసారభారతి సంస్థ పాలకుల ఆదేశాలను ధిక్కరించిన వైనం అలాంటి ఊహకందని పరిణామమే. ప్రసారభారతి బోర్డులో ఒక సభ్యుడి నియామకంతోపాటు ఇద్దరు పాత్రికేయులను భారీ వేతనాలతో ఉద్యోగులుగా తీసుకోవాలంటూ తాజాగా కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ చేసిన ప్రతిపాదనలను ప్రసారభారతి బోర్డు తిరస్కరించింది. ఇలాంటి సిఫార్సులు ప్రసారభారతి చట్టాన్ని, దాని స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తాయని స్పష్టం చేసింది. అలాగే కాంట్రాక్టు సిబ్బందిని తొలగించాలన్న సూచనకు కూడా అంగీకరించలేదు. ప్రసారభారతి పుట్టి బుద్ధెరిగి ప్రభుత్వానికి ఇలా ఎదురుతిరిగిన సందర్భం లేదు. వాస్తవానికి ఆ సంస్థ ఏర్పాటు ఉద్దేశం పాలకుల అడుగులకు మడుగులొత్తాలని కాదు... అది స్వతంత్రంగా వ్యవహరించి దూరదర్శన్, ఆకాశవాణిలను వృత్తిపరమైన ఉన్నత సంస్థలుగా తీర్చిదిద్దాలనే. కానీ ప్రసారభారతి తన ఆవిర్భావం వెనకున్న ఉద్దేశాన్ని మరిచింది. అధికారంలో ఉన్నవారి అభీష్టాన్ని నెరవేరుస్తూ వచ్చింది. ఫలితంగా దూరదర్శన్, ఆకాశవాణి ఎప్పటిలాగే మిగిలిపోయాయి. మన దేశంలో ఉన్నతాశయాలతో ప్రారంభించిన సంస్థలు వాటికి చాలా దూరంగా ఉండిపోవడం కొత్తేమీ కాదు. పరిశ్రమల నిర్వహణ బాధ్యతలను ఆయా రంగాల్లో నిపుణులైనవారికి అప్పగించి, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడానికి అనుమతించాలని పబ్లిక్ రంగ సంస్థలను ఏర్పాటు చేశారు. కానీ ఆచరణలో అది విఫలమైంది. పరిశ్రమల నిర్వహణలో రాజకీయ జోక్యం పెరగడం, ఉన్నత పదవుల్లో అయినవారిని నియమించాలంటూ ఒత్తిళ్లు తీసుకురావడం పర్యవసానంగా చాలా పబ్లిక్ రంగ సంస్థలు నష్టాల్లో కూరుకుపోయి చివరకు మూతబడిన ఉదంతాలున్నాయి. అలాగే ప్రభుత్వం నుంచి ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా స్వతంత్రంగా వ్యవహరించి అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతుల్ని గడించిన సంస్థలు కూడా లేకపోలేదు.

తాము అధికారంలోకొస్తే ఆకాశవాణి, దూరదర్శన్‌లకు ప్రభుత్వ అజ్మాయిషీ నుంచి విముక్తి కలిగిస్తామని చెప్పని పార్టీ లేదు. అత్యవసర పరిస్థితి కాలంలో సెన్సార్‌షిప్ అమలు చేసి ఆకాశవాణి గొంతు నులిమిన తీరుపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికిన తర్వాత తమకు అధికారమిస్తే ఇలాంటి దుస్థితి కలగకుండా చూస్తామని జనతాపార్టీ తొలిసారి హామీ ఇచ్చింది. ఆ తర్వాత ఇతర పార్టీలు సైతం అలాంటి హామీలివ్వడం, అమలు చేయకపోవడం రివాజుగా మారింది. కానీ బలహీనమైన ప్రభుత్వానికి నాయకత్వంవహించి, స్వల్పకాలం ప్రధానిగా పనిచేసిన చంద్రశేఖర్ ఆశ్చర్యకరంగా 1990లో ఈ ప్రసారభారతి బిల్లుకు మోక్షం కలిగించి అది చట్టరూపం ధరించడానికి కారకులయ్యారు. ఆ తర్వాత వచ్చిన పీవీ ప్రభుత్వం ఆ చట్టాన్ని అటకెక్కించింది. 1995లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నాకే కదలిక మొదలైంది. అయినా రెండేళ్లకాలం వృథాగా గడిచిపోయింది. చివరకు ఐకె గుజ్రాల్ ప్రధానిగా వచ్చాక 1997లో ప్రసారభారతి చట్టం అమల్లోకి వచ్చింది.

ప్రసారభారతి పనితీరు మొదటినుంచీ అంత సంతృప్తికరంగా ఏం లేదు. దాని పని అది చేసుకుంటే పెత్తనం చేయడానికి తమకేం మిగులుతుందని సమాచార మంత్రులుగా వచ్చినవారంతా భావించినట్టున్నారు. అందువల్లే ఆ సంస్థను తమ ఉక్కు పిడికిట్లో ఉంచుకున్నారు. దాదాపు 450 దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రాలను నిర్వహిస్తున్న ప్రసారభారతి దేశంలోనే అతి పెద్ద ప్రసార సేవల సంస్థ. వర్తమాన అవసరాలకు తగినట్టుగా ఉన్నతస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవాలని, అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని అది ప్రయత్నించిన దాఖలాలు లేవు. నిధుల కొరత దీనికి ప్రధాన కారణం అన్నది నిజమైనా... అందుకోసం ప్రభుత్వంతో అవసరమైతే తలపడాలని ఎవరూ అనుకోలేదు. ప్రసారభారతి సారథులుగా నియమితులయ్యేవారు సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకి సన్నిహితులైనవారే ఉంటారు. ఆ మొహమాటం కొద్దీ వారు నోరెత్తరు. ఏ నియామకం చేయాలన్నా ప్రభుత్వామోదం కోసం ఎదురుచూడాల్సిందే. ఎవరైనా చొరవ తీసుకుని నిపుణులైనవారిని డైరెక్టర్ జనరళ్లుగా లేక బ్యూరో చీఫ్‌లుగా నియమిస్తే సమాచార మంత్రిగా ఉండేవారికి ఆగ్రహం కలుగుతుంది. ఎవరు అధికారంలో ఉన్నా జరుగుతున్నది ఇదే. ప్రసారభారతి చట్టం ప్రకారం దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో ఉన్న దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రాల ఆస్తులు ప్రసారభారతి సంస్థకు బదిలీ కావాలి. అదే జరిగుంటే ఆ ఆస్తుల్ని ఆదాయ వనరులుగా మార్చుకోవడానికి, ప్రభుత్వంపై ఆధారపడే స్థితిని తగ్గించుకోవడానికి ఆస్కారం ఉండేది. ప్రసారభారతి ఏర్పాటైనప్పుడు ప్రభుత్వం నుంచి ఆ సంస్థకు 48,000మంది సిబ్బంది బదిలీకాగా, ప్రస్తుతం ఉన్నవారి సంఖ్య 32,000 మాత్రమే. వారిలో చాలా భాగం కాంట్రాక్టు కింద పనిచేస్తున్నవారే.

ఆకాశవాణి, దూరదర్శన్‌లు ఎన్ని పరిమితుల్లో పనిచేసినా వృత్తిపరంగా ఉన్నతులైనవారిని అందించాయి. సృజనాత్మక రంగాల్లో లబ్ధప్రతిష్టులైనవారు ఆ సంస్థల్లో పనిచేశారు. వాటికి విశ్వసనీయత కలిగించారు. నిజానికి ప్రసారభారతి ఏర్పడ్డాక ఇవి రెండూ మరింత ఉన్నతంగా ఎదిగి ఉండాల్సింది. ప్రసారభారతిని బీబీసీ స్థాయిలో తీర్చిదిద్దాలని, ఆకాశవాణి, దూరదర్శన్‌లను అగ్రగామి సంస్థలుగా రూపొందించాలని కలలుగన్నవారు లేకపోలేదు. కానీ వారు త్వరలోనే నీరసించిపోయారు. ఏమీ చేయలేక అచేతనంగా ఉండిపోయారు. కారణాలేమైనా ఇప్పుడు ప్రసారభారతి బోర్డు ప్రభుత్వ సిఫార్సులను, సూచనలను తిప్పికొట్టింది. మొత్తం కాంట్రాక్టు సిబ్బందిని తొలగించాలని హుకుం జారీ చేయడం, అందుకు ఉపయోగించిన భాష తమకు సమ్మతం కాదని తెలిపింది. ఈ ఉదంతంతోనైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి. ప్రసారభారతి స్వయంప్రతిపత్తిని గౌరవించాలి. ప్రభుత్వ కర్ర పెత్తనం వల్ల ప్రయోజనం కలగకపోగా ప్రసారభారతి, దాంతోపాటు ఆకాశవాణి, దూరదర్శన్‌లు మరింతగా దెబ్బతింటాయని తెలుసుకోవాలి.



స్వయంప్రతిపత్తి వ్యక్తికీ, సంస్థకూ కూడా ప్రాణాధారమైన అంశం. దాంట్లో ఎవరి జోక్యమైనా అవాంఛనీయమే.

– జుడిత్ గెస్ట్
అమెరికన్ నవలా రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి శు.సప్తమి రా.11.57 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం భరణి ఉ.11.36 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం రా.11.03 నుంచి 12.35 వరకు దుర్ముహూర్తం ఉ.10.16 నుంచి 11.03 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.40 వరకు, అమృతఘడియలు ఉ.6.57 నుంచి 8.30 వరకు.

సూర్యోదయం : 6.28
సూర్యాస్తమయం : 5.59
రాహుకాలం : ప 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు


నమాజ్ వేళలు



ఫజర్ : 5.26
జొహర్ : 12.30
అసర్ : 4.43
మగ్రీబ్ : 6.20
ఇషా : 7.33

పోరాటంతోటే ప్రత్యేక హోదా

విశ్లేషణ



డాక్టర్ ఏపీ విఠల్

ప్రత్యేక హోదా ఒక పరిమిత ప్రాంతానికో, స్వల్ప సంఖ్యలోని ప్రజానీకానికో మాత్రమే సంబంధించింది కాదు. ఏపీ ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన సమస్య. ఇది మానవతా సమస్య కాదు. రాజకీయ పోరాటం అనివార్యమైంది. పవన్ కల్యాణ్ తన వీరాభిమానులను ప్రేక్షక పాత్రకే పరిమితం చేయడం సరికాదు. ప్రత్యేక హోదా వంటి అత్యంత ప్రధానమైన సమస్య విషయంలో ఇలా చేయరాదు. తన మానవతా దృక్పథాన్ని నిలబెట్టుకుంటూనే తన అభిమానులను, కార్యకర్తలను ప్రత్యక్ష పోరాటానికి కూడా సిద్ధం చేయాలి.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీలతో పాటు అంతకు మించి ఏపీకి ప్రత్యేక హోదా సాధించుకోవాలన్న ప్రజల డిమాండ్ భౌతిక వాస్తవిక ఆవశ్యకత పరిధిని దాటింది. నాటి విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదం లాగే, ఇది తెలుగు జాతి ప్రజల భావోద్వేగ సమస్యగా కూడా రూపు దాలుస్తున్న పరిస్థితి నేడు ఉన్నది. ఇంకా చెప్పాలంటే రానున్న శాసనసభ ఎన్నికలలో ఏపీకి ప్రత్యేక హోదా అంశం నిర్ణయాత్మకం కానున్నదా అన్నట్లుంది రాష్ట్రంలో రాజకీయ వాతావరణం. ఆరంభం నుంచి ప్రత్యేక హోదా అంశంపై వదిలిపెట్టకుండా, వివిధ రీతుల్లో పోరాడుతున్న వైఎస్సార్‌సీపీ, ఈ తరుణంలో ఆ పోరాటాన్ని తీవ్రతరం చేసింది. అందునా ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత రెండు మూడునెలలుగా ప్రత్యేకించి తన పాదయాత్ర సందర్భంగా ఈ అంశాన్ని ప్రస్తావించి ప్రజలను జాగృతం చేస్తున్నారు. అంతే కాదు... పార్లమెంటు వెలుపలా లోపలా ప్రత్యేక హోదా కోసం నిరంతరం పోరాడుతూనే, ఈ పార్లమెంటు సమావేశం చివరి రోజైన ఏప్రిల్ 5వ తేదీ నాటికి కూడా ప్రత్యేక హోదా రాదన్నది స్పష్టమైతే, పార్టీ ఎంపీలు తమ పార్లమెంటు స్థానాలకు రాజీనామా చేస్తారని కూడా నిర్ణయించి ప్రకటించారు. దానితో ప్రజల్లో ప్రత్యేక హోదా సాధన అసాధ్యం కాదన్న ఆత్మ విశ్వాసం దృఢంగా వేళ్లూనుకుంటోంది.

ప్రత్యేక హోదా డిమాండుకు తూట్లు పొడిచి ప్రత్యేక సహాయం, ప్రత్యేక ప్యాకేజీ అంటూ కేంద్రంలో మోదీకి ఏమాత్రం ఇబ్బంది, ఆగ్రహం కలుగకుండా జీ హుజూర్ అంటూ కేంద్రాన్ని పల్లెత్తు మాట అనలేదు. అలా కాలం గడుపుతూ వచ్చిన చంద్రబాబు, ఆయన అనుయాయులు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తాజాగా సన్నాయి నొక్కులు నొక్కసాగారు. ప్రజల్లో కానవస్తున్న అలజడి, ఆందోళనలు చూసిన పిదప, తాము కూడా ప్రత్యేక హోదాతో సహా అన్ని హామీలను అమలు జరిపేలా పోరాటం చేస్తున్నట్లు నటిస్తున్నారు.

జగన్ ప్రకటనతో తెలుగు తమ్ముళ్లలో కలవరం

వైఎస్సార్ సీపీ, వామపక్షాలతోపాటు ఇతర ప్రత్యేక హోదా సాధనకై ఏర్పడిన వివిధ సంస్థలు ఎప్పుడైతే ప్రజల్లో ప్రత్యేక హోదా చైతన్యాన్ని రగల్చగలిగాయో, ఇక తప్పదని ప్రత్యేక హోదాతో సహా అంటూ అశ్వత్థామ హతః (కుంజరః) అన్నమాటలు చంద్రబాబు మాటవరసకైనా అనక తప్పలేదు. దాంతో వైఎస్ జగన్ ‘మాకు అత్యంత ప్రధానం ఆంధ్రప్రదేశ్ హక్కు. అందుకే మా పార్లమెంటు సభ్యులతోపాటు మీ టీడీపీ ఎంపీలతో కూడా రాజీనామా చేయించండి. ఏపీకి చెందిన 25 మంది ఎంపీలు ప్రత్యేక హోదా కోసం రాజీనామా చేస్తే కేంద్రం దిగిరాదా? ప్రత్యేక హోదా ఎట్లా సాధ్యం కాదో చూద్దాం’ అని బహిరంగంగా రాజకీయ పరిణతితో చంద్రబాబుకు సలహా ఇచ్చారు. దీంతో చంద్రబాబు, ఆయన తెలుగు తమ్ముళ్లు ఏం చేయాలో తెలీక నానా గందరగోళంలో పడిపోయారు. తామేం మాట్లాడుతున్నారో తమకే తెలియనట్లుగా తికమకగా మాట్లాడుతున్నారు. అందుకు నిదర్శనంగా.. రాష్ట్రమంత్రి ఆదినారాయణ రెడ్డి ‘మీరు ఏప్రిల్ 5న రాజీనామా చేస్తే మా పార్టీకి చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలు మార్చ్ 5నే అంటే వైఎస్సార్ సీపీ ఎంపీల కంటే నెలముందే రాజీనామాలు చేస్తాం, మోదీతో తెగతెంపులు చేసుకుంటామ’ని గంభీరంగా సెక్రటేరియట్ లోనే పత్రికా సమావేశం పెట్టి మరీ ప్రకటించారు. గంటలోపే ఆదినారాయణ రెడ్డిపై అది తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే అని ప్రకటించవలసిందిగా తీవ్ర ఒత్తిడి వచ్చింది. వారి అధినేత అయితే ఓటుకు కోట్లు కేసు గుర్తుకు వచ్చి కంగారుపడినట్లుంది. ఇవన్నీ ఎలా ఉన్నా, వైఎస్ జగన్ సలహా వాస్తవ రూపం దాలిస్తే ప్రత్యేక హోదా వాస్తవమవుతుంది. ప్రజల్లో ఈ అంశంపై ఎంతటి పట్టుదల ఉందంటే, ఈ నెల 8వ తేదీన వామపక్షాలు ప్రత్యేక హోదా కోసం ఇచ్చిన రాష్ట్ర బంద్‌ని యావత్ ప్రజానీకం స్వచ్ఛందంగా పాటించారు. వైఎ స్సార్ సీపీ కూడా ఆ పోరాటంలోనే మునిగి ఉంది కనుక మరో ఆలోచన లేకుండా వామపక్షాల బంద్ పిలుపునకు మద్దతు ప్రకటించడమే కాకుండా బంద్ విజయానికి తీవ్రంగా కృషి చేసింది. ఈ బంద్‌ను విఫలం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు అరెస్టులతో సహా తనవద్ద ఉన్న అన్ని అస్త్రాలనూ ప్రయోగిం చింది. దీంతో ఈ ప్రత్యేక హోదా నినాదంతో పార్టీల మధ్య నూతన ఉద్యమ సమీకరణలు ఏర్పడగల అవకాశం స్పష్టంగా పొడసూపుతుండటంతో వచ్చే ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదన్న భీతి చంద్రబాబు టీడీపీకి పట్టుకుంది.



ఈ స్థితిలో పాలకపార్టీ వెన్నుపోటు రాజకీయాలకు మారుపేరైన బాబు తన శైలి రాజకీయంతో, అడ్డదారినో, దొడ్డిదారినో గండం గడిచి గట్టెక్కాలని తన శకుని పాచికలను బయటకు తీస్తున్నారు. ఆ పాచికల జూదం ప్రధాన లక్ష్యాలు రెండు. ఒకటి, ఏపీ ప్రజానీకాన్ని అట్టుడికిస్తున్న ప్రత్యేక హోదా అనే అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చాలి. దాని స్థానంలో నేటి ఆంధ్రప్రదేశ్ దయనీయ స్థితికి కారణం కేంద్రప్రభుత్వమా లేక రాష్ట్ర ప్రభుత్వమా అన్న కృత్రిమ ప్రశ్నొకదాన్ని రంగంమీదకు తేవాలి. అందుకు అనువుగా ముందుగా తన శ్రేణులచే చంద్రబాబు లాలూచీ కుస్తీలాగా కేంద్ర బీజేపీపై సణుగుడు, గొణుగుడు మొదలెట్టి, విమర్శలు చేయించసాగారు. అవసరం అయితే ఏపీ ప్రయోజనాల కోసం ఎన్డీయే నుంచి బయటకు వస్తామని కూడా ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఈ రోజు కూడా కేంద్రప్రభుత్వంతో వివాదం కాదు కావలిసింది. నిదానంగా వారిని ప్రసన్నులను చేసుకోవడమే అంటూ బాబు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. నిజానికి ఏపీకి జరుగుతున్న అన్యాయానికి అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వమూ రెండూ కారణమే.

పవన్ మళ్లీ చంద్రబాబు పావు అవుతారా?

ప్రజాకర్షణ కలిగిన పవన్ కల్యాణ్‌ను 2014 ఎన్నికలలోవలే పావుగా వాడదలుచుకున్నారు. ఈ విన్యాసాల విషయం అంతగా ఒంటబట్టని పవన్.. ‘నిజమే ప్రజలకు వాస్తవాలు తెలియాలి కదా. నిజంగా రాష్ట్రానికి ఇచ్చిందేమిటి? రాష్ట్రం దాన్ని ఎలా ఖర్చు చేసింది జమాలెక్కల కోసం’ అంటూ ఒక నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేశారు. జయప్రకాష్ నారాయణ్, ఉండవల్లి అరుణ్‌కుమార్ వంటి విషయ పరిజ్ఞానం కలిగిన మరి కొందరు తటస్థంగా ఉండే మేధావులను పిలుస్తూ వారితో పాటు కాంగ్రెస్, వామపక్ష నేతలు, తదితరులను కూడా ఆహ్వానించారు. నిధులపై శ్వేత పత్రం ప్రకటించమని కోరిన పవన్ కోరిక పట్ల కేంద్ర ప్రభుత్వం స్పందించనేలేదు. ఈ చర్చల్లో పాల్గొన్నవారు మాత్రం... ఇవన్నీ చేసుకోండి... కానీ ఏపీకి కావలసింది ప్రత్యేక హోదా. అందుకు ఏపీ ప్రజల ఐక్య పోరాటమే మార్గం అని స్పష్టంగా తేల్చిచెప్పారు. ప్రత్యేకించి వామపక్షాలు కూడా ఇదే చెప్పాయి. ఈ సందర్భంలో కావలసింది ప్రత్యేక హోదా కోసం ఐక్య సమరశీల ప్రజా ఉద్యమం. కానీ తాను ప్రజలు ఇలా రోడ్డెక్కే సమరశీల ఉద్యమాలకు వ్యతిరేకమనీ, చక్కగా అవగాహనతో చర్చించి, ప్రభుత్వ దృష్టికి వాటిని తీసుకెళ్లి వాటిని పరిష్కరించుకోవాలని, ఇలాంటి ప్రజా ఉద్యమాలు శాంతికి భంగం కలిగిస్తాయని పవన్ కల్యాణ్ చాలా మంచి మాటలు చెబుతున్నారు. కానీ దున్నపోతు మీద వానలాగా నేటి ప్రభుత్వాలు ఇలాంటి సుభాషితాలకు లొంగిరావు. ప్రస్తుత పాలకులకు రాజకీయం అంటే తదుపరి ఎన్నికలు మాత్రమే.

ప్రత్యేక హోదా ఏ పార్టీ సాధిస్తే ఆ పార్టీవైపు, అందుకోసం తీవ్రంగా యత్నిస్తున్న పార్టీల వైపు జనం మొగ్గు చూపడం ఖాయం. నేడు ప్రధానంగా ఆ పాత్ర పోషిస్తున్న వైఎస్సార్‌సీపీ వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయం. బాబుకు ఈ విషయం స్పష్టంగా తెలుసు. అందుకే ఆయన బయటకు తెచ్చిన రెండో రకం పాచిక – ప్రజల ఐక్యతను, ప్రతిపక్షాల ఐక్యతనూ విచ్ఛిన్నం చేసి ఓట్లను చీల్చడం లేదా 2019 ఎన్నికల్లో కూడా పవన్ కల్యాణ్‌తో చేతులు కలపాలన్నదే. అయితే గత నాలుగేళ్ల బాబు పాలన ఎలా ప్రజా వ్యతిరేకంగా సాగుతోందో తెలిసింతర్వాత కూడా పవన్ మరోసారి బాబు చేతిలో పావుగా మారతారని భావింపజాలం. ఉండవల్లి, వామపక్షాలు స్పష్టం చేసినట్లే, ప్రత్యేక హోదా సమస్య ప్రజా ఉద్యమాలతో సాఫల్యం కావలసిందే. దీనికి రాజకీయేతర పరిష్కారం ఉండదు. కనుక ప్రత్యేక హోదా అంశాన్ని కనుమరుగు చేస్తున్న నేటి పాలకులను ఓడించి, హోదాకోసం నిరంతరం ప్రజల్లో ఉంటున్న వైఎస్సార్ సీపీతో కలిసి వామపక్షాలతో సహా అన్ని పార్టీలూ, సంస్థలూ ఒక వేదికగా ఏర్పడాలి. ఏదో కాలయాపన సాగిస్తూ, ప్రజల్లో గందరగోళానికి దారి తీసేలా ఉద్యమంలో వేరు వేరు కుంపట్లు, చీలికలు, విభేదాలకు దారి తీసే అవకాశం కల్పించవద్దని, ఐక్యపోరాటానికి మద్దతు ఇవ్వాలని పవన్ కల్యాణ్‌కు విజ్ఞులు సలహా ఇవ్వగలగాలి.

మానవత్వం కాదు.. రాజకీయ పోరాటం అవశ్యం

ఇది పవన్ కల్యాణ్‌కు దురుద్దేశం ఆపాదించడం కాదు. పవన్ కల్యాణ్ కిడ్నీ బాధితుల విషయంలో చూపిన చొరవ, ఆ సమస్యపై అంతకు ముందు నుంచే పోరాడుతున్న ప్రజా సంఘాలకు నైతిక మద్దతు ఇవ్వడం, ఆ వ్యాధిగ్రస్తులకు ఊరట కలిగించిన మానవతా చర్య హర్షణీయమే. కానీ ప్రత్యేక హోదా ఒక పరిమిత ప్రాంతానికో, స్వల్ప సంఖ్యలోని ప్రజానీకానికో మాత్రమే సంబంధించింది కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన సమస్య. ఇది మానవతా సమస్య కాదు. రాజకీయ పోరాటం అనివార్యమైంది. మానవతా దృక్పథమే ప్రధానమైతే స్వచ్ఛంద సంస్థను స్థాపించి సేవ చేయవచ్చు. కానీ పవన్ కల్యాణ్ జనసేన అని రాజకీయ పార్టీ స్థాపించారు. అది స్వచ్ఛంద సంస్థ కాదు. వేలాదిమందిగా ఉన్న తన వీరాభిమానులను ప్రేక్షక పాత్రకే పరిమితం చేయడం సరికాదు. ప్రత్యేక హోదా వంటి అత్యంత ప్రధానమైన సమస్య విషయంలో ఇలా చేయరాదు. తన మానవతా దృక్పథాన్ని నిలబెట్టుకుంటూనే తన అభిమానులను, కార్యకర్తలను ప్రత్యక్ష పోరాటానికి కూడా సిద్ధం చేయడం పవన్ కల్యాణ్ కర్తవ్యం. ఆయన ఆ దిశగా కూడా ఆలోచిస్తారని ఆశిద్దాం.


కొసమెరుపు : పవన్ కల్యాణ్‌కి ఓ సలహా. గతంలో చంద్రబాబుతో రాజకీయంగా కలిసినవారు దాదాపు అందరూ మటాష్ అయారు. దీనికి చక్కటి నిదర్శనం కమ్యూనిస్టు పార్టీలు. ఇప్పుడు బీజేపీ కూడా దాదాపు అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది. అలాగే పవన్ కూడా బాబుతో రాజకీయంగా కలవాలనే ఉద్దేశం ఉంటే అది ఆయన స్వేచ్ఛ. కానీ గతానుభవాల రీత్యా పవన్ ఆపని చేస్తే తాను ఎదగడం మాటేమో కానీ తనతో ఇంతవరకు కలిసి వస్తున్న, మద్దతిస్తున్న అభిమానులు చాలామందిని కూడా పవన్ కోల్పోయే ప్రమాదమైతే పొంచి ఉంది. తన భవిష్యత్తుకు సంబంధించిన అడుగులు వేసే ముందు పవన్ కల్యాణ్ దీన్ని తీవ్రంగా పరిశీలించుకుంటే మంచిది.

వ్యాసకర్త మార్క్సిస్టు విశ్లేషకులు । మొబైల్ : 98480 69720

విశ్వ బోధకుడు బిల్లీ గ్రాహం

ఆయన ప్రవేశంతో ఈరోజు పరలోకం పులకరించిపోయింది. కానీ పుడమి ఒక మహోన్నత క్రైస్తవుణ్ణి కోల్పోయింది. ఒకటిమాత్రం నిజం. ఐదారు శతాబ్దాలకొకసారి బిల్లీ గ్రాహం వంటి మహా దైవజనుడు ఈ లోకంలో కనబడతాడు.


సందర్భం



రెవ. డా. టి. ఎ. ప్రభుకిరణ్

ఆకలేసిన పసికందులు పాల కోసం ఏడ్వడం ఆరంభిస్తే ఏ తల్లైనా విసుక్కొంటుందా? తన పనులన్నీ వదిలేసి పరిగెత్తుకునివచ్చి బిడ్డను ఆలింగనం చేసుకొని ప్రేమతో పాలు పడుతుంది కదా. ఆపదలో, కష్టాల్లో ఉన్న విశ్వాసి చేసే ఆక్రందనలతో కూడిన ప్రార్థనకు కూడా దేవుడు అలాగే ప్రతిస్పందిస్తాడు. తన బిడ్డలైన ప్రజల్ని కాపాడుకోవడం, ఆదరించడమే దేవునికి ఎంతో ఇష్టమైన విషయం. దైవ మానవ బంధాన్ని, ప్రార్థనా ప్రక్రియను ఎలా ఎంతో ఆర్ద్రంగా, అద్భుతంగా, అందంగా, మనసుకు హత్తుకు నేలా సోదాహరణంగా నిర్వచించగలిగిన ఏకైక మహా దైవజనుడు రెవ. డాక్టర్. బిల్లీగ్రాహం. గత నవంబర్ 7న నూతన సంవత్సరంలోకి ప్రవేశించిన బిల్లీగ్రాహంగారి వందేళ్ల జన్మదినోత్సవాలను అమెరికాలోని నార్త్ కేరొలిన్ రాష్ట్రంలో ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన వేలాదిమంది ఆహ్వానితులు, ఆయన అభిమానులు, శిష్యుల సమక్షంలో ఎంతో పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్న సమయంలో ఆయన ఫిబ్రవరి 21న ఈ లోకంతో తనువు చాలించి పరలోకానికి వెళ్లిపోయారు. ఈ శతాబ్దపు, గత శతాబ్దపు క్రైస్తవ దైవజనుల్లో అగ్రగణ్యుడు రెవ. డాక్టర్. బిల్లీ గ్రాహం. కడిగిన ముత్యంలా నిష్కళంక జీవితంతో, వాక్చాతుర్యం జోలికి పోకుండా అత్యంత సరళమైన పదాలతో, అందరికీ రోజూ ఎదురయ్యే అనుభవాలనే సోదాహరణంగా పేర్కొంటూ సాగే ఆయన ప్రసంగ శైలి అత్యంత విలక్షణమైనది. ‘గాడ్ లవ్స్ యూ, కమ్ టు హిమ్ టు నైట్’ (దేవుడు మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు. ఈ రాత్రి ఆయన వద్దకు వచ్చేయండి) అంటూ ఆయన తన సువార్త మహా సభల్లో ప్రసంగం చివర తన రెండు చేతులూ చాచి ఆహ్వానిస్తే, వేలాదిమంది ఉన్నఫళంగా లేచి నిలబడి దేవుణ్ణి తమ జీవితాల్లో హత్తుకొని పరివర్తన చెందడం అత్యంత సామాన్యమైన దృశ్యం.

అమెరికాలో ఉత్తర కేరొలినా రాష్ట్రంలోని శార్లెట్ పట్టణంలో ఒక పేద రైతు కుటుంబంలో డాక్టర్ బిల్లీ గ్రాహం జన్మించారు. సదరన్ బాప్టిస్ట్‌గా పిలిచే క్రైస్తవ శాఖకు చెందిన బిల్లీ గ్రాహం ఫ్లోరిడాలోని ట్రినిటీ బైబిల్ కాలేజీలో బైబిలు అధ్యయన శాస్త్రం (థియాలజీ) చదివి క్రైస్తవ పరిచారకుడయ్యాడు. లక్షలాదిమంది హాజరయ్యే అతిపెద్ద సువార్త సభల్లో 1947 నుండి 2005 వరకు అనేక వందల సభల్లో ఆయన ప్రసంగించారు. పత్రికలు, రేడియో, టీవీల ద్వారా ఆయన అందజేసిన సువార్త ఇప్పటిదాకా 100 కోట్ల మందికిపైగా ప్రజలకు చేరిందని అంచనా. తాను నమ్మిన క్రైస్తవ విశ్వాసాన్ని అందరికీ ధైర్యంగా ప్రకటించడమేగాక దాన్నే తూ.చ. తప్పకుండా తన జీవితంలో ఆచరించి చూపాడాయన. ప్రపంచీకరణ, సరళీకరణ పెనుగాలులకు క్రైస్తవ మత విశ్వాసం అనే దీపం ఆరిపోతుందేమోనన్నంతగా రెపరెపలాడుతుండగా, ఉవ్వెత్తున కెరటంలా లేచిన ఎంతోమంది



గొప్ప క్రైస్తవ బోధకులు, వారి జీవితాల్లో క్రైస్తవ విలువలను ఆచరించడంలో విఫలమై మట్టికాళ్ల మహా ప్రతిమలుగా కుప్పకూలుతున్న ఆధునిక సమకాలీన ప్రపంచంలో హిమాలయమంత ఎత్తుకు ఎదిగి చిట్టచివరిదాకా అంతే స్థిరంగా పడిపోకుండా నిలిచిన మహోన్నత పర్వతం డాక్టర్ బిల్లీ గ్రాహం.


కోట్లమందికి సువార్త అనే ఆశీర్వాదాన్ని ఆయన ద్వారా పంచిపెట్టాడు. హైదరాబాద్ నగరాన్ని కూడా ఆయన 1970వ దశకంలో ఒక సువార్త మహాసభ ద్వారా దర్శించాడు. కృష్ణా జిల్లా దివిసీమలో 1977లో వచ్చిన ఉప్పెన సమయంలో బిల్లీ గ్రాహం ఆ ప్రాంతాలు దర్శించి అక్కడి దృశ్యాలు చూసి చలించిపోయి వేలాదిమందికి ఇళ్లు కట్టించడానికి నడుంబిగించి విరాళాలు సేకరించి ఆ ప్రాజెక్టును పూర్తి చేశారు. ఏ విధంగా చూసినా బిల్లీ గ్రాహం గారిది ధన్య జీవితం. సాత్వికత్వం, నిశ్చలత్వం, సౌశీల్యం, అలుపెరుగని అవిశ్రాంత వ్యక్తిత్వం బిల్లీ గ్రాహం సొంతం. పాటలంటే ఆయన ప్రాణం. ఆయన బెవర్లీషీ అనే గొప్ప గాయకుడు, ప్రాణ మిత్రుడు బిల్లీ గ్రాహం ప్రసంగించే ముందు ఒక పాట పాడేవారట. లక్షలమంది పాల్గొన్న ఒక సభలో ఒకసారి బెవర్లీషీ ‘అమేజింగ్ గ్రేస్’ అనే పాట పాడితే పరవశించిపోయిన బిల్లీగ్రాహం మైక్ ముందుకొచ్చి, అంత అద్భుతమైన పాటే ఈనాటి ప్రసంగం అని ప్రకటించి ప్రసంగించకుండా ప్రార్థించి సభను ముగించారట.

ఆయన ప్రవేశంతో ఈరోజు పరలోకం పులకరించిపోయింది. కానీ పుడమి ఒక మహోన్నత క్రైస్తవుణ్ణి కోల్పోయింది. ఐదారు శతాబ్దాల కొకసారి బిల్లీ గ్రాహం వంటి మహా దైవజనుడు ఈ లోకంలో కనబడ్డాడు. యేసు నడిచివెళ్లిన అడుగు జాడలు ఆయన మరోసారి లోకానికి కనిపించే విధంగా తన అడుగు జాడల్లో చూపించి వెళ్లాడు. దైవ జనులంటే సినీతారల్లాగా, క్రికెటర్లలాగా సెలబ్రిటీలు కాదని, యేసు జీవితాన్ని, బోధల్ని ఆచరించి చూపించే ‘సెలబ్రేషన్’గా జీవించిన మహామహులని ఆయన నిరూపించాడు. ఈ మాటలు ఆయన తన డైరీలో రాసుకున్నారు. ‘‘ఒక రోజున టీవీల్లో, దినపత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో బిల్లీ గ్రాహం చనిపోయారన్న వార్త వింటారు, చదువుతారు, తెలుసుకుంటారు. కానీ ఆ వార్తను మీరు ఏ మాత్రం నమ్మొద్దు. ఇప్పటికన్నా క్రియాశీలకంగా, బలంగా నేను జీవిస్తూంటాను. కాకపోతే నా చిరునామా ఈ లోకం నుండి పరలోకానికి మారుతుంది. అక్కడ దేవుని సమక్షంలో సంతోషంగా ఉంటాను...’’

మొబైల్ : 98488 21472

మోదీకి ఓ సలహా

రాహుల్ గాంధీ సూచనలను బొత్తిగా కొట్టిపారేయకుండా మోదీ ‘జాదూ కా జప్పీ’ని గుర్తుంచుకోవాలి. వారు విదేశాల్లోనే కాకుండా దేశంలో పర్యటించినప్పుడు మధ్య మధ్య మామూలు మనుషుల్ని కూడా కావలించుకోవాలి.



గొల్లపూడి మారుతీరావు

నాకు రాహుల్ గాంధీ అభిప్రాయాలమీద అపారమైన విశ్వాసం ఉంది. వారు ఏ అభిప్రాయమైనా ఆచితూచి చెబుతారు. ఇప్పుడు రాహుల్, మోదీకి ఓ సలహా చెప్పారు.

మోదీ టీవీలు తరచూ చూస్తారని మొన్న రాజ్యసభలో రేణుకాదేవి నవ్వుకి రామాయణాన్ని ఉదహరించడం ద్వారా మనకి అర్థమయింది. అలాగే వారు ‘మున్నాభాయ్ ఎంబీబీఎస్’ సినిమాని కూడా చూసి ఉండవచ్చు. అందులో కథానాయకుడు సంజయ్‌దత్ మహాత్మాగాంధీ ఉదహరించిన ‘జాదూ కి జప్పీ’ మోదీ హృదయానికి గట్టిగా హత్తుకుని ఉంటుంది. మహాత్ముడు– ఎదుటి వ్యక్తి మంచిచెడ్డలను విశ్లేషించకుండా గట్టిగా ఆలింగనం చేసుకోవడం వల్ల ఎటువంటివారయినా ఆత్మీయులవుతారనీ– ఇదే ‘ఆలింగనంలో ఉన్న మ్యాజిక్’ అని వక్కాణించారు. కనుక– ఈ మూడు నాలుగు సంవత్సరాలలో వారు పర్యటించిన 50 దేశాలలో ఈ ‘మ్యాజిక్’ని వినియోగించారు.

అయితే ఇందులో చిన్న పక్షపాత ధోరణి ఉన్నదని రాహుల్ గాంధీ భావించారు. ఎంతసేపూ మోదీ ఆయా దేశాల నాయకుల్ని, మహానుభావుల్నీ కావలించుకుంటారు కానీ– పేద రైతుల్నీ, కార్మికుల్నీ, జవాన్లనీ కావలించుకోవడం లేదు అని విచారాన్ని వ్యక్తం చేశారు.

సాధారణంగా ఈ వీరంగాన్ని మనం ఎన్నికల్లో చూస్తాం. మామూలు రోజుల్లో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాన్ని మరచిపోతారు.

‘ఒరే కేతీ! మన నియోజకవర్గం పేరేటిరా?’ అని గుర్తు తెచ్చుకుంటారు.

గుడిసె గుడిసెకీ వెళ్లి అందర్నీ కావలించుకుని, ముద్దులాడి, పిల్లల్ని ఎత్తుకుని కితకితలు పెట్టి, వీలయితే వారింట్లో తరవాణీ అన్నం రుచి చూస్తారు. సంభాషణ ఇలా సాగుతుంది:

‘బాగున్నావా నూకాలమ్మా?’

‘బాగున్నాను కానీ నా పేరు నూకాలమ్మ కాదు బాబూ– అసిరమ్మ’

‘నీ మొగుడు ఉద్యోగం చేస్తున్నాడా?’

‘ఆడు సచ్చిపోయి 13 ఏళ్లయింది బాబూ’

‘నీ కొడుకు నౌఖరీ ఎలా ఉంది?’

‘నాకు కొడుకే లేడు బాబూ’

ఎమ్మెల్యేగారు కంగారుపడి కార్యకర్త వేపు తిరిగి– మెల్లగా ‘ఏరా! లం.. కొడకా! ఏటీ తిరకాసు?’

కార్యకర్త ‘వార్డు నంబరు తప్పు పడిందయ్యా’ అని నాలిక కొరుక్కుంటాడు.

ఒక్కో నాయకునికి ఒక్కొక్క అలవాటుంటుంది. ఒక్కో ఏడుపు ఉంటుంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌జీఆర్ మామూలు మనుషుల్ని ఆదరంగా కావలించుకునేవారు. అంతే. ఓట్ల వర్షం కురిసేది. నెహ్రూ ఉన్నట్టుండి కారులోంచి దూకి రోడ్డు పక్క నిలబడిన

జీవన కాలమ్



పిల్లల్ని ముద్దాడేవారు. రక్షణ సిబ్బందికి తలప్రాణం తోకకి వచ్చేది. దాదాపు తాతగారి మర్యాదల్నే పాటించిన రాజీవ్ గాంధీ ప్రజల మధ్య అలవోకగా నడిచి ప్రాణాల మీదకి తెచ్చుకున్నారు.

ఇప్పుడు మోదీకి నావి కొన్ని సలహాలు. రాహుల్ గాంధీ సూచనలను బొత్తిగా కొట్టిపారేయకుండా మోదీ ‘జాదూ కా జప్పీ’ని గుర్తుంచుకోవాలి. వారు విదేశాలకు వెళ్లినప్పుడు మాత్రమే కాకుండా దేశంలో పర్యటించినప్పుడు మధ్య మధ్య మామూలు మనుషుల్ని కూడా కావలించుకోవాలి. అయితే వారిలో రైతులు ఎవరు, కార్మికులు ఎవరు, జవాన్లు ఎవరు– అన్నది ఎలా తెలుస్తుంది? మార్గం ఉంది. మోదీ వెళ్లే ఊరేగింపులో ‘ఎర్ర’ బ్యాడ్జీ పెట్టుకున్న వ్యక్తి కార్మికుడుగా ముందు రక్షణ శాఖ మోదీకి సూచన చేయవచ్చు. అలాగే ‘పచ్చ’ బ్యాడ్జీ రైతుగా, మిలట్రీ యూనిఫారం రంగు బ్యాడ్జీగల వారిని సైనికులుగా మోదీకి సూచించవచ్చు. మధ్య మధ్య ఓ రిక్షా వాడిని, ఓ మరమరాల దుకాణం వాడిని, ఓ టీ దుకాణం వాడినీ కావలించుకోవచ్చు.

అయితే ఇందులో చిన్న తిరకాసు ఉంది. మోదీ ఊరేగింపులో ఉన్నట్టుండి ఆయన కారు దిగి తనవైపు దూసుకు వస్తుంటే మరమరాల దుకాణం వాడికి చెమటలు పట్టవచ్చు. భయంతో పారిపోవచ్చు. కంగారుతో భోరుమని ఏడవవచ్చు. మరి ఫలానా మరమరాల వాడిని మోదీ కావలించుకుంటారని రక్షణ శాఖకి ఎలా తెలుస్తుంది? అందుకని మోదీ వెళ్లే దారిలో కావలించుకున్నా ఇబ్బందిలేని టీకొట్టువాడు, పాత సామాన్లు అమ్మేవాడు– వీళ్లకి ధైర్యం చెప్పడానికి మామూలు దుస్తుల్లో రక్షణ భటుల్ని ఉంచాలి. ‘చూడు బాబూ.. కొద్దిసేపట్లో ప్రధానమంత్రి ఇటు వస్తారు. వారు కారు దిగి ఒకవేళ నీ వేపు వస్తే నువ్వు కంగారుపడనక్కర లేదు. కేవలం నిన్ను కావలించుకుని మురిసిపోతారు. అంతే’ అని ధైర్యం చెప్పాలి. అలా పోగయిన వాళ్లలో ఓ థానూ, ఓ శివరాజన్ వంటి వారు ఉండకుండా చూసుకోవాలి.

ఏనాడైనా మోదీ చాలా గడుసయిన నాయకులని నాకనిపిస్తుంది. విదేశాల్లో 50 కెమెరాలు తమ మీద ఉండగా కావలించుకున్న మోదీ గారిని ట్రంప్ దొరగారు తుపాకీతో కాల్చరు. మరి ‘జాదూ కా జప్పీ’ మాటో! రోడ్డుమీద మనిషికి మోదీ ఆ అవకాశం కల్పించి తనకి పక్షపాతం లేదని నిరూపించుకోవాలి. ఇదీ రాహుల్ అభిమతం.

'మక్కళ్ నీది మయ్యం'

కొత్త పార్టీ పేరును ప్రకటించిన కమల్‌హాసన్



సాక్షి ప్రతినిధి, చెన్నై

తమిళనాట మరో నటుడు రాజకీయ రంగప్రవేశం చేశారు. ప్రఖ్యాత హీరో, లోకనాయకుడుగా పేరుగాంచిన కమల్ హాసన్ బుధవారం మదురైలో పార్టీ పేరును, పతాకాన్ని ఆవిష్కరించారు. 'మక్కళ్ నీది మయ్యం (ప్రజా న్యాయ వేదిక)' పేరుతో ప్రజాక్షేత్రంలోకి దిగబోతున్నట్లు అభిమానుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అలాగే, ఐకమత్యాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆరు చేతులు ఒకదాన్నొకటి మణికట్టు దగ్గర పట్టుకున్నట్లుగా, వర్తులాకృతిలో ఉన్న చిత్రం, మధ్యలో నక్షత్రం ఉండేలా పతాక రూపకల్పన చేశారు. ఆ చేతులు ఎరుపు, తెలుపు రంగుల్లో ఒకదాని తరువాత మరొకటి ఉండేలా చిత్రించారు. ఆ ఆరు చేతులు ఆరు దక్షిణాది రాష్ట్రాలకు ప్రతీకలని తన ప్రసంగం సందర్భంగా కమల్ వివరించడం విశేషం. దక్షిణ తమిళనాడులోని మదురైలో నిర్వహించిన ఈ భారీ బహిరంగసభకు కమల్ అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సభకు ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా.. తాను ప్రజల చేతుల్లోని ఆయుధాన్నని అభివర్ణించుకున్న కమల్.. పార్టీ ఏర్పాటు ప్రజాపాలనకు తొలి అడుగని, ఇక్కడున్న ప్రజాసమూహంలోని ప్రతీ ఒక్కరూ నాయకులేనని స్పష్టం చేశారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న పలు సమస్యలను, వివాదాలను ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించారు. 'నేను మీకు సలహాలు ఇచ్చే నాయకుడిని కాను. మీ సలహాలు వినే కార్యకర్తను' అని వేదికపై కమల్ చెప్పడంతో ప్రజలంతా చప్పట్లు, ఈలలు, కేరింతలతో కొత్త పార్టీకి స్వాగతం పలికారు.

వృత్తి కాదు.. నీతి ముఖ్యం!

రాజకీయాల్లో చేరేందుకు వృత్తి ఏమిటనేది ముఖ్యం కాదని, నీతి, నిజాయితీ, సత్యం, ఉద్వేగం వంటి సుగుణాలు కలిగి ఉన్నవారంతా రాజకీయ రంగ ప్రవేశానికి అర్హులేనని కమల్ చెప్పారు. 'తమిళనాడు ప్రజలు ఇంకా ఎన్నాళ్లు అవినీతి పాలనలను భరించాలి.. మూగవారిగా కలలు కంటూ కాలం గడపాలి? ఈ రాష్ట్రంలో డబ్బుకు కొదవ లేదు. మంచి మనుషులకే కొరత ఉంది. నేను నాయకుడిని కాదు. మీ సేవకుడిని. తమిళుడిగా మనకు మనమే న్యాయం చేసుకోవాలి అని అందరూ ప్రమాణం చేయాలి. ఓటుకు ఆరువేలు ఇచ్చి నష్టపోతున్నామని నేతలంటున్నారు. నేను డబ్బులిచ్చి ఓటు అడగను. ఇన్నాళ్లు ప్రజలు ఓటును అమ్ముకుని మోసపోయారు. మంచి పార్టీకి ఓటేస్తే ఏడాదికి ఆరు లక్షలు సంపాదించుకునే స్తోమత కలుగుతుంది. ఇన్నాళ్లు కావేరి జలాల సమస్యపై నేతలు ఇల్లు కాలుతుంటే బీడి వెలిగించుకున్నట్లుగా వ్యవహరించారు. కర్ణాటక నుంచి నీరు కాదు ప్రజలు తమిళనాడు కోసం రక్తదానం చేసేందుకు సిద్ధం చేస్తాను. మనకు మంచి భవిష్యత్తు ఉంది. నటుడిగా మీ వల్ల సంపాదించాను. ఇందుకు కృతజ్ఞతగా ప్రజలకు ఏమి చేశానని ఆలోచించాను. నాలో తప్పు చేశానన్న భావన కలిగింది. అందువల్లే రాజకీయపార్టీని స్థాపించడం ద్వారా తమిళనాడు ప్రజల రుణం తీర్చుకోవాలని సంకల్పించాను. ప్రజా సేవకుడిగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేకుంటే మరొకరికి సారథ్యం అప్పగిస్తానే గాని పదవులను పట్టుకుని ఊగిసలాడను. అవినీతి నిర్మూలనకు ప్రజలు నాతో పాటు కొంత త్యాగం చేయాల్సి ఉంటుంది. నేను అధికారంలోకి వస్తే ప్రజలకు క్వార్టర్ బాటిల్, స్కూటర్‌లు ఉచితంగా ఇవ్వను. స్కూటర్లు కొనుక్కునే స్తోమతకు ప్రజలను తీసుకుని వస్తాను. మహిళలను చూస్తున్నప్పుడు అమ్మను, సోదరిని చూస్తున్నామనే భావన కలిగితే వేధింపులు ఆగిపోతాయి. ఇన్నాళ్లు ఏలిన వారు ప్రజలకు చేసింది శూన్యం. అందుకే నేను రాజకీయాలలోకి రావాల్సి వచ్చింది' అని కమల్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుతో మంగళవారం రాత్రి తాను మాట్లాడాననీ, విధానాలను ప్రకటించడం కంటే ప్రజాసంక్షేమ కార్యక్రమాల జాబితాను తయారుచేసుకోవాల్సిందిగా తనకు చంద్రబాబు సూచించారని కమల్ చెప్పారు.

రామేశ్వరం నుంచి ప్రారంభం..

రామేశ్వరంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఇంటిని సందర్శించి కమల్ తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. కలాం దేశభక్తి, ఆశయాలకు తాను ముగ్ధుడినయ్యాననీ, ఆయనే తనకు మార్గదర్శకుడు, స్ఫూర్తి ప్రదాత అని కమల్ కొనియాడారు. శతాధిక వృద్ధుడైన కలాం అన్న మహమ్మద్ ముత్తుమీరన్ లెబ్బై మరైక్కయార్‌ను కమల్ కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ తర్వాత ఓ ట్వీట్ చేస్తూ 'నిరాడంబరత నుంచే గొప్పతనం వస్తుంది. గొప్ప వ్యక్తికి చెందిన చిన్న ఇంటి నుంచి నా ప్రయాణాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

నిజ జీవితపు హీరో కమల్: కేజ్రీవాల్

కమల్ నిజాయితీ గల, నిజ జీవితపు హీరో అని కేజ్రీవాల్ ప్రశంసించారు. డీఎంకే, ఏడీఎంకేలు అవినీతి పార్టీలనీ, నిజాయితీ ఉన్న పార్టీకి ఓటేసే అవకాశం ఇప్పుడు తమిళనాడు ప్రజలకు లభించిందని కేజ్రీవాల్ అన్నారు. కమల్ రాజకీయ అరంగేట్రాన్ని కేరళ సీఎం పినరయి విజయన్ ఓ ప్రకటనలో స్వాగతించారు. లౌకికత్వం, ప్రజాస్వామ్యం, బహుళత్వ సమాజాన్ని కమల్ పార్టీ గౌరవిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కమల్ పార్టీలో చేరేందుకు పలువురు రిటైర్డు ఐఏఎస్, ఐపీఎస్‌లు ఉత్సాహం చూపుతున్నట్లు తెలుస్తోంది. మాజీ ఐపీఎస్ అధికారి, చెన్నై మైలాపూర్ పోలీస్ సహాయ కమిషనర్ మవురియా, నటి శ్రీప్రియ మంగళవారం రాత్రి కమల్‌పార్టీలో చేరారు.

కాగితపు పువ్వు కమల్: డీఎంకే, ఏడీఎంకే

కమల్, రజినీలు సువాసన వెదజల్లలేని కాగితపు పువ్వులని డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ మంగళవారం వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నానని మత్స్యశాఖ మంత్రి జయకుమార్ అన్నారు. స్టాలిన్ వ్యాఖ్యలపై కమల్ స్పందిస్తూ వాడిపోవడానికి తాను పువ్వును కాదనీ, చెట్టుగా ఎదిగే విత్తనాన్నని బదులిచ్చారు. దీనిపై జయకుమార్ మాట్లాడుతూ కమల్ జన్యుపరంగా మార్పులు చేసిన విత్తనమనీ, ఎవ్వరికీ ఉపయోగం లేదనీ, భారత్‌లో దాన్ని వాడరని అన్నారు.

మేనిఫెస్టో

'నాణ్యమైన విద్య, అవినీతి రహిత పాలన, నిరుద్యోగ నిర్మూలన, కోతలు లేని విద్యుత్ నా రాజకీయలక్ష్యాల'ని కమల్ పేర్కొన్నారు.

పార్టీ, పతాకం

మక్కల్ నీది మయ్యంలో మయ్యం అంటే కేంద్రం...మధ్య స్థానం.ప్రజలకు సమపాలన అందించే త్రాసులోని ముల్లు వంటిది. పతాకంలోని ఆరు చేతులూ ఆరు రాష్ట్రాలు, దక్షిణ భారతావనికే కొత్త మ్యాపు ఇది' అని కమల్ అభివర్ణించారు. మధ్యలో ఉన్న నక్షత్రం రాష్ట్ర ప్రజలని వివరించారు.

బాల నటుడిగా ప్రారంభించి..

ఐదు దశాబ్దాలపాటు సినీ పరిశ్రమలో కొనసాగి ఎన్నో అద్భుత విజయాలను, జాతీయ పురస్కారాలను అందుకున్న కమల్ తాజాగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1954లో జన్మించిన కమల్ 1960లో 'కాళత్తూర్ కణ్ణమ్మ' చిత్రంలో ఒక అనాథ బాలుడిగా తన నట ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం కొద్ది కాలం నృత్య సహాకుడిగానూ పనిచేశారు. తర్వాత దర్శకదిగ్గజం, దాదా సాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత దివంగత కె.బాలచందర్ దృష్టిని ఆకర్షించిన కమల్.. ఆయనతో దర్శకత్వంలో అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించారు. 1981లో 'ఏక్ దూజే కే లియే' చిత్రంతో బాలీవుడ్‌లోనూ అరంగేట్రం చేశారు. ఎన్నో శృంగారభరిత, పోరాట చిత్రాల్లో నటించిన ఆయన మగువల మనసును కొల్లగొట్టారు. అయితే 2012–13 సమయంలో ఆయన సినీ పరిశ్రమలో కష్టకాలాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. కమల్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన విశ్వరూపం చిత్రాన్ని వివాదాలు చుట్టుముట్టి విడుదలకు ఆటంకాలు ఏర్పడటంతో ఓ దశలో ఆయన దేశం విడిచి పోతానని కూడా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తొలి నుంచి రాజకీయాలకు దూరంగా ఉండిన కమల్, మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణం తర్వాత అధికార ఏడీఎంకే, ప్రతిపక్ష డీఎంకేలపై ట్వీటర్‌లో విమర్శలు చేసేవారు. ఏదైనా మాట్లాడాలంటే రాజకీయాల్లోకి రావాలని కొందరు నేతలు అనడంతో అప్పటి నుంచి రాజకీయ రంగ ప్రవేశంపై దృష్టి పెట్టారు. జయలలిత మరణం, డీఎంకే అధినేత కరుణానిధి వృద్ధాప్యం కారణంగా ప్రస్తుతం రాష్ట్రంలో కొంత రాజకీయ శూన్యం ఏర్పడిన నేపథ్యంలో కమల్ పార్టీ పెట్టడం గమనార్హం. తమిళనాడులో ఎందరో సినీ ప్రముఖులు రాజకీయాల్లోకి వచ్చినా, మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి మినహా మిగతా ఎవ్వరూ పెద్దగా రాణించలేదు.

ప్రియా వారియర్‌కు సుప్రీంలో ఊరట



న్యూఢిల్లీ: మలయాళీ చిత్రం 'ఒరు అదార్ లవ్'లో కన్నుగీటే సన్నివేశంతో దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన నటి ప్రియా ప్రకాశ్ వారియర్(18)కు సుప్రీంకోర్టులో బుధవారం ఊరట లభించింది. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రియాతో పాటు ఈ చిత్ర దర్శకుడు ఒమర్ లులూపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణపై అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. అలాగే వీరిద్దరిపై కొత్తగా ఎఫ్ఐఆర్‌లు నమోదుచేయరాదని సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఒరు అదార్ లవ్ చిత్రంలోని 'మాణిక్య మలరాయ పూవీ' పాట ముస్లింల మనోభావాల్ని దెబ్బతీసేలా చిత్రీకరించారంటూ తెలంగాణ, మహారాష్ట్రల్లో వారిపై క్రిమినల్ కేసులు నమోదైన సంగతి తెలిసిందే. దీంతో ఈ కేసుల్ని కొట్టివేయాలని కోరుతూ ప్రియా వారియర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పాట కేరళలో చాలా ప్రాచుర్యం పొందిందనీ, దీన్ని అపార్థం చేసుకోవడం వల్లే వేర్వేరు రాష్ట్రాల్లో తమపై కేసులు నమోదయ్యాయని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ విషయమై తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది.

ఎల్వోసీ సమీపంలో పాక్ హెలికాప్టర్ చక్కర్లు

న్యూఢిల్లీ: సరిహద్దులో కాల్పుల విరమణ ఒప్పందాన్ని తరచూ ఉల్లంఘిస్తోన్న పాకిస్తాన్ మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడింది. పాకిస్తాన్ సైన్యానికి చెందిన ఎంఐ–17 హెలికాప్టర్ ఒకటి బుధవారం ఉదయం 9.45 గంటలకు నియంత్రణ రేఖ(ఎల్వోసీ)కు 300 మీటర్ల సమీపంలోకి చొచ్చుకొచ్చింది. అనంతరం కొద్దిసేపటికే వెనక్కి తిరిగి వెళ్లిపోయింది. ఈ ఘటన పూంచ్ జిల్లాలోని గుల్పూర్ సెక్టార్‌లో జరిగినట్లు ఆర్మీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఎల్వోసీకి సమీపంలోకి వచ్చిన పాక్ హెలికాప్టర్‌పై భారత బలగాలు ఎలాంటి కాల్పులు జరపలేదనీ, పాక్ వైపు నుంచి కూడా ఎలాంటి దాడి జరగలేదని వెల్లడించారు. ఈ హెలికాప్టర్‌ను భారత ఆర్మీ బలగాలు స్పష్టంగా చూడగలిగాయన్నారు. ఎల్వోసీకి కి.మీ లోపు హెలికాప్టర్లు, 10 కి.మీ.లోపు ఎలాంటి విమానాలు ఎగరరాదని ఇరుపక్షాలు గతంలో అంగీకారానికి వచ్చినట్లు పేర్కొన్నారు.

రైల్వే దరఖాస్తు ఫీజును పెంచలేదు: పియూష్

న్యూఢిల్లీ: రైల్వేల్లో ఉద్యోగ నియామక పరీక్షలకు ఫీజును పెంచలేదని ఆ శాఖ మంత్రి పియూష్ గోయల్ స్పష్టం చేశారు. గతంలో రైల్వే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ తదితర కొన్ని వర్గాల అభ్యర్థులను ఉచితంగా పరీక్షలకు అనుమతించేవారు. జనరల్ కేటగిరీ అభ్యర్థుల నుంచి రూ.100 వసలూ చేసేవారు. అయితే ఫీజు లేకపోవడంతో చాలా మంది కేవలం దరఖాస్తు చేసి కనీసం పరీక్షకు కూడా హాజరు కావడం లేదని తాము గుర్తించామనీ, కాలక్షేపం కోసం కాకుండా నిజంగా ఉద్యోగం కోరుకునేవారే దరఖాస్తు చేసేలా చర్యలు తీసుకున్నామని గోయల్ చెప్పారు. అందులో భాగంగానే గతంలో ఫీజు మినహాయింపు ఉన్న వర్గాల అభ్యర్థుల నుంచి ఈసారి రూ.250, జనరల్ అభ్యర్థుల నుంచి రూ.500 ఫీజు తొలుత వసూలు చేయాలని తాము నిర్ణయించామన్నారు. పరీక్షకు హాజరైన వారిలోని మినహాయింపు ఉన్న వర్గాలకు వారు కట్టిన మొత్తం ఫీజును, జనరల్ అభ్యర్థులకు రూ.400ను వెనక్కు ఇస్తామన్నారు. అందువల్ల ఇది ఫీజు పెంపు కిందకు రాదని గోయల్ వివరించారు.

పీఎన్‌బీ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

- బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సహా 9 మంది అరెస్టు
- నీరవ్, చోక్సీల షెల్ కంపెనీలపై కొనసాగుతున్న దాడులు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రూ.11,400 కోట్ల పీఎన్‌బీ కుంభకోణానికి బాధ్యులైన వారిచుట్టూ ఉచ్చు బిగుస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేశ్ జిందాల్ (2009–11 మధ్య కుంభకోణం జరిగిన పీఎన్‌బీ బ్రాడీహౌజ్ (బ్రాంచ్ హెడ్) సహా తొమ్మిది మంది బ్యాంకు ఉన్నతాధికారులనూ సీబీఐ అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. వీరంతా.. మోదీ, చోక్సీలకు మేలు జరిగేలా అబద్ధపు గ్యారెంటీలను జారీచేశారన్నకోణంలో విచారణ జరుగుతోంది. ఈ కుంభకోణాన్ని సీరియస్‌గా తీసుకున్న ఈడీ దేశవ్యాప్తంగా పలుచోట్ల సోదాలు నిర్వహించింది. ఈడీ చీఫ్ కర్నల్ సింగ్ తన ఫ్రాన్స్ పర్యటన (అంతర్జాతీయ మనీల్యాండరింగ్ కేసుల విచారణ సంస్థల సదస్సు)ను రద్దు చేసుకుని మరీ వ్యక్తిగతంగా ఈ కేసు విచారణను పర్యవేక్షిస్తున్నారు. అటు ఆరోరోజు దేశవ్యాప్తంగా పలుచోట్ల నీరవ్ మోదీ, చోక్సీలకు సంబంధించిన ఆస్తులపై ఈడీ, సీబీఐ దాడులు జరిగాయి. ముంబై సమీపంలోని అలీబాగ్‌లో ఉన్న నీరవ్ మోదీ విలాసవంతమైన ఫామ్‌హౌజ్ (1.5 ఎకరాల)ను సీబీఐ బుధవారం సీజ్ చేసింది. 2004లో 32 కోట్లకు నీరవ్ దీన్ని కొనుగోలు చేశారు. చోక్సీకి సంబంధించిన గీతాంజలి జెమ్స్, ఇతర సంస్థలపై ముంబై, పుణే, హైదరాబాద్, సూరత్, బెంగళూరు సహా 20 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు.

రొటొమ్యాక్ ఆస్తులు అటాచ్

రూ.3,695 కోట్ల రుణ ఎగవేత కేసుకు సంబంధించిన కేసులో రొటొమ్యాక్ కంపెనీ అధినేత విక్రమ్ కొఠారి, ఆయన కుమారుడు రాహుల్‌లకు చెందిన ఆస్తులను ఐటీ శాఖ అటాచ్ చేసింది. కాన్పూర్‌లోని మూడు స్థిరాస్తులు, అహ్మదాబాద్‌లోని ఒక భవంతిని అటాచ్ చేసింది. వీటి విలువ రూ. 85 కోట్లు. విక్రమ్, రాహుల్‌లను ఢిల్లీలో సీబీఐ బుధవారం విచారించింది.

సర్కారుకు స్వేచ్ఛనివ్వాలి: సుప్రీం

పీఎన్‌బీ కేసు దర్యాప్తులో కేంద్రానికి పూర్తి స్వేచ్ఛ కావాలని సుప్రీంకోర్టు చెప్పింది. ప్రభుత్వ సంస్థలు దర్యాప్తు సరిగ్గా చేయని పక్షంలోనే తామే జోక్యం చేసుకుంటామంది.

యూపీలో డిఫెన్స్ కారిడార్

- ప్రకటించిన ప్రధాని మోదీ
- రూ. 20 వేల కోట్ల పెట్టుబడులు, 2.5 లక్షల ఉద్యోగాలొచ్చే అవకాశం



లక్నో: ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రతిపాదించిన రెండు రక్షణ పారిశ్రామిక కారిడార్లలో ఒకదాన్ని ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్‌లో ఏర్పాటుచేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. దీని వల్ల రూ.20 వేల కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు, సుమారు 2.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. బుందేల్‌ఖండ్ ప్రాంత అభివృద్ధి దృష్ట్యా ఈ కారిడార్‌ను ఆగ్రా, అలహాబాద్, లక్నో, కాన్పూర్, ఝాన్సీ, చిత్రకూట్‌లకు విస్తరిస్తామని తెలిపారు. బుధవారం లక్నోలో మొదలైన రెండు రోజుల పెట్టుబడిదారుల సదస్సు ప్రారంభ కార్యక్రమంలో మోదీ ఈ విషయం వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విదేశీ ప్రతినిధులు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా మోదీ యూపీ పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అవకాశాలను ప్రస్తావిస్తూ..యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం బాగా పనిచేస్తోందన్నారు. ప్రతికూల వాతావరణాన్ని అధిగమించే సామర్థ్యం(పొటెన్షియల్), విధానాలు(పాలసీ), ప్రణాళికలు(ప్లానింగ్), పనితీరు(పెర్ఫామెన్స్) లాంటివి అభివృద్ధికి మార్గాలని, ఈ విషయంలో యూపీ సర్కారు, ప్రజలు మెరుగైన ప్రదర్శన చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు.

ఆప్ ఎమ్మెల్యేల అరెస్టు

- సీఎస్‌పై దాడి కేసులో...
- వారు దళిత, ముస్లిం వర్గాలకు చెందిన వారు కాబట్టే: ఆప్




అమానతుల్లా ఖాన్, ప్రకాశ్

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అన్షు ప్రకాశ్‌పై దాడి కేసుకు సంబంధించి ఇద్దరు ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు అరెస్టయ్యారు. ఎమ్మెల్యే ప్రకాశ్ జార్వాల్‌ను గతరాత్రి బాగా పొద్దుపోయాక, మరో ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌ను బుధవారం మధ్యాహ్నం పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మెల్యేల అరెస్టును ఆమ్ ఆద్మీ పార్టీ ఖండించింది. అరెస్టైన ఎమ్మెల్యేల్లో ఒకరు దళితుడు, మరొకరు ముస్లిం కాబట్టే వారినే బీజేపీ లక్ష్యంగా చేసుకుందని ఆరోపించింది. ఆప్ ఎమ్మెల్యేలు సీఎం సమక్షంలోనే తనను కొట్టారని అన్షు ప్రకాశ్ పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. తమ పార్టీ ప్రతిష్టను మసకబార్చేందుకే బీజేపీ సీఎస్‌ను అడ్డం పెట్టుకుని ఇలాంటి వ్యవహారాలకు పాల్పడుతోందని ఆప్ ఆరోపించింది. ఢిల్లీ పౌర సరఫరాల మంత్రి ఇమ్రాన్ హుస్సేన్, ఆయన సహాయకుడిపై సచివాలయంలో ఉద్యోగులు దాడిచేయగా ఆయన కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడం విదితమే. ఈ ఘటనకు సంబంధించి వీడియో ఆధారం ఉన్నా పోలీసులు ఇంకా ఏ చర్యలూ తీసుకోలేదనీ, కానీ సీఎస్ ఆరోపణలకు ఆధారాల్లేకుండానే తమ ఎమ్మెల్యేలను అరెస్టు చేశారని ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్ విమర్శించారు. మరోవైపు సీఎస్ తలపై స్వల్ప గాయాలున్నట్లు వైద్య పరీక్షల్లో తేలింది.

బిల్లీ గ్రాహమ్ కన్నుమూత

- లక్షలాది మంది క్రైస్తవుల అభిమానం పొందిన ఎవాంజలిస్ట్
- 185 దేశాల్లో క్రైస్తవ మత ప్రచార కార్యక్రమాల నిర్వహణ



మాంట్రీ(యూఎస్): విఖ్యాత క్రైస్తవ మత ప్రబోధకుడు, ప్రచారకర్త బిల్లీ గ్రాహమ్ కన్నుమూశారు. ఆయన వయసు 99 ఏళ్లు. గత కొన్నేళ్లుగా ప్రొస్టేట్ కేన్సర్, న్యుమోనియాతో బాధపడుతున్న ఆయన బుధవారం ఉత్తర కరోలినాలోని తన స్వగృహంలో మృతిచెందారు. అమెరికాలో ఉదారవాద ప్రొటెస్టంట్లు, రోమన్ కేథలిక్‌లకు పోటీగా మత ప్రచార కార్యక్రమాలను ఆయన ఒక ఉద్యమంలా నిర్వహించారు. 185కు పైగా దేశాల్లో సదస్సులు, సమావేశాలు నిర్వహించి సంప్రదాయ క్రైస్తవుల మధ్య అంతర్జాతీయ స్థాయిలో సంబంధాలు నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు. కమ్యూనిస్టుల పాలనలోని క్రైస్తవులకు కూడా ఆశా కిరణంగా నిలిచారు. మత బోధనల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మందికి చేరువైంది గ్రాహమే అంటే అతిశయోక్తి కాదు. 'అమెరికా పాస్టర్'గా పేరొందిన గ్రాహమ్.. ఐసన్‌హోవర్ నుంచి జార్జి డబ్ల్యూ బుష్ వరకు పలువురు అమెరికా అధ్యక్షులకు ఆధ్యాత్మిక సలహాదారుగా, సన్నిహితుడిగా వ్యవహరించారు. బహిరంగ ప్రార్థనలే కాకుండా టీవీలు, రేడియోల ద్వారా కూడా గ్రాహమ్ మిలియన్ల కొద్ది అభిమానులను సంపాదించుకున్నారు. గ్రాహమ్ మృతిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతాపం తెలిపారు.

21 కోట్ల మందికి ప్రసంగం

2005లో న్యూయార్క్ పట్టణంలో నిర్వహించిన తన చివరి ప్రార్థనలో ప్రపంచ వ్యాప్తంగా 21 కోట్ల మందిని ఉద్దేశించి ప్రసంగించి రికార్డు సృష్టించారు. అయనలా మరో ఎవాంజలిస్ట్ ఇలాంటి బృహత్తర కార్యక్రమం తలపెట్టే అవకాశాలు దాదాపు అసాధ్యమే. 1983లో అప్పటి అధ్యక్షుడు రీగన్ నుంచి గ్రాహమ్ అమెరికా అత్యున్నత పౌర పురస్కారం ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను అందుకున్నారు. గ్రాహమ్ 1918, నవంబర్ 7న చార్లెట్‌లో సంప్రదాయ క్రైస్తవుల కుటుంబంలో జన్మించారు. కాలేజీలో చదువుతుండగా చైనాకు చెందిన రూత్ బెల్ అనే యువతితో పరిచయమైంది. 1943లో వారు వివాహం చేసుకున్నారు.

'ఖలిస్తాన్'కు మద్దతు ఇవ్వం

పంజాబ్ సీఎంకు కెనడా ప్రధాని హామీ

- 9 మంది జాబితా ఇచ్చిన పంజాబ్ సర్కార్
- స్వర్ణదేవాలయాన్ని దర్శించుకున్న ట్రూడో



స్వర్ణదేవాలయంలో చపాతీలు చేస్తున్న ట్రూడో దంపతులు

అమృత్‌సర్: భారత పర్యటనలో భాగంగా బుధవారం పంజాబ్ చేరుకున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో.. కుటుంబ సమేతంగా పంజాబీ సంప్రదాయ వస్త్రధారణతో స్వర్ణ దేవాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ట్రూడో, కెనడా రక్షణమంత్రి హర్జిత్ సజ్జన్‌లు పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్‌తో ఓ హోటల్‌లో దాదాపు 40 నిమిషాల సేపు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కెనడాలో ఉంటూ పంజాబ్‌లోని యువతను విద్వేష నేరాలు, ఉగ్రవాదంవైపు రెచ్చగొడుతున్న 9 ఖలిస్తాన్ వేర్పాటువాదుల జాబితాను అమరీందర్ ట్రూడోకు అందజేశారు. వీరిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన్ను కోరారు. భారత్ సహా మరెక్కడా వేర్పాటువాద ఉద్యమాలకు కెనడా మద్దతివ్వబోదని ట్రూడో హామీ ఇచ్చినట్లు పంజాబ్ సీఎం మీడియా సలహాదారు రవీన్ థుక్రల్ తెలిపారు. క్యూబెక్‌లో వేర్పాటువాద ఉద్యమాన్ని తాను ఎదుర్కొన్నాననీ, ఇలాంటి హింసతో వచ్చే ప్రమాదాలపై తనకు పూర్తి అవగాహన ఉందని ఈ సమావేశంలో ట్రూడో చెప్పినట్లు వెల్లడించారు. 'తమ ప్రభుత్వం ఎలాంటి వేర్పాటువాద ఉద్యమానికి మద్దతివ్వబోదని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో హామీ ఇవ్వడం నిజంగా ఆనందకరమైన విషయం. ట్రూడో వ్యాఖ్యలు భారత్‌లోని అందరికీ చాలా ఊరట కల్గించాయి. భవిష్యత్‌లో కూడా వేర్పాటువాద శక్తుల్ని ఏరివేయడానికి కెనడా ప్రభుత్వ సహకారాన్ని కోరుతున్నాం' అని భేటీ అనంతరం అమరీందర్ ట్వీట్ చేశారు. అంతకుముందు శిరోమణి అకాలీదళ్ చీఫ్ సుక్బీర్ సింగ్ బాదల్, శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు గోబింద్‌సింగ్ లంగోవాల్‌లు ట్రూడో కుటుంబానికి స్వర్ణ మందిరంలోకి ఘన స్వాగతం పలికారు. భార్య, ఇద్దరు చిన్నారులతో కలసి ఆలయంలో ప్రార్థనల్లో పాల్గొన్న ట్రూడో.. ఆ తర్వాత ఇక్కడి గురు రాందాస్‌జీ లంగర్‌లో కుటుంబ సభ్యులతో కలసి చపాతీలు తయారుచేశారు.

ట్రూడోకు లేవా ఆలింగనాలు?

కెనడా ప్రధానితో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న ప్రభుత్వం



ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో మోదీ ఆలింగనం (ఫైల్)

న్యూఢిల్లీ: భారత్‌లో పర్యటిస్తున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో వెంట కేంద్ర మంత్రులెవరూ కనిపించడం లేదు. సంప్రదాయ దుస్తుల్లో తాజ్‌మహల్, స్వర్ణదేవాలయం, సబర్మతీ ఆశ్రమం సందర్శించినప్పుడు ఆయనతో భార్య, ముగ్గురు పిల్లలే ఉన్నారు. కెనడాతో(జనాభా మూడున్నర కోట్లు) పోల్చితే చిన్న దేశం ఇజ్రాయెల్(84 లక్షలు) ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఇటీవల ఇండియా వచ్చినప్పుడు ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే మోదీ ఆలింగనంతో స్వాగతం పలికారు. కెనడాతో భారత్‌కు వందేళ్లకు పైగా సంబంధాలున్నాయి. అక్కడ భారత సంతతికి చెందిన జనాభా సుమారు నాలుగు శాతం(దాదాపు 14 లక్షలు). ఈ నేపథ్యంలో వారం రోజుల అధికారిక పర్యటనపై వచ్చిన ట్రూడోతో భారత సర్కారు అంటీముట్టనట్టు ఎందుకు వ్యవహరిస్తోంది? అన్న ప్రశ్నకు సరైన జవాబు దొరకడం లేదు. కెనడాలో దాదాపు 1.4% జనాభా, పార్లమెంటులో 17 మంది సభ్యుల ప్రాతినిధ్యమున్న సిక్కుల్లోని తీవ్రవాద శక్తులతో ట్రూడో సర్కారు అంటకాగుతోందని, పరోక్షంగా మద్దతిస్తోందని మోదీ సర్కారు, ముఖ్యంగా పంజాబ్ కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తుండటమే ఇందుకు కారణమని పలువురు విశ్లేషిస్తున్నారు.

'ఖలిస్తాన్'పై నిరసనా?

పంజాబ్ ఖలిస్తాన్ ఉద్యమానికి కెనడా సిక్కుల్లో కొద్దిమంది మద్దతు ఇచ్చిన మాట నిజమే. 1985లో టోరంటో నుంచి 329 మంది ప్రయాణికులతో బయల్దేరిన ఎయిరిండియా విమానాన్ని సిక్కు ఉగ్రవాదులు దారిలోనే బాంబులతో కూల్చేశారు. 1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం దేశంలో మూడు వేల మంది సిక్కులను వేటాడి చంపడాన్ని కెనడా పార్లమెంటు 'మారణకాండ' అని వర్ణించడం అప్పటి కేంద్ర సర్కార్లకు నచ్చలేదు. ఇప్పటికీ కెనడా సిక్కుల్లో కొద్ది మంది ఖలిస్తాన్ ప్రస్తావన తేవడం ఇండియాకు మింగుడుపడడం లేదు. ట్రూడో మంత్రివర్గంలో కేబినెట్ (రక్షణ శాఖ) మంత్రి హర్జీత్‌సింగ్ సజ్జన్ ఖలిస్తానీ సానుభూతిపరుడంటూ కిందటేడాది ఆయనను కలుసుకోవడానికి పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ నిరాకరించారు. కెనడా యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం చేస్తున్న, అక్కడి ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న భారతీయుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. 'ట్రూడో పర్యటనను మోదీ చూసీచూడనట్టు వ్యవహరించడం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సిక్కు వేర్పాటువాద సమస్యకు సంబంధించి కెనడా సర్కారు వైఖరితో తీవ్ర అసంతృప్తిగా ఉన్నామని భారత్ ఇలా బలమైన సంకేతం ఇచ్చినట్లు తెలుస్తోంది'' అని బ్రూకింగ్స్ ఇండియాలో నిపుణుడు ధ్రువ జైశంకర్ అన్నారు.



కె.అగ్రహారంలో జగన్‌తో కలిసి నడుస్తున్న రైతులు



పొగాకు లోడుతో ఉన్న ట్రాక్టర్‌పై నుంచి జగన్‌తో కరచాలనం చేస్తున్న అక్కచెల్లెమ్మలు



పెద్ద అలవలపాడులో జగన్‌తో మాట్లాడుతున్న పొగాకు రైతులు



అగ్రహారంలో దివ్యాంగుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న జగన్



కనిగిరి నియోజకవర్గం వెంగళాపురం క్రాస్ వద్ద జగన్ వెంట నడుస్తున్న అశేషజనవాహిని

నవరత్నాలతో పేదలకు భరోసా

మా అన్న చెప్పాడని అందరికీ చెప్పండి..

అక్కచెల్లెమ్మలతో ప్రతిపక్ష నేత జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'నవరత్నాల గురించి మా అన్న చెప్పాడని అందరికీ చెప్పండి.. ఓ అవ్వా.. నా మనవడు చెప్పాడని అందరికీ చెప్పు... అమ్మా.. నా కొడుకు చెప్పాడని చెప్పండి.. దేవుడి ఆశీస్సులు, మీ అందరి సహకారంతో రేపు మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కచ్చితంగా నవరత్నాలను అమలు చేస్తామని చెప్పండి. పేదలందరినీ ఆదుకుంటామని కూడా చెప్పండి' అని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 94వ రోజు బుధవారం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని చెరువుకొమ్ము పాలెం వద్ద తనను కలిసిన మహిళలతో ఆయన మాట్లాడారు. అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మనల్నందరినీ మోసం చేశారని, ఇలాంటి నాయకుడిని ఇకపై నమ్మొద్దని చెప్పారు. రేపు మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏం చేస్తామో మీరంతా తెలుసుకుని ఇళ్లకు వెళ్లి అందరకూ చెప్పాలని కోరారు. 'మన చిట్టి పిల్లలను బడులకు పంపిస్తే.. ప్రతి తల్లికీ ఏటా రూ.15 వేలు ఇస్తాం. పెద్ద పెద్ద చదువులకు ఎంత ఖర్చు అయినా ప్రభుత్వమే భరిస్తుంది. పైగా వారి హాస్టల్ ఖర్చుల కోసం ఏటా రూ.20 వేలు ఇస్తాం. అవ్వాతాతల పింఛన్ వయసును 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు 45 ఏళ్లకే పింఛన్ ఇచ్చి ఆదుకుంటాం. అర్హత వయసు తగ్గించడం వల్ల ఇంకా ఎక్కువ మందికి మేలు జరుగుతుంది. పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మల రుణాలన్నింటినీ మాఫీ చేస్తానని చెప్పి.. ఒక్క రూపాయి కూడా మాఫీ చేయకుండా చంద్రబాబు దారుణంగా మోసం చేశారు కదా.. (అవును.. అవును.. అని మహిళల స్పందన) మనందరి ప్రభుత్వం రాగానే ఎన్నికల నాటికి డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణం ఎంత ఉందో ఆ మొత్తాన్ని నాలుగు విడతలుగా వారి చేతికే నేరుగా అందిస్తాం. మీకు సున్నా వడ్డీకే రుణాలు కావాలా? వద్దా? (కావాలి.. కావాలి అంటూ మహిళల స్పందన) వాస్తవానికి గత ప్రభుత్వాల్లో సున్నా వడ్డీకే మహిళలు, రైతులకు రుణాలు లభించేవి. ఎలా వచ్చేవంటే వారు తీసుకునే రుణాలపై వడ్డీని ఆ ప్రభుత్వాలే బ్యాంకులకు చెల్లించేవి కనుక. కానీ చంద్రబాబు ప్రభుత్వం బ్యాంకులకు వడ్డీ మొత్తాన్ని కట్టడం మానేసింది. అందుకే బ్యాంకులు సున్నా వడ్డీకి రుణాలు ఇవ్వడం లేదు. మనందరి ప్రభుత్వం రాగానే ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుంది. అప్పుడు బ్యాంకులు సున్నా వడ్డీకే రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుంది' అని జగన్ చెప్పారు. ఈ విషయాలన్నింటినీ అందరికీ వివరించాలని కోరారు.



వెంగళాపురం క్రాస్ వద్ద జనం, జగన్.. పరస్పర అభివాదం

డీఎస్సీలో పీఈటీ పోస్టుల సంఖ్య పెంచాలి..

పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అవసరమైన బీపీఈడీ చదివిన నిరుద్యోగ యువకులు పాదయాత్రలో జగన్‌ను కలిశారు. పీఈటీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చేలా ఒత్తిడి తేవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లోని వివిధ కాలేజీల్లో చదువుకున్న వారందరూ బుధవారం పాదయాత్ర ప్రాంతానికి చేరుకొని జగన్‌కు వినతిపత్రం ఇచ్చారు. 400 మంది విద్యార్థులు దాటిన ప్రతి పాఠశాలలో ఇద్దరు పీఈటీలు ఉండాలని, యూపీ పాఠశాలలో సైతం పీఈటీని నియమించాలని ప్రభుత్వ ఉత్తర్వులున్నప్పటికీ ప్రభుత్వం ప్రతి డీఎస్సీలోనూ జిల్లాకు నాలుగు.. ఐదు పోస్టులను మాత్రమే భర్తీ చేస్తోందని జగన్ దృష్టికి తీసుకొచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తమకు న్యాయం చేయాలని కోరారు. తమ గ్రామంలోని మంచినీటి పథకానికి కరెంటు బిల్లులు చెల్లించ లేదన్న సాకుతో మంచినీటి పథకానికి కరెంటు సరఫరాను నిలిపివేశారని పెదఅలవలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డిపాలెం గ్రామస్తులు జగన్‌కు ఫిర్యాదు చేశారు. 15 విద్యుత్ స్తంభాలను కూడా పూర్తిగా తొలగించారని గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామంలో కిడ్నీ బాధితులం అధికంగా ఉన్నామని, మీరు ఆందోళన చేయడం వల్లే కనిగిరి ప్రాంతంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారని వారు జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, పాదయాత్రలో గిద్దలూరు మండలం కొమరోలు గ్రామానికి చెందిన కె.దివిషద తన తండ్రితో కలిసి పొన్నలూరు మండలంలో జరుగుతున్న పాదయాత్ర వద్దకు వచ్చింది. ఏడాదిగా తాను దాచుకున్న డబ్బును విరాళంగా అందజేసింది.



జగన్‌ను చూసేందుకు చెట్టెక్కిన అభిమానులు



పాలేటి గంగ వద్ద బొల్లావుల మధ్య జగన్

ప్రజాసంకల్ప యాత్ర 94వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
1,275.9 కిలోమీటర్లు

94వ రోజు నడిచిన దూరం
13.5 కిలోమీటర్లు

ప్రారంభం: ఉ.8 గంటలకు తిమ్మపాలెం

ముగింపు: సా.4.45 గంటలకు పెద్ద అలవలపాడు

ముఖ్యాంశాలు: తిమ్మపాలెం, చెరువుకొమ్ముపాలెం, కె.అగ్రహారం, పర్చూరివారిపాలెం, వెంగళాపురం క్రాస్, పెద్ద అలవలపాడులో జనంతో మమేకం.

- పర్చూరివారిపాలెం, పెద్ద అలవలపాడులో పార్టీ జెండా ఆవిష్కరణ

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 8 గంటలకు పెద్ద అలవలపాడు

ముఖ్యాంశాలు

పెద్ద అలవలపాడు, రామాపురం, గుదేవారిపాలెం క్రాస్, హాజీస్‌పురంలో జనంతో మమేకం

టీడీపీ పెద్దల వేధింపులు భరించలేకపోతున్నా..

- ఓ దళిత సర్పంచ్ వ్యథ..
- జగన్‌తో గోడు వెళ్లబోసుకున్న వైనం
- పార్టీ వీడుతున్నట్టు వెల్లడి.. వైఎస్సార్‌సీపీలో చేరిక

ప్రజా సంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ మద్దతుదారుడిగా బరిలో నిలిచి, గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యాక ఆ పార్టీ పెద్దల వేధింపులు భరించలేక విలవిల్లాడిపోయిన ఓ దళిత ప్రజాప్రతినిధి గోడు ఇది. పామూరు మండలానికి చెందిన తూర్పు కోడిగుడ్లపాడు గ్రామ సర్పంచ్ తాతపూడి భూషణం చాలా కాలంగా ఆ పార్టీ నేతల ఆగడాలకు విసిగిపోయారు. తన గోడును ఆ పార్టీ నేతలెవ్వరూ పట్టించుకోక పోవడంతో బుధవారం జగన్ పాదయాత్ర సాగుతున్న ప్రాంతానికి చేరుకుని రోడ్డు పక్కన చెప్పులు కుడుతూ నిరసన తెలిపారు. కొంత సేపటి తర్వాత అక్కడికి చేరుకున్న జననేతకు తాను అనుభవించిన కష్టాలను చెప్పుకున్నాడు. 'గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన కొద్దిరోజులకే నన్ను ఆ పదవి నుంచి తొలగించారు. ఎస్సీ రిజర్వుడు అయినప్పటికీ అడ్డదారిన పార్టీ పెద్దోళ్లు ఒకతన్ని సర్పంచ్ పదవిలో నియమించారు. గ్రామస్తుల మద్దతుతో పోరాడి తిరిగి సర్పంచ్ పదవిని దక్కించుకున్నాను. అయినా అధికారులపై ఒత్తిడి తెచ్చి చెక్ పవర్ రద్దు చేయించారు. రకరకాలుగా వేధింపులకు గురిచేశారు. సర్పంచ్ అన్నమాటే కానీ ఏనాడూ ఆ కుర్చీలో కూర్చోనివ్వలేదు. శిలాఫలకాల్లో ఎక్కడా నా పేరు వేయలేదు. వారు నియమించిన వ్యక్తి పేరే వేశారు. పైగా నేను ఊళ్లో ఉండనని తప్పుడు నివేదికలు ఇచ్చారు. ఊరు వదిలి నేనెక్కడికి పోతాను? వారి చెప్పు చేతల్లో ఉంటూ వారు చెప్పిన తప్పుడు పనులు చేయాలేదనేది వారి బాధ. ఈ పరిస్థితిలో చెక్ పవర్ రద్దుపై హైకోర్టుకు వెళ్లి అనుకూలంగా తీర్పు తెచ్చుకున్నా. నాలుగు నెలల పాటు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆ ఉత్తర్వులు సైతం అమలు కాకుండా టీడీపీ పెద్దలు అడ్డుకున్నారు. ఆ సమయంలోనే గ్రామ పంచాయతీ నిధులను భారీ మొత్తంలో టీడీపీ పెద్దలే డ్రా చేసుకొని దుర్వినియోగం చేశారు. వారి ఆగడాలను ప్రశ్నిస్తే నన్ను కులం పేరుతో దూషించారు.. అవమానించారు. పోలీసుస్టేషన్‌లో ఎస్సీ అట్రాసిటీ కేసు పెట్టాను. అయినా టీడీపీ పెద్దలపై కనీస చర్య తీసుకోలేదు' అని బావురుమన్నారు.



టీడీపీ నేతల వేధింపులపై చెప్పులు కుడుతూ నిరసన తెలిపి.. జగన్ కోసం ఎదురుచూస్తున్న సర్పంచ్ భూషణం

సీఎం, లోకేశ్ దృష్టికి కూడా తీసుకెళ్లా..

తనకు జరిగిన అన్యాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి లోకేశ్‌తో పాటు జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవోల వద్ద పలుమార్లు చెప్పుకున్నా ఒక్కరూ పట్టించుకోలేదని భూషణం వాపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా మంత్రులుగా ఉన్న వారు పలు సందర్భాల్లో దళితుల పట్ల చులకనగా మాట్లాడటం కారణంగా గ్రామాల్లోనూ స్థానిక అధికార పార్టీ నాయకులు అలానే వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబే అన్నారని.. మరో మంత్రి సైతం దళితులు శుభ్రంగా ఉండరని వ్యాఖ్యానించారని ఆయన జగన్‌కు గుర్తు చేశారు. ఇంత జరిగినా అధిష్టానం తనను వేధించిన పెద్దల వైపే నిలిచిందని, దళితులకు గౌరవం లేని ఇలాంటి పార్టీలో ఉండలేనని చెప్పారు. ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. తాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరతానని చెప్పారు. ఆయన గోడు సావధానంగా విన్న జగన్.. 'అధైర్య పడవద్దు, నేను అండగా ఉంటాను' అని భూషణానికి ధైర్యం చెప్పారు. అనంతరం భూషణం వైఎస్సార్‌సీపీలో చేరారు.



తూర్పు కోడిగుడ్లపాడు సర్పంచ్ భూషణంకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రతిపక్ష నేత జగన్




దివ్యాంగుడి సమస్యను వింటున్న ప్రతిపక్ష నేత



అశేష జనవాహిని వెనుక నడుస్తుండగా అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న జగన్ చిత్రంలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్త మధుసూదన్ యాదవ్

94వ రోజు

21-02-2018, బుధవారం
పెద్ద అలవలపాడు, ప్రకాశం జిల్లా



దళితుల్ని అవమానిస్తూ.. 'దళిత తేజం' వంచన కాదా?

అధికార పార్టీ నేత అగ్రకుల దురహంకార ఉక్కుపాదాల కింద నలిగిపోతున్నా.. పోరుబాటే ఊపిరిగా చేసుకున్న ఆ దళిత సర్పంచ్ మనో ధైర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. ఆయనది తూర్పు కోడిగుడ్లపాడు. పేరు తాతపూడి భూషణం. టీడీపీ ఆవిర్భావం నుంచీ ఆ పార్టీలోనే ఉన్నాడట. ఐదేళ్ల కిందట ఆ ఊరికి ఏకగ్రీవంగా సర్పంచ్ అయ్యాడట. అయితే, ఆ పదవి అలంకారప్రాయమే అయిందట. సర్పంచ్ అయినా, పెత్తనమంతా అగ్రకులానికి చెందిన టీడీపీ నేతదేనట. ఆయన అన్యాయం చేసినా నోరెత్తకూడదట. చెప్పిన చోట సంతకం పెట్టాలి. చూపించిన చోటే చేతులు కట్టుకుని కూర్చోవాలి. ఆ టీడీపీ నేత అహంకారం ఏ స్థాయిలో ఉందంటే.. ఆ సర్పంచ్‌ని ఏనాడూ ఆ సీటులోనే కూర్చోనివ్వలేదట. ఈ పెత్తందారీ వైఖరిని సహించలేక ఎదురుతిరిగితే.. అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నాడట. తన పలుకుబడితో చెక్ పవర్ తీసేయించడం, కులం పేరుతో వేధించడం, చెప్పులు కుట్టుకునే వాడంటూ పదే పదే దూషించడం. తప్పుడు నివేదికలతో ఫిర్యాదులు చేసి సర్పంచ్ పదవి నుంచి తొలగించాడట. పంచాయతీ నిధులన్నీ మెక్కేశాడట. ఇన్ని అవమానాల్లోనే భూషణం అన్న కోర్టుకెళ్లి న్యాయం సాధించాడట. అయినా ఫలితం లేదట. ఇదెక్కడి అన్యాయమంటూ చంద్రబాబు దృష్టికి తెచ్చినా, ఆయన తనయుడు, పంచాయతీరాజ్ మంత్రి లోకేశ్‌కు గోడు చెప్పుకున్నా పట్టించుకోలేదట. ఇక ఆ పార్టీలో ఉండటం నైతికత కాదనుకున్న ఆ సర్పంచ్ ఈ రోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. నేను వచ్చే మార్గంలోనే చెప్పులు కుడుతూ, ధర్నా చేస్తూ, టీడీపీపై నిరసన తెలియజేస్తూ.. నన్నక్కడికి ఆహ్వానించి నాతో పార్టీ కండువా కప్పించుకున్నాడు. నిజంగా ఎంత అన్యాయం? ఒక దళిత సర్పంచ్‌కు ఇన్ని వేధింపులా? ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న చంద్రబాబే దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా? అన్నాడంటే.. ఇక ఆయన పార్టీలో నేతలు ఇంతకన్నా గొప్పగా ఉంటారా? ఆయన మంత్రివర్గ సహచరుడే దళితులు శుభ్రంగా ఉండరని, చదువుకోరని, తెలివి తక్కువ వారని అవమానించేలా మాట్లాడారు. మనసే లేని బాబుగారు 'దళిత తేజం' అంటూ దళితుల దగ్గరకు రావడం మోసం కాదా?

అక్షయ గోల్డ్, అగ్రి గోల్డ్, సిరి గోల్డ్.. పేరు ఏదైతేనేం పేదలను నిండా ముంచేవే కదా. ఈ రోజు అక్షయ గోల్డ్ మార్కెటింగ్ ఏజెంట్లు వాళ్ల గోడు చెప్పుకొన్నారు. సంస్థ మాట నమ్మి 2007 నుంచి పేదలతో డబ్బులు కట్టించారట. ఆ సంస్థ బోర్డు తిప్పేయడంతో జనం వెంటబడుతున్నారట. ఎన్నికలప్పుడు చంద్రబాబును కలిస్తే.. ప్రభుత్వం వస్తే సమస్య తీరినట్టే అని చెప్పాడట. అధికారంలోకి వచ్చాక అనేక సార్లు కలిసినా ఒరిగిందేమీ లేదని వాపోయారు. మానసిక వేదనతో బాధితులెందరో తనువు చాలించారట. అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదనను అనేకసార్లు అసెంబ్లీలోనూ, బయటా పదే పదే వినిపించాను. బోర్డు తిప్పేసే సంస్థల ఆస్తులను స్వాహా చేయడంలో టీడీపీ నేతలే సూత్రధారులైతే ప్రజల గోడు వినేదెవరు?

సాయంత్రం.. వ్యాయామ విద్య పూర్తిచేసుకున్న నిరుద్యోగులు కలిశారు. ప్రతీ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిని పెడతామని చంద్రబాబు చెప్పాడు. క్రీడా సంస్కృతిని పెంచుతామని ప్రకటించాడు. వ్యాయామ అక్షరాస్యత కోసం జీవో 29ని అమలు చేస్తానన్నాడు. కానీ ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదన్నారు. నాన్నగారి హయాంలో 2000 పోస్టులు భర్తీ చేస్తే.. బాబుగారి పాలనలో 200 కూడా భర్తీ చేయలేదట. నిజంగా ఇది అన్యాయమే. మోసం, నయవంచన చంద్రబాబు నైతిక హక్కులుగా మారిపోయాయి. ఇరుకు గదుల్లో, నిబంధనలకు విరుద్ధంగా, శారీరక ఉల్లాసమే లేని నియంతృత్వ విద్యకు కేరాఫ్ అడ్రస్‌లుగా మారిన విద్యా సంస్థలన్నీ చంద్రబాబు బినామీలవే కదా! అందుకే ఆయన వ్యాయామ విద్యను, ఉపాధ్యాయులను మరోసారి మోసం చేశాడు.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. ఎన్‌సీఆర్‌బీ 2017 నివేదిక ప్రకారం దళితులపై వేధింపుల్లో మన రాష్ట్రం దేశంలోనే ఐదో స్థానంలో ఉండడం సిగ్గుచేటైన విషయం కాదా? దళితుల పట్ల మీకున్న దృక్పథమే దీనికి కారణం కాదా? మీ పార్టీకే చెందిన దళిత ప్రజా ప్రతినిధికే ఘోర అవమానాలు జరుగుతుంటే.. ఇక సామాన్య దళితుల పరిస్థితేంటి? కాగా, ఇప్పుడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దళిత తేజం పేరుతో వారి దగ్గరికి వెళుతుండటం మరోసారి వంచించడానికే కాదా?

వై.ఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం, 22-2-2018



“ గృహ హింసను
బయట పెట్టకపోతే,
గృహ హింస నుండి
ఎప్పటికీ బయటపడలేం.

- రూపీ కౌర్, యువ కవయిత్రి



ఈ ఇద్దరికీ
60 ఏళ్లు
సినిమా పేజీలో...



బిగ్ ఫైట్

బతుకు బాటపై జీవన పోరాటం

కోల్‌కతాలోని రద్దీ వీధుల్లో నిత్యం బోలెడన్ని మినీ బస్సులు నడుస్తుంటాయి. అది విశేషం కాకపోవచ్చు. ఆ బస్సులలో ఒక బస్సుని ఆరేళ్లుగా ఒక మహిళ నడుపుతోంది. అది తప్పకుండా విశేషమే. ఆమె పేరు ప్రతిమా పొద్దార్. ఇంతవరకు ఒక్క ప్రమాదం కూడా జరగకుండా ప్రయాణికులను క్షేమంగా గమ్యాలకు చేరుస్తోంది. ఫుట్‌బోర్డు మీద ఒక్కరు నిలబడ్డా, విండోలోంచి చూసి అక్కడికక్కడ బస్సును ఆపేస్తుంది. ఫుట్‌బోర్డు మీది వాళ్లంతా లోనికి వచ్చాకే బస్‌ను స్టార్ట్ చేస్తుంది. అది ప్రతిమ ప్రత్యేకత. ప్రతిమ ఇద్దరు పిల్లల తల్లి. యాక్సిడెంట్ జరిగి భర్త మంచానికే పరిమితం అయ్యాక.. తానే ధైర్యంగా నిలబడి సంసార సాగరాన్ని డ్రైవ్ చేస్తోంది.



స్టీరింగ్ సీట్లో ప్రతిమ

సరదాగా నేర్చుకున్నది... బతుకుబండి ఎక్కించింది!

ఆమె భర్త శిబేశ్వర్. బస్సు కండక్టర్. 2011లో ప్రమాదం జరగడంతో ఆయన ఉద్యోగం మానేయాల్సి వచ్చింది. దాంతో ప్రతిమే ఏదో ఒక ఉద్యోగం వెతుక్కోవాల్సిన అవసరం ఏర్పడింది. అప్పటికి ఆమె వయసు 36 ఏళ్లు. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు. ఏం చేయాలా అని ఆలోచిస్తుండగా.. చాలాకాలం క్రితం సరదాగా నేర్చుకున్న డ్రైవింగ్ గుర్తుకొచ్చింది. చివరికి ఆ డ్రైవింగే ఆమెకు బతుకుతెరువు అయ్యింది. కొంతకాలం అంబులెన్స్, ట్యాక్సీ నడిపింది. ఆ తరవాత బస్ డ్రైవింగ్ నేర్చుకుంది. బ్యాంకు లోన్ మీద సొంత బస్సు కొనుక్కుంది, లైసెన్స్ తెచ్చుకుంది. నిత్యం కోల్‌కతాలోని బిరాటి నుంచి హౌరాకు బస్సులు నడపడం ప్రారంభించింది. క్రమం తప్పకుండా బ్యాంకు డబ్బు జమ చేసింది. ఇద్దరు కూతుళ్లను బాగా చదివిస్తోంది.

ఓవర్‌టేక్ చెయ్యదు... రన్నింగ్‌లో ఎక్కనివ్వదు

ప్రతిమ పెద్ద కూతురు రాఖీ.. బెంగాల్ జిమ్నాస్టిక్స్‌లో పాల్గొంటోంది. రాష్ట్రం తరఫున ఈత పోటీలలో కూడా పాల్గొంటోంది. జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో మ్యాథమెటిక్స్ చేస్తోంది. చిన్న కూతురు సాథీ స్కూల్‌లో చదువుకుంటోంది.

డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ప్రతిమ ఎప్పుడూ ఓవర్‌టేక్ చెయ్యదు. అలాగే రన్నింగ్ బస్‌నీ ఎక్కనివ్వదు. ‘‘ఆమె చాలా జాగ్రత్తగా బస్సు నడుపుతుంది’’ అని హౌరా పోలీస్‌స్టేషన్ ప్రతిమకు సర్టిఫికెట్ కూడా ఇచ్చింది!

ఉద్యోగంలో అందరిలాగే ప్రతిమకూ ఏవో చిన్న చిన్న ఇబ్బందులు ఉంటాయి. అయితే చిరునవ్వుతో వాటిని నెట్టుకొస్తుంది ఉద్యోగం కోసం ఉదయాన్నే 3.30కి నిద్ర లేస్తుంది. బి.ఎ. చదువుతూ మధ్యలో ఆపేసిన ప్రతిమ తన పిల్లలను విద్యాధికులను చేసేందుకే ఇంత శ్రమా పడుతున్నానని అంటోంది.

– రోహిణి

గుండె బరువైంది

● పెళ్లైన పదిహేను రోజులకే పుట్టింటికి ● మంచి ఆకృతికి సర్జరీ చేసుకోవాలని సలహా ● అప్పటివరకు రావొద్దని ఆదేశం

ఎద లోతుల్లో ఉన్న బాధను
ఆడపిల్లలు బయటపెట్టకపోతే..
మగాళ్ల వికృత బుద్ధికి
హద్దే లేకుండా పోతుంది!
భార్య ఆకారాన్ని వెక్కిరించి
సొమ్ము చేసుకోవాలని చూశాడు అతడు.
మహిళ శక్తిని మించిన అందం లేదని..
ఆమె నిరూపించింది.

మాది జగిత్యాల జిల్లాలోని ఓ కుగ్రామం. నాన్న వ్యవసాయం చేస్తాడు. అమ్మ బీడీలు చుడుతుంది. చిన్ననాటి నుంచి నాన్న నన్ను కూడా తమ్ముడితో సమానంగా చూశాడు. నన్ను ఉన్నత చదువులు (ఎమ్మెస్సీ) చదివించాడు. అమ్మ, నాన్న, తమ్ముడు, నేను అంతా హాయిగా ఉన్నాం. పీజీ పూర్తయిన తరువాత నాకు పెళ్లి చెయ్యాలని అమ్మా నాన్న అనుకున్నారు. సరేనన్నాను. 2017, ఫిబ్రవరిలో ఓరోజు నాన్న హడావుడిగా ఇంటికి వచ్చాడు.

‘‘మా ఫ్రెండు చెప్పిండు.. ఆమ్మాయిని చూసేందుకు వరంగల్ నుంచి పిలగాడు, ఆయన తల్లిదండ్రులు వస్తుండ్రట.. చిన్నిని రెడీ చేయి’’ అని అమ్మతో చెప్పిండు. అమ్మ వచ్చి నాకు విషయం చెప్పింది.

మళ్లీ వచ్చి చూస్తాడు

పెళ్లి కొడుకు తల్లిదండ్రులు, ఆడబిడ్డ, బంధువులతో కలిపి ఆరుగురు వచ్చారు. అమ్మ పిలవగానే నేను వెళ్లి వాళ్ల ముందు కూర్చున్నా. అందరు నన్ను పరిశీలనగా చూసుకున్నారు. రకరకాల ప్రశ్నలు వేశారు. చివరికి ‘‘మా అబ్బాయి మళ్లీ వచ్చి చూస్తాడు..ఆ తరువాత మాట్లాడుకుందాం’’ అనేసి వెళ్లిపోయారు. అబ్బాయి తల్లిదండ్రులకు నేను నచ్చానని అమ్మా, నాన్న సంతోషంగా ఉన్నారు. మొదటి పెళ్లి చూపులతోనే చిన్నికి సంబంధం ఖరారు అవుతుందని సంబరపడ్డారు. నాలుగు రోజులకే మళ్లీ అబ్బాయి వచ్చి చూసిండు. అబ్బాయి సెల్‌ఫోన్ల రిపేరింగ్ షాపు బాగా నడుస్తుందని చెప్పుకున్నారు. అంతా ఒకే అనుకున్నారు. నాలుగు లక్షల కట్నం, రెండు లక్షల రూపాయల సామాన్లు ఇస్తామని నాన్న ఒప్పుకున్నడు. వారం రోజుల వ్యవధిలోనే పెళ్లి జరిగిపోయింది. కట్నం, ఆడబిడ్డ కట్నాలు, పెళ్లి ఖర్చులు కలిపి మొత్తం రూ.8 లక్షల దాకా ఖర్చు వచ్చింది. నాన్న దగ్గర డబ్బులు లేకున్నా అప్పు తెచ్చి సర్దుబాటు చేసిండు. మొత్తం మీద బిడ్డ పెళ్లి చేశానన్న సంతోషం అమ్మానాన్నల మోములో కనబడింది.

రెండు వారాలకే ఆవిరి

పెళ్లయిన పదిహేను రోజులకు మా ఆయన నన్ను తీసుకువచ్చి అమ్మానాన్నల దగ్గర వదిలి భోజనం చేసి వెళ్లాడు. నేను మామూలుగానే ఇంటి దగ్గర దింపాడనుకున్నాను. అమ్మా నాన్న అలానే అనుకున్నారు. అల్లుడు మరో నాలుగు రోజుల్లో వచ్చి తీసుకెళ్తాడని భావించారు. వారం గడిచింది. ఆయన రాలేదు. నేను ఫోన్ చేశాను. ‘‘పని బిజీగా ఉంది తరువాత వస్తాను’’ అని చెప్పాడు. మరో వారం చూశాం. ఈ సారి నాన్న ఫోన్ చేశాడు. రెండు మూడు రోజుల్లో వచ్చి తీసుకెళ్తానని చెప్పాడు. సరేలే.. ఏదో పని మీద ఉన్నట్టున్నాడు.. వస్తాడులే అనుకున్నారు అమ్మానాన్న. మరో పదిహేను రోజులు చూసి మా మామయ్యకు ఫోన్ చేశారు. అల్లుడు రావడం లేదని అడిగారు. అప్పుడు ఆయన.. ‘‘మమ్మల్ని మీరు మోసం చేశారు.. నీ బిడ్డనే అడుగు’’ అంటూ కఠినంగా జవాబివ్వడంతో మా అమ్మానాన్న షాక్ అయ్యారు. పెళ్లి సందడి మర్చిపోక ముందే మామయ్య నుంచి అలాంటి సమాధానం రావడంతో నిర్ఘాంతపోయారు.

ఏమని చెప్పేది..?

మామయ్యతో మాట్లాడిన తరువాత అమ్మా నాన్న నన్ను అడిగారు. పదిహేను రోజుల్లోనే అత్తగారింటి వద్ద ఏం జరిగిందో చెప్పమన్నారు. ఏమని చెప్పాలో తోచలేదు. కళ్ల వెంట నీళ్లు తిరిగాయి. ‘‘ఏమయిందమ్మా..’’ అని కలవరపడ్డారు. అమ్మతో చెప్తానని అన్నాను. నాన్న మా ఇద్దరికీ ఏకాంతం కల్పించాడు. మెల్లగా. అమ్మ నన్ను దగ్గరకు తీసుకుని, విషయం చెప్పమంది. ‘‘అమ్మా.. మా ఆయన నన్ను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోమంటున్నాడు’’ అని చెప్పాను. అమ్మ నివ్వెరపోయింది. ‘‘ఎందుకు?’’ అని అడిగింది. ఏడుస్తూ అంతా చెప్పాను. ‘‘నా ఒంటి ఆకారం బాగాలేదట, నా వక్షోజాలు పెద్దగా ఉన్నాయట. వక్షోజాల పైభాగం కుచించుకుపోవడం బాగాలేదట. అవి అలా ఉంటే పెద్ద వయసు ఆడమనిషితో ఉంటున్నట్లు అనిపిస్తుందట. మూడ్ వస్తలేదట. మొదటి రోజు నుంచి నాకు ఇదే టార్చర్’’ అంటూ అమ్మతో గోడు వెళ్లబోసుకున్నా. నన్ను పట్టుకుని బోరున ఏడ్చింది అమ్మ. నాన్నకు ఏమని చెప్పాలో తెలియక వారంరోజులు తనలో తాను కుమిలిపోయింది. నాన్న గట్టిగా ఏమీ అడగలేదు.. ఇంట్లో పెళ్లి వాతావరణం కనుమరుగైంది. గత్యంతరం లేక అమ్మ నాన్నకు విషయం చెప్పింది. నాన్న మండిపడ్డాడు. పెద్ద మనుషులను పిలిపించాలనుకున్నా.. బిడ్డకు ఇలా జరిగిందని చెప్పలేక.. ఫ్యామిలీ ఫ్రెండ్‌కు విషయం చెప్పాడు. ఆయన మా మామయ్య వాళ్లతో విషయం బయటకు తెలియకుండా సర్దుబాటు చేసి మాట్లాడదామన్నాడు.

అందరికీ చెప్పేశాడు!

రెండు నెలలు గడిచిపోయాయి. నేను ఇంకా ఇంటి దగ్గరే ఉంటున్నాను. చుట్టుపక్కల ఉన్న అమ్మలక్కలు నా గురించి గుసగుసలాడటం మొదలైంది. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే నామోషీగా ఉంది. చివరకు మా నాన్న స్నేహితుడిని తీసుకుని మా అత్తమామలతో మాట్లాడదామని వరంగల్ వెళ్లాడు. అక్కడ మా ఆయన పెద్ద పంచాయితీ పెట్టాడు. సహజమైన విషయాన్ని అసహజమైనదిగా చిత్రీకరించి పెద్ద మనుషులందరికీ చెప్పాడు. వాళ్లంతా మా నాన్నను.. ముందే ఇలా ఉందని చెప్పకుండా మోసం చేశారని, పెళ్లికొడుకు కోరిన మేరకు సర్జరీ చేయించాలని అన్నారు. ఇది సమస్య కానే కాదని నాన్న స్నేహితులు వాదించినా అక్కడ ఎవరూ పట్టించుకోలేదు. సర్జరీకి దాదాపు పది లక్షలు ఖర్చు అవుతాయి. ఆ డబ్బులు మా నాన్నను భరించాలని గదమాయించినట్లుగా అన్నారు. చివరకు చేసేదేమీ లేక నాన్న ఆయన స్నేహితులు తిరిగివచ్చారు.

మరో పెళ్లికి ఒప్పుకోవాలట

పంచాయితీ అయిన పదిహేను రోజులకు మా ఆయన నాకు ఫోన్ చేశాడు. నువ్వు సర్జరీ చేయించుకున్నాక నిన్ను ఇంటికి తీసుకెళ్తా.. కానీ మన ఇద్దరికి పుట్టే పిల్లలకు నీ లాగే సమస్య వస్తే ఎట్లా. అప్పుడు మీ నాన్న సర్జరీ చేయించలేడు కదా. రూ.10 లక్షలు మీ నాన్నను ఇవ్వమను. ఆ డబ్బులు డిపాజిట్ చేసుకుని సర్జరీ చేయిస్తా. ఇక నాకు నీతో తృప్తి లేదు కాబట్టి నేను మరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని తన అన్యాయమైన ఆలోచనలు బయటపెట్టాడు. అప్పటి దాకా ఏదో ఓ మూల ఆయన మీద ఉన్న ఆశ ఈ మాటలతో ఆవిరైంది. ఇక నేను అత్తారింటికి వెళ్లొద్దని నిశ్చయించుకున్నా. పీజీ చదివాను. నేను ఎక్కడయినా జాబ్ చేసుకుంటానని నాన్నకు చెప్పా. అంతే కాదు.. నా భర్త, అత్తమామలపై పోలీస్ కేస్ పెట్టమని నాన్నకు చెప్పి ఒప్పించా. ఆ తరువాత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశా.

- ముక్కెర చంద్రశేఖర్, కోరుట్ల, జగిత్యాల జిల్లా



ప్రతీకాత్మక చిత్రం

సోషల్‌గా, లీగల్‌గా బయటికి ఈడ్చాలి

ఈ అమ్మాయి ఆర్థిక హింసనూ ఎదుర్కొంది. అందులో వరకట్న వేధింపు కూడా ఉంది. ముందు.. దేహాన్ని గేలి చేస్తూ చివరకు పదిలక్షల డిమాండ్ పెట్టాడు! ఈ తరహా ‘బాడీ షేమింగ్’ అనేది అమ్మాయిల ఆత్మ స్థయిర్యం దెబ్బతీసే చర్యల్లో భాగమే. కాబట్టి అమ్మాయిలు మానసికంగా బలంగా ఉండాలి. ఇంట్లోవాళ్లకు చెప్పాలి. నిశ్శబ్దంగా భరించొద్దు. లోపల్లోపల కుమిలిపోవద్దు. మన నిశ్శబ్దం అవతలివాళ్లను మరింత బలవంతులుగా మారుస్తుంది. గృహహింస వంటివాటి మీద అవగాహన కల్పించి.. లీగల్‌గా, సైకాలజికల్‌గా గైడ్ చేయడానికి ప్రతి జిల్లాలో ‘సఖి’ సెంటర్స్ ఉన్నాయి. ఎలాంటి అబ్యూజ్‌కు గురైన మహిళలైనా సఖి సెంటర్స్‌కు వెళ్లి సలహాలు తీసుకోవచ్చు. తమను అబ్యూజ్‌కు గురిచేసిన వాళ్లు మళ్లీ జీవితంలో వేరే అమ్మాయితో అలా ప్రవర్తించకుండా వాళ్లను సోషల్‌గాను, లీగల్‌గానూ ఎక్స్‌పోజ్ చేయడం చాలా అవసరం.



- సుమిత్ర, ‘అంకురం’ (స్త్రీ,శిశు అభివృద్ధి సంస్థ)

యు.ఎస్.లో ఎన్నికలు

మీటూ దెబ్బకు సీట్లు ఖాళీ!

ఫిబ్రవరిలో రెండు చోట్ల ‘మీటూ’ ఎన్నికలు జరగ్గా.. మార్చి 13న ఒకటి, ఏప్రిల్ 24న మరొకటీ మీటూ ఎన్నికలు జరగబోతున్నాయి. టిమ్ మర్ఫీ అనే ఆయన తన వివాహేతర ప్రియసఖికి.. ‘అబార్షన్ చేయించుకో’ అని మెజేస్ ఇచ్చినందుకు, ట్రెంట్ ఫ్రాంక్స్ అనే ఆయన తన బిడ్డలకు అద్దెతల్లులుగా ఉండమని తన మహిళా సిబ్బందిని కోరినందుకు ఈ రెండు ఎన్నికలూ అవసరమయ్యాయి.

‘మీటూ’ ధర్మాగ్రహానికి మగవాడి దురహంకార సౌధాలు ఒకటొకటిగా బీటలు వారుతున్నాయి! దాగి ఉన్న బొద్దింకలను కూడా బయటికి రప్పించి, మట్టుపెట్టే ‘స్ప్రే’లా, ఈ స్త్రీల ఉద్యమమైన ‘మీటూ’.. ఒక్కొక్క పెద్దమనిషి నిజ స్వరూపాన్నీ రచ్చకీడుస్తోంది. సాటి మహిళలకు ఆత్మస్థయిర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటివరకు చిత్రపరిశ్రమలో ఉన్న లైంగిక హింసోన్మాదులపైనే జరుగుతున్న ‘మీటూ’ పోరాటం క్రమంగా పాలనా భవనాలలోకి సైతం ధైర్యంగా చొరబడి, కామ పిశాచాలైన ప్రజాప్రతినిధులను సీట్లలోంచి లాగి అవతల పడేస్తోంది! దాంతో ఇప్పుడు యు.ఎస్.లో తరచూ ఎన్నికలు జరగడం మామూలైపోయింది.



ట్రెంట్ ఫ్రాంక్స్

టిమ్ మర్ఫీ

లైంగిక వేధింపులకు పాల్పడిన సెనెటర్లు రాజీనామాలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడడంతో వారి స్థానాలలో కొత్తవారిని ఎన్నుకునేందుకు దాదాపు ప్రతినెలా ఒక పోలింగ్ జరుగుతోంది!

ఓక్లహోమాలో ఆ రాష్ట్ర సెనెటర్ (ఎగువసభ సభ్యుడు) తనను ముద్దుపెట్టుకోడానికి ప్రయత్నించినట్లు ఊబర్ మహిళా డ్రైవర్ ఒకరు ఆరోపించడంలో తాజాగా ఆయన పదవి గండంలో పడింది. కాలిఫోర్నియాలో ఆ రాష్ట్ర అసెంబ్లీమ్యాన్ (దిగువసభ సభ్యుడు), పాలనా విభాగాలలో పని నిమిత్తం వచ్చిన ఒక మహిళా లాబీయిస్టును ఆమె రెస్టురూమ్ వరకు వెంబడించి, ఆమె ఎదురుగానే స్వీయస్ఖలన చర్యకు పాల్పడడంతో అతడి సీటు కూడా ఖాళీ అయింది. మిన్నెసోటా రాష్ట్రంలో మరో లాబీయిస్టు.. ఒక ప్రజాప్రతినిధి తనను లైంగికంగా లోబరుచుకునేందుకు నిరంతరం తనపై ఒత్తిడి తెచ్చాడని, ఒక టెక్స్ట్ మెసేజ్ కూడా ఇచ్చాడని బయటపెట్టడంతో ఆయన స్థానంలోకి కొత్త వ్యక్తి అవసరమయ్యాడు! అతడు పంపిన మెసేజ్ సారాంశం ఇది:

‘‘ఏకాంతవేళ ఖరీదైన మద్యాన్ని స్వల్పంగా సేవించి, రుచికరమైన ఆహారాన్ని భుజించి, భోజనానికి ముందరో... తర్వాతో మైమరిపించే శయన మందిర సుఖాన్ని పొందాలని ఉందని నేను నీతో అంటే కనుక.. అది నిన్ను వణికించే విషయం అవుతుందా?’’

ఈ టెక్స్ట్‌ని తీసుకెళ్లి ఆ లాబీయిస్టు నేరుగా స్టేట్ సెనెట్‌కు ఫిర్యాదు చేయడంతో నియోజకవర్గంలో ఆయనకు నూకలు చెల్లాయి.!

ఇటీవలి కాలంలో ఇలా పన్నెండు మందివరకు స్టేట్ సెనెటర్‌లు, ఫెడరల్ సభ్యులు (కేంద్రంలో ఎగువ, దిగువ సభలైన ‘సెనెట్’, ‘హౌస్’ సభ్యులు) లైంగిక ఆరోపణలు ఎదుర్కొని, రాజీనామా చెయ్యడంతో ఆ స్థానాలను భర్తీ చెయ్యడం కోసం ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. వీటికి అమెరికన్ ప్రజలు ‘మీటూ ఎన్నికలు’గా నామకరణం చేశారు!

చెట్టు నీడ

ఇవే కనుక అలా ఉంటేనా!

అతనొక బాటసారి. చాలా దూరం నుంచి నడుచుకుంటూ వస్తున్నాడు.

దారిలో ఓ పక్కగా అతనికొక గుమ్మడిపాదు కనిపించింది. దాని నిండా ఇంతింతలావు గుమ్మడికాయలున్నాయి. వాటిని చూసి అతను ‘‘దేవుడు ఎంత పిచ్చివాడు? ఇక్కడెక్కడో అనామకంగా... బలహీనంగా పడి ఉన్న ఈ గుమ్మడి పాదుకు ఇంతింత పెద్ద కాయలు ఇచ్చాడు’’ అనుకున్నాడు.

తర్వాత ఇంకొంచెం దూరం నడిచాడు. అక్కడ అతనికొక మర్రిచెట్టు కనిపించింది. ఎంతో విశాలంగా, ఊడలు దిగి ఉన్న ఆ చెట్టుకు చిన్న చిన్న కాయలుండటం చూశాడు. ‘‘దేవుడు నిజంగానే ఉట్టి వెర్రివాడు, పైగా మూర్ఖుడు కూడా! లేకపోతే ఇంత పెద్ద చెట్టుకు అంత చిన్న కాయలా?’’ అనుకున్నాడు.

మండుటెండ, దానికితోడు చాలా దూరం నుంచి నడిచి వస్తుండటం వల్ల అతనికి అలసటగా అనిపించింది. కాసేపు విశ్రాంతి తీసుకుని వెళదాం అనుకున్నాడు. దగ్గరున్న సంచిలోనుంచి వెంట తెచ్చుకున్న తినుబండారాలను తిన్నాడు.

> మండుటెండ, దానికితోడు చాలా దూరం నుంచి నడిచి వస్తుండటం వల్ల అతనికి అలసటగా అనిపించింది. కాసేపు విశ్రాంతి తీసుకుని వెళదాం అనుకున్నాడు

తలకు చుట్టుకుని ఉన్న కండువాను విప్పి, చెట్టుకింద పరిచాడు. నీడలో పడుకున్నాడు. నిద్ర ముంచుకొచ్చింది. హాయిగా పడుకున్నాడు.

కాసేపయ్యాక లేచాడు. తన మీద, పక్కన పడి ఉన్న మర్రికాయలను చూశాడు.

‘‘ఇంకా నయం, ఈ కాయలు చిన్నవి కాబట్టి, మీద పడినా నాకేమీ కాలేదు. అదేగనక ఆ గుమ్మడికాయల పరిమాణంలో ఉండి ఉంటే... అవి గనక నా మీద పడి ఉంటే ఎంత ప్రమాదం జరిగి ఉండేదో... నిజంగా దేవుడు ఎంత దయామయుడు... ఎంత ఆలోచనాపరుడు!’’

అనుకుని, మనసులోనే దేవుడికి వెయ్యి దణ్ణాలు పెట్టుకుని లేచి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

పట్టించుకుంటే... పట్టి పట్టి చూస్తే ప్రతిదీ లోపంగానే కనిపిస్తుంది. కాస్త ఆలోచించి, నిదానించి చూస్తే గానీ తెలియదు, మర్మం ఏమిటో.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
విజయవాడ
గురువారం
22-2-2018

స్పెషల్ ట్రైనింగ్!


● రామ్‌చరణ్


● ఎన్టీఆర్

పక్కా ప్లానింగ్‌తో సినిమాలను కంప్లీట్ చేస్తారు రాజమౌళి. అంతేకాదు.. ఆయన సినిమాలు కూడా సమ్‌థింగ్ స్పెషల్‌గానే ఉంటాయి. సినీ ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన 'బాహుబలి' వంటి చిత్రం తర్వాత రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా ఓ మల్టీస్టారర్ మూవీ రూపొందనుందని ఇండస్ట్రీలో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రం గురించి ఓ లేటెస్ట్ అప్‌డేట్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాలో రామ్‌చరణ్, ఎన్టీఆర్ బాక్సర్స్‌గా కనిపించనున్నారట. అంతేకాదు అన్నదమ్ముల్లా కూడా నటిస్తారని కొందరి గాసిప్‌రాయుళ్ల ఊహ. బాక్సర్లుగా వీరిద్దరూ ఎవరి భరతం పడతారన్నది స్క్రీన్‌పై చూడాల్సిందే. అయితే.. ఈ సినిమాలోని పాత్రల కోసం కొన్ని రోజుల పాటు స్పెషల్ ట్రైనింగ్ తీసుకోనున్నారట చరణ్ అండ్ ఎన్టీఆర్ . ఈ ట్రైనింగ్‌లో స్పెషల్ డైట్ ఫాలో అవ్వనున్నారట వీరిద్దరూ. నిర్మాత దానయ్య నిర్మించబోయే ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి స్టార్ట్ అవుతుందని ఫిల్మ్‌నగర్ టాక్. వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ ప్లాన్ చేస్తున్నారట. మరోవైపు ఈ సినిమాలో రామ్‌చరణ్ సరసన రాశీ ఖన్నా నటించనున్నారన్న వార్త కూడా హల్‌చల్ చేస్తోంది.



వక్కంతం వంశీ బుధవారం మొదటి పుట్టినరోజు జరుపుకున్నారు. ఫస్ట్ బర్త్‌డే ఏంటీ అనుకుంటున్నారా? డైరెక్టర్‌గా ఆయన జరుపుకున్న బర్త్‌డే ఇది. అశోక్, కిక్, టెంపర్ వంటి పలు హిట్ చిత్రాలకు కథలు అందించిన వంశీ 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమా ద్వారా దర్శకునిగా మారిన విషయం తెలిసిందే. అల్లు అర్జున్ హీరోగా కె. నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీషా శ్రీధర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'బన్నీ' వాసు సహ నిర్మాత. ఈ షూటింగ్ లొకేషన్లో అల్లు అర్జున్, లగడపాటి శ్రీధర్, బన్నీ వాసు తదితరుల సమక్షంలో వక్కంతం వంశీ బర్త్‌డే కేక్ కట్ చేశారు. ఏప్రిల్ 26న ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.

అహం బ్రహ్మాస్మి


● క్రిష్


... అంటే నేనే బ్రహ్మ అని అర్థం. క్రిష్ ఇలానే అంటున్నారు. 'అహం బ్రహ్మాసి' టైటిల్‌తో ఓ సినిమా తీయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం వీరనారి రాణీ లక్ష్మీభాయ్ జీవితం ఆధారంగా ఆయన 'మణికర్ణిక' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో లక్ష్మీభాయ్‌గా కంగనా రనౌత్ నటిస్తున్నారు. ఈ హిస్టారికల్ మూవీని తెరకెక్కిస్తూనే తన నెక్ట్స్ సినిమా 'అహం బ్రహ్మాస్మి'కు సంబంధించిన ప్రీ–ప్రొడక్షన్ పనులను మొదలు పెట్టారు క్రిష్. ఇదొక హై బడ్జెట్ కమర్షియల్ మూవీ అని సమాచారం. ఒక్క 'వేదం' మినహా క్రిష్ తెరకెక్కించిన ఫస్ట్ మూవీ 'గమ్యం' నుంచి 'గౌతమిపుత్ర శాతకర్ణి' వరకు అన్ని సినిమాలనూ నిర్మించిన సాయిబాబు జాగర్లముడి, రాజీవ్ రెడ్డి ఈ సినిమాను నిర్మించనున్నారు. ఇందులో ఒక టాప్ హీరోను తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు క్రిష్. ''ఫుల్ టెక్నికల్ వేల్యూస్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నాం. హీరో ఫైనలైజ్ అయిన తర్వాత మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు తెలియజేస్తాం. ఆగస్టులో ఈ సినిమాను ప్రారంభించబోతున్నాం'' అని నిర్మాతలు పేర్కొన్నారు.


● నితిన్, మేఘా ఆకాశ్

తొలి రాగానికి వేళాయె

నితిన్, మేఘా ఆకాశ్ జంటగా శ్రేష్ఠ్ మూవీస్, పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా 'ఛల్ మోహన్‌రంగ'. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్‌కు, టీజర్‌కు మంచి స్పందన లభిస్తోందని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాలోని తొలి సాంగ్ 'గా..ఘా..మేఘా'ను ఈ నెల 24న ఉదయం పది గంటలకు రిలీజ్ చేయనున్నారు. అన్నట్లు డేట్ గుర్తుంది కదా.. ఫిబ్రవరి 24 అంటే.. 'ఇష్క్' సినిమా రిలీజ్ డేట్. నితిన్ కెరీర్ గ్రాఫ్‌ని పెంచిన సినిమా 'ఇష్క్'. ఆ సంగతలా ఉంచితే.. 'ఛల్ మోహన్‌రంగ'ను ఏప్రిల్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా..! నేను తొమ్మిదో తరగతిలో ఉండగా ఇళ్లు మారాం. అక్కడ ఓ అబ్బాయి పరిచయం అయ్యాడు. మొదట మంచి ఫ్రెండ్స్ అయ్యాం. ఆ తరువాత నాకు ప్రపోజ్ చేశాడు. తను చూపించే కేరింగ్ చూసి ఓకే అన్నాను. చాలా బాగా ఉండేవాళ్లం. ఇంటర్‌లో తను హాస్టల్‌లో జాయిన్ అయ్యాడు. అప్పటి నుంచి నాతో మాట్లాడటం తగ్గించాడు. ఎందుకని అడిగితే.. బ్రేకప్ అన్నాడు. చాలా ఏడ్చాను. చచ్చిపోవాలనిపించింది. నా పేరెంట్స్ గురించి ఆలోచించి ఆగాను. కొన్నాళ్లకు నా దగ్గరికొచ్చి సారీ చెప్పాడు. ఎందుకు బ్రేకప్ చెప్పావని అడిగితే, ఫేస్‌బుక్‌లో ఒక అమ్మాయి పరిచయం అయిందట. చాలా లవ్ చేశాడట. కానీ ఆ అమ్మాయి తనని మోసం చేసి వేరే పెళ్లి చేసుకొని వెళ్లిపోయిందట. 'నిన్ను చీట్ చేసినందుకే నాకు ఇలా జరిగింది. రియల్లీ సారీ' అన్నాడు. తనని ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించాను, అందుకే ఇప్పటికీ తనతో మాట్లాడుతున్నా. కానీ తను మాత్రం నా విషయంలో సరిగా స్పందించడు. ఇప్పటికి ఎనిమిదేళ్లవుతోంది నా ప్రేమకి. బ్రేకప్ చెప్పి నాలుగేళ్లు కావస్తోంది. అయినా తన మీద ప్రేమ పోవడంలేదు. ఒక అమ్మాయి చేతిలో తను మోసపోవడంతో, ఇక ఎవరినీ లవ్ చెయ్యనని డిసైడ్ అయ్యాడట. నేనంటే ఇష్టం ఉందట కానీ ఫ్యూచర్ ముఖ్యం అంటున్నాడు. తను మళ్లీ వస్తాడనే నమ్మకం నాకు లేదు. కానీ వస్తే బాగుండనిపిస్తోంది. తనని మరిచిపోలేకపోతున్నా. నిజమైన ప్రేమకు ఇదే పనిష్మెంటా? మీరే చెప్పండన్నయ్యా నేనేం చెయ్యాలో??

– స్మైలీ

ప్రేమించావు కాబట్టే ఇన్ని విషయాలు అర్థమయ్యాయి.
ప్రేమకు ప్రేమ రివార్డు అనుకోవద్దు.
ప్రేమ ఒక పాఠం అనుకో..!
నువ్వు ఇప్పుడు స్ట్రాంగ్ అవ్వాలి.
వాడు ఫేస్‌బుక్‌లో, వాట్సాప్‌లో, ట్విట్టర్‌లో ప్రేమాయణం నడిపిస్తూనే ఉంటాడు. మునుగుతాడు. అలాంటి వెధవే తిరిగి రావాలని.. నిన్ను ప్రేమించాలని.. మనం మళ్లీ ఫూల్ అవ్వాలని.. అనుకోవద్దు. పీడబోయింది. దరిద్రుడు దూరమయ్యాడని హ్యాపీగా ఉండు. స్ట్రాంగ్‌గా ఉంటే నీ పట్ల అట్రాక్ట్ అయ్యేవాళ్లు చాలామందే ఉంటారు. నిన్ను ప్రేమించే వాళ్లు నీలో స్ట్రాంగ్ క్యారెక్టర్ చూసి మురిసిపోతారు. స్మైలీ కీప్ స్మైలింగ్...!

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

6			2	5	7	9	4	
7	9		3		6	2		5
2		5						8
	1	6				4		
			1		8			
		2				8	5	
1						3		2
9		3	8				7	4
	5	7	9	3	2			6

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3x3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

4	1	8	2	6	3	5	9	7
6	7	9	4	5	1	8	3	2
2	5	3	7	9	8	4	1	6
3	8	2	6	1	4	7	5	9
1	9	6	5	2	7	3	8	4
5	4	7	8	3	9	6	2	1
8	6	1	3	4	2	9	7	5
9	3	5	1	7	6	2	4	8
7	2	4	9	8	5	1	6	3

చిరంజీవిగారి అభినందన మరచిపోలేను


● రంజిత్

''నాది వైజాగ్. చిన్నప్పటి నుంచి సినిమాలంటే చాలా ఇష్టం. నన్ను నేను హీరోగా చూసుకోవాలనేది నా కోరిక. అందుకు చాలాకాలం ట్రై చేశా'' అని హీరో రంజిత్ అన్నారు. రంజిత్, పాలక్ లల్వాని జంటగా 'దిక్కులు చూడకు రామయ్య' ఫేమ్ త్రికోటి పి. దర్శకత్వంలో భరత్ సోమి నిర్మించిన 'జువ్వ' సినిమా శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ– ''నా మొదటి చిత్రం 'నువ్వు నేను ఒకటవుదాం'. రెండో సినిమా 'జువ్వ'ని మా అన్నయ్య డా. భరత్ చాలా ఇష్టపడి నిర్మించారు. ఈ సినిమా ఇంత గొప్పగా రావడానికి ఆయనే ప్రధాన కారణం. ఇదొక అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్. రొమాన్స్, యాక్షన్, మంచి పాటలు, ఫన్ అన్నీ ఉంటాయి. ఇందులో నా పాత్ర పేరు రానా. ఎప్పుడూ జాలీగా, సరదాగా ఉండే కుర్రాడి పాత్ర. ఫైట్స్, రొమాన్స్, ఫన్.. ఇలా అన్ని సమయాల్లోనూ జాలీగానే ఉండే క్యారెక్టర్. త్రికోటి గారికి నాలెడ్జ్ ఎక్కువ. షూటింగ్ సమయంలో ఆయన వద్ద నుంచి చాలా నేర్చుకున్నాను. కీరవాణిగారు వంటి పెద్ద సంగీత దర్శకుడు నా సినిమాకు మ్యూజిక్ చేయడం చాలా సంతోషంగా ఉంది. చిరంజీవిగారు అడగ్గానే టీజర్ రిలీజ్ చేసి, 'నీది ఫొటోజెనిక్ ఫేస్' అని మెచ్చుకున్నారు. ఆయన అభినందన మరచిపోలేను. ఫ్రెష్ లవ్‌స్టోరీ, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ మూవీస్‌లో నటించాలని ఉంది. నెక్ట్స్ సినిమా గురించి చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.


● అడివి శేష్

అమెరికాలో గూఢచారి

అడివి శేష్, మిస్ ఇండియా శోభిత ధూళిపాళ్ల జంటగా నటిస్తోన్న చిత్రం 'గూఢచారి'. శశికిరణ్ తిక్క దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నేతృత్వంలో అభిషేక్ పిక్చర్స్–విస్టా డ్రీమ్ మర్చంట్స్ సంస్థలు నిర్మిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ అమెరికాలో జరుగుతోంది. అడివి శేష్ ఈ చిత్రానికి కథ అందించడం విశేషం. నిర్మాతలు అభిషేక్ నామా, టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ– ''ఇప్పటివరకూ తెలుగు తెరపై చూడని కొత్త కాన్సెప్ట్‌తో 'గూఢచారి' తెరకెక్కుతోంది. అడివి శేష్ గూఢచారి పాత్రను అద్భుతంగా చేస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. వేసవిలో విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: షానిల్ డియో, మాటలు: అబ్బూరి రవి, సంగీతం: శ్రీచరణ్ పాకాల, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

హంసానందిని పంతం

యాక్షన్ హీరో గోపీచంద్‌తో హంసానందిని 'పంతం' పట్టారు. గోపితో ఆమె పంతం పట్టాల్సినంత వైరం ఏంటి? అనేగా మీ డౌట్. ఇక్కడ పంతం అన్నది రియల్ లైఫ్‌లో కాదు రీల్ లైఫ్‌లో అన్నమాట. ఇంకా అర్థం కాలేదా?. గోపీచంద్, మెహరీన్ జంటగా చక్రి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పంతం'. గోపి కెరీర్‌లో ఇది 25వ సినిమా కావడం విశేషం. ఈ చిత్రంలో హంసానందిని ఓ ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. గతంలో 'లౌక్యం' సినిమాలో గోపీచంద్‌తో ఐటమ్ సాంగ్ చేశారీ బ్యూటీ. అయితే.. 'పంతం' సినిమాలో మాత్రం ఐటమ్ సాంగ్, అతిథి పాత్రలాంటివి కావట. హంసా కెరీర్‌లో బాగా గుర్తింపు తెచ్చేలా ఈ పాత్ర ఉంటుందట. ''చక్రి చెప్పిన కథ బాగా నచ్చింది. బాగా డబ్బున్న అమ్మాయిగా క్లాసీ లుక్‌లో కనిపిస్తా. నటిగా నన్ను నేను కొత్తగా చూసుకునే పాత్ర ఇది. చాలా ప్రాధాన్యత ఉంటుంది. అందుకే వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశా '' అన్నారు హంసానందిని. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా వేసవిలో విడు దల కానుంది.


● హంసా


● అక్షిత, సాత్విక్

వినోదాత్మక సందేశం

సాత్విక్ ఈశ్వర్, అక్షిత జంటగా రూపొందిన చిత్రం 'సత్యగ్యాంగ్'. ఈ చిత్రానికి ప్రభాస్ దర్శకత్వం వహించడంతో పాటు సంగీతం అందించారు. మహేష్ ఖన్నా నిర్మాత. ఈ సినిమా ఆడియో సక్సెస్‌మీట్ కర్నూలులో నిర్వహించారు. మహేష్ ఖన్నా మాట్లాడుతూ– ''సమాజంలో అనాథలనేవారు ఉండకూడదనే సందేశానికి వినోదాన్ని మేళవించి రూపొందించిన చిత్రమిది. మా డైరెక్టర్ ప్రభాస్ మ్యూజిక్ డైరెక్టర్‌గానూ మంచి మార్కులు సంపాదించారు. మార్చి 15న సినిమా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ''సినిమా బాగా వచ్చిందన్నా.. మ్యూజిక్‌కి చాలా మంచి రెస్పాన్స్ వస్తోందన్నా అందుకు కారణం మా నిర్మాత మహేష్ ఖన్నా'' అన్నారు ప్రభాస్. '' సాత్విక్ ఈశ్వర్, అక్షిత, సినిమాటోగ్రాఫర్ అడుసుమిల్లి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నలుగురి నేరగాళ్ల కథ

''రెగ్యులర్ సినిమాలు తీస్తే ప్రేక్షకులు థియేటర్ వైపు చూడటం లేదు. తెలుగు ప్రేక్షకుల్లో చాలా మార్పొచ్చింది. కొత్తదనాన్ని ఆస్వాదిస్తున్నారు. 'ఐతే 2.0' మంచి సినిమా అవుతుంది'' అని డైరెక్టర్ నందినీరెడ్డి అన్నారు. ఇంద్రనీల్ సేన్‌గుప్తా, జారా షా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్, మృణాల్, మృదాంజలి ముఖ్య తారలుగా రాజ్ మాదిరాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఐతే 2.0'. ఫర్మ్ 9 పతాకంపై కె.విజయరామరాజు, హేమంత్ వల్లపురెడ్డి నిర్మించిన ఈ సినిమా మోషన్ పోస్టర్, టీజర్‌ను నిర్మాత రాజ్ కందుకూరి, నందినీరెడ్డి విడుదల చేశారు. రాజ్ మాదిరాజు మాట్లాడుతూ– ''ఇంజినీరింగ్ పూర్తి చేసి నిరుద్యోగంతో ఉన్న నలుగురు యువకులు ఆకలి, ఆశకి లొంగక ఆక్రోశానికి బలై క్రిమినల్స్‌గా ఎలా మారారు? అన్నదే కథ. నేటి టెక్నాలజీ, సోషల్ మీడియా, హ్యాకింగ్ వంటి అంశాలను కీలకంగా చూపించాం'' అన్నారు. ''త్వరలో ట్రైలర్‌ను, పాటల్ని విడుదల చేస్తాం. మార్చి 16న తెలుగు, హిందీలో సినిమా విడుదల చేయనున్నాం'' అన్నారు విజయరామరాజు, హేమంత్. ఈ చిత్రానికి కెమెరా: కౌశిక్ అభిమన్యు, సంగీతం: అరుణ్ చిలువేరు.


● ఇంద్రనీల్, జారా షా

పరి పరిశోధన

ఎముకలు అతుక్కునేందుకు సూదిమందు!


ఎముకలు విరిగి ఆసుపత్రికెళితే.. గట్టి కట్టు కట్టి వదిలేస్తారు. కొద్దోగొప్పో మందులు ఇచ్చినా.. అవి నొప్పి తగ్గేందుకు లేదంటే ఇన్ఫెక్షన్ రాకుండా మాత్రమే. ఇంకొంత కాలానికి ఈ పరిస్థితి పూర్తిగా మారిపోతుందని అంటున్నారు పర్‌డ్యూ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. శరీరంలోకి జొప్పించగల మందుల ద్వారా విరిగిన ఎముకలు తొందరగా అతుక్కునేలా చేయడంతోపాటు గాయం కూడా తొందరగా మానేలా చేయవచ్చునని వీరు అంటున్నారు.



నోవోస్టియో అనే కంపెనీ సాయంతో వీరు ఈ మందులపై ఇప్పటికే పరిశోధనలు ప్రారంభించారు. ''ఈ కొత్త మందును సూదుల ద్వారా ఎక్కించినప్పుడు అది ముందుగా శరీరమంతా తిరిగినప్పటికీ.. ఆ తరువాత మాత్రం ఎముక విరిగిన చోట పేరుకుపోతుంది. ఫలితంగా దుష్ప్రభావాలేమీ లేకుండానే ఎముకలను అతికించవచ్చు'' అని ఈ పరిశోధనల్లో పాలుపంచుకుంటున్న శాస్త్రవేత్త స్టీవర్డ్ లౌ తెలిపారు. ఈ మందు ఎలా పనిచేస్తుంది? ఎంత వేగంగా ఎముకలను అతుకుపెడుతుంది? ఇటువంటి వివరాలేవీ ప్రస్తుతానికి తెలియవు కానీ.. మొత్తం వ్యవహారం చాలా వేగంగా జరుగుతుందని మాత్రం చెప్పగలమని లౌ అంటున్నారు. ఈ కొత్త మందు అందుబాటులోకి వస్తే వయోవృద్ధులకూ ఎంతో ఉపయోగకరమని, చిన్న సూదితోనే విరిగిన ఎముకలను అతికించవచ్చునని వివరించారు.

గదిలో ఫోన్లన్నీ ఛార్జ్ చేసేస్తుంది...

స్మార్ట్‌ఫోన్లను వైర్‌లెస్ పద్ధతిలో ఛార్జ్ చేయడం కొత్త కాదు గానీ.. ఇందుకోసం ప్రత్యేకమైన పరికరాలపై ఫోన్లు ఉంచాల్సి వస్తుంది. ఇకపై ఈ చిక్కులుండవు. ఎందుకంటే గదిలో ఏ మూల పడేసినా వైర్‌లెస్ పద్ధతిలో బ్యాటరీలను నింపేందుకు యూనివర్శిటీ ఆఫ్ వాషింగ్టన్ శాస్త్రవేత్తలు ఓ కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేశారు. స్మార్ట్‌ఫోన్ వెనుకవైపు ఓ పవర్ సెల్‌ను బిగించి.. దాన్ని పరారుణ లేజర్ కిరణాలతో ఢీకొట్టించినప్పుడు విద్యుత్తు ప్రసారం జరిగినట్లు వీరు చేసిన ప్రయోగాల్లో తేలింది. దాదాపు 14 అడుగుల దూరంలో ఉన్న ఫోన్ బ్యాటరీకి విద్యుత్తును అందించగలిగారు. సాధారణ యూఎస్‌బీ కేబుల్ ద్వారా చేసే ఛార్జింగ్ వేగానికిది దాదాపు సమానంగా ఉండటం విశేషం.



లేజర్ కిరణాలను ప్రసారం చేసే యంత్రం ఫోన్ బ్యాటరీలో ఎంత విద్యుత్తు ఉందో? ఎప్పుడు ఛార్జ్ చేయాలో కూడా నిర్ణయించుకోగలదు. స్మార్ట్‌ఫోన్లు చెవికి వినిపించని స్థాయిలో సూక్ష్మమైన శబ్దాలు చేయడం ద్వారా లేజర్ పరికరానికి తన ఉనికిని చాటుతుందని.. తదనుగుణంగా పరికరం విద్యుత్తును ప్రసారం చేస్తుందని ఈ ప్రయోగాల్లో పాల్గొన్న శాస్త్రవేత్త గొల్లకోట శ్యామ్ తెలిపారు. మరింత ఎక్కువ దూరం నుంచి విద్యుత్తును ప్రసారం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అన్నీ సవ్యంగా సాగితే 39 అడుగుల దూరం నుంచి కూడా ఛార్జింగ్ వీలవుతుందని వివరించారు.

కొవ్వులైనా, పిండిపదార్థాలైనా... ఫలితం ఒక్కటే!

ఒళ్లు తగ్గించుకునేందుకు కొంతమంది కొవ్వు పదార్థాలు తగ్గిస్తే.. ఇంకొందరు కార్బోహైడ్రేట్లకు (పిండి పదార్థాల) కు కోత పెట్టుకుంటారు. అయితే ఈ రెండిటితో జరిగే ప్రయోజనం దాదాపు సమానమని తేల్చేసింది స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తలు. అంతేకాదు.. వీరు ఇటీవల నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఇన్సులిన్ మోతాదు, ఇతర భౌతిక లక్షణాలు ఒళ్లు తగ్గే విషయంలో ఎలాంటి ప్రభావం చూపడం లేదని కూడా తెలిసింది.



ఇంకోలా చెప్పాలంటే.. ఎవరో ఏదో చేసి ఒళ్లు తగ్గినా... ఆ పద్ధతులు అందరికీ వర్తించవు అని! ''ఒళ్లు తగ్గేందుకు ఏ ఆహారం మంచిదని అడగడం ఇకపై సరి కాదు. ఎందుకంటే ఏ ఆహారం ఎవరికి మేలు? అని అడగాల్సి ఉంటుంది'' అని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త క్రిస్టోఫర్ గార్డ్‌నర్ చెప్పారు. అధ్యయనంలో భాగంగా 18 – 50 ఏళ్ల మధ్య వయస్కుల వారి ఆహారపు అలవాట్లను పరిశీలించారు. కొవ్వులు, కార్బోహైడ్రేట్లు తక్కువగా తీసుకునే వారిని రెండు గుంపులుగా విడదీశారు. ఏడాది తరువాత జరిపిన పరిశీలనల్లో రెండు గుంపుల్లోని వారు తగ్గిన బరువులో పెద్దగా తేడా లేదని తెలిసింది. రెండు గుంపుల్లోని వారు సగటున 13 పౌండ్ల వరకూ బరువు తగ్గారని గార్డ్‌నర్ చెప్పారు. కొంతమంది 60 పౌండ్లు తగ్గగా, కొంతమంది 15 – 20 పౌండ్లు పెరిగారని వివరించారు. ఏడాది పాటు సేకరించిన సమాచారాన్ని మరింత విశ్లేషించడం ద్వారా బరువు తగ్గే విషయంలో ఏ అంశాలు ఎక్కువ ప్రభావం చూపుతాయో తెలుసుకుంటామని అంటున్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం
22-2-2018



ప్రతీకాత్మక చిత్రం

● వంట నూనెల్లో హానికర రసాయనాలు ఉండే అవకాశం ఎక్కువ కాబట్టి మనమే తీసుకోగల కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్‌తో వంట – ఒళ్లూ రెండూ ఆరోగ్యకరమని చెబుతున్నారు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి నిపుణులు

కొత్తగా ట్రై చేయండి

చల్లగా ఫ్రై చేయండి

కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్‌తో వంటకాలు ఆరోగ్యానికి మంచిదంటున్నారు నిపుణులు

- మర గానుగ వంట నూనెలతో ఆరోగ్య ప్రయోజనాలు
- ఇప్పుడు అందుబాటులో ఇంట్లోనే నూనె తీసుకునే చిన్న యంత్రాలు
- ఎవరి వంట నూనె బాధ్యత వారే తీసుకోవడం వల్ల నమ్మకం
- 'సాక్షి'తో జాతీయ ప్రకృతి వైద్య సంస్థ(పుణే) సంచాలకులు డాక్టర్ సత్యలక్ష్మి

కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ అంటే?

నూనె గింజలను వత్తిడికి గురిచేసే క్రమంలో 49 డిగ్రీల సెల్సియస్ వేడి పుట్టినప్పుడు కణాలలో నుంచి నూనె బయటకు వస్తుంది. అంతకన్నా ఎక్కువ వేడి కలగని పద్ధతిలో నిదానంగా వెలికి తీసిన నూనెను కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ అంటారు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన అంశం మరొకటి ఉంది. మనకు థయామిన్ అనే విటమిన్ చాలా మేలు చేస్తుంది. దీని లోపం వల్ల కొన్ని వ్యాధులు వస్తాయి. ఇటీవలి మన ఆహారపదార్థాల్లో ఆర్సినిక్ అనే విషం పాళ్లు ఎక్కువగా ఉంటున్నట్లు అనేక పరిశోధనల్లో వెల్లడయ్యింది. ఆహారంలో ఆర్సినిక్ ఉన్నప్పుడు థయామిన్ సరిగా పనిచేయదు. ఇలాంటప్పుడు మన శరీరంలో ప్రవించిన ఇన్సులిన్ కూడా ఎంత ప్రభావవంతంగా ఉండాలో అంత ప్రభావవంతంగా పనిచేయదు. దాంతో 'ఇన్సులిన్ రెసిస్టెన్స్' వస్తుంది. టైప్–2 డయాబెటిస్‌లోనూ ముందుగా ఇలాంటి ఇన్సులిన్ రెసిస్టెన్స్ కండిషన్ ఉంటుంది కాబట్టి... ఇలా ఆహారంలో ఆర్సినిక్ ఉండటం, అది థయామిన్ ఇచ్చే మంచి ప్రయోజనాలకు అడ్డుపడటం చక్కెర వ్యాధి ఉన్నప్పుడు ఉండే కండిషన్ల వంటి వాటినే కలగజేస్తుంది. అందుకే రసాయనాలతో ఉండే నూనెలను కొనడం కంటే... మనకు అవసరమైన నూనెను ఈ గానుగ యంత్రాల ద్వారా మనమే తయారు చేసుకోవడం మంచిది.

వంట నూనెను పరిమితికి మించి అతిగా వేడి చేసినప్పుడు విషతుల్యంగా మారుతుంది. నూనె రకాన్ని బట్టి పరిమితి ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు.. కుసుమ(శాఫ్లవర్) నూనెను 105 డిగ్రీల సెల్సియస్ కన్నా ఎక్కువగా వేడి చేయకూడదు. ఇది కూరలకు బాగుంటుంది. డీప్ ఫ్రై చేయడానికి ఈ నూనె పనికిరాదు. ఎందుకంటే.. డీప్ ఫ్రై చేసేటప్పుడు 150 డిగ్రీల సెల్సియస్ కన్నా ఎక్కువ వేడి చేయాల్సి వస్తుంది. అందుకు వేరుశనగ నూనె పనికొస్తుంది.

ఇక్కడ మరో విషయం కూడా గుర్తుపెట్టుకోవాలి. మనం తీసుకునే ఆహారం అంటే అదేదో కేవలం తిండికి సంబంధించిన వ్యవహారం మాత్రమే కాదు. అది సుస్థిరమైన ఆరోగ్యం కోసం, సమతుల ఆహారం కోసం, మంచి పర్యావరణం కోసం... ఇలా ఈ అంశాలన్నింటి సమతౌల్యానికి దోహదం చేసే అంశం. అందుకే మనం విష రసాయనాలను కాకుండా... నమ్మకమైన ఆహారాన్ని మాత్రమే కడుపులోకి పంపాలి.



విత్తనాలు, పండ్ల నుంచి అతిగా వేడి పుట్టని రీతిలో గానుగల ద్వారా పోషకాలతో కూడిన ఆరోగ్యదాయకమైన వంట నూనెలను తయారు చేసుకొని వాడుకోవడం పూర్వకాలం నుంచి మనకు ఉన్న సంప్రదాయం. అయితే, ఆధునిక కాలంలో డబుల్ రిఫైన్డ్ వంట నూనెలు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చిన దరిమిలా గానుగ ఆడించడం ద్వారా తీసిన నూనెల వాడకం దాదాపుగా కనుమరుగైంది. డబుల్ రిఫైన్డ్ పేరిట చలామణిలో ఉన్న వంట నూనెల వల్ల కొలెస్ట్రాల్, బీపీ లేకపోయినా శరీరం లోపల జనరలైజ్‌డ్ ఇన్‌ఫ్లమేషన్ వల్ల గుండె జబ్బులు వస్తున్నాయని తెలిసిందని పుణేలోని జాతీయ ప్రకృతి వైద్య సంస్థ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి) సంచాలకులు డాక్టర్ సత్యలక్ష్మి అంటున్నారు. భారీ గానుగలు అవసరం లేదని, ఇంట్లో పెట్టుకొని అవసరమైనప్పుడు నూనె తీసుకునే చిన్నపాటి విద్యుత్ గానుగ యంత్రాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయని ఆమె తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సహజ ఆహారోత్సవం సందర్భంగా డా. సత్యలక్ష్మి 'సాక్షి'తో ముచ్చటించారు... ముఖ్యాంశాలు ఆమె మాటల్లోనే..

మనం నూనెలను వాడే ముందర ఒక విషయాన్ని తార్కికంగా ఆలోచిద్దాం. ఉదాహరణకు మీ ఇంట్లో సాధారణంగా వేరుశెనగ నూనెను ఉపయోగిస్తున్నారని అనుకుందాం. రెండున్నర కిలోల వేరుశనగ గింజలు ఉపయోగిస్తే తప్ప ఒక లీటరు నూనె రాదు. కిలో నూనె గింజల ఖరీదు నూరు రూపాయలు. కానీ, మార్కెట్‌లో లీటరు వేరుశనగ నూనెను రూ.120 అంతకన్నా తక్కువకు కూడా అమ్ముతున్నారు. డబుల్ రిఫైన్డ్ నూనె అంటున్నారు. కిలో నూనె రావాలంటే ఉపయోగించాల్సిన రెండున్నర కిలోల గింజల (ముడిసరుకు) ధరే దాదాపుగా రూ. 250 అవుతుంది. అలాంటప్పుడు కిలో వేరుశెనగ నూనె రూ. 120 అంటూ మార్కెట్‌లో దొరకేది అసలు వేరుశెనగ నూనేనా? ఇంకేదైనానా? ఇక ప్రాసెస్ చేశాక అన్ని రకాల నూనెల రంగు, రుచి, వాసన ఒకే మాదిరిగా ఉంటున్నాయి. మరి అలాంటప్పుడు అది వేరుశెనగ నూనే కావచ్చు అంటూ సర్ది చెప్పుకోవడం తప్ప మరో మార్గం ఉండదు. ఇప్పుడు తార్కికంగా ఆలోచిద్దాం. ముడిసరుకు ధరే రూ. 250 ఉంటే కిలో నూనె ధర రూ. 120 కి దొరికే అవకాశం ఉండదు. కాబట్టి ఆ నూనెలో వేరుశెనగ పాళ్లు చాలా తక్కువ. మిగతాదంతా ఏదైనా రసాయనాలు కావచ్చు. మరి అలాంటప్పుడు మనమే ఓ నూనె తీసుకునే గానుగమెషిన్ కొనుక్కుంటే? మన కళ్ల ముందే మనమే నూనెను తీసుకుంటే? అప్పుడు మనం వాడే నూనె గురించి మనకు భరోసా ఉంటుంది. పైగా కోల్డ్ ప్రెస్డ్ నూనె తీసుకుంటే మరో ప్రయోజనమూ ఉంది. నూనెలు వేడి చేయడం మంచిది కాదన్న విషయం తెలిసిందే. అలాంటప్పుడు మనకు అమ్మే నూనెలను ఏమేరకు వేడి చేసి తీస్తున్నారో మనకు తెలియదు. కానీ మన కళ్ల ముందు ఆడించి, తీసుకునే నూనెను వేడి చేయకుండా తీసుకోవడం వల్ల మనకు భరోసాకు భరోసా, ఆరోగ్యానికి ఆరోగ్యం. అందుకే ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన యాంత్రిక గానుగలను వాడుకోవడం ప్రయోజనకరమే కదా.

పై ఉదాహరణతో మార్కెట్లో అందుబాటులో ఉన్న డబుల్ రిఫైన్డ్ వంట నూనెల వల్ల అవాంఛనీయ రసాయనాలు, విషపదార్థాలు ఉన్నాయనే విషయం తేలిపోయింది. దాంతో మనం ఆ నూనెలను వాడినప్పుడు ఆయా విషపూరిత రసాయనాలు మన దేహాల్లోకి చేరుతున్నాయి. ఫలితంగా అధిక బరువు, అకాల మతిమరుపు (డిమెన్షియా), కాలేయ సమస్యలు, త్వరగా ముసలితనం రావడం, శరీరం లోపల వాపు (జనరలైజ్డ్ ఇన్‌ఫ్లమేషన్) వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఈ కలుషిత డబుల్ రిఫైన్డ్ వంట నూనెల వల్ల వస్తున్నాయి.

- ప్రాసెస్ చేసిన ఈ వంట నూనెలు క్రమంగా మనుషుల ప్రాణాలను బలిగొంటున్నాయి. కాబట్టి వాటిని వంట గదులకు దూరంగా ఉంచడమే ఆరోగ్యదాయకం.
- అతిగా వేడి తగలని స్థితిలో నూనె గింజలు, పండ్ల నుంచి గానుగ ద్వారా రసాయనాలు లేదా సాల్వెంట్లు వాడకుండా తీసిన వంట నూనెలు అనేక ఆరోగ్యదాయకమైన ప్రయోజనాలను అందిస్తాయి. విటమిన్ ఇ సహా ఇతర పోషకాలను సైతం అందిస్తాయి. ఇవి ఆరోగ్యదాయకమైనవి. అందువల్ల ఈ గ్రహింపుతోనే గత ఏడాదిగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి తరఫున గానుగ నూనెల వాడకాన్ని ప్రోత్సహించే ప్రయత్నం జరుగుతోంది.
- కొలెస్ట్రాల్, బీపీ... ఈ రెండు గుండె జబ్బులకు మూల కారణాలని గతంలో భావించేవాళ్లం. అయితే, కొలెస్ట్రాల్, బీపీ సమస్యలు లేని వారికీ గుండె జబ్బులు వస్తున్నాయి. గుండెపోటు మరణాలూ సంభవిస్తున్నాయి. సడన్ హెమరేజ్ వంటి సమస్యలు వస్తున్నాయి. డబుల్ రిఫైన్డ్ వంట నూనెల వల్ల వస్తున్న 'జనరలైజ్డ్ ఇన్‌ఫ్లమేషనే (శరీరం లోపల వాపు) ఇందుకు మూల కారణమని ఇప్పుడు గుండె వైద్య నిపుణులు సైతం గుర్తించారు. శరీరం లోపల ఆ ఇన్‌ఫ్లమేషనే లేకపోతే ఈ కొలెస్ట్రాల్, బీపీ కూడా అంతగా ఇబ్బంది పెట్టవు.
- వెనకటి కాలంలో మాదిరిగా చెక్క గానుగలు ఇప్పుడూ పెట్టి నాణ్యమైన వంటనూనెలు అందిస్తున్న వ్యక్తులు, సంస్థలు అనేకం ఉన్నాయి. అయితే, ఎవరికి వారు తమ వంట నూనెలను, తమ ఇంట్లోనే కావాలనుకున్నప్పుడు సిద్ధం చేసుకునేందుకు సులువైన చిన్న సైజు ఆయిల్ ఎక్స్‌లర్స్ సూరత్, నాగపూర్ మోడల్స్ చాలానే అందుబాటులో ఉన్నాయి. వీటి ధర దాదాపు రూ. 22 వేలకు అటూ ఇటుగా ఉంటాయి. చిన్న సైజు ఆయిల్ ఎక్స్‌లర్ ద్వారా నూనె గింజల్లో నుంచి 98% నూనెను వెలికితీయవచ్చు. చక్క/పిట్టు/పిప్పిలో అతి తక్కువగా 2% నూనె మాత్రమే ఉంటుంది. విద్యుత్ ఖర్చు కూడా పెద్దగా ఉండదు.
- ఇక ఈ తరహా నూనెల్లోనూ కుసుమ నూనె శ్రేష్టమైనది. తర్వాత నల్ల నువ్వుల నూనె, వేరుశనగ నూనె, కొబ్బరి నూనె, ఆవ నూనె మంచివి. ముఖ్యంగా కుసుమ, నల్లనువ్వుల నూనెలో శరీరానికి హాని చేసే ట్రాన్స్‌ఫ్యాట్స్ తక్కువ. కాబట్టి మిగతా నూనెలతో పోలిస్తే కుసుమ, నల్లనువ్వుల నూనెలు మంచివి.
- నూనె తీసిన తర్వాత వచ్చే పిప్పిలో పోషక విలువలు ఉంటాయి. వీటిని నేరుగా తినొచ్చు. కూరల్లో వేసుకోవచ్చు. ఈ విధంగా చూస్తే వృథాగా పోయే వ్యర్థాలనూ ఆరోగ్యం కోసం మనం వాడుకోవచ్చు.



● జాతీయ ప్రకృతి వైద్య సంస్థ(పుణే) సంచాలకులు డాక్టర్ సత్యలక్ష్మి



● మనకు కావలసిన నూనెను మనమే పొందేలా మనం ఆడించుకోగల మరగానుగ

ఫ్యామిలీ డాక్టర్

పీసీవోడీకి చికిత్స ఉందా?

నా భార్య వయసు 35 ఏళ్లు. ఇటీవల ఆమె శరీరంపై వెంట్రుకలు ఎక్కువగా పెరుగుతుంటే డాక్టర్‌కు చూపించాం. ఆమె పీసీఓడీతో బాధపడుతున్నట్లు చెప్పారు. దీనికి హోమియోలో చికిత్స ఉందా?

– టి. లక్ష్మణ్‌రావు, విజయనగరం

రుతుక్రమం సవ్యంగా ఉన్న మహిళల్లో నెలసరి అయిన 11–18 రోజుల మధ్యకాలంలో వాళ్లలోని రెండు అండాశయల్లోని ఏదో ఒకదాని నుంచి అండం విడుదల అవుతుంది. అలా జరగకుండా అపరిపక్వమైన అండాలు వెలువడి అవి నీటిబుడగల్లా అండాశయపు గోడలపై ఉండిపోయే కండిషన్‌ను పీసీవోడీ (పాలిసిస్టిక్ ఒవేరియన్ డిసీజ్) అంటారు.

లక్షణాలు : నెలసరి సరిగా రాకపోవడం, వచ్చినా అండాశయం నుంచి అండం విడుదల కాకపోవడం, రుతుస్రావం సమయంలో ఎక్కువ రక్తంపోవడం, రెండు రుతుక్రమాల మధ్యకాలంలో రక్తస్రావం కావడం, నెలసరి వచ్చే సమయంలో కడుపులో బాగా నొప్పిరావడం, నెలసరి రాకపోవడం, బరువు పెరగడం, తలవెంట్రుకలు రాలిపోతుండటం, ముఖం, వీపు, శరీరంపై మొటిమలు రావడం, ముఖం, ఛాతీపైన మగవారిలా వెంట్రుకలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనివల్ల సంతానం కలగకపోవడం, స్థూలకాయం, డయాబెటిస్, కొందరిలో చాలా అరుదుగా హృద్రోగ సమస్యలు రావచ్చు. రోగిని భౌతిక లక్షణాలతో పాటు అల్ట్రాసౌండ్ స్కాన్, హెచ్‌సీజీ, టెస్టోస్టెరాన్, ఆండ్రోజెన్, ప్రోలాక్టిన్ మొదలైన హార్మోన్ల పరీక్షలు, రక్తంలో చక్కెరపాళ్లు, కొలెస్ట్రాల్ శాతం వంటి పరీక్షలతో దీన్ని నిర్ధారణ చేయవచ్చు. హోమియో విధానంలో సరైన హార్మోన్ వ్యవస్థను పరిపుష్టం చేయడం ద్వారా దుష్ఫలితాలేవీ లేకుండా శాశ్వతంగా పీసీఓడీని నయం చేయవచ్చు.



డాక్టర్ శ్రీకాంత్ మోర్లావర్
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్, హైదరాబాద్

మావాడికి ఆస్తమా... తగ్గుతుందా?

ఇప్పుడు మా కొడుకు వయసు 22 ఏళ్లు. వాడికి పుట్టినప్పటి నుంచి దగ్గు, ఆయాసం ఉన్నాయి. ఆయాసపడే సమయంలో పిల్లికూతలు వినిపిస్తుంటాయి. మావాడికి ఉన్న ఉబ్బసం ఎలా తగ్గుతుంది?

– మోహన్ ప్రసాద్, కొత్తగూడెం

ఉబ్బసం (ఆస్తమా) అనేది ఊపిరితిత్తుల్లోని వాయునాళాలకు సంబంధించిన దీర్ఘకాలిక మొండి వ్యాధి. వాయునాళాలు మూసుకుపోయి గాలిపీల్చడం, వదలడం కష్టంగా మారుతుంది. దీన్ని ఉబ్బసం, ఆయాసం, ఆస్తమా అనే పేర్లతో పిలుస్తుంటారు. దాదాపు 80 శాతం మంది ఆస్తమా రోగుల్లో ఈ వ్యాధి 18 ఏళ్ల లోపు వయసులోనే మొదలవుతుంది.

కారణాలు : ● దుమ్ము, ధూళి, కాలుష్యం ● వాతావరణ మార్పులు, చల్లగాలి ● ఇన్ఫెక్షన్స్ ● పొగాకు ● పెంపుడు జంతువులు ● సుగంధద్రవ్యాలు, ఘాటైన వాసనలు ● పుప్పొడి రేణువులు ● వంశపారంపర్యం మొదలైనవి.

లక్షణాలు : ● ఆయాసం ● దగ్గు రాత్రిపూట రావడం ● గాలి తీసుకోవడం కష్టం కావడం; పిల్లికూతలు ● ఛాతీ పట్టేసినట్లుగా ఉండటం. వ్యాధిగ్రస్తులందరిలో ఈ లక్షణాలన్నీ ఉండాలని ఏమీ లేదు. వీటిల్లో కొన్ని లక్షణాలు మాత్రమే ఉండవచ్చు.

చికిత్స : ఆస్తమా నుంచి పూర్తిగా ఉపశమనం కలిగించే మందులు హోమియోపతిలో అందుబాటులో ఉన్నాయి. అవి ఆస్తమా లక్షణాలకు తగ్గించడమే కాకుండా, ఆ లక్షణాలను కలిగించే కారకాల పట్ల శరీరానికి వ్యాధి నిరోధకతను పెంచుతాయి. హోమియో విధానంలో ఆర్సినిక్ ఆల్బ్, ఇపికాక్, నేట్రమ్ సల్ఫ్, కాల్కేరియా కార్బ్, యాంటిమోనమ్ ఆల్బ్, స్పాంజియా వంటి మందులను నిపుణులైన హోమియో వైద్యుల పర్యవేక్షణలో వాడాల్సి ఉంటుంది.



డాక్టర్ మురళి కె. అంకిరెడ్డి,
ఎండీ (హోమియో) స్టార్ హోమియోపతి, హైదరాబాద్

మళ్లీ చెప్పకుందాం! రీటోల్డ్ కథలు - 12

ఫైసలా



వచ్చినవాళ్లలో ఎవరో జన్నతుల్ ఫిర్‌దౌస్ రాసినట్టున్నారు. మంచి వాసనొస్తోంది.

కాని అసలు కంపంతా హుసేన్ చేశాడు.

పంచాయితీ కూచుంది.

బల్లపీటల మీద కూచున్నోళ్లు బల్లపీటల మీద ఉన్నారు. నులక మంచాల మీద కూచున్నోళ్లు నులక మంచాల మీద ఉన్నారు. వరండాలో చాటుగా ఘోషా పాటిస్తున్న ఆడవాళ్లు మాటకు అవసరం రాకపోతుందా అన్నట్టు కాచుకుని ఉన్నారు.

ఒకవైపు హుసేను ఒకవైపు జుబేదా నిల్చున్నారు.

మూడు నెలలుగా గొడవ జరుగుతూ ఉంది. గొడవ చేస్తున్నవాడు హుసేను.

టీచరుద్యోగానికి వెళ్లిన జుబేదా ఇంకో స్కూలు సారు సైకిల్ మీద కూచుని కనిపించిందని గొడవ.

'పెళ్లయిన ఏడేళ్లలో మూడు కడుపులు పోయాయి. ముగ్గురు పిల్లలు పుట్టారు. పిల్లల సంచి పలుచనైందని డాక్టరమ్మ చెప్పి గోలీలు రాసిచ్చింది. కాని ఎన్నిగోలీలు వాడినా బహిష్టప్పుడు నొప్పితో బంతిలా మారిపోతున్నా. నేను ఉద్యోగం చేసే ఊరు బస్సులు తిరిగే ఊరు కాదు. పొద్దునొక జీపు సాయంత్రం ఒక జీపు తిరుగుతాయి. నొప్పికి వీలుగాక కాస్త ఇంటిదాక వదలమంటే, పాపం అన్నలాంటోడు, వచ్చి వదిలాడు. అది తప్పా' అని జుబేదా జవాబు చెప్పింది.

కాని వినట్లేదు.

అసలు సంవత్సరం ఆరు నెలలుగా సతాయిస్తున్నాడు.

'నువ్వు దొడ్డగైనావు. నా దోస్తులు చూసి నవ్వుతున్నారు' అన్నాడొకసారి.

'నువ్వు మాత్రం పెళ్లయినప్పుడు ఎట్టున్నావో అట్టే ఉన్నావా. బొర్రా పిర్రా పెంచలేదా. నాది ఊబవొళ్లు. నీకు సేవ జేసిజేసి, పిల్లల్ని కనీకనీ ఈ ఒళ్లు వచ్చింది' అంది జుబేదా.

'నలుగురితో మీద మీద పడి మాట్లాడుతున్నావు'

'నాది సర్కారు నౌకరీ. నలుగురితో కలుపుగోలుగా ఉండటమే నా కొలువు. కాదంటే చెప్పు మానేసి ఇంట్లో కూచుంటా'

ఊహూ. వినట్లేదు.

సంగతి తర్వాత తెలిసింది. ఊళ్లో ఒంటెద్దుబండి తిప్పే మస్తాను కూతురు ఫాతిమా వెనుక పడుతున్నాడట. ఆ పిల్ల మీద మోజుతో ఏదో ఒక కారణం చూసుకొని తన్ని పుట్టింటికి పంపుతున్నాడు.

'వాని మీద గత్తర పడ. వానికి సావు రాను. వాని కనుగుడ్లలో పువ్వులు పుయ్య. వాడి చేతుల్లో పుండ్లు పడ' అని కూతురు ఇంటికొచ్చినప్పుడల్లా జుబేదా తల్లి తిట్లు లంకించుకుంటుంది.

'మీ ఇళ్లల్లో ఒక్కో మగాడు ఇద్దరు ముగ్గుర్ని చేసుకుంటారు గదా. ఇదేం కొత్త' అంది ఇరుగమ్మ.

'రా చూద్దూరా. మా అయ్య చేసుకున్నాడా. మా తాత చేసుకున్నాడా. మా పుప్పా చేసుకున్నాడా. మా ఆయన చేసుకున్నాడా. చేసుకునే బద్మాష్‌గాళ్లు ఏ కులం మతంలో అయినా ఉంటారు. చేసుకోనివాళ్లు కూడా ఎక్కడైనా ఉంటారు. నా ప్రాణానికే దొరికాడు ఇలాంటి లత్తుకోరుగాడు' అంది జుబేదా తల్లి.

'ఆ మస్తానుకు బుద్ధి లేదా. పెళ్లయినోడు పిల్ల వెంట పడుతుంటే బుద్ధి చెప్పాలి గదా. పిల్లనట్ట వదిలేస్తాడా సోబతు పొమ్మని' అంది పొరుగమ్మ.

'ఆ మస్తానుగాడికి ముగ్గురు కూతుళ్లు. ఒక పిల్ల పెళ్లికే నంగా అయ్యి గల్లీల పడ్డాడు. ఇంకో ఇద్దరు బిడ్డల నిఖాలు ఎక్కడ జరిపిస్తాడు? పూట పూటకు దిక్కులు చూడాల్సిన పరిస్థితి. ఇంటి పిల్ల రెండోదానిగానో మూడోదానిగానో వెళ్లినా వేళకు రెండు ముద్దలైనా తింటుందని ఆశ పడుతున్నాడు గాబోలు. ఆకలికి మనుషుల్ని అమ్ముకునే బేహాలతు ఉన్నంత కాలం ఇలాంటి వాళ్లు ఉండనే ఉంటారు. అసలు వాళ్లను అని ఏం ప్రయోజనం. మన బంగారం మంచిదైతే కదా' అంది జుబేదా.

ఇలాంటి తకరార్లు, తగాదాలు జరిగి మొగునికి బుద్ధి చెప్పే విషయంగా పంచాయితీ కూచోబెట్టింది జుబేదా. టోపీలు, గడ్డాలు, సుర్మాలు, బుర్ఖాలు అన్నీ కొలువు దీరాయి.

'మరి ఏమంటావు హుసేనా?' అన్నాడు మసీదు పెద్ద.

హుసేను ముందుకొచ్చి, జంకూ గొంకూ లేకుండా 'నాకిద్దరూ గావాలె' అన్నాడు.

'అట్టెట్ట కుదురుద్ది' అని ఘోషాలో నుంచి ఎవరో ఆడామె అనబోయింది.

'ఆడోళ్ల నోరు ముయ్యండి. మగాళ్లం మాట్లాడుతున్నాం కదా' కసిరాడు మసీదు పెద్ద.

'నాకు ఇద్దర్ని పోషించే హోస్లా ఉంది. పోషించే హోస్లా ఉన్నప్పుడు చేసుకొమ్మని మతం చెప్పింది గదా. ఇంకేంటి' అన్నాడు హుసేను.

మసీదు పెద్ద ఫాతిమాని పిలిపించాడు.



● రుబీనా పర్వీన్

'పెళ్లయినోణ్ణి కోరుతున్నావ్. వాణ్ణి కోరడం మంచి పనేనా?'

ఫాతిమా పక్కా ఇరాదాతో అంది– 'నాకు వాడు గావాలె'.

'ఏం మస్తానా. పెళ్లయినవాడికిచ్చి నీ కూతురి గొంతు కోద్దామనుకుంటున్నావా?'

మస్తాన్ ఏమీ మాట్లాడలేదు. తల వొంచుకుని కూచున్నాడు.

'ఇంకేంది పంచాయితీ తేలిపోయింది. ఇద్దరూ పడి ఉండండి' అన్నాడు మసీదు పెద్ద.

'ఏంటి?' అంది జుబేదా ముందుకొచ్చి.

'పోషించే హోస్లా ఉందంటున్నాడుగా నీ మొగుడు. నువ్వుంటావు. అదీ ఉంటుంది. అదే తీర్పు' అన్నాడు మసీదు పెద్ద.

'అయితే నా తీర్పు వినండి' అంది జుబేదా.

'ఒళ్లు దొడ్డుగయ్యింది ముక్కు సొట్టబొయ్యింది అని నెపం పెట్టి ఇవాళ ఇంకోదాన్ని తీసుకొస్తున్నాడు. రేపు ఆ రెండోదాన్ని నువ్వు నల్లగున్నావు రాత్రేళ సల్లగున్నావు అని వేరేదాన్ని తేకుండా ఉంటాడా? నేనూ మనిషినే. ఒకమ్మ కడుపున పుట్టిన్నానే. చదువుకున్నా. ఉద్యోగం ఉంది. నా బతుకు నేను బతగ్గలను. నన్ను గౌరవించని మొగుడు నాకెందుకు. హోస్ల ఉంటే ఇంకోదాన్ని తెచ్చుకోమని చెప్పిన మతమే సరిపడని మగాణ్ణి వదిలించుకొమ్మని కూడా చెప్పింది. బహిష్టు నొప్పప్పుడు తంగేడు పుల్ల నవిలితే నొప్పి పోతుందని నవిలా. పోలేదు. పిల్లలసంచి తీసి పారెయ్ పోతుంది అని డాక్టరమ్మ చెప్తే రేపొస్తానని వచ్చా. ఈ పుల్ల పంచాయితీ ఎంత మందమో తెలిసిపోయింది. నా పిల్లలసంచి లాగే వీణ్ణి కూడా తీసి అవతల పారేస్తున్నా. నాకు ఖులా ఇప్పించండి' అని, బోర్లేసిన చేతులను నడుం మీద ఉంచి అందరి వైపు తీక్షణంగా చూస్తూ నిలబడింది జుబేదా.

కథ ముగిసింది.

రుబీనా పర్వీన్ రాసిన 'ఖులా' కథ ఇది.

ఇస్లాంలో పెళ్లి అగ్రిమెంట్‌లాంటిది. అందులో నుంచి బయటపడటానికి మగవాడికి 'తలాక్' ఏర్పాటు ఎలా ఉందో స్త్రీకి 'ఖులా' ఏర్పాటు అలా ఉంది. తగిన నోటీసు ఇచ్చి తలాక్ ఎలా చెప్పవచ్చో తగిన నోటీస్ ఇచ్చి ఖులా కూడా చెప్పవచ్చు. ముస్లిం స్త్రీ ఖులా తీసుకోదలిస్తే ఆపే శక్తి ఎవరికీ లేదు. తమను ఇబ్బంది పెట్టే మగవాళ్లకు ఖులా ఇచ్చే ఆడవాళ్ల సంఖ్య హైదరాబాద్‌లో పెరిగిందని ఇటీవలి అధ్యయనం చెప్పింది. ఏ స్త్రీకైనా జీవితంలో ఆత్మగౌరవమే ప్రథమం. మతం ద్వితీయం. అది ఏ మతమైనా సరే.

పునః కథనం: ఖదీర్

సాక్షి ఫ్యామిలీ
సినిమా
విజయవాడ
గురువారం
22-2-2018


● ఆమిర్ ఖాన్
● రణ్‌వీర్ సింగ్

కురుక్షేత్రంలో ఖిల్జీ!

కర్ణుడా.. దుర్యోధనుడా.. అర్జునుడా.. భీముడా.. రణ్‌వీర్ సింగ్ ఏ రోల్ చేస్తే బాగుంటుందంటారు? ఇదిగో ఇలాంటి చర్చే జరుగుతుంది బీటౌన్‌లో. ఎందుకంటే బాలీవుడ్ హీరో ఆమిర్ ఖాన్ డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహాభారతం'లో రణ్‌వీర్ నటించనున్నారట. ఎప్పటినుంచో ఈ ప్రాజెక్ట్ పనిలో ఉన్న ఆమిర్ రీసెంట్ టైమ్స్‌లో కాస్త స్పీడ్ పెంచారు. రణ్‌వీర్ సింగ్‌తో చర్చలు జరిపారు. రణ్‌వీర్‌ని తీసుకోవాలని ఆమిర్ అనుకోవడానికి కారణం 'పద్మావత్' సినిమా. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో దీపికా పదుకోన్, షాహిద్ కపూర్, రణ్‌వీర్‌సింగ్ ముఖ్య తారలుగా రూపొందిన ఈ చిత్రంలో ఖిల్జీ పాత్రలో అందర్నీ మెప్పించారు రణ్‌వీర్. ఆమిర్ ఖాన్ కూడా ఖిల్జీకి ఫిదా అయ్యారు. అంతకుముందు రణ్‌వీర్ చేసిన పాత్రలు ఇష్టమైనప్పటికీ ఖిల్జీ పాత్ర ఆయనకు బాగా నచ్చిందట. అందుకే మహాభారతం సినిమా తీస్తే అందులో ఏ క్యారెక్టర్ సూట్ అవుతుందా? అని రణ్‌వీర్‌తోనే చర్చలు జరిపారు. రీసెంట్‌గా ఓ ప్రైవేట్ ప్రోగ్రామ్ కోసం కలిసిన వీళ్లు.. మరో కార్యక్రమం కోసం మళ్లీ కలిశారు. అక్కడే ఇద్దరి మధ్య మహాభారతం గురించిన టాపిక్ వచ్చిందట. ఈ సంగతి ఇలా ఉంచితే ప్రస్తుతం 'గల్లీబాయ్' చిత్రంతో రణ్‌వీర్, 'థగ్స్ ఆఫ్ హిందోస్తాన్' సినిమాతో ఆమిర్ బిజీగా ఉన్నారు. మరి.. 'మహాభారతం' పట్టాలెక్కేదెప్పుడు? కాలమే చెప్పాలి.


● తాప్సీ
● కృతీసనన్

ఈ ఇద్దరికీ 60 ఏళ్లు!

60లో సగం 30 ఏళ్లను తాప్సీ దాటి ఒకే ఒక్క సంవత్సరం అయింది. ఇంకో రెండేళ్లల్లో 30ని టచ్ చేస్తారు కృతీ సనన్. మరి.. ఈ ఇద్దరికీ 60 ఏళ్లు అంటున్నారేంటి అనుకుంటున్నారా? మరేం లేదు. 'ఉమనియా' అనే సినిమాలో ఈ ఇద్దరూ 60 ఏళ్ల వయసున్న స్త్రీల్లా కనిపించనున్నారు. సినిమా మొత్తం ఇలానే కనిపిస్తే.. ఫ్యాన్స్ ఫీలవుతారు కదూ. డోంట్ వర్రీ. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో మాత్రమే ఈ పాత్రల్లో కనిపిస్తారు. మిగతా సీన్స్‌లో తమ వయసుకు తగ్గట్టు యూత్‌ఫుల్ క్యారెక్టర్స్‌లో కనిపిస్తారట. సినిమా టైటిల్‌ని బట్టే ఇది లేడీ ఓరియంటెడ్ మూవీ అని అర్థం చేసుకోవచ్చు. ఓ కొత్త దర్శకుడితో మధు మంతెన, అనురాగ్ కశ్యప్, విక్రమాదిత్య మొత్వాని, వికాస్ బాల్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. పలువురు ఉమెన్ ప్రొఫెషనల్ షూటర్స్ నిజజీవిత సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ కథ వినగానే తాప్సీ, కృతి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. చిత్రీకరణ ప్రారంభించే ముందు ఇద్దరికీ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ప్రొఫెషనల్ షూటింగ్ ఎలా ఉంటుందో తెలిస్తే నటించడానికి సులువుగా ఉంటుంది కదా. అందుకే ఈ ట్రైనింగ్. జూన్ లేక జులైలో ఈ చిత్రాన్ని ప్రారంభించాలనుకుంటున్నారు.

అప్పడాలమ్మా.. అప్పడాలు!


● హృతిక్ రోషన్

కావాలనుకుంటే కాళ్ల ముందు కొచ్చి ఆగుతాయి కార్లు. అనుకుంటే ఆకాశయానం ఈజీ. ఫిక్స్ అయితే చార్టెడ్ ఫ్లైట్‌లో సింగిల్‌గా ఫ్లై అవ్వగలడు. కానీ.. గల్లీ గల్లీ తిరిగి అప్పడాలు అమ్ముతున్నారు హృతిక్ రోషన్. డబ్బులు కోసం ఎండను కూడా లెక్క చేయకుండా చెప్పులరిగేలా సైకిల్ సవారీ చేస్తున్నారు బస్‌స్టాండ్‌లో. అతనికెందుకంత కష్టం? అంటే కాదు ఇష్టం. యాక్టింగ్ అంటే ప్యాషన్. బిహారీ గణిత శాస్త్రవేత్త ఆనంద్‌కుమార్ జీవితం ఆధారంగా హిందీలో దర్శకుడు వికాశ్ బాల్ రూపొందిస్తున్న చిత్రం 'సూపర్ 30'. ఆనంద్‌కుమార్ పాత్రలో హృతిక్ రోషన్ నటిస్తున్నారు. నిజజీవితంలో ఆనంద్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి అప్పడాలు అమ్మారు. ఆ సన్నివేశాలనే చిత్రీకరిస్తున్నారు. ఇప్పుడు అర్థమైంది కదా. హృతిక్ అప్పడాలు అమ్మింది సినిమా కోసమని. ఆరడగుల అందగాడు హృతిక్ రోషన్ ఫొటోలో చూస్తున్నట్లుగా సిల్వర్ స్క్రీన్‌పై కనిపించడం ఇదే తొలిసారి. గోల్డెన్ స్పూన్‌తో పుట్టిన హృతిక్ రియల్ లైఫ్‌లో కూడా ఇలా కనిపించలేదు. సో.. ఈ గెటప్‌లో ఆకట్టుకోవడంతో పాటు నటనతో మెస్మరైజ్ చేస్తారని ఊహించవచ్చు. ఈ సినిమాను వచ్చే ఏడాది జనవరి 25న విడుదల చేయాలనుకుంటున్నారు.

బాలీవుడ్ స్పైస్

హార్వీ వెయిన్‌స్టీన్‌లు బాలీవుడ్‌లోనూ ఉన్నారు!


● ఏక్తా కపూర్

హార్వీ వెయిన్‌స్టీన్ ఎవరో తెలుసా? తెలియకుండా ఎలా ఉంటాడు? నటీమణుల పట్ల రాక్షసుడిలాంటి వాడని హాలీవుడ్ కోడై కూస్తోంది. అది అన్ని వుడ్స్‌కీ పాకింది. అంతే.. ఇక్కడ కూడా ఇలాంటి కిరాతకులు ఉన్నారని కొందరు నటీమణులు బాహాటంగా 'క్యాస్టింగ్ కౌచ్' గురించి మాట్లాడుతున్నారు. ఈ లిస్ట్‌లో బాలీవుడ్ టీవీ, ఫిల్మ్ ప్రొడ్యూసర్ ఏక్తా కపూర్ చేరారు. 'మీటూ' అంటూ ప్రతి ఇండస్ట్రీలోని నటీమణులు బడా బడా ప్రొడ్యూసర్స్, డైరెక్టర్స్ బండారం బయటపెడుతున్న ఈ ఉద్యమం నేపథ్యంలో ఏక్తా కపూర్ కూడా తన గళం విప్పారు. ''కాయిన్‌కి ఒకవైపే కాదు రెండో వైపు కూడా చూడాలి'' అంటూ క్యాస్టింగ్ కౌచ్ గురించి పలు ఆసక్తికర విషయాలు ప్రస్తావించారామె. ''బాలీవుడ్‌లో కూడా హార్వీ వెయిన్‌స్టీన్‌లు ఉన్నారు. కానీ వారితో పాటు అంతే సమానంగానే కథకు మరోవైపు కూడా హార్వీ వెయిన్‌స్టీన్ (బాధితులు)లు ఉన్నారు. కానీ వారి గురించి మనం ఎవ్వరం మాట్లాడం. అవును పవర్‌లో ఉన్న కొద్దిమంది నిర్మాతలు వాళ్ల పలుకుబడిని ఉపయోగించి అడ్వాంటేజ్ తీసుకొని ఉండొచ్చు. సేమ్ టైమ్ అవకాశం కోసం చూస్తున్న కొందరు యాక్టర్స్ దిగజారి, తమ పనులు జరిగేలా చూసుకుంటున్నారు. నేను నమ్మేదేంటంటే 'పదవి, పవర్ ఉన్నవాళ్లనే ఎప్పుడూ దోషులుగా చిత్రీకరించకూడదు. అలాగే పవర్‌లో లేనివాళ్లను బాధితులుగా పరిగణించకూడదు'' అని పేర్కొన్నారు ఏక్తా కపూర్.

> కేవలం నటీమణులకే కాదు.. ఓ ప్రొడ్యూసర్‌గా నాకూ కొన్ని చేదు అనుభవాలు ఎదురయ్యాయి. కొంతమంది మగాళ్లు చాలా అసభ్యకరంగా ప్రవర్తించేవాళ్లు. మరి అలాంటి సిచ్యువేషన్స్‌లో నిందితులు ఎవరు? పవర్‌లో ఉన్న ప్రొడ్యూసరా? లేక పవర్ లేనివాళ్లా?



ఆన్ ద వే!



సినిమా రిలీజ్ కాలేదు. బాక్సాఫీసు లెక్కలు తేలలేదు. కానీ 'భాగీ' ఫ్రాంచైజీలో నెక్స్ట్ చిత్రం 'భాగీ 3' ఎనౌన్స్ చేశారు. అంటే..'భాగీ 3' ఆన్ ద వే అన్నమాట. టైగర్ ష్రాఫ్, దిశా పాట్నీ జంటగా ఆహ్మద్‌ఖాన్ దర్శకత్వంలో 'భాగీ'కి సీక్వెల్‌గా రూపొందుతున్న సినిమా 'భాగీ 2'. మంగళవారం ఫస్ట్ లుక్‌ను, బుధవారం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఫుల్‌యాక్షన్ ప్యాకేజీగా ట్రైలర్ ఉంది. ఇది తెలుగు 'క్షణం' చిత్రానికి రీమేక్ అని టాక్. ముందుగా సెకండ్ పార్ట్‌నీ ఏప్రిల్ 27న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు ఏప్రిల్ 30న విడుదల చేస్తున్నారు చిత్రబృందం.

కవయిత్రి దీపిక


● దీపికా పదుకోన్

యాక్టర్ కాకపోయి ఉంటే ఏమై ఉండేవారు? అని ప్రతి యాక్టర్‌కు ఏదో సందర్భంలో ఎదురుపడే ప్రశ్న. డాక్టర్, పైలెట్, ఇంజినీర్ అని ఏదో ఒకటి చెబుతుంటారు. కానీ దీపికా పదుకోన్ మాత్రం ఖచ్చితంగా కవయిత్రి అయ్యి ఉండేవారు. అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నాం అనుకుంటున్నారా? దీపికా పదుకోన్ ఏడో తరగతిలో రాసిన 'ఐ యామ్ – ది చైల్డ్ విత్ లవ్ అండ్ కేర్' అనే కవితను చదివితే ఎవరైనా అలానే అంటారు. ఎప్పుడో రాసుకున్న ఈ కవితను ఇప్పుడు దీపికా తన సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్ట్ చేశారు. ''లైఫ్ ఏదో ఒక రోజు ఎండ్ అవుతుంది అని మనందరికీ తెలుసు. అలా అని అది మనం అనుకున్న గోల్స్‌ను రీచ్ కావడాన్ని ఆపకూడదు. మనం కలలు కంటూనే ఉండాలి. మనం కష్టపడుతూనే ఉండాలి, మన బెస్ట్‌నే ఇస్తూనే ఉండాలి, అలాగే.. వెరీ బెస్ట్‌ని ఆశించాలి'' అనే సారాంశంతో సాగే ఈ పోయమ్‌ను ఏడో తరగతిలోనే అంత మెచ్యూరిటీతో రాశారంటే.. ఒక వేళ యాక్టర్ కాకపోయి ఉంటే కవయిత్రిగా దీపికా రాణించేవారని ఊహించవచ్చు.

ఫన్నీ లియోన్



● సన్నీ లియోన్

డంబుల్స్.. వాటిని చూస్తేనే అమ్మాయిల గుండెల్లో గుబుల్స్. కోరి కోరి అంత బరువుని నెత్తి మీద పెట్టుకుంటారా? దానికి ఎంతో ఖలేజా ఉండాలి. సన్నీ లియోన్‌కి ఆ దమ్ముంది. అంతే.. ఫొటోలో కనిపిస్తున్నట్లుగా డంబుల్స్‌ని నెత్తి మీద పెట్టుకున్నారు. అవి నిజమైనవేనంటారా? ఉత్తుత్తివే అని సన్నీ చెప్పలేదు కాబట్టి నిజమైనవే అనుకోవాలేమో. ఇంకో ఫొటోలో చూశారా? అందాల రాక్షసిలా కనిపిస్తున్నారు కదూ. మరో ఫొటోలో ఏకంగా తాడుతో గాల్లో వేలాడుతున్నారు. మెడలో పాము వేసుకుని ఎంత హాయిగా నవ్వుతున్నారో చూశారా? వామ్మో సన్నీ ఎంత డేరింగ్ అండ్ డ్యాషింగ్‌గో కదా. ఏంటి సన్నీ? ఏం జరిగింది? అంటే.. ఓ టీవీ షో కోసం సన్నీ ఈ విన్యాసాలు చేస్తున్నారు. మెడలో ఉన్నది నిజం పాము కాదు. ''ఇంకా నయం.. దర్శక–నిర్మాతలు నాకు నిజం పాము ఇవ్వలేదు. బతికిపోయాను' అని నవ్వేశారు సన్నీ లియోన్. ఇలాంటి సరదా ఫొటోలను చూస్తే సన్నీ లియోన్‌ను ఫన్నీ లియోన్ అనకుండా ఉండలేం కదా.


అందర్నీ ఇంప్రెస్ చేయలేం


● సోనాక్షి సిన్హా

'దబంగ్' సినిమాతో ఎంట్రీ ఇచ్చి 'రౌడీ రాథోడ్, సన్నాఫ్ సర్దార్, దబంగ్ 2' అంటూ వరస విజయాలతో గోల్డెన్ రన్ చూశారు బొద్దుగుమ్మ సోనాక్షి. ఇటీవల ఆమెకు చెప్పుకోదగ్గ హిట్స్ లేవు. ప్రభుదేవా దర్శకత్వంలో వచ్చిన 'యాక్షన్ జాక్సన్' తర్వాత వరుస బాక్సాఫీస్ ఫెయిల్యూర్స్ చూస్తున్నారామె. మధ్యలో 'లుటేరా, అకీరా, నూర్' వంటి సినిమాల్లో మంచి పెర్ఫార్మెన్స్ చేసినా సినిమాలు హిట్స్ కాలేకపోయాయి. ఈ వరుస వైఫల్యాల గురించి సోనాక్షి మాట్లాడుతూ – ''ఈ మధ్య నా సినిమాలు బాక్సాఫీస్ దగ్గర సరిగ్గా ఆడట్లేదు కానీ యాక్టర్‌గా నేను చేస్తున్న రోల్స్ నాకు చాలా సంతృప్తి ఇచ్చాయి. 'అకీరా, నూర్, లుటేరా' వంటి సినిమాల్లో భాగమైనందుకు నేనెంతో గర్వపడుతున్నాను. కమర్షియల్ సినిమాలతో సక్సెస్ సాధించినప్పుడు అందులో నేను చేసింది ఏమీ లేదన్నారు. ఇప్పుడు కంటెంట్ ఓరియంటెడ్ సినిమాలు చేస్తుంటే కమర్షియల్ సినిమాలు ఎందుకు చేయట్లేదు? అంటున్నారు. ఈ రెండు రకాల మాటలు విన్న తర్వాత నాకు అర్థం అయ్యిందేంటంటే.. మన వర్క్‌తో అందర్నీ ఇంప్రెస్ చేయలేమని, అందర్నీ సంతృప్తి పరచలేమని, విమర్శించేవాళ్లు విమర్శిస్తూనే ఉంటారు. అందుకే నాకు నచ్చింది, నన్ను చాలెంజ్ చేసే పాత్రలే చేద్దాం అని ఫిక్స్ అయ్యాను. హ్యాపీగా, బ్యాలెన్స్‌గా ఉన్నప్పుడే స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంటుంది. అందుకే నేను ఎప్పుడూ ఆనందంగా ఉంటా'' అని పేర్కొన్నారు సోనాక్షి.

నాలుగేళ్ల తర్వాత


● కంగనా రనౌత్


● రాజ్‌కుమార్ రావ్

కెరీర్ పరంగానే కాదు. యాక్టింగ్‌వైజ్‌గా కూడా కంగనా రనౌత్‌ను నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్లిన సినిమా 'క్వీన్'. వికాశ్ బాల్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు విమర్శకుల ప్రసంశలూ దక్కాయి. ఈ సినిమాలో కీలక పాత్రలో రాజ్‌కుమార్ రావ్ నటించారు. ఇప్పుడు ఈ ఇద్దరు నాలుగేళ్ల తర్వాత నటించనున్నారు. సైకలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ సినిమాను దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు తనయుడు ప్రకాశ్ కోవెలమూడి దర్శకత్వంలో రూపొందనుందని బాలీవుడ్ టాక్. బొమ్మలాట, అనగనగా ఓ ధీరుడు, సైజ్ జీరో చిత్రాలను తెరకెక్కించారాయన. ఈ సినిమా షూటింగ్ మార్చిలో స్టార్ట్ కానుందని బీటౌన్ టాక్.

పౌరులకు సర్కారీ బోనస్!



వివిధ రూపాల్లో ముక్కుపిండి పన్నులు వసూలు చేయటమే కాదు.. పౌరులు బోనస్ ఇవ్వటంలోనూ సింగపూర్‌ది విలక్షణ శైలి. ఆ దేశ పౌరసత్వంతో పాటు 21 ఏళ్ల వయసుంటే చాలు ఈ బోనస్ పొందేందుకు అర్హత లభిస్తుంది. ఇదీకూడా సంపాదించే ఆదాయానికి బోనస్ లభించనుంది. తక్కువ ఆదాయమున్నవారికి ఎక్కువ బోనస్.. పెద్దమొత్తంలో ఆర్జించే వారికి తక్కువగా బోనస్ ఇవ్వబోతోంది. 2017లో దాదాపు పది బిలియన్ల సింగపూర్ డాలర్ల మిగులు బడ్జెట్ (దాదాపు రూ.49వేల కోట్లు) సాధించడంతో పౌరులకు ఈ కానుక ఇవ్వాలనుకుంటోంది. ప్రత్యేక సందర్భాల్లో డబ్బురూపంలో ఇచ్చే ఈ బహుమతిని స్థానిక భాషలో 'హాంగ్‌బావో' అని అంటారు. సింగపూర్ అభివృద్ధి ఫలాలు పౌరులకు అందాలనే తమ ప్రభుత్వ దీర్ఘకాల నిబద్ధతకు అనుగుణంగా ఈ బోనస్ చెల్లిస్తున్నట్లు ఆ దేశ ఆర్థికమంత్రి హెంగ్‌స్వీకీట్ ప్రకటించారు. – (సాక్షి నాలెడ్జ్ సెంటర్)

సింగపూర్‌లో మిగులు బడ్జెట్
ఆదాయం ఆధారంగా బోనస్ పంపకం

లాభం ఎంతెంత?
ఈ బోనస్ పొందేందుకు మొత్తం దేశవ్యాప్తంగా 27 లక్షల మంది అర్హులు. ఏడాదికి లక్షకు పైగా సింగపూర్ డాలర్లు సంపాదించే వారికి 100 డాలర్లు, 28 వేల డాలర్ల నుంచి లక్ష డాలర్ల దాకా ఆర్జించే వారికి 200 డాలర్లు, 28 వేల డాలర్లు అంత కంటే తక్కువ ఆదాయం వచ్చే వారికి 300 సింగపూర్ డాలర్ల వరకు అందజేస్తారు. 2018 చివరికల్లా ఈ బోనస్‌లు చెల్లిస్తారు.

జీఎస్టీ పెంపు.. పరిశ్రమలకు వాత
బడ్జెట్ మిగులులో దాదాపు సగం (5 సింగపూర్ బిలియన్ డాలర్లు) రైల్వే మౌలికసదుపాయాల నిధికోసం పక్కనపెడుతున్నారు. మిగిలినదాంట్లో 2 మిలియన్ డాలర్లను వయోజనులు, వికలాంగుల బీమా ప్రీమియం కోసం ఖర్చుచేస్తారు. అయితే.. ఓ వైపు బోనస్‌తో పాటు జీఎస్టీని 7 నుంచి 9శాతానికి (2021–25 మధ్య కాలంలో అమలు) పెంచనున్నట్లు ప్రభుత్వం ప్రకటించటం కాస్తంత చేదువార్తే. అటు, వాతావరణ మార్పు, సముద్రమట్టం పెరగడం వల్ల సింగపూర్‌కు జరిగే నష్టనివారణ కోసం 25 వేల టన్నులకు పైబడి కర్బన ఉద్గారాలు వదిలే పరిశ్రమలపై టన్నుకు 5 సింగపూర్ డాలర్ల 'కార్బన్ టాక్స్'ను (2019–23 మధ్య కాలంలో) సైతం విధిస్తారు.

విశాఖ నగరంలో బస్సు బోల్తా

17 మందికి స్వల్పంగా, అయిదుగురికి తీవ్రంగా గాయాలు


లారీ ఢీకొట్టడంతో బోల్తా పడిన బస్సు

ఎన్‌ఏడీ జంక్షన్ (విశాఖ పశ్చిమం): విశాఖ ఎన్‌ఏడీ జంక్షన్‌లో బుధవారం ఘోర ప్రమాదం తప్పింది. ప్రైవేటు ట్రావెల్ బస్సును టిప్పర్ లారీ ఢీ కొట్టడంతో బస్సు బోల్తా పడింది. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఎయిర్‌పోర్ట్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 4.20 గంటల సమయంలో విజయవాడ నుంచి రాజాం వెళ్తున్న వెంకటరమణ ట్రావెల్స్ బస్సు ఎన్‌ఏడీ జంక్షన్ దాటుతుండగా పోర్టు నుంచి వస్తున్న టిప్పర్ లారీ బస్సు వెనుక భాగంలో ఢీకొట్టింది. దీంతో బస్సు బోల్తాపడింది. ఆ సమయాంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. 22 మందికి గాయాలయ్యాయి. వీరిలో తీవ్రగాయాలైన కీసంగి సరోజిని, సీతామహాలక్ష్మి, కోట జయప్రకాశ్, తమ్మి సంతోశ్, గౌతమ్ కుమార్‌లను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మిగిలిన 17 మంది ప్రాథమిక చికిత్స అనంతరం స్వగ్రామాలకు వెళ్లిపోయారు. కాగా లారీ డ్రైవర్ పోలిన చిన్నఅప్పన్నపై గతంలో కూడా కేసు నమోదైందని ఎయిర్‌పోర్ట్ స్టేషన్ సీఐ మళ్ల శేషు తెలిపారు.

గుంటూరు జిల్లాలో వృద్ధురాలి సజీవ దహనం

షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైన పూరిల్లు

పొన్నూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పులు చెలరేగి పూరిల్లు దగ్ధమై అందులో నిద్రిస్తున్న వృద్ధురాలు సజీవదహనం అయింది. గుంటూరు జిల్లా పొన్నూరు మండల పరిధిలోని ఉప్పరపాలెంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. ఉప్పరపాలెంకు చెందిన ముద్రబోయిన తిరుపతమ్మ(80) తన కుమార్తె భూలక్ష్మితో కలసి నివసిస్తోంది. భూలక్ష్మి కూలిపనులకు వెళ్లేందుకు బుధవారం తెల్లవారుజామునే లేచి పక్కనే ఉన్న సోదరుడి ఇంటికి వెళ్లింది. ఇంతలో ఒక్కసారిగా మంటలు రావడంతో చుట్టుపక్కల వారు వెళ్లేసరికి పూరిల్లు పడిపోయింది. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో పూరిల్లు దగ్ధమై అందులోని వృద్ధురాలు సజీవ దహనమైయింది. వృద్ధురాలు మంటల్లో కాలిపోతూ చేసిన ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25న రాష్ట్ర యాదవ యువగర్జన

భవానీపురం(విజయవాడ పశ్చిమ): అఖిల భారతీయ యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 25న రాష్ట్ర యాదవ యువగర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కోస్తా జిల్లాల యాదవ్ యూత్ కన్వీనర్ దూది బ్రహ్మయ్య యాదవ్ తెలిపారు. ఊర్మిళానగర్‌లో బుధవారం విలేకరులతో ఆయన యువగర్జన వివరాలను వెల్లడించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 25న ఉదయం 9 గంటలకు యువగర్జన జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 75 లక్షల మంది జనాభా కలిగిన యాదవ సామాజికవర్గానికి ఏ ప్రభుత్వం వచ్చినా సరైన న్యాయం జరగటం లేదని అన్నారు. ఈ యువగర్జన ద్వారా యాదవ యువత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లటమే తమ ఉద్దేశమన్నారు. రాష్ట్ర రాజధానిలో యాదవ భవన్ నిర్మించాలని, జిల్లా కేంద్రాల్లో యాదవ విద్యార్థులకు హాస్టల్ భవనాలు నిర్మించాలన్నారు. విదేశాలు వెళ్లి చదువుకోవాలనుకునే విద్యార్థులకు పది లక్షలు ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. అనంతరం యాదవ యువగర్జన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో మల్లిబోయిన కొండ, వాసుదేవ్, కొనికి కొండ, వెంకటేశ్వర్లు(టైలర్), రాంబాబు, కాకు బాలనారాయణ, దొండపాటి బ్రహ్మం, దాసరి రామకృష్ణ, బాజీ యూత్ పాల్గొన్నారు.



ఎర్రచందనం చెట్లు విస్తరించిన అటవీ ప్రాంతం

జిల్లా	వైఎస్సార్	వైఎస్సార్	వైఎస్సార్	చిత్తూరు	చిత్తూరు	నెల్లూరు	ప్రకాశం	మొత్తం
డివిజన్	కడప	ప్రొద్దుటూరు	రాజంపేట	తిరుపతి	చిత్తూరు తూర్పు	నెల్లూరు	గిద్దలూరు	7
విస్తీర్ణం (హెక్టార్లలో)	1,32,661	92,910	1,42,106	83,471	38,807	67,117	26,391	5,83,463

ఫోర్స్ లేని టాస్క్‌ఫోర్స్!

- శేషాచలంలో ఆగని ఎర్రచందనం అక్రమ రవాణా
- యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్‌లో సగం ఖాళీలు
- ప్రతిపాదనలకే పరిమితమైన సాయుధ బేస్ క్యాంపులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎర్ర చందనం అక్రమ రవాణాను కట్టడి చేశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ గణాంకాలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. ఎర్రచందనం స్మగ్లింగ్ యథేచ్ఛగా కొనసాగుతూనే ఉందని క్షేత్రస్థాయి అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. చిత్తూరు జిల్లాలోని శేషాచలం అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు భారీ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. అటవీశాఖ అధికారుల రాకపోకలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు పరిసర గ్రామాల ప్రజలను ఇన్‌ఫార్మర్లుగా వాడుకుంటున్నారు. ఫలానా ప్రాంతం నుంచి ఫలానా వారు వస్తున్నారనే సమాచారం ఇన్‌ఫార్మర్ల ద్వారా స్మగ్లర్లకు వెంటనే తెలిసిపోతోంది. దీంతో వారు సులువుగా తప్పించుకుంటున్నారు. స్మగ్లర్లు సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకుంటూ విలువైన ఎర్రచందనాన్ని కొల్లగొడుతుండగా, ప్రభుత్వం మాత్రం అటవీశాఖకు అవసరమైన సిబ్బందిని కూడా నియమించడం లేదు. సర్కారు నిర్లక్ష్య వైఖరి వల్ల ఎర్రచందనం రక్షణ గాలిలో పెట్టిన దీపం చందంగా మారింది.

అటవీ సిబ్బందిపై దాడులు
రెడ్ శాండల్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్(ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్)ను ఏర్పాటు చేసిన తర్వాత ఎర్రచందనం స్మగ్లింగ్ తగ్గిందని ప్రభుత్వం చెబుతోంది. ఇది ఏర్పాటైన తర్వాత కూడా నిత్యం వందలాది మంది కూలీలు శేషాచలం అడవుల్లోకి వెళ్లి ఎర్రచందనం చెట్లను నరికేసి, దుంగలను తరలిస్తున్నారు. గస్తీ కోసం వెళ్లిన అటవీశాఖ సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్‌ను పటిష్టం చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. టాస్క్‌ఫోర్స్‌లో 463 మంది సిబ్బందిని నియమించాలని ప్రభుత్వమే నిర్ణయించింది. ప్రస్తుతం 247 మంది మాత్రమే ఉన్నారు. మరో 216 ఖాళీలు ఉన్నాయి. సగం సిబ్బందితో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నియంత్రించలేకపోతున్నామని ఉన్నతాధికారులు వాపోతున్నారు. శేషాచలం అడవుల్లో 10 సాయుధ బేస్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ఇందుకోసం 605 మందిని నియమించాలని అటవీ శాఖ చేసిన ప్రతిపాదనకు ఇంకా మోక్షం లభించడం లేదు.

ఎర్రచందనం నరికివేత కేసులు, సీజ్ చేసిన కలప (క్వింటాళ్లలో)

సంవత్సరం	కేసులు	సీజ్ చేసిన కలప	సీజ్ చేసిన వాహనాలు	అరెస్టు అయినవారి సంఖ్య
2011-12	1,556	1,437.17	985	2,658
2012-13	1,488	1,389.58	1,002	3,139
2013-14	2,058	1,889.20	1,566	4,345
2014-15	1,385	918.49	994	3,952
2015-16	753	355.65	480	2,587
2016-17	911	487.63	705	3,344
2017-18	322	106.69	221	905

(2017-18 సంవత్సరం గణాంకాలు గతేడాది ఆగస్టు ఒకటో తేదీ వరకూ)



హోమియో మందులూ రోడ్డుపాలు!

- రాత్రికి రాత్రి గప్‌చుప్‌గా పారబోసిన సిబ్బంది
- ప్రభుత్వ డాక్టర్ల 'ప్రైవేట్' సేవ కారణం
- ప్రభుత్వ హోమియో కళాశాలల్లో దారుణ పరిస్థితి



సాక్షి, అమరావతి: ఇప్పటికే కోట్లాది రూపాయల విలువైన అల్లోపతి మందులు కాలం చెల్లిపోవడంతో పారబోశారు. తాజాగా హోమియో మందులదీ అదే పరిస్థితి. ఓ వైపు మందుల్లేక రోగులు నానా అగచాట్లు పడుతుంటే.. మరోవైపు.. రాష్ట్రంలోని హోమియో కళాశాలలో మందులన్నీ కాలం చెల్లిపోవడంతో వాటిని రాత్రికి రాత్రి పారబోసిన సంఘటన ఆరోగ్య శాఖలో ఇప్పుడు కలకలం రేపుతోంది. ప్రభుత్వ హోమియో డాక్టర్ల 'ప్రైవేట్' సేవే ఇందుకు కారణంగా తెలుస్తోంది. రాష్ట్రంలో కడప, రాజమండ్రి, గుడివాడల్లో ప్రభుత్వ హోమియో కళాశాలలున్నాయి. వీటికి అనుబంధంగా ఆస్పత్రులూ ఉన్నాయి. ఇక్కడికి రోజూ వందలాది మంది రోగులు వస్తుంటారు. వీరి కోసం ఏటా కోట్ల రూపాయల విలువ చేసే మందులు సరఫరా అవుతాయి. కానీ, మందులన్నీ కాలం చెల్లిపోవడంతో ఈ ఏడాది వాటిని గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రి పారబోశారు. గత నాలుగేళ్లుగా ఈ మందులను సరిగా వాడకపోవడంతో మందులు మిగిలిపోయినట్లు సమాచారం. ఇటీవలే కొత్తగా వచ్చిన ఆయుష్ కమిషనర్ ఫార్మసీ స్టోర్లకు వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఆయా హోమియో కళాశాలల ప్రిన్సిపాళ్లు ఉన్నపళంగా ఈ మందులను పారబోశారు.

'ప్రైవేట్'కు సిఫారసు చేస్తుండడంవల్లే..
ఇదిలా ఉంటే.. కడప, రాజమండ్రి, గుడివాడ కళాశాలల్లో ఎక్కువ మంది హోమియో వైద్యులకు ప్రైవేటు ప్రాక్టీస్‌లు ఉన్నాయి. వీరందరూ ప్రభుత్వ హోమియో ఆస్పత్రికి వచ్చే రోగులకు అక్కడి మందులు ఇవ్వకుండా సొంత క్లినిక్‌లకు పంపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రైవేటు హోమియో స్టోర్లకు సిఫారసు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వాస్పత్రులకు సరఫరా అయిన మందులు నిరుపయోగంగా మిగిలిపోయి కాలం చెల్లిపోతున్నాయి. ముఖ్యంగా కడప హోమియో కళాశాలలో వైద్యులు ఆస్పత్రికి సరిగ్గా రాకుండా సొంత క్లినిక్‌కే ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కువ శాతం మందులు కూడా ఇక్కడే కాలం చెల్లిపోయాయి. ఇక్కడ కొంతమంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు అవినీతికి పాల్పడుతున్నా ప్రిన్సిపాల్ కనీస చర్యలు కూడా తీసుకోవడంలేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఎప్పటి నుంచో అలా ఉంచేశారు..

ఇది సూపరింటెండెంట్‌ల నిర్లక్ష్యమే. ఎప్పట్నుంచో అలాగే స్టాకు ఉంచారు. ఇవన్నీ (గ్లోబిల్స్) రంగు మారిపోయాయి. దీంతో వాటిని బయటపడేయాలని చెప్పాం. లేని మందులు రాయొద్దని డాక్టర్లకు సూచించాం. అసలే మాకు బడ్జెట్ తక్కువ. మందులు బయటకు రాయడం నా దృష్టికి రాలేదు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.
– డా. సురేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్, కడప ప్రభుత్వ హోమియో కళాశాల

మేం ఉత్తర్వులిచ్చే వరకు హిందూయేతర ఉద్యోగులను తొలగించవద్దు

టీటీడీ ఈవోకు హైకోర్టు ఆదేశం.. మధ్యంతర ఉత్తర్వులు జారీ



సాక్షి, హైదరాబాద్: తిరుమల, తిరుపతి దేవస్థానాలతో పాటు, ఆ దేవస్థానాల ఆర్థిక సాయంతో నడిచే దేవాలయాలు, ఆసుపత్రులు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న హిందూయేతర ఉద్యోగులను తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకు తొలగించవద్దని హైకోర్టు బుధవారం టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)ను ఆదేశించింది. అయితే ఈవో జారీ చేసిన షోకాజ్ నోటీసులకు మాత్రం సమాధానం ఇవ్వాలని హిందూయేతర ఉద్యోగులకు స్పష్టం చేసింది. ఈవో జారీ చేసిన షోకాజ్ నోటీసుల చట్టబద్ధతపై తరువాత లోతుగా విచారణ జరుపుతామంది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. టీటీడీ పరిధిలో హిందూయేతరులను ఏ పోస్టుల్లో కూడా నియామించడానికి వీల్లేదంటున్న టీటీడీ ఉద్యోగుల సర్వీసు నిబంధనల్లోని రూల్ 9(6)ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించడంతో పాటు, ఈ రూల్ కింద హిందూయేతరులమైన తమకు టీటీడీ జారీ చేసిన షోకాజ్ నోటీసులను రద్దు చేయాలని కోరుతూ టీటీడీ పరిధిలో వివిధ పోస్టుల్లో పనిచేస్తున్న 36 మంది క్రిస్టియన్, ముస్లిం ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా టీటీడీ తరపు న్యాయవాది వై.బాలాజీ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు ఉద్యోగాల్లో చేరేటప్పుడు హిందూయేతర మతాల ప్రచారం చేయబోమని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ హామీకి బద్దులై ఉండేలా పిటిషనర్లను ఆదేశించాలని కోరారు. ఇందుకు ధర్మాసనం తిరస్కరిస్తూ... ఆ పని తాము ఎందుకు చేయాలని ప్రశ్నించింది. హామీ ఇచ్చింది టీటీడీకి కాబట్టి, ఉల్లంఘనలకు పాల్పడితే టీటీడీనే చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే టీటీడీ చర్యలు సమర్థించే విధంగా లేవని ధర్మాసనం స్పష్టం చేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకు పిటిషనర్లను వారి వారి ఉద్యోగాల నుంచి తొలగించవద్దని టీటీడీ ఈవోను ఆదేశించింది. ఈ మొత్తం వ్యవహారంపై కౌంటర్లు దాఖలు చేయాలని దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి, టీటీడీ ఈవోలను ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదం

వైఎస్సార్ జిల్లా వాసులు సహా 9 మంది మృతి


కనిమెట్ట హైవేపై ప్రమాదానికి గురైన కారు. చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు

సాక్షి, వనపర్తి: తెలంగాణలోని వనపర్తి జిల్లా కనిమెట్ట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 9 మంది మరణించారు. ఈ ఘటన 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగింది. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్లకు చెందిన ఆంజనేయులు(35), మదనాపురం మండలం అజ్జకొల్లుకు చెందిన పత్తోల్ల రాజు(34), అమరచింత మండలం మస్తీపూర్‌కు చెందిన కుర్వ మల్లేశ్(28), మొగిలయ్య, నందిమల్ల గ్రామానికి చెందిన నరేశ్(25)లు హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో ఉంటున్నారు. తమ బంధువైన మూలమల్ల గ్రామానికి చెందిన కుర్వ బుడ్డమ్మ కుమారుడు శ్రీకాంత్ వివాహానికి హాజరయ్యేందుకు మరో బంధువైన బీరప్ప(24) కారు(మహీంద్రా వెరిటో)లో హైదరాబాద్ నుంచి బయల్దేరారు. పెళ్లి ముహూర్తం 8 గంటలకే ఉండడంతో త్వరగా చేరుకోవాలన్న ఆత్రుతలో వేగంగా వస్తున్నారు. మరోవైపు హైదరాబాద్ బడంగ్‌పేటలో వ్యాపారం చేస్తున్న కడపకు చెందిన సూరిబాబు(52).. తన మేనత్త ప్రసూన మనవడు సాయి వివాహం ఈ నెల 20న కర్నూలు జిల్లా కల్లూరులో జరగ్గా.. దానికి భార్య సునీత, కుమార్తె కల్పన, అత్త రాజమ్మ (అనంతపురం జిల్లా పూలకుండ్ల మండలం మేకల చెరువు గ్రామం)తో కలసి హాజరయ్యారు. వారు కూడా ఉదయాన్నే తమ కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామశివారు వద్ద ఆంజనేయులు బృందం కారు (మహీంద్రా వెరిటో) అదుపుతప్పి అత్యంత వేగంతో డివైడర్ ఎక్కి.. అవతలివైపు రోడ్డులో ఎదురుగా వస్తున్న సూరిబాబు కారును ఢీకొట్టింది. దీంతో రెండు కార్లూ నుజ్జునుజ్జయ్యాయి. మహీంద్రా వెరిటో వాహనంలో ఉన్న ఆంజనేయులు, రాజు, మల్లేశ్, బీరప్పతోపాటు రెనాల్ట్ కారులో ఉన్న సూరిబాబు, ప్రసూన, రాజమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. సునీత, కల్పన, నరేశ్, మొగిలయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. సునీత ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందగా.. నరేశ్ చికిత్స పొందుతూ మరణించాడు. మొగిలయ్య, కల్పనల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

● తెలంగాణ

ఏ మూలకైనా 'వల' వేస్తాం!

ఎఫ్ఎస్ఓసీతో సాధ్యమే: గూగుల్ 'ఎక్స్' డైరెక్టర్ టామ్ మూర్

సాక్షి, హైదరాబాద్: గూగుల్.. సంచలనాలకు పెట్టింది పేరు. టెక్నాలజీని కొత్త పుంతలు తొక్కిస్తూ అందరికీ నిత్యావసరంగా మారిన ఈ సంస్థ ఇంకో అద్భుత విజయం సాధించింది. ప్రపంచంలో ఏమూలలో ఉన్న వారికై నా.. చిటికెలో మొబైల్, ఇంటర్నెట్ కనెక్షన్లను అందించేందుకు వినూత్న టెక్నాలజీని అభివృద్ధి చేసింది. హైదరాబాద్‌లో జరుగుతున్న వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో భాగంగా బుధవారం 'కనెక్టింగ్ ద నెక్స్ట్ బిలియన్' పేరుతో ఓ కార్యక్రమం జరిగింది. ఇందులో గూగుల్ అనుబంధ సంస్థ 'ఎక్స్' డైరెక్టర్ టామ్ మూర్ స్వయంగా వెల్లడించిన ఈ కొత్త టెక్నాలజీ వివరాలు.. 'ప్రపంచంలో వీలైనంత ఎక్కువ మందికి ఇంటర్నెట్‌ను అందుబాటులోకి తేవాలని గూగుల్ చాలాకాలంగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే రెండేళ్ల క్రితం మేం భారీసైజు గాలి బుడగల్లో కొన్ని పరికరాలను ఉంచి ఇంటర్నెట్‌ను ప్రసారం చేయాలని ఒక ప్రాజెక్టు చేపట్టాం. ప్రయోగాలన్నీ విజయవంతంగానే సాగాయి. అయితే ఈ ప్రాజెక్టుల్లో భాగంగా మేం గాలి బుడగల్లో వాడిన ఓ పరికరం మా ఆలోచనలకు పదును పెట్టింది. ఒక బెలూన్ ఇంకోదాన్ని గుర్తించేందుకు, సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు వాడే ఈ పరికరం లేజర్ల సాయంతో పని చేస్తుంది. ఆకాశంలో విజయవంతంగా సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు వీలు కల్పించిన ఈ 'ఫ్రీ స్పేస్ ఆప్టికల్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీని భూమ్మీద వాడితే ఎలా ఉంటుందన్న ఆలోచనలు మొదలయ్యాయి. పరీక్షించి చూద్దామని శాన్‌ఫ్రాన్సిస్కో బేలో గతేడాది చిన్న ప్రయోగం చేశాం. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న రెండు ఎత్తైన భవనాలపై రెండు ఎఫ్ఎస్ఓసీలు బిగించి పరీక్షించాం. సెకనుకు కొన్ని గిగాబైట్ల సమాచారం ప్రసారం చేయవచ్చని, అందుకోవచ్చని తేలింది. ఈ పరికరాలకు బదులుగా ఫైబర్ ఆప్టిక్ కేబుల్‌ను వాడాల్సి వస్తే.. భారీగా కేబుల్ వేయాల్సి వచ్చేది. గోతులు తవ్వడం, కేబుల్ వేయడం వంటి అన్ని పనులకు బోలెడంత ఖర్చయ్యేది. నెలల సమయం పట్టేది. ఇవేవీ లేకుండానే 2 గంటల సమయంలోనే మేం ఆ పని చేయగలిగాం.

చాపరాయిలోనూ సక్సెస్
ఎఫ్ఎస్ఓసీలతో అతితక్కువ సమయంలో ఎక్కడైనా ఇంటర్నెట్ కనెక్షన్ ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించవచ్చని స్పష్టమైన తర్వాత ఆ సంస్థ ఉన్నతోద్యోగి ఒకరు.. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా చాపరాయిలోనూ డిజిటల్ వెలుగులు దీన్ని పంచేందుకు ఉపయోగించారు. అడవి మధ్యలో అభివృద్ధికి దూరంగా ఉన్న ఈ గ్రామానికి నాలుగంటే నాలుగు వారాల్లో పూరిస్థాయిలో కనెక్టివిటీ సాధించగలిగాం. ఈ ప్రాజెక్టు విజయవంతమైన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం రెండు వేల ఎఫ్ఎస్ఓసీల కొనుగోలుకు సిద్ధమైంది. అన్నీ సవ్యంగా సాగితే సమీప భవిష్యత్తులో భారత్‌లోని మారుమూల ప్రాంతాలకూ ఇంటర్నెట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం'

కేసీఆర్ సోదరి విమలమ్మ మృతి

- ఆనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- కన్నీటి పర్యంతమైన సీఎం


సోదరి పార్థివ దేహం వద్ద రోదిస్తున్న సీఎం

హైదరాబాద్: సీఎం చంద్రశేఖర్‌రావు రెండో సోదరి విమలమ్మ (83) కన్నుమూశారు. అనారోగ్యంతో యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్ అల్వాల్‌లోని నివాసానికి పార్థివదేహాన్ని తరలించారు. మధ్యాహ్నం సీఎం కేసీఆర్, ఎంపీ కవిత, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు విమలమ్మకు నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ తిరుమలగిరిలోని స్వర్గవాటికలో విమలమ్మ అంత్యక్రియలు జరిగాయి.

కన్నీటి పర్యంతమైన కేసీఆర్
కాన్వాయ్‌లో నుంచి దిగి సోదరి పార్థివదేహం వద్దకు రాగానే కేసీఆర్ ఒక్కసారిగా ఉద్వేగానికిలోనై కన్నీటి పర్యంతమయ్యారు. పక్కనే ఉన్న కుటుంబ సభ్యులు ఆయన్ను ఓదార్చారు. కేసీఆర్‌కు ఎనిమిది మంది సోదరీమణులు, ఒక సోదరుడు కాగా వీరిలో ఓ సోదరి, అన్న మరణించారు. విమలమ్మకు కేసీఆర్ అంటే అమితమైన ప్రేమని, ఏటా రాఖీ కట్టేదని కుటుంబ సభ్యులు చెప్పారు.

మనూలో ఉచిత యూజీసీ, నెట్ కోచింగ్

హైదరాబాద్: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూజీసీ నెట్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో యూజీసీ, నెట్/జేఆర్ఎఫ్ పరీక్షల కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ పొందడానికి నాన్ క్రీమీలేయర్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు అర్హులుగా గుర్తించారు. శిక్షణ పొందడానికి మార్చి 5న ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. ఫలితాలను 8న ప్రకటించి, శిక్షణ తరగతులను మార్చి 12 నుంచి ప్రారంభిస్తారు. ప్రవేశ పరీక్ష కోసం గచ్చిబౌలిలోని వర్సిటీ క్యాంపస్‌లోని సీఎస్ఈ కోచింగ్ అకాడమీలో దరఖాస్తులు స్వీకరించి, పూర్తి చేసి మనూ హైదరాబాద్ పేరిట రూ.200 డీడీని మార్చి 5 లోపు తీసి దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముగిసిన సంబురం

- 3 రోజులపాటు ఘనంగా జరిగిన ప్రపంచ ఐటీ కాంగ్రెస్
- ఆతిథ్యంతో ఐటీ ప్రపంచాన్ని ఆకట్టుకున్న భాగ్యనగరం

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఐటీ సమ్మేళన సంబురం ముగిసింది. రాష్ట్ర పారిశ్రామిక యవనికపై ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోయింది. వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలియెన్స్ (డబ్ల్యూఐటీఎస్ఏ), నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ప్రపంచ ఐటీ కాంగ్రెస్ బుధవారం ఘనంగా ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆతిథ్యం.. ప్రపంచ ఐటీ పరిశ్రమల సీఈఓలు, ఎగ్జిక్యూటివ్‌లు, మేధావులను సమ్మోహనపరిచింది. పరిశ్రమల ఒలంపిక్స్‌గా పేరుగాంచిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌కు 40 ఏళ్ల చరిత్ర ఉండగా, 22వ సదస్సును దేశంలో నిర్వహించారు. గత సదస్సులతో పోల్చితే ఈసారి అత్యధిక మంది ఐటీ రంగ ప్రతినిధులు హాజరయ్యారని, అత్యంత ఘనంగా నిర్వహించారని సదస్సు ముగింపు కార్యక్రమంలో వక్తలు రాష్ట్ర ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు మాట్లాడుతూ, సదస్సు విజయవంతానికి కృషి చేసిన డబ్ల్యూఐటీఎస్ఏ, నాస్కామ్ ప్రతినిధి బృందాలకు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేసిన పరిశ్రమలు, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు కూడా ఐటీ రంగంలో వృద్ధి సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అర్మేనియాలో తదుపరి సదస్సు
వచ్చే ఏడాది అక్టోబర్ 6వ తేదీ నుంచి 9 వరకు అర్మేనియాలో ప్రపంచ ఐటీ కాంగ్రెస్ 23వ సదస్సును నిర్వహిస్తామని డబ్ల్యూఐటీఎస్ఏ ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ ఐటీ, పరిశ్రమల ప్రతినిధులు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా బాటన్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో డబ్ల్యూఐటీఎస్ఏ చైర్మన్ ఇవాన్ చియు, ప్రధాన కార్యదర్శి జిమ్ పైసంట్, నాస్కామ్ చైర్మన్ రమణ్ రాయ్, అధ్యక్షులు ఆర్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు 30 దేశాల నుంచి ఐటీ రంగానికి చెందిన 2 వేల మంది దార్శనికులు, పరిశ్రమలు, ప్రభుత్వాల సారథులు, విద్యావేత్తలు హాజరయ్యారు. టాప్ 500 ఐటీ కంపెనీల నుంచి కనీసం 20 మంది సీఈఓలు, మరో 100 మంది ఎగ్జిక్యూటివ్‌లు వీరిలో ఉన్నారు. ఈ సదస్సులో 50కి పైగా చర్చాగోష్టిలు (సెషన్లు), మరో 50కి పైగా అత్యాధునిక ఐటీ రంగ ఉత్పత్తులపై ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈనెల 20న మానవ రూప రోబో సోఫియా చేసిన ప్రసంగం, ఇంటర్వ్యూ సదస్సుకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

తైవాన్‌తో ఒప్పందం
సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం మార్పిడి చేసుకునేందుకు తైవాన్‌లోని టాయుఆన్ (Taoyuan) నగరంతో రాష్ట్ర ప్రభుత్వం పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. పెట్టుబడులను ఆకట్టుకోవడం, పరిపాలనలో సాంకేతిక సహకారం, స్టార్టప్‌లకు మద్దతు, విద్యా సంస్థలతో ఒప్పందాలు, అత్యాధునిక సాంకేతిక ఉత్పత్తులపై ప్రదర్శనల ఏర్పాటు విషయంలో పరస్పర సహకారం కోసం మంత్రి కేటీఆర్ సమక్షంలో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.

రాంగోపాల్‌వర్మను తక్షణం అరెస్టు చేయాలి

విశాఖలో మహిళా సంఘాల నిరసన



జీవీఎంసీ గాంధీ పార్కులో నిరాహారదీక్ష చేస్తున్న మహిళా సంఘాలు

ద్వారకానగర్ (విశాఖ దక్షిణ): సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మను తక్షణమే అరెస్ట్ చేయాలని కోరుతూ మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ పార్కులో మహిళా సంఘాలు 48 గంటల నిరహార దీక్ష చేపట్టాయి. తెలంగాణ సామాజికవేత్త దేవి మహిళా సంఘాల ప్రతినిధులకు పూలమాలలు వేసి దీక్ష ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాంగోపాల్‌వర్మ చేతలు, వాఖ్యలు శిక్షింపదగినవని ఇండియన్ పీనల్ కోడ్ చెబుతోందన్నారు. లైంగిక స్వేచ్ఛ మహిళలకు కావాలని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న రాంగోపాల్‌వర్మను అరెస్ట్ చేసి తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. అతనిపై విశాఖ పోలీసులు కేసు నమోదు చేయాలన్నారు. మహిళా సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు మణి, లక్ష్మి, విమల, మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ మాట్లాడుతూ, మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వర్మ వ్యాఖ్యానాలు చేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మహిళాలపై దాడులు, చిన్నారులపై హత్యలు, యువతులపై అత్యాచారాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు శ్రీదేవి వర్మ, షబీరా బేగం, శశికళ, పీవోడబ్ల్యూ నేతలు, పలు సంఘాల మహిళలు పాల్గొన్నారు. కాగా, వర్మపై ఐద్వా మహిళా సంఘం నాయకురాలు మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీజోన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

గ్రామీణ వైద్యులకు న్యాయం చేయండి

మంత్రి కామినేనికి పలువురు వైద్యుల విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యులకు ఇన్‌సర్వీస్ పీజీ వైద్యసీట్ల కేటాయింపులో న్యాయం చేయాలని పలువురు వైద్యులు కోరారు. ప్రభుత్వ వైద్యుల రాష్ట్ర కార్యదర్శి డా.జయధీర్ ఆధ్వర్యంలో వైద్యులు బుధవారం వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్‌ను కలిశారు. పీజీ వైద్య సీట్ల విషయంలో జాతీయ పూల్‌లో చేరకముందు 33 శాతం ఇన్‌సర్వీస్ కోటా ఉండేదని, ఇప్పుడు 50 శాతం సీట్లు వెళ్లడంతో గ్రామీణ ప్రాంత వైద్యులకు అన్యాయం జరుగుతోందని వివరించారు. ఇన్‌సర్వీస్ కోటా ఉందనే ఉద్దేశంతో వైద్యులు గ్రామాల్లో పనిచేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని మంత్రి కామినేని హామీ ఇచ్చినట్టు డాక్టర్ జయధీర్ తెలిపారు.

'విద్యుత్' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విద్యుత్ మంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ



సాక్షి, అమరావతి: విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. ఈ మేరకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కె.కళావెంకట్రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. విద్యుత్ రంగంలో మూడంచెల కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను, ఉద్యోగులను విద్యుత్ సంస్థల్లో విలీనం చేసి, డైరెక్ట్ వేతన విధానం అమలు చేయాలని కార్మికులు ఆందోళన చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి వారిని ఆదుకోవాలని రామకృష్ణ కోరారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి చేయండి

అధికారులకు మంత్రి మాణిక్యాలరావు ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు మంత్రి పైడికొండల మాణిక్యాలరావు ఆదేశించారు. తాత్కాలిక సచివాలయంలోని తన చాంబర్‌లో బుధవారం మంత్రి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాఖలోని సమస్యలపై దృష్టిసారించి పరిష్కారం చూపాలని కోరారు. రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అర్చకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి మాణిక్యాలరావుకు ఏపీ అర్చక సమాఖ్య ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు తాత్కాలిక సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. మార్చి మొదటి వారంలో అధికారులు, అర్చక సమాఖ్య ప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

పది రోజుల్లో న్యాయం జరిగేలా చూస్తా

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పది రోజుల్లో పరిష్కరిస్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు.. నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలకు హామీ ఇచ్చారు. బుధవారం ఎన్‌ఎంయూ నేతలు చంద్రయ్య, రమణారెడ్డి, శ్రీనివాసరావు మంత్రిని కలిసి గురువారం ఆర్‌ఎంల కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చామని చెప్పారు. అయినా యాజమాన్యం స్పందించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. పది రోజుల గడువు ఇవ్వాలని, ఈలోగా కార్మికుల ప్రధాన డిమాండ్లపై చర్చించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

హోదా ఇవ్వకుంటే ఒకే రాష్ట్రం చేయండి

బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్

హైదరాబాద్: ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ విలేకరులతో ఆయన మాట్లాడారు. విభజన హామీలను నెరవేర్చలేనప్పుడు మళ్లీ రెండు తెలుగు రాష్ట్రాలను ఒకటిగా కలపాలని కోరారు. ప్రత్యేక హోదాను సాధించాల్సిన టీడీపీ ప్రజలను నిలువునా ముంచేసిందని అన్నారు. అస్సాం, నాగాలాండ్, జమ్మూకాశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, ఉత్తరాఖండ్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాలకు ఇచ్చిన కేంద్రం ఏపీకి ఎందుకు ఇవ్వలేకపోతోందని ప్రశ్నించారు.

వేరుపడినా...
కొత్త రేషన్‌కార్డు ఇవ్వరట!



- స్ప్లిట్ కార్డుల కోసం 4.11 లక్షల దరఖాస్తులు
- అనుమతి ఇవ్వొద్దని సీఎం చంద్రబాబు ఆదేశం
- పింఛన్ల కోసమే విడిపోతున్నారని వెల్లడి
- ఒకే కార్డు వల్ల కుటుంబాల్లో చెలరేగుతున్న గొడవలు

సాక్షి, అమరావతి: ఉమ్మడి కుటుంబంలోని సభ్యులు విడిపోతే ప్రత్యేకంగా తెల్ల రేషన్‌కార్డు పొందడం కష్టతరంగా మారింది. ఉమ్మడిగా తీసుకున్న రేషన్‌కార్డులో.. విడిపోయిన కుటుంబ సభ్యుల పేర్లను తొలగించి, మరో కార్డు ఇవ్వాలంటూ ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వృద్ధాప్య పింఛన్, వికలాంగుల పింఛన్ల కోసమే కుటుంబాలు విడిపోతున్నాయని, అందుకే కొత్త కార్డులు (స్ప్లిట్ కార్డులు) అడుగుతున్నారని, ఇలాంటి వారికి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

సరుకుల కోసం కుటుంబాల్లో గొడవలు

రాష్ట్రంలో ఉన్న రేషన్‌కార్డులు, అందులో నమోదైన సభ్యుల వివరాలను అధికారులు సేకరించారు. ఒక సభ్యుడున్న కార్డులు ఎన్ని, ఇద్దరు నుంచి 10 మంది సభ్యులున్న కార్డులు ఎన్ని అనే వివరాలను జిల్లాల వారీగా తెప్పించారు. స్ప్లిట్ కార్డులు ఇవ్వాలని క్షేత్రస్థాయిలో పలువురు తమపై ఒత్తిడి తెస్తున్నారని మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. రాష్ట్రంలో 1.42 కోట్ల తెల్ల రేషన్‌కార్డులుండగా, ఇందులో స్ప్లిట్ కార్డుల కోసం 4.11 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం కరుణించకపోవడంతో ఇవన్నీ పెండింగ్‌లోనే మూలుగుతున్నాయి. 5 నుంచి 10 మంది సభ్యులున్న కుటుంబాల నుంచే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. కుటుంబ సభ్యుల్లో రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ–పాస్ మిషన్‌లో ఎవరు ముందు వేలి ముద్రలు వేస్తారో వారికే డీలర్లు సరుకులు ఇచ్చేస్తున్నారు. దీంతో విడిపోయిన కుటుంబాల్లో సరుకుల కోసం గొడవలు జరుగుతున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని స్ప్లిట్ కార్డులు ఇచ్చి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

రాష్ట్రంలో సభ్యుల వారీగా ఉన్న రేషన్ కార్డుల వివరాలు

జిల్లా	మొత్తం కార్డులు	ఒక సభ్యుడున్న కార్డులు	ఇద్దరు సభ్యులున్న కార్డులు	ముగ్గురు సభ్యులున్న కార్డులు	నల్గురు సభ్యులున్న కార్డులు	5 నుంచి 10 మంది సభ్యులున్న కార్డులు
శ్రీకాకుళం	8,21,085	1,37,043	1,90,207	1,80,490	2,44,993	68,352
విజయనగరం	7,01,495	1,16,451	1,69,099	1,60,970	2,02,430	52,545
విశాఖపట్నం	11,94,094	2,17,540	2,85,356	2,70,064	3,30,623	90,511
తూర్పు గోదావరి	16,15,277	2,82,039	4,56,052	3,54,837	4,29,365	92,984
పశ్చిమ గోదావరి	12,11,757	2,02,156	3,48,863	2,68,882	3,32,185	59,671
కృష్ణా	12,38,626	2,16,289	3,49,069	2,65,199	3,35,764	69,305
గుంటూరు	14,31,549	2,89,898	3,88,763	2,98,694	3,60,942	93,252
ప్రకాశం	9,45,540	1,64,661	2,57,142	2,03,297	2,32,648	87,792
నెల్లూరు	8,66,478	1,91,943	2,35,926	1,86,121	1,99,927	52,561
కర్నూలు	11,53,165	1,74,639	2,69,937	2,40,027	2,97,131	1,71,431
వైఎస్సార్	7,61,846	1,20,783	1,97,241	1,71,423	1,84,062	88,337
అనంతపురం	11,95,329	1,63,256	2,73,347	2,70,825	3,43,495	1,44,406
చిత్తూరు	10,91,363	1,56,506	2,45,986	2,43,819	3,04,292	1,40,760
మొత్తం	1,42,27,604	24,36,204	36,66,988	31,14,648	37,97,857	12,11,907

ప్రత్యేక హోదాతోనే పారిశ్రామికాభివృద్ధి

- ఏపీడబ్ల్యూజేఎఫ్ రౌండ్ టేబుల్‌లో వక్తలు
- తెలంగాణ తరహాలో యువత, విద్యార్థులు ఉద్యమం చేపట్టాలి
- హోదా వచ్చేంత వరకు ప్రజా ఉద్యమాలు జరగాలి
- శాసన మండలిలో తీర్మానం చేసి పంపుతాం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

సూర్యారావుపేట (విజయవాడ సెంట్రల్): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు తెలంగాణ ఉద్యమం తరహాలో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని ప్రజాసంఘాలు, యువజన, విద్యార్థి సంఘాలు అభిప్రాయపడ్డాయి. ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు నెరవేర్చాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకుడు అమరయ్య అధ్యక్షతన బుధవారం స్థానిక ఎంబీ విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ... రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఉంటే నిధుల కోసం కేంద్రాన్ని అడుక్కోవాల్సిన పరిస్థితి ఉండదని, రాష్ట్రానికి కావాల్సిన నిధులను కేంద్రం ఖచ్చితంగా ఇచ్చి తీరుతుందని చెప్పారు. హోదా ఉంటేనే అన్ని పన్నులలో రాయితీలు వస్తాయని, రాయితీలు వస్తే పారిశ్రామికాభివృద్ధి చెంది ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. వచ్చే నెలలో జరిగే శాసనమండలి సమావేశాల్లో ప్రత్యేక హోదాపై తీర్మానం చేసి శాసనసభకు పంపుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇచ్చేంతవరకు ప్రజా ఉద్యమాలు కొనసాగించాలని సూచించారు.

విద్యార్థులు ఉద్యమించాలి

ప్రత్యేకహోదాపై చంద్రబాబు ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లాది విష్ణు విమర్శించారు. చంద్రబాబు చేతకానితనం వల్లనే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదా కోసం తెలంగాణ ఉద్యమం తరహాలో విద్యార్థులు ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ కృష్ణ జిల్లా కన్వీనర్ కంభంపాటి కృష్ణ చెప్పారు. ప్రత్యేక హోదా కోసం పార్లమెంట్ సభ్యులపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఐద్వా నాయకురాలు రమాదేవి తెలిపారు. రాజధాని నిర్మాణానికి, విద్యా సంస్థలకు అవసరమైన నిధులను, ఇప్పటివరకు కేంద్ర వచ్చిన నిధులను ప్రత్యేక హోదాతో రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలను అమరయ్య వివరించారు. ఎన్‌డీఏ నుంచి టీడీపీ బేషరతుగా బయటకు వచ్చి ప్రజా ఉద్యమంలో పాల్గొనాలని యంబీవీకే కార్యదర్శి మురళీకృష్ణ సూచించారు. సమావేశానికి సీనియర్ జర్నలిస్టు ముక్కంటి సమన్వయకర్తగా వ్యవహరించగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకురాలు శాంతి పలు తీర్మానాలు చేయడంతో అందరూ ఆమోదించారు. సమావేశంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామమూర్తి, షేక్ ఖాజావలి, సీపీయం నాయకులు ఉమామహేశ్వరరావు, శివయ్య, 10 టీవీ ఎడిటర్ సతీష్, గొట్టిముక్కల ప్రసాద్, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, ప్రజా, యువజన, కార్మిక, మహిళా సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుల నుంచి
ప్రాణ హాని ఉంది

- బాధిత మహిళ ఆందోళన
- అత్యాచారం చేయడంతో పాటు కులం పేరిట దూషణలు
- అలుసుగా తీసుకుని లైంగిక వేధింపులకు పాల్పడ్డ మరింత మంది ఉద్యోగులు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): తనపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి, లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యక్తుల నుంచి తనకు ప్రాణహాని ఉందని బాధిత దళిత మహిళ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన అనితా మెహరా బుధవారం విలేకరులతో మాట్లాడారు. విశాఖ జిల్లా అచ్యుతాపురం సెజ్ అపెరల్ సిటీ పరిధిలోని 'షోర్ టూ షోర్' కంపెనీలో 2012లో థర్మల్ మెకానిస్ట్‌గా ఉద్యోగంలో చేరానని ఆమె తెలిపారు. అదే కంపెనీలో జనరల్ మనేజర్‌గా పనిచేస్తున్న దిలీప్ పింటో (శ్రీలంక) గతేడాది రెండు సార్లు తనపై అత్యాచారం చేశాడని చెప్పారు. తనపై అత్యాచారం గురించి పింటో తోటి కంపెనీ ఉద్యోగులకు గొప్పగా చెప్పుకోవడంతో పాటు కులం పేరుతో దుషిస్తూ, చులకనగా మాట్లాడేవాడన్నారు. దీంతో కంపెనీ ఉద్యోగులు మళ్ల శ్యామ్ సుందర్‌గోపికృష్ణ, రెడ్డి లక్ష్మీ నరసింహరాజు, ఉరుకూటి వాసుదేవ, వి.బాలశంకర్, రుత్తల నరేష్, లాలం సురేష్‌లు కూడా తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో తాను ప్రతిఘటించడంతో ఉద్యోగం నుంచి తొలగించారని వాపోయారు. దీనిపై జనవరి 24న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పింటో, శ్యామ్‌సుందర్‌లను అరెస్టు చేశారని, మిగిలిన వారు పరారయ్యారని వివరించారు. అయితే నిందితుల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జీజీహెచ్‌లో అరుదైన వ్యాధికి చికిత్స



వ్యాధి నుండి కోలుకున్న వ్యక్తితో న్యూరాలజీ వైద్య బృందం

గుంటూరుమెడికల్: అరుదైన వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి చికిత్స అందించి వ్యాధి నుంచి ఉపశమనం కల్పించినట్లు గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి తెలిపారు. బుధవారం జీజీహెచ్‌లో ఆయన మీడియాతో ఈ వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన షేక్ కమ్రుద్దీన్ (50) అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. 2017 అక్టోబర్ 2 నుంచి కమ్రుద్దీన్ ప్రవర్తనలో విపరీతమైన మార్పులు రావడాన్ని భార్య మొహీబ్ గమనించింది. భార్యను పనిమనిషిగా భావించడం, పెళ్లీడుకొచ్చిన తన పిల్లలను పాఠశాల వయసు పిల్లలుగా భావించడం, ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇల్లు మర్చిపోయి రోడ్ల మీదే తిరుగుతూ ఉండడం, దైనందిన కార్యక్రమాలన్నీ కూడా మర్చిపోవడం వంటివి చేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో కమ్రుద్దీన్‌కు పిచ్చిపట్టిందని భావించి నరసరావుపేట ఆస్పత్రిలో, గుంటూరు ప్రైవేటు ఆస్పత్రిలో సుమారు రూ. 3 లక్షలు ఖర్చు చేసి వైద్యం చేయించారు. అయినా మానసిక ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో బంధువుల ద్వారా తెలుసుకుని 2017 డిసెంబర్‌లో జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో చేర్పించారు. సుమారు నెల రోజుల పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి చివరకు 'ఆటో ఇమ్యూన్ ఎన్‌సెఫలైటిస్' అనే అరుదైన వ్యాధిగా గుర్తించినట్లు డాక్టర్ సుందరాచారి చెప్పారు. మందులు, ఇంజెక్షన్లు వాడి వ్యాధిని నయం చేశామన్నారు. ఈ వ్యాధి రావడానికి ప్రత్యేక కారణాలేవీ లేవని, శరీరంలో కేన్సర్ లేదా ఇన్‌ఫెక్షన్ ఉంటే వ్యాధి వచ్చేందుకు 10 శాతం అవకాశాలు ఉన్నాయన్నారు. ఇలాంటి వ్యాధి గురించి ఇప్పటివరకు పుస్తకాల్లో చదవడమే తప్ప నేరుగా ఎక్కడా చూడలేదని, ఇదే మొట్టమొదటి కేసుగా తెలిపారు. ఈ వ్యాధిని నూరుశాతం నయం చేయవచ్చని, మగవాళ్లలో 60 ఏళ్లలోపు వయస్సు వారికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యాధి నుంచి విముక్తి చేసిన న్యూరాలజీ వైద్యులకు కమ్రుద్దీన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నాడు కాదన్నారు.. నేడు ఔనన్నారు!

- కామర్స్ లెక్చరర్ల నియామకాల్లో ఎంబీఏ అభ్యర్థులకూ అవకాశం
- నోటిఫికేషన్‌లో ఎంకాం విద్యార్థతగా పేర్కొన్న వైనం

సాక్షి, విశాఖపట్నం/ అమరావతి: డిగ్రీ కాలేజీల్లో కామర్స్ లెక్చరర్ ఉద్యోగాల నియామకాల్లో అడ్డదారులు తొక్కుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పోస్టులకు ఎంబీఏ అభ్యర్థులు అర్హులు కాదని ఏపీపీఎస్సీ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇప్పుడు వారినే ఎంపిక చేయడం వివాదాస్పదమవుతోంది. రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లోని లెక్చరర్ల పోస్టుల భర్తీకి 2016 డిసెంబర్‌లో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసింది. 2017 జూన్ 6, 7 తేదీల్లో పరీక్షలు నిర్వహించింది. క్వాలిఫై అయిన అభ్యర్థులకు గతేడాది డిసెంబర్ 15 నుంచి 19 వరకు ఇంటర్వ్యూలు జరిపింది. జనవరి 18న మెరిట్ లిస్టు ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 50 కామర్స్ లెక్చరర్ల ఖాళీలకు ఎంకాం విద్యార్హతగా నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఎంబీయే అభ్యర్థులు అనర్హులని స్పష్టం చేసింది. దీంతో కొంతమంది ఎంబీఏ అభ్యర్థులు తాము ఎంకాం ఉత్తీర్ణత సాధించినట్టు తప్పుడు సర్టిఫికెట్లతో కామర్స్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేశారు. వీరిలో కొందరు అర్హత సాధించారు. ఇలాంటి వారిని ఇటీవల జరిపిన ఇంటర్వ్యూల్లో తిరస్కరించారు. అనూహ్యంగా ఈనెల 16న విడుదల చేసిన వెబ్‌నోట్‌లో కామర్స్ లెక్చరర్ పోస్టులకు ఎంబీఏ ఉత్తీర్ణులైన వారు కూడా ఎంకాం అభ్యర్థులతో సమానమని పేర్కొన్నారు. పరీక్షా ఫలితాలు విడుదలై, ఇంటర్వ్యూలు నిర్వహించాక ఇప్పుడు ఎంబీఏ అభ్యర్థులు కూడా ఈ పోస్టులకు అర్హులని ఏపీపీఎస్సీ పేర్కొనడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కావాల్సినవారికి పోస్టులు ఇప్పించుకోవడానికి వేసిన పథకంలో భాగమే ఇదని విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించి అర్హులకు న్యాయం చేయాలని వీరు కోరుతున్నారు.

అర్హతలపై యూనిట్ విభాగాలదే తుది నిర్ణయం: ఏపీపీఎస్సీ

ఏపీపీఎస్సీ పేర్కొన్న ఎంకాం అర్హతల నిబంధనలతో తమ క్వాలిఫికేషన్ సమానమని ఆయా ఎంబీఏ అభ్యర్థులు తమకు అఫిడవిట్ ఇచ్చారని, దీనిపై తాము సంబంధిత యూనిట్ ఆఫీస్ నుంచి సమాచారం కోరామని ఏపీపీఎస్సీ కార్యదర్శి వైవీఎస్‌టీ సాయి తెలిపారు. ఈలోగా వారికి రాతపరీక్ష, ఇంటర్వ్యూలకు అనుమతినిచ్చామని చెప్పారు. బీకాం కామర్స్ డిగ్రీతో కూడిన ఎంబీఏ అభ్యర్థులను ఎంకాం సమానార్హతగా గుర్తించవచ్చని యూనిట్ ఆఫీసు నుంచి తమకు చాలా ఆలస్యంగా సమాచారం వచ్చిందని చెప్పారు. ఆ మేరకు ఇద్దరు అభ్యర్థులను ఇంటర్వ్యూలకు అనుమతించి ఫలితాలను కూడా ప్రకటించామన్నారు. ఎంకాంకు ఎంబీఏ సమానార్హత కాదని గతంలో అదే విభాగం ఆర్డర్‌ని విడుదల చేసిన విషయాన్ని ప్రస్తావించగా దానితో తమకు సంబంధం లేదన్నారు.

వైద్య విద్యార్థుల జీవితాలతో
అధికారుల చెలగాటం

- గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ప్రాక్టికల్ పరీక్షలు వాయిదా
- మొన్న పీడియాట్రిక్స్, నిన్న ఈఎన్‌టీ విభాగాల్లో నిలిచిపోయిన పరీక్షలు
- ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ తీరుపై సర్వత్రా విమర్శలు

సాక్షి, గుంటూరు: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల జీవితాలతో అటు ప్రభుత్వం, ఇటు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అధికారులు చెలగాటమాడుతున్నారు. మంగళవారం, బుధవారం ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులకు ఈఎన్‌టీ విభాగంలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పరీక్షలను నిలిపేసిన హెల్త్ యూనివర్సిటీ తిరిగి ఎప్పుడు నిర్వహిస్తుందో ఇంకా ప్రకటించలేదు. వైద్య కళాశాల అధికారులు, వర్సిటీ అధికారులు నెపాన్ని ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారే తప్పా పరీక్షల నిర్వహణకు శ్రద్ధ చూపడం లేదు.

ఇన్విజిలేటర్లు రాకపోవడం వల్లే..

ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులకు ఈ నెల 4 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మెడిసిన్, సర్జరీ, గైనిక్ విభాగాల్లో పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించారు. ఈ నెల 10న ఇన్విజిలేటర్లు రాకపోవడంతో పీడియాట్రిక్స్ ప్రాక్టికల్ పరీక్షలు నిలిచిపోయాయి. తర్వాత వాటిని నిర్వహించారు. తర్వాత పరీక్షలకైనా తగు జాగ్రత్తలు తీసుకున్నారా అంటే అదీ లేదు. ఈ నెల 20న ఈఎన్‌టీ విభాగంలో ప్రాక్టికల్ పరీక్షలు చివరి నిమిషంలో వాయిదా పడ్డాయి. మంగళ, బుధవారాల్లో కూడా పరీక్షలు నిర్వహించలేక వైద్య కళాశాల అధికారులు చేతులెత్తేశారు. ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల నుంచి రావాల్సిన ఇన్విజిలేటర్స్ (ఎక్స్‌టర్నల్స్) రాకపోవడం వల్లే పరీక్షలు వాయిదా పడ్డాయి. ఎక్స్‌టర్నల్స్ రావడం లేదనే విషయాన్ని ఐదు రోజుల ముందే వర్సిటీ అధికారులకు తెలియజేశామని, వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం వల్లే పరీక్షలు వాయిదా వేయాల్సి వచ్చిందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బారావు చెబుతున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ఇన్విజిలేటర్ల వసతి, భోజనం కోసం విద్యార్థుల నుంచి ప్రొఫెసర్లు నగదు వసూలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నగదు తీసుకుని పరీక్షలు నిర్వహించకపోవడం ఏమిటంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జీజీహెచ్‌లోని చెవి, ముక్కు, గొంతు విభాగం

ఎక్స్‌టర్నల్స్ రాకపోవడం వల్లే పరీక్షలు వాయిదా

ఇతర రాష్ట్రాల నుంచి రావాల్సిన ఎక్స్‌టర్నల్స్ రాకపోవడంతో ఈఎన్‌టీ విభాగంలో ప్రాక్టికల్ పరీక్షలను వాయిదా వేశాం. ప్రత్యామ్నాయం చూసి పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– డాక్టర్ మేజర్ భీమేశ్వర్, పరీక్షల నియంత్రణ అధికారి

108లో సహాయ నిరాకరణ

- నిలిచిపోయిన 120 అంబులెన్సులు
- గందరగోళంలో పడిన 108 వాహనాల నిర్వహణ
- నేడు యాజమాన్యంతో చర్చలు.. న్యాయం చేయకపోతే నోటీసులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 108 ఉద్యోగులు సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టారు. తమకు నెలసరి వేతనాలు చెల్లించకుండా రోజువారీ కూలీ లెక్కన చెల్లించడం, బకాయిలు చెల్లించకపోవడం, ఉద్యోగులకు ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలు ఇవ్వకపోవడం, మరమ్మతులకు వచ్చిన వాహనాలను పట్టించుకోకపోవడం వంటి చర్యలపై వారు నిరసనకు దిగారు. అత్యవసర సేవలు కొనసాగిస్తూనే అంబులెన్సుల్లో తీసుకెళ్లిన బాధితుల వివరాలను ప్రభుత్వానికి ఇవ్వడం నిలిపివేశారు. ఈనెల 19వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో, అన్ని వాహనాల్లో వివరాలను ఇవ్వడం ఆపేశారు. వాహనాలకు పట్టే డీజిల్ వివరాలతో సహా అన్ని సేవలూ ఆపేసినట్టు ఉద్యోగుల సంఘం ప్రకటించింది. ఏరోజుకు ఆరోజు ఎంతమంది బాధితులను ఆస్పత్రులకు చేర్చిన వివరాలను సీఎం కోర్‌డాష్ బోర్డులో నమోదు చేసేవారు. రెండ్రోజులుగా ఈ నమోదు ఆగిపోయింది. దీంతో గందరగోళంగా మారింది. ఆగిపోయిన వాహనాల కోసం మరికొన్ని వాహనాలను ఆపేస్తున్న పరిస్థితి దాపురించింది. తాజా లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 120 వాహనాల వరకూ ఆగిపోయినట్టు తెలుస్తోంది. మొత్తం 439 వాహనాలు ఉండగా అందులో 419 వాహనాలు రోడ్డుమీద ఉండాలి. బుధవారం సాయంత్రానికి 300 వాహనాలు కూడా తిరగడం లేదని తేలింది.

రోజుకూలీ లెక్కన వేతనాల చెల్లింపు

గతంలో ఎన్నడూ లేనట్టుగా రెండువేల మంది ఉద్యోగులకు రోజువారీ కూలీ ప్రాతిపదికన 52 రోజులకు డబ్బు చెల్లించారు. ఒక్కో ఉద్యోగికి రూ.11,500 నుంచి రూ.14,500 వరకూ వేతనం ఉంది. దీన్ని పట్టించుకోకుండా 52 రోజులకు రోజుకు రూ.300 లెక్కన రూ.15,600 చెల్లించారు. ఇదేమని నిర్వహణా సంస్థ బీవీజీని ప్రశ్నించగా... తమకు ప్రభుత్వం రూ.మూడు కోట్లు మాత్రమే ఇచ్చిందని, తమ వద్ద ఉద్యోగుల వేతనాల వివరాలు లేవని సమాధానం చెప్పింది. దీంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్య వైఖరికి నిరసగా సహాయ నిరాకరణ చేస్తున్నట్టు తెలిపారు. నేడు (గురువారం) యాజమాన్యంతో చర్చలు జరుగుతున్నాయని, తమకు న్యాయంగా ఇవ్వాల్సిన వేతనాలు, బకాయిలు ఇవ్వకపోతే సమ్మెకు నోటీసులు ఇవ్వడానికి కూడా వెనుకాడేది లేదని ఉద్యోగ సంఘం నేత కిరణ్‌కుమార్ చెప్పారు. ఇంజన్ ఆయిల్ మారుస్తున్నామంటూ రోడ్డుమీద తిరుగున్న వాహనాలను కూడా ఆపేసి అందులో ఆయిల్ డ్రమ్ములను తీసుకెళుతున్నారని ఆరోపించారు.



తూర్పుగోదావరి జిల్లా ఉప్పాడ కొత్తపల్లి, తొండంగి మండలాల్లో 108 వాహనంలో ఆయిల్ క్యాన్‌లు తరలిస్తున్న బీవీజీ సిబ్బంది

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్.. 62 ఖాళీలు

చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోస్టల్ అండ్ మెరైన్ ఏరియా మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టరేట్ (ఐసీఎంఏఎం-పీడీ).. 62 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌కు చెందింది. మొత్తం ఖాళీల్లో ప్రాజెక్ట్ సైంటిస్ట్ 'డి'-1, ప్రాజెక్ట్ సైంటిస్ట్ 'సి'-17, ప్రాజెక్ట్ సైంటిస్ట్ 'బి'-33, టెక్నికల్ అసిస్టెంట్-3, ఫీల్డ్ అసిస్టెంట్-8 ఉన్నాయి. సంబంధిత విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ/బ్యాచిలర్స్ డిగ్రీ/ఇంజనీరింగ్ డిప్లొమా/పదోతరగతి ఉత్తీర్ణులు అర్హులు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీ పంపాలి. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 14, 2018. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.icmam.gov.in

జాబ్ ఇన్ఫో



రైల్వే కొలువుల కూత..!

భారత రైల్వేల చరిత్రలో తొలిసారిగా భారీ సంఖ్యలో 89,409 ఉద్యోగాల భర్తీకి రైల్వేశాఖ వేర్వేరుగా రెండు నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. మొదట 26,502 అసిస్టెంట్ లోకో పైలట్(ఏఎల్‌పీ), టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీకి పచ్చ జెండా ఊపిన రైల్వే మంత్రిత్వశాఖ.. వెంటనే మరో 62,907 గ్రూప్-డి ఉద్యోగాలకు ప్రకటన ఇచ్చింది. మొత్తంగా 89,409 పోస్టుల భర్తీ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో సదరు రైల్వే నోటిఫికేషన్‌ల వివరాలు, ఎంపిక తీరు, ప్రిపరేషన్ టిప్స్ తెలుసుకుందాం..

26,502 ఏఎల్‌పీ, టెక్నీషియన్

దేశవ్యాప్తంగా వివిధ రైల్వే జోన్లల్లో 26,502 టెక్నీషియన్, అసిస్టెంట్ లోకోపైలెట్ ఉద్యోగాల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడులైంది. ఈ మొత్తం ఖాళీల్లో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఆర్ఆర్‌బీ), సికింద్రాబాద్ పరిధిలో 3,262 పోస్టులుండటం తెలుగు విద్యార్థులకు మంచి అవకాశమని చెప్పొచ్చు. ఈ ఉద్యోగాలకు ఎంపికైతే ప్రారంభ వేతనం నెలకు రూ.19,900 ఉంటుంది. ఇతర అలవెన్సులు లభిస్తాయి.

అర్హతలు: పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ/ట్రేడ్‌అప్రెంటీస్‌షిప్/ఇంటర్మీడియెట్ (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్)/ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన వారు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసు కోవచ్చు. **వయసు:** 2018, జూలై1నాటికి 18-28 ఏళ్లు(నోటిఫికేషన్ ప్రకారం- గరిష్ట వయోపరిమితి 28ఏళ్ల, ఆ తర్వాత అన్ని పోస్టులకు మరో రెండేళ్లు వయోపరిమితి పెంచుతున్నట్లు రైల్వే శాఖ పేర్కొంది). రిజర్వేషన్ కేటగిరీకి నిబంధనల మేరకు సండలింపు ఉంటుంది. **పరీక్ష విధానం:** ఏఎల్‌పీ/టెక్నీషియన్ పోస్టులకు ఉమ్మడిగా రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) ఉంటుంది. టెక్నీషియన్ పోస్టులకు రెండోదశ ద్వారానే తుది ఎంపిక జరుగుతుంది. ఏఎల్‌పీ పోస్టులకు మాత్రం రెండో దశ సీబీటీ అనంతరం కంప్యూటర్ ఆధారిత ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏటీ) నిర్వహిస్తారు.

- తొలిదశ సీబీటీ ప్రశ్నపత్రంలో 75 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి గంట. మ్యాథమెటిక్స్; జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్; జనరల్ సైన్స్; జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. తొలిదశలో అర్హత సాధించిన వారికి రెండోదశ సీబీటీ నిర్వహిస్తారు. కేటగిరీల వారీగా మొత్తం పోస్టుల సంఖ్యకు 15 రెట్ల మంది అభ్యర్థులను రెండోదశ పరీక్షకు పిలుస్తారు. ● రెండోదశ పరీక్షలో పార్ట్-ఏ(100 ప్రశ్నలు, 90 నిమిషాలు), పార్ట్-బీ(75 ప్రశ్నలు, 60 నిమిషాలు) ఉంటాయి. పార్ట్-ఏలో మ్యాథమెటిక్స్; జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్; బేసిక్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్; జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. పార్ట్-బీ (అర్హత పరీక్ష మాత్రమే)లో సంబంధిత ట్రేడ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు.
- మొదటి, రెండో దశ సీబీటీలకు నెగెటివ్ మార్కులు ఉంటాయి. ప్రతితప్పు సమాధానానికి 1/3 మార్కులు కోత విధిస్తారు. తదుపరి ఎంపిక ప్రక్రియకు రెండోదశలోని పార్ట్-ఏలో సాధించిన మార్కులను మాత్రమే పరిగణనలోకి తీసు కుంటారు. ● అభ్యర్థులు ఏదో ఒక ఆర్ఆర్‌బీకి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు రుసుం:** ఎస్సీ/ఎస్టీ/ఎక్స్‌సర్వీస్‌మెన్/పీడబ్ల్యూడీ/మహిళలు/ట్రాన్స్‌జెండర్/మైనారిటీలు/ఈబీసీ అభ్యర్థులకు రూ.250. మిగిలిన వారికి రూ.500. ● **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 5, 2018.
- **తొలిదశ కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** ఏప్రిల్ /మే, 2018.

62,907 గ్రూప్ డీ పోస్టులు

అసిస్టెంట్ లోకోపైలట్/టెక్నీషియన్ ఉద్యోగాల ప్రకటన తర్వాత... కొద్దిరోజులకే 62,907 గ్రూప్ – డి పోస్టులతో మరో భారీ నోటిఫికేషన్‌ను రైల్వే శాఖ విడుదల చేసింది. ఈ మొత్తం పోస్టుల్లో దక్షిణ మధ్య రైల్వే-సికింద్రాబాద్‌లో 6,523 ఖాళీలు ఉన్నాయి. గ్రూప్-డి పోస్టుల్లో హెల్పర్స్, ట్రాక్ మెయిన్‌టైనర్, పాయింట్స్‌మన్, గేట్‌మన్, పోర్టర్స్ వంటి పలు ఉద్యోగాలు ఉన్నాయి. ఈ పోస్టులకు ఎంపికైతే నెలకు రూ.18,000 వేతనంతోపాటు ఇతర అలవెన్సులు, సౌకర్యాలు లభిస్తాయి. ● **అర్హతలు:** పోస్టులను బట్టి పదో తరగతి/ఐటీఐ/ నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. (కోర్సు ఆఖరు సంవత్సరం చదువుతున్నవారు అనర్హులు). నోటిఫికేషన్ ప్రకారం-2018, జూలై1 నాటికి 18-31ఏళ్ల మధ్య వయసున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు.(తర్వాత గరిష్ట వయోపరిమితి మరో 2ఏళ్లు పెంచుతున్నట్లు రైల్వే శాఖ పేర్కొంది). రిజర్వేషన్ వర్గాల వారికి నిబంధనల మేరకు సడలింపు ఉంటుంది.

- **ఎంపిక:** మొదట కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహించి.. ఇందు లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు శారీరకదారుఢ్య పరీక్షలు ఉంటాయి. సీబీటీలో వచ్చిన మార్కుల ఆధారంగానే ఉద్యోగాల భర్తీ జరుగు తుంది. ● **దరఖాస్తులు:** ఏదేని ఒక ఆర్ఆర్‌బీకి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. దక్షిణ మధ్య రైల్వేలో ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో http://rrbsecunderabad.nic.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ● **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 2018, మార్చి 12. ● **దరఖాస్తు రుసుం:** రూ.500, ఎస్సీ/ఎస్టీ/ఎక్స్ సర్వీస్‌మెన్/పీడబ్ల్యూడీ/మహిళలు/ ట్రాన్స్‌జెండర్లు/ మైనార్టీలు/ఈబీసీలకు ఫీజు రూ. 250. ● **పరీక్ష తేదీ:** 2018 ఏప్రిల్, మేల్లో ఉంటాయి.

పరీక్ష విధానం

సీబీటీ (కంప్యూటర్ ఆధారిత పరీక్ష)లో 100 ప్రశ్నలు ఉంటాయి. 90 నిమిషాల సమయం ఇస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు రుణాత్మక మార్కులుంటాయి. నిబంధనలు ప్రకారం- జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 40 మార్కులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కేట గిరీలకు చెందిన విద్యార్థులు కనీసం 30 మార్కులు సాధించి, మెరిట్‌లో ఉంటేనే తుది జాబితా రూపొందించే క్రమంలో పరిగణనలోకి తీసుకుంటారు.

ప్రిపేర్ అవ్వండిలా

రెండు పరీక్షల సీబీటీల్లో నాలుగు సెక్షన్లు కామన్‌గా ఉన్నాయి. అవి..
- మ్యాథమెటిక్స్ ● జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ ● జనరల్ సైన్స్
- కరెంట్ అఫైర్స్ అండ్ జనరల్ అవేర్‌నెస్

మ్యాథమెటిక్స్

ఆరు నుంచి పదో తరగతి వరకు ఉన్న డెసిమల్స్, ఫ్రాక్షన్స్ చాప్టర్లను చూసుకోవాలి. కసాగు, గసాభా, నిష్పత్తి-అనుపాతం, శాతాలు, మెన్సురేషన్, కాలం-పని, కాలం-దూరం, చక్రవడ్డీ, బారువడ్డీ, లాభన ష్టాలు, ఆల్జీబ్రా, జామెట్రీ, త్రికోణమితి, సాంఖ్యక శాస్త్రం తదితర బేసిక్ పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ముందుగా నంబర్లపై పట్టు సాధించాలి. ముఖ్యంగా నంబర్ సిస్టమ్స్, బోడ్‌మస్ నిబంధనలను మొదట తెలుసుకోవాలి. కూడికలు, తీసివేతలు, భాగాహారాలు, గుణకారాలు, శాతాలు వంటి ప్రాథమిక అర్థమెటిక్ అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఎక్కాలు, వర్గాలు-వర్గమూలాలు, ఘనమూలాలు కంఠస్థం చేయాలి. వయసుపై అడిగే ప్రశ్నలు, క్యాలెండర్, క్లాక్, పైప్స్ అండ్ సిస్టర్న్ చాప్టర్లను బాగా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్

ఈ సెక్షన్‌లో మంచి మార్కులు పొందడానికి అవకాశం ఉంటుంది. అల్ఫాబెటికల్, నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, మ్యాథమెటికల్ ఆపరేషన్స్, రిలేషన్స్, ఆడ్‌మాన్ అవుట్, సింబల్స్, నొటేషన్స్, వెన్ చిత్రాలు, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్-కన్‌క్లూజన్, స్టేట్‌మెంట్-అసంప్షన్, డెసిషన్ మేకింగ్, సిలాజిజం విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి అన్ని విభాగాలను ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ సైన్స్

పదోతరగతి స్థాయి వరకు సైన్స్ సబ్జెక్టులైన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. కాబట్టి 6 నుంచి పదోతరగతి వరకు పుస్తకాలు సేకరించుకొని ప్రిపరేషన్ సాగించాలి. సొంతంగా నోట్స్ రాసుకోవడం మేలు. దాని ద్వారా సులువుగా గుర్తుండిపోవడంతోపాటు పరీక్ష సమయంలో పునశ్చరణకు దోహదపడుతుంది. నిత్యజీవితంలో జరిగే సైన్స్ సంబంధిత అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్

ఇందులో స్టాక్ జీకే, కరెంట్ అఫైర్స్ ప్రశ్నలు అడుగుతారు. వివిధ దేశాల అధ్యక్షులు, భారతదేశ భౌగోళిక స్థితిగతులు, రాజకీయ వ్యవస్థ, ఇతర దేశాలతో సంబంధాలు, కొత్తగా ప్రవేశపెడుతున్న బిల్లులు, దేశాల కరెన్సీలు, వార్తల్లోని వ్యక్తులు, రచయితలు మొదలైన సమకాలీన అంశాలు తెలుసు కోవాలి. వీటితోపాటు శాస్త్ర సాంకేతిక రంగంలో చోటుచేసుకున్న సంఘటనలు, డిఫెన్స్ టెక్నాలజీ, మిలిటరీ ఎక్సర్‌సైజ్‌లు, తాజాగా క్రీడల్లో జరిగిన చెప్పుకోదగిన పరిణామాలు, బడ్జెట్, అందులో ముఖ్య అంశాలు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు వాటి లక్ష్యాలను స్పష్టంగా తెలుసుకోవాలి.

సక్సెస్ స్పీక్స్

ఏపీపీఎస్సీ గ్రూప్-1 (2011)

సహనంతో.. సక్సెస్

సుదీర్ఘ ఎదురుచూపులకు ఎట్టకేలకు తెరపడింది. దాదాపు ఆరేళ్ల తర్వాత అభ్యర్థుల ఆశలు సాకారమయ్యాయి. గ్రూప్-1 (2011) నోటిఫికేషన్ రీ-ఎగ్జామినేషన్ తుది ఫలితాలు విడుదలయ్యాయి. మొత్తం 294 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించిన ఏపీపీఎస్సీ.. ఈనెల 20న ఇంటర్వ్యూలు ముగియడంతో.. అభ్యర్థుల మార్కుల తుది జాబితాను వెల్లడించింది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన వెంకట రమణ, కనుగుల హేమలతల సక్సెస్ స్పీక్స్..





స్వయం కృషితో..

783 మార్కులకుగాను 489.5 మార్కులు సాధించిన వెంకట రమణ

మా స్వస్థలం ప్రకాశం జిల్లా మార్కాపురం. వ్యవసాయ కుటుంబం. నాన్న శ్రీరాములు, అమ్మ లక్ష్మీ నరసమ్మ. ఉన్న కొద్దిపాటి పొలం సాగు చేస్తూ .. వచ్చే ఆదాయంతోనే నన్ను, ఇద్దరు అన్నయ్యలను, తమ్ముడిని చదివించారు. నావిద్యాభ్యాస మంతా మా స్వస్థలం మార్కాపురంలో ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తయింది. 2000లో ఇంటర్మీడియెట్ పూర్తయ్యాక బీటెక్ చదవాలనే కోరికతో ఒక సంవత్సరం పాటు సొంతంగానే ఎంసెట్‌కు ప్రిపేరై 2001లో వేయి ర్యాంకు సాధించా. బీటెక్ ఈసీఈ పూర్తవగానే క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థలో 2005లో సర్క్యూట్ డిజైన్ ఇంజనీర్‌గా ఉద్యోగం లభించింది.

మలుపుతిప్పిన ఉద్యోగం: ప్రభుత్వ సర్వీసులవైపు దృష్టి పెట్టడానికి నా ఉద్యోగ జీవితమే కారణమని చెప్పొచ్చు. నేను జాబ్ చేసేటప్పుడు ఖాళీ సమయాల్లో సహచర ఉద్యోగులతో కలసి సమీప ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లి, అక్కడి విద్యార్థులకు క్లాసులు చెప్పేవాళ్లం. ఆ సందర్భంగా సమాజానికి ఎంతో అవసరమైన ప్రాథమిక విద్యలో లోటుపాట్లు ప్రత్యక్షంగా చూశాను. దీంతో ప్రభుత్వ సర్వీసుల ద్వారా మరింత సేవ చేయొచ్చనే భావనతో గమ్యాన్ని మార్చుకున్నాను.

కొలువు వదిలి: 2009లో ఉద్యోగానికి రాజీనామా చేసి.. సివిల్స్, గ్రూప్స్ ప్రిపరేషన్‌కు ఉపక్రమించాను. సివిల్స్ లక్ష్యంగా 2011లో తొలి అటెంప్ట్ ఇచ్చాను. అందుకోసం శిక్షణ కూడా తీసుకున్నాను. అప్పుడు ప్రిలిమ్స్‌లో నెగ్గి మెయిన్స్ రాసినా.. ఫలితం రాలేదు. ఆ తర్వాత సంవత్సరం నుంచే సివిల్స్ పరీక్ష విధానంలో మార్పు వచ్చింది. దాంతో అప్పుడే వెలువడిన 2011 గ్రూప్-1పై దృష్టిపెట్టా. ఒకవైపు ఉద్యోగానికి రాజీనామా.. మరోవైపు సొంత ప్రిపరేషన్ మొదలుపెట్టా. వ్యక్తిగత ఖర్చుల కోసం కుటుంబంపై ఆధారపడటం ఇష్టంలేక.. గ్రూప్-2, బ్యాంక్ పీఓ వంటి పరీక్షలకు జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్‌కు ఫ్యాకల్టీగా పనిచేశా.

విసుగు విరామమెరుగక: గ్రూప్-1కు తొలిసారిగా 2011లో హాజరయ్యాను. అప్పుడే ఇంటర్వ్యూ దశకు చేరుకున్నాను. కానీ దురదృష్టవశాత్తు అది రద్దవడం తెలిసిందే. మళ్లీ గతేడాది రీ-ఎగ్జామినేషన్ నిర్వహించి.. తాజాగా ఫలితాలు విడుదల చేయడం.. అందులో మార్కుల పరంగా టాపర్‌గా నిలవడం ఆనందంగా ఉంది. దాదాపు అయిదేళ్లపాటు సాగిన ఈ సుదీర్ఘ ప్రిపరేషన్‌లో ఏ సందర్భంలోనూ విసుగు చెందలేదు. నిరాశకు గురవలేదు. ఈ సమయంలో పట్టుదలతో నా నైపుణ్యాలను మరింత పెంచుకునేందుకు కృషి చేశాను.

అరగంట ఇంటర్వ్యూ: నా ఇంటర్వ్యూ దాదాపు అరగంట సేపు జరిగింది. ఏపీపీఎస్సీ చైర్మన్ సహా నలుగురు సభ్యుల బోర్డ్ ఇంటర్వ్యూ చేసింది. ఇందులో నా వ్యక్తిగత నేపథ్యం, బీటెక్ చదివి ప్రభుత్వ సర్వీసువైపు రావడానికి కారణం, ప్రభుత్వ శాఖల్లో అవినీతి, మావోయిస్ట్ సమస్య, తెలంగాణ రాష్ట్రంలోని సమస్యలు, సామాజిక మార్పు అంటే ఏంటి? మా ప్రాంతంలో వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తవకపో వడానికి కారణం?ఇలా దాదాపు అన్ని అంశాలపై ప్రశ్నలు సంధించారు. అన్నిటికీ సంతృప్తికరంగా సమాధానాలిచ్చాను. ఇంటర్వ్యూ పూర్తయ్యాక విజేతల జాబితాలో నిలుస్తాననే నమ్మకం కలిగింది. గ్రూప్-1 జాబితాలో వచ్చిన మార్కుల ప్రకారం.. డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చే అవకాశముంది. నా పరిధిలో.. వ్యవసాయభివృద్ధి కార్యక్రమాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తాను.

సహనంతో సాగాలి: గ్రూప్-1, సివిల్స్ వంటి పోటీ పరీక్షల అభ్యర్థులు ముందుగా వ్యక్తిగతంగా సహనం అలవర్చుకోవాలి. ఇది సుదీర్ఘంగా సాగే ఎంపిక ప్రక్రియ. ఏ సమయంలోనూ విసుగు చెందకుండా మానసికంగా స్థిరంగా ఉండాలి. ప్రిపరేషన్ పరంగా శిక్షణ తీసుకోవడం అనేది ఆయా అభ్యర్థుల సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. బేసిక్స్‌పై పట్టు సాధించి విశ్లేషణాత్మక దృక్పథంతో చదవాలి. అన్నిటికంటే ముఖ్యంగా ఫలితం గురించి ఆలోచించకుండా.. స్వయంకృషిని నమ్ముకొని ముందుకుసాగితే కొంత ఆలస్యమైనా విజయం వరిస్తుంది!!

మహిళా సాధికారతే లక్ష్యం

470 మార్కులతో రెండో స్థానంలో, మహిళా టాపర్‌గా నిలిచిన కనుగుల హేమలత

మాది వ్యవసాయ కుటుంబం. అక్క, అన్నయ్య ఇద్దరూ ప్రభుత్వ సర్వీసుల్లో చేరడం.. ఒకరు టీచర్‌గా, మరొకరు ఏఈఈగా ఎంపికవడమే నేను గ్రూప్-1ను ప్రధాన లక్ష్యంగా ఎంపిక చేసుకోవడానికి ప్రేరణ. నా విద్యాభ్యాసం పలు ప్రాంతాల్లో సాగింది. ఇంటర్మీడియెట్ తర్వాత ఇంజనీరింగ్‌లో చేరాలనుకొని ఒక ఏడాది పూర్తిగా ఎంసెట్ ప్రిపరేషన్‌కే కేటాయించాను. అప్పుడు కూడా ఆశించిన ర్యాంకు రాలేదు. దాంతో 2002లో శ్రీకాకుళం జిల్లాలో డైట్ కళాశాలలో చేరి 2004లో పూర్తి చేశాను.

ప్రభుత్వ టీచర్‌గా

నా జీవితంలో అత్యంత ఆనందకరమైన సందర్భం డైట్ కోర్సు పూర్తవుతూనే సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం లభించడం. నేను డైట్‌లో టీటీసీ ద్వితీయ సంవత్సరంలో ఉన్నప్పుడు డీఎస్సీ-2003 నోటిఫికేషన్ వెలువడింది. ఆ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో మహిళా టాపర్‌గా, మా జిల్లాలో మూడో ర్యాంకర్‌గా నిలిచాను. ఫలితంగా.. ఎస్‌జీటీ పోస్ట్ లభించింది. ఆరున్నరేళ్లపాటు ఆ వృత్తిలో కొనసాగాను.

ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ: మరింత ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే.. కనీసం బ్యాచిలర్ డిగ్రీ అర్హత తప్పనిసరి. కానీ.. అప్పటికి చేతిలో డిగ్రీ లేదు. దాంతో డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2004-07 మధ్య కాలంలో దూర విద్య విధానంలో డిగ్రీ పూర్తి చేశాను. ఉన్నత ఉద్యోగం లక్ష్యంగా కృషిచేస్తూనే.. మరోవైపు ఉన్నత విద్య కూడా అభ్యసించాను.

మూడుసార్లు వైఫల్యం: విద్యార్హతలు పెరగడంతో నా లక్ష్యం స్పష్టంగా నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా ముందుకుసాగాను. మూడుసార్లు గ్రూప్-1 ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. కానీ.. కొద్దిపాటి మార్కులతో విజయం చేజారింది. గ్రూప్-1కు ప్రిపరేషన్ సాగిస్తూనే నా అర్హతలకు సరిగాతే ఇతర పరీక్షలకు కూడా హాజరయ్యాను. ఫలితంగా.. 2012లో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాను. 2011 గ్రూప్-1 విషయంలో ఎలాగైనా విజయం సాధించాలనే పట్టుదలతో ప్రిపేర్ అయ్యాను. ఫలితంగా ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. కానీ.. పరీక్ష రద్దవడంతో ఎంతో నిరాశకు గురయ్యాను. అయితే మళ్లీ నిర్వహిస్తారు. తప్పక విజయం సాధిస్తాను అనే ఆత్మవిశ్వాసంతో నిరంతరం అడుగులు వేశాను.

స్వీయ ప్రిపరేషన్: గ్రూప్-1 ప్రిపరేషన్ పరంగా శిక్షణ తీసుకోలేదు. పూర్తిగా స్వీయ ప్రిపరేషన్‌పైనే ఆధారపడ్డాను. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, అకడమిక్ పుస్తకాలు, ఆన్‌లైన్ మెటీరియల్ రిసోర్సెస్‌ను వినియోగించుకున్నాను. తాజాగా విడుదల చేసిన మార్కుల జాబితాలో రెండో స్థానంలో నిలవగలిగాను.

ఇంటర్వ్యూ ఉద్యోగ నేపథ్యంపైనే: నా ఇంటర్వ్యూ ఎక్కువగా ప్రస్తుతం పని చేస్తున్న డీఏఓ ఉద్యోగ నేపథ్యంపైనే జరిగింది. అవినీతి గురించి.. ఒక అధికారిగా మీకున్న విచక్షణాదికారాలను ఎలా వినియోగిస్తారు? తాజా కేంద్ర బడ్జెట్‌పై అభిప్రాయం ఏంటి? వంటి ప్రశ్నలతో దాదాపు 15 నిమిషాలపాటు ఇంటర్వ్యూ సాగింది.

సానుకూల దృక్పథం: గ్రూప్స్ అభ్యర్థులు ఎంపిక చేసుకున్న లక్ష్యం దిశగా సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి. ఒడిదుడుకులు ఎదురైనా నిరుత్సాహానికి గురికాకుండా.. రెట్టించిన ఉత్సాహంతో అడుగులు వేయాలి. ప్రస్తుతం నాకు వచ్చిన మార్కులతో డిప్యూటీ కలెక్టర్ పోస్టు లభిస్తుందనే నమ్మకం ఉంది. ఆ హోదాలో.. నా పరిధిలో మహిళా సాధికారతకు, విద్యాభివృద్ధికి కృషి చేస్తాను!

కాంపిటీటివ్ గైడెన్స్ కరెంట్ అఫైర్స్

దక్షిణాఫ్రికా నూతన అధ్యక్షుడిగా సిరిల్

జాతీయం

ఇరాన్ అధ్యక్షుడి భారత పర్యటన



ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ భారత పర్యటనలో భాగంగా ఫిబ్రవరి 17న ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్న రౌహానీ..ఉగ్రవాదంపై పోరులో భారత్, ఇరాన్‌లు ఉమ్మడిగా ముందుకెళ్తున్నాయన్నారు. రెండు దేశాల మధ్య రాజకీయ, రాయబారులకు మించిన చారిత్రక సంబంధాలు ఉన్నాయన్నారు. ద్వైపాక్షిక చర్చల అనంతరం రెండు దేశాల మధ్య ఉగ్రవాదం, భద్రత, వాణిజ్యం, ఇంధనం తదితర అంశాలకు సంబంధించి 9 ఒప్పందాలు కుదిరాయి.

ముంబైలో 2వ విమానాశ్రయానికి శంకుస్థాపన

భారత ప్రధాని నరేంద్రమోదీ నవీ ముంబైలో నూతన అంతర్జాతీయ విమానాశ్రయానికి ఫిబ్రవరి 18న శంకుస్థాపన చేశారు. దీన్ని నాలుగు విడతల్లో దాదాపు 16,700 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. మొదటి విడతలో భాగంగా 2019 డిసెంబర్ నాటికి కోటి మంది ప్రయాణించేలా ఒక రన్‌వే, విమానాశ్రయ భవనాన్ని నిర్మిస్తారు. తర్వాతి దశల్లో 2031 నాటికి 6 కోట్ల మంది ప్రయాణించేందుకు వీలుగా విమానాశ్రయాన్ని తీర్చిదిద్దుతారు.

ప్రమాదంలో 40 భాషలు

దేశంలోని 40కి పైగా భాషలు/మాండలికాలు అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఫిబ్రవరి 17న వెల్లడించింది. ఈ భాషలను (ఒక్కో భాష) మాట్లాడేవారి సంఖ్య 10 వేల కంటే తక్కువగా ఉందని తెలిపింది. ఈ జాబితాలో అండమాన్-నికోబార్ దీవులకు చెందిన భాషలు/మాండలికాలు 11 ఉండగా, తర్వాతి స్థానాల్లో మణిపూర్ 7; హిమాచల్‌ప్రదేశ్ 4 ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గడాబా, నైకీ భాషలు కూడా ఈ ముప్పును ఎదుర్కొంటున్నాయి.

అంతర్జాతీయం

ఇజ్రాయెల్ ప్రధానిపై విచారణకు సిఫారసు

అవినీతి ఆరోపణలకు సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై రెండు కేసుల్లో నేరాభియోగాలు నమోదుకు ఆ దేశ పోలీసులు సిఫారసు చేశారు. 14 నెలల దర్యాప్తు అనంతరం నెతన్యాహుకు వ్యతిరేకంగా తగిన ఆధారాలు లభించాయని ప్రకటించిన పోలీసులు.. ప్రభుత్వ విచారణకు సిఫారసు చేశారు. అనుకూలంగా పనులు చేసి పెట్టేందుకు కానుకలు స్వీకరించడం; మీడియా కవరేజ్ కోసం ఒక ప్రముఖ వార్తా ప్రతిక ప్రచురణకర్తతో తెరవెనుక లావాదేవీలు జరపడం వంటివి పోలీసుల ప్రధాన ఆరోపణలు. నెతన్యాహు గత పదేళ్ల కాలంలో దాదాపు 3 లక్షల డాలర్లు స్వీకరించారని పోలీసులు ఆరోపించారు.

ఆర్థికం

టోకు ధరల సూచీ 2.84 శాతంగా నమోదు

టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం జనవరిలో 2.84 శాతంగా నమోదైంది. దీన్ని బట్టి జనవరి 2017తో పోల్చితే 2018 జనవరి నాటికి టోకు ధరలు 2.84 శాతం మేర పెరిగాయని తెలుస్తుంది. ప్రభుత్వం ఫిబ్రవరి 15న విడుదల చేసిన గణాంకాల ప్రకారం గడచిన ఆరు నెలల్లో ఇంత తక్కువ స్థాయిలో ద్రవ్యోల్బణం నమోదు కావడం ఇదే తొలిసారి.

5.07 శాతంగా రిటైల్ ద్రవ్యోల్బణం

జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గి.. 5.07 శాతంగా నమోదైంది. దీనికి సంబంధించిన గణాంకాలను కేంద్రం ఫిబ్రవరి 12న విడుదల చేసింది. అయితే ఇది రిజర్వ్ బ్యాంక్ మధ్యస్థ లక్ష్యమైన 4 శాతం కంటే అధికం. ఆహార, ఇంధన ధరల్లో పెరుగుదల రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ప్రభావితం చేస్తుంది.

వార్తల్లో వ్యక్తులు

దక్షిణాఫ్రికా నూతన అధ్యక్షుడిగా సిరిల్



దక్షిణాఫ్రికా నూతన అధ్యక్షుడిగా సిరిల్ రమఫోసా ఎన్నికయ్యారు. తీవ్ర రాజకీయ ఒత్తిళ్ల అనంతరం జాకబ్ జుమా ఫిబ్రవరి 15న అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. దీంతో ఫిబ్రవరి 16న జాతీయ అసెంబ్లీలో అధ్యక్ష ఎన్నిక జరిగింది. పార్లమెంటులో మెజార్టీ కలిగిన ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్..రమఫోసాను అధ్యక్ష పదవికి నామినేట్ చేసింది.

నేపాల్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఓలీ

కేపీ శర్మ ఓలీ రెండోసారి నేపాల్ ప్రధానమంత్రి పదవిని చేపట్టారు. రాష్ట్రపతి బిద్యాదేవీ భండారీ ఫిబ్రవరి 16న ఖాట్మాండులో ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు.

తెలంగాణ సీఈవోగా రజత్ కుమార్



తెలంగాణ ఎన్నికల సంఘం ప్రధానాధికారిగా 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి రజత్ కుమార్‌ను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఫిబ్రవరి 19న ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ఉమ్మడి రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని విభజించింది. దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకంగా సీఈవోను నియమించుకుంది. తెలంగాణ ప్రభుత్వం సైతం సీఈవోను నియమించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో తాజా నియామకం జరిగింది.

రాష్ట్రీయం

హైదరాబాద్‌లో వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఐటీ

హైదరాబాద్‌లో ఫిబ్రవరి 19 నుంచి మూడు రోజులపాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వరల్డ్ కాంగ్రెస్ జరిగింది. ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాంగ్రెస్‌ను ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ.. దేశంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ సదస్సును ప్రారంభిస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ప్రసంగించిన కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్..కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, రోబోటిక్స్ వంటి సాంకేతికతల కారణంగా ఉద్యోగాలు పోతాయనే భయం అక్కర్లేదన్నారు. ఈ కాంగ్రెస్‌ను వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలయెన్స్, నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్(నాస్కామ్), రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించాయి. ఇందులో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

క్రీడలు

వన్డే సిరీస్ నెగ్గిన భారత్: దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ గెలుచుకుంది. సెంచూరియన్‌లో ఫిబ్రవరి 16న జరిగిన ఆరో వన్డేలో నెగ్గి..5-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. భారత కెప్టెన్ విరాట్ కోహ్లీకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్; మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి.



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్

సాక్షి బిజినెస్
గురువారం 22-2-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
141 ▲	37 ▲
33,845	10,397

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తాజా రెండు రాత్రి 10.30కి)

నాస్‌డాక్	7,299	▲ 64
డోజోన్స్	25,054	▲ 90
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,282	▲ 35
డాక్స్	12,470	▼ 17
షాంఘై (14 ముగింపు)	3,199	▲ 15
నికాయ్	21,971	▲ 46

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.65	65.78
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	92.24	92.42
€	యూరో	ఎస్‌బీఐ	81.24	81.40
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.13	61.25
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.86	51.97
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.92	50.02
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.69	18.60
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.06	18.78
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.23	11.74

వేలిముద్రే బ్యాంక్ ఖాతా!

- టెక్నాలజీ ఆధారంగా గ్రామాల్లో బ్యాంక్ సేవలు
- డెబిట్, క్రెడిట్ కార్డులు లేకుండానే నగదు లావాదేవీలు
- ఏ ఏటీఎంలోనైనా ఎన్ని లావాదేవీలైనా ఉచితమే
- కనీస నిల్వ షరతులు; చార్జీలు ఉండనే ఉండవు
- తెలంగాణలో బ్రాంచి, కార్పొరేట్ సేవలు ఆరంభం
- 'సాక్షి బిజినెస్'తో ఐడీఎఫ్‌సీ బ్యాంక్ ఈడీ అవతార్ మోంగా



విలేకరుల సమావేశంలో అవతార్ మోంగా, అమిత్ కుమార్ (పర్సనల్ బ్యాంకింగ్ హెడ్) (ఎడమ నుంచి కుడికి)

సాక్షి ఇంటర్వ్యూ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నగదు విత్ డ్రా చేసుకోవాలంటే ఏటీఎంకో లేక బ్యాంక్‌కో వెళ్లాల్సిన అవసరం లేదు. జస్ట్.. మీ దగ్గర్లోని ఐడీఎఫ్‌సీ బ్యాంకు మైక్రో ఏటీఎం సెంటర్‌కెళితే చాలు. డెబిట్, క్రెడిట్ కార్డులేమీ అవసరం లేకుండా కేవలం వేలిముద్ర ఆధారంగా నగదు విత్‌డ్రా చేసుకోవచ్చు... జమ చేయొచ్చు కూడా. అంతేకాదు వివిధ బ్యాంకులతో ఉన్న ఒప్పందం ఆధారంగా తమ కస్టమర్ ఏ బ్యాంకు ఏటీఎంలోనైనా నెలకు ఎన్నిసార్లయినా నగదు ఉపసంహరించుకోవచ్చని, దీనికి పరిమితులేవీ లేవని కూడా ఐడీఎఫ్‌సీ బ్యాంకు స్పష్టంచేసింది. కనీస నగదు నిల్వల వంటి షరతులు కూడా లేవు. పైపెచ్చు ఏ బ్యాంక్‌లో ఖాతా ఉన్నవారైనా ఈ మైక్రో ఏటీఎం ద్వారా లావాదేవీలు జరుపుకొనే వీలుంది. బుధవారమిక్కడ హైదరాబాద్‌లో తొలి ఐడీఎఫ్‌సీ బ్రాంచీని ప్రారంభించిన సందర్భంగా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) అవతార్ మోంగా... సాక్షి బిజినెస్ బ్యూరో ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాలు చెప్పారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలివీ...

మైక్రో ఏటీఎంలపై ఫోకస్ పెడుతున్నామన్నారు కదా? అసలేంటివి? ఎలా పనిచేస్తాయి?

మైక్రో ఏటీఎం అంటే టెక్నాలజీ నిండిన ఒక ట్యాబ్లెట్ మాత్రమే. రేషన్ షాపులు, పెట్రోల్ బంకులు, కిరాణా, కూరగాయల దుకాణాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. ఆ డివైజ్‌పై కస్టమరు వేలి ముద్ర వేయగానే... తన బ్యాంక్ ఖాతా వివరాలొచ్చేస్తాయి. దీంతో ఒక ఖాతా నుంచి ఇంకో ఖాతాకు నగదు లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. కావాలంటే సంబంధిత పాయింట్ ఆఫ్ సేల్ నిర్వాహకుడి నుంచి నగదును తీసుకోవచ్చు. తన దగ్గరే జమ చేయొచ్చు కూడా. అది అప్పటికప్పుడు మీ ఖాతాలోకి కూడా చేరిపోతుంది. దీనికి ఎలాంటి నిర్వహణ చార్జీలుండవు. నగదు లావాదేవీలే కాదు... వాహన, గృహ, వ్యక్తిగత, రిటైల్, వ్యాపార రుణాలు, బీమా పథకాలు, వినియోగ బిల్లుల చెల్లింపుల వంటి సేవలన్నో దీని ద్వారా పొందొచ్చు. డెబిట్ కార్డుపై రూ.25 లక్షల ప్రమాద బీమా కవరేజీ కూడా ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే టెక్నాలజీ ఆధారంగా గ్రామీణులకు బ్యాంక్ సేవలందించడమే ఈ మైక్రో ఏటీఎంల ఉద్దేశం.

మరి ఈ మైక్రో ఏటీఎంలను ఎవరు ఏర్పాటు చేసుకోవచ్చు?

ఎవరైనా ముందుకు రావచ్చు. వారికి మా బ్యాంకులో కరెంట్ అకౌంట్ ఇస్తాం. దాని ద్వారానే వారు తమ చుట్టు పక్కలి వారికి సేవలందిస్తారు. దీనిపై వారికి కమీషన్ కూడా వస్తుంది. గ్రామాల్లో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారికి ఇది అదనపు ఆదాయంగా ఉంటుంది. స్థానికంగా చక్కని సంబంధాలున్న వారికి ప్రాధాన్యమిస్తున్నాం.

తెలంగాణలో ఇది తొలి బ్రాంచి కదా.. మరి కొత్త బ్రాంచీలకు సంబంధించి లక్ష్యాలేమైనా ఉన్నాయా?

2014 ఆగస్టులో ఐడీఎఫ్‌సీకి బ్యాంకు లైసెన్స్ వచ్చింది. ప్రస్తుతం 25 రాష్ట్రాల్లోని 670 ప్రాంతాల్లో 45 వేల గ్రామాల్లో సేవలందిస్తున్నాం. దేశంలో 13 వేల మైక్రో ఏటీఎంలు, 3,423 ఆధార్ పే కేంద్రాలు, 135 బ్రాంచీలు ఉన్నాయి. వీటిలో 100 బ్రాంచీలు గ్రామాల్లోనే ఉన్నాయి. ఇప్పటివరకు మాకు 24 లక్షల మంది కస్టమర్లున్నారు. ఇందులో తెలంగాణ నుంచి 15 లక్షల మంది ఉన్నారు. తెలంగాణలో 767 మైక్రో ఏటీఎంలు, 182 ఆధార్ పే కేంద్రాలున్నాయి. ఇక్కడ నెలకు 1.5 లక్షల లావాదేవీలు ఆధార్ పే ద్వారా జరుగుతుంది. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి మొత్తం 200 బ్రాంచీలు, వచ్చే ఏడాది మార్చి నాటికి 30 వేల మైక్రో ఏటీఎంల ఏర్పాటు లక్ష్యించాం. ఈ ఏడాది ముగిసేనాటికి హైదరాబాద్‌లో మరో 4 బ్రాంచీలతో పాటూ బెంగళూరులో 8, చెన్నైలో 5 శాఖలను ప్రారంభిస్తాం.

ఐడీఎఫ్‌సీ ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగానే ఉందా?

గతేడాది డిసెంబర్ నాటికి స్థూల రిటైల్, కార్పొరేట్ ఆస్తులు రూ.67,488 కోట్లుగా, నికర లాభం రూ.146.1 కోట్లుగా ఉంది. ఏటా 15 శాతం వృద్ధిని నమోదు చేస్తున్నాం. గతేడాది డిసెంబర్ నాటికి 8,668 మంది ఉద్యోగులున్నారు.

తెలంగాణలో ప్రత్యేకమైన సేవలందించే యోచనేమైనా ఉందా?

పెన్షన్లు, ఎల్పీజీ వంటి ఇతరత్రా సబ్సిడీలు, స్కాలర్‌షిప్స్, పౌర సరఫరాలు వంటి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) కోసం ఏపీతో ఒప్పందం చేసుకున్నాం. ఇది ఆధార్ అనుసంధానిత పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పీడీఎస్) ద్వారా పనిచేస్తుంది. ఈ సేవలను ప్రయోగాత్మకంగా తెలంగాణ సిద్ధిపేటలోని పలు రేషన్ షాపుల్లోనూ నిర్వహిస్తున్నాం. త్వరలోనే పూర్తి స్థాయిలో అధికారికంగా అందుబాటులోకి తెస్తాం. తర్వాత మహారాష్ట్ర, హరియాణాల్లోనూ ప్రారంభిస్తాం. విద్యుత్, మున్సిపల్ వంటి పలు ప్రభుత్వ విభాగాల్లోనూ ఐడీఎఫ్‌సీ మైక్రో ఏటీఎంల ఏర్పాటు కోసం ఆయా విభాగాలతో చర్చలు జరుపుతున్నాం. త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశాలున్నాయి.

2 నెలల్లో క్యాపిటల్ ఫస్ట్ విలీనం పూర్తి

విలీనం తర్వాత మిశ్రమ సంస్థ నిర్వహణ ఆస్తుల విలువ రూ.88 వేల కోట్లు

ఐడీఎఫ్‌సీతో క్యాపిటల్ ఫస్ట్ హోమ్ ఫైనాన్స్ విలీన ప్రక్రియకు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) బుధవారం అనుమతినిచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), ఇతర నియంత్రణ సంస్థల అనుమతులు రావాల్సి ఉందని.. మరో 2 నెలల్లో విలీన ప్రక్రియ పూర్తవుతుందని ఐడీఎఫ్‌సీ ఈడీ అవతార్ మోంగా విలేకరులతో చెప్పారు. విలీనం తర్వాత మిశ్రమ సంస్థ నిర్వహణ ఆస్తుల విలువ రూ.88 వేల కోట్లుగా ఉంటుందన్నారు. ''షేర్ హోల్డర్లకు 139:10 నిష్పత్తిలో షేర్లు జారీ చేయాలని ఇప్పటికే బోర్డులు నిర్ణయించాయి. అంటే 10 క్యాపిటల్ ఫస్ట్ షేర్లకు ఐడీఎఫ్‌సీ షేర్లు 139 వస్తాయి'' అని చెప్పారు.

పీఎన్‌బీ కేసులో బ్యాంకర్లతో త్వరలో కేంద్రం భేటీ



న్యూఢిల్లీ: భారీ కుంభకోణం కేసులో ఇతర బ్యాంకులకు పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) జరపాల్సిన చెల్లింపుల వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించడంపై కేంద్రం దృష్టి సారించింది. ఇందులో భాగంగా పీఎన్‌బీతో పాటు ఇతర బ్యాంకర్లతో కేంద్ర ఆర్థిక శాఖ త్వరలో భేటీ కానుంది. వజ్రాభరణాల డిజైనర్ నీరవ్ మోదీ సంస్థలకు లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్‌వోయూ) జారీ చేసిన పీఎన్‌బీ రూ. 11,400 కోట్ల స్కామ్‌లో ఇరుక్కున్న సంగతి తెలిసిందే. ఇతర బ్యాంకులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామంటూ స్కామ్ వెలుగుచూసిన సందర్భంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రధానంగా ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులు, పీఎన్‌బీకి మధ్య నెలకొన్న చెల్లింపుల వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాలని కేంద్రం భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందుకోసం కేంద్ర ఆర్థిక సేవల విభాగం.. ఈ వివాదంలో ఉన్న బ్యాంకుల అధికారులతో త్వరలో సమావేశం కానున్నట్లు వివరించాయి. ఈ కుంభకోణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం పడిన బ్యాంకుల్లో ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, యూనియన్ బ్యాంకు ఉన్నాయి.

ఖాతాదారులూ.. ఆందోళన వద్దు!

పంజాబ్ నేషనల్ బ్యాంక్ భరోసా

విత్‌డ్రాయల్స్‌పై ఆంక్షలు విధించామన్న వార్తలను పంజాబ్ నేషనల్ బ్యాంక్ కొట్టిపారేసింది. పుష్కలంగా మూలధన నిధులున్నాయని, ఖాతాదారులు, ఇన్వెస్టర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. ఈ స్కామ్ నేపథ్యంలో ఖాతాదారులు భయపడాల్సిన పనిలేదంటూ పీఎన్‌బీ బుధవారం ట్వీట్ చేసింది. ఈ స్కామ్ కారణంగా తలెత్తిన సమస్యలను తట్టుకునేలా పుష్కలంగా మూలధన నిధులున్నాయని పేర్కొంది. కరెంట్, సేవింగ్స్ ఖాతాల నిల్వలు (కాసా) పటిష్ఠంగా ఉన్నాయని, రుణ నాణ్యత స్థిరంగా ఉందని, డిజిటైజేషన్ జోరుగా ఉందని వివరించింది. తగినంతగా మూలధన నిధులతో పాటు కీలకం కాని ఆస్తులు కూడా పటిష్ఠంగానే ఉన్నాయని పేర్కొంది. ఈ పరిస్థితులను చక్కదిద్దగల స్థాయిలో ఉన్నామని, బ్యాంక్ ప్రయోజనాలను పరిరక్షించగలమని భరోసానిచ్చింది. విత్‌డ్రాయల్స్‌పై ఆంక్షలు విధించినట్లు కొన్ని చానెళ్లలో వస్తున్న వార్తలు నిరాధారమని పేర్కొంది.

ఇలాంటివి మళ్లీ జరగకూడదు: జైట్లీ



పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) స్కామ్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తొలిసారి స్పందించారు. అక్రమాలను గుర్తించేందుకు వీలుగా ప్రవేశపెట్టాల్సిన నూతన వ్యవస్థలు ఏంటన్న దానిపై పర్యవేక్షణ సంస్థలు దృష్టి సారించాలని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృత్తం కాకుండా చూడాల్సి ఉందన్నారు. బ్యాంకుల్లో మోసాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు ఆర్‌బీఐ ఇప్పటికే వైహెచ్ మాలేగమ్ అధ్యక్షతన ఓ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ''పన్ను చెల్లింపుదారులు బ్యాంకింగ్ వ్యవస్థలో అధికంగా ఇన్వెస్ట్ చేసి ఉన్నారు. ప్రధాని మోదీ చెప్పినట్టు ప్రభుత్వం బ్యాంకుల వాణిజ్య నిర్ణయాల్లో జోక్యం చేసుకోదు. బ్యాంకులు స్వతంత్రంగా పనిచేయాలని మేం కోరుకుంటున్నాం. మాలో ఎవరూ కూడా మీకు కాల్ చేయరు. మీరు సొంతంగా నిర్ణయాలు తీసుకోండి. మీకు ఇచ్చిన అధికారాన్ని సరైన విధంగా సమర్థవంతంగా వినియోగించుకోవాలి'' అని జైట్లీ సూచించారు.

ఇక క్రాస్ కరెన్సీ ట్రేడింగ్!

- 27 నుంచి బీఎస్‌ఈ, ఎన్ఎస్ఈల్లో డెరివేటివ్స్
- ఉదయం గం. 9 నుంచి రాత్రి గం. 7.30 వరకూ ట్రేడింగ్



న్యూఢిల్లీ: బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)ల్లో క్రాస్ కరెన్సీ డెరివేటివ్స్ ట్రేడింగ్ మొదలవుతోంది. ఈ నెల 27 నుంచి క్రాస్ కరెన్సీ డెరివేటివ్స్‌ను ప్రారంభిస్తున్నామని, క్రాస్ ఇండియన్ రూపీ (ఐఎన్ఆర్) ఆప్షన్స్‌ను కూడా ఆరంభిస్తామని బీఎస్ఈ వెల్లడించింది. ఉదయం 9 నుంచి రాత్రి 7.30 వరకూ ట్రేడింగ్ ఉంటుంది. ప్రస్తుతం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీలో (ఎంసీఎక్స్) కరెన్సీ ట్రేడింగ్‌కు మాత్రమే అనుమతి ఉంది. అంటే రూపాయి – డాలర్, రూపాయి – పౌండ్ స్టెర్లింగ్, రూపాయి – జపనీస్ యెన్‌లో మాత్రమే ట్రేడింగ్‌కు అనుమతి ఉంది. ఇకపై యూరో– అమెరికా డాలర్, పౌండ్ స్టెర్లింగ్– అమెరికా డాలర్, అమెరికా డాలర్– జపనీస్ యెన్ జోడీల్లో ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌కు తమకు సెబీ అనుమతినిచ్చినట్లు బీఎస్ఈ ఎమ్‌డీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆశీష్ కుమార్ చౌహాన్ చెప్పారు.

పీఎఫ్ రేటు 8.55 శాతానికి తగ్గింపు



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఈపీఎఫ్‌వో 2017–18 ఆర్థిక సంవత్సరానికి పీఎఫ్‌పై వడ్డీ రేటును 8.65 శాతం నుంచి 8.55 శాతానికి తగ్గించింది. దీంతో రూ. 586 కోట్ల మేర మిగులు నమోదు కానుందని ఈపీఎఫ్‌వో ట్రస్టీల సమావేశం అనంతరం కేంద్ర కార్మిక మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం 8.65 శాతం వడ్డీ రేటునివ్వడంతో.. రూ. 695 కోట్లు మిగులు నమోదైనట్లు వివరించారు. దాదాపు 6 కోట్ల చందాదారులపై ఇది ప్రభావం చూపనుంది. తాజా నిర్ణయానికి కార్మిక సంఘాలు సైతం అంగీకరించగలవని గంగ్వార్ ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఉమంగ్ మొబైల్ యాప్ ద్వారా ఈపీఎఫ్‌వో యూఏఎన్‌కి ఆధార్‌ను అనుసంధానం చేసుకునే సదుపాయాన్ని మంత్రి ఆవిష్కరించారు. అడ్మినిస్ట్రేటివ్ చార్జీలను 0.65 శాతం నుంచి 0.50 శాతానికి తగ్గించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) నిర్ణయించినట్లు గంగ్వార్ వివరించారు. అటు, ఇకపై పది మంది ఉద్యోగులున్న సంస్థలు కూడా ఈపీఎఫ్‌వో స్కీములో భాగమయ్యేలా చేయాలని సీబీటీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ నిబంధన 20 మంది పైగా ఉద్యోగులన్న సంస్థలకే వర్తిస్తోంది. తాజా నిర్ణయంతో ఈపీఎఫ్‌వో చందాదారుల సంఖ్య ప్రస్తుతమున్న 6 కోట్ల నుంచి దాదాపు 9 కోట్ల దాకా పెరగవచ్చని గంగ్వార్ పేర్కొన్నారు.

పెరగనున్న స్కోడా ధరలు

న్యూఢిల్లీ: స్కోడా ఆటో ఇండియా తన అన్ని మోడళ్ల ధరలను వచ్చే నెల నుంచి పెంచుతోంది. బడ్జెట్లో కస్టమ్స్ సుంకాలను పెంచడంతో అన్ని మోడళ్ల ధరలను 1 శాతం వరకూ (రూ.10,000 నుంచి రూ.35 వేల వరకూ) పెంచుతున్నామని తెలిపింది. దశలవారీగా కార్ల ధరలను మరింతగా పెంచుతామని పేర్కొంది. మోడళ్లను బట్టి భవిష్యత్తులో ధరల పెంపు 3 నుంచి 4 శాతం రేంజ్‌లో ఉంటుందని పేర్కొంది. ఈ కంపెనీ రూ.8.32 లక్షల ఖరీదు చేసే మిడ్ సైజ్ సెడాన్ రాపిడ్ నుంచి రూ.34.5 లక్షలు ధర ఉండే ఎస్‌యూవీ కోడియాక్ వరకు మోడళ్లను విక్రయిస్తోంది.



భూషణ్ స్టీల్ రేసు నుంచి లిబర్టీ హౌస్ అవుట్



న్యూఢిల్లీ: భూషణ్ స్టీల్ టేకోవర్ కోసం లిబర్టీ హౌస్ దాఖలు చేసిన బిడ్‌ను రుణదాతల కమిటీ (సీఓసీ) తిరస్కరించింది. బిడ్‌లు దాఖలు చేయడానికి చివరి తేదీ ఈ నెల 8 అని, కానీ ఇంగ్లండ్‌కు చెందిన లిబర్టీ హౌస్ ఈ నెల 20న బిడ్‌ను దాఖలు చేసిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అందుకే రుణదాతల కమిటీ లిబర్టీ బిడ్‌ను తిరస్కరించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇక భూషణ్ స్టీల్ రేసులో టాటా స్టీల్, జీఎస్‌డబ్ల్యూ స్టీల్ కంపెనీలే మిగిలాయి. బుధవారం జరిగిన సమావేశంలో ఈ రెండు కంపెనీల బిడ్‌ల వివరాలను సీఓసీకి నివేదించడం జరిగిందని, న్యాయ సలహాదారులు ఈ బిడ్‌లను మదింపు చేస్తున్నారని సమాచారం. వచ్చే నెల 6న జరిగే సీఓసీ సమావేశంలో భూషణ్ స్టీల్ ఎవరి పరమయ్యేది వెల్లడవుతుంది. అయితే సంబంధిత పరిణామాలపై వ్యాఖ్యానించడానికి రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ) మహేందర్ కుమార్ నిరాకరించారు. భూషణ్ పవర్ అండ్ స్టీల్ కంపెనీ రుణదాతలకు రూ.45,000 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. రుణ దాతలకు రూ.17,000 కోట్లు, భూషణ్ స్టీల్ కార్యకలాపాల కోసం రూ.7,200 కోట్లు ఇవ్వడానికి టాటా స్టీల్ ఆఫర్ చేసిందని సమాచారం.

'ఖాయిలా' జాబితాలు తయారవుతున్నాయ్: నీతి ఆయోగ్



న్యూఢిల్లీ: ప్రైవేటీకరణ చేయాల్సిన ఖాయిలా ప్రభుత్వ రంగ సంస్థల మరో జాబితాను నీతి ఆయోగ్ సిద్ధం చేస్తోంది. ఖాయిలా పడిన 40 పీఎస్‌యూల్లో వ్యూహాత్మక డిజిన్వెస్ట్‌మెంట్ అమలు చేయాలని ఇప్పటికే సూచించామని నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ వెల్లడించారు. ఈ విషయమై దీపమ్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్) కసరత్తు చేస్తోందని, ఈ ప్రక్రియ తుది దశలో ఉందని వివరించారు. ఖాయిలా పడిన పీఎస్‌యూలకు సంబంధించిన ఇప్పటికే నాలుగు జాబితాలను పంపించామని, ప్రస్తుతం ఐదో జాబితాను రూపొందిస్తున్నామని, ఆరు, ఏడో జాబితాలను కూడా రూపొందించనున్నామని పేర్కొన్నారు. పీఎస్‌యూ డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.80,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీటిల్లో సీపీఎస్‌ఈల్లో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.46,500 కోట్లు, వ్యూహాత్మక డిజిన్వెస్ట్‌మెంట్(పీఎస్‌యూలో వంద శాతం వాటా విక్రయం) ద్వారా రూ.15,000 కోట్లు, బీమా కంపెనీల లిస్టింగ్ ద్వారా రూ.11,000 కోట్లు సమీకరించనున్నారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా కేంద్రం రూ. లక్ష కోట్లు సమీకరించింది.

స్వల్పంగా పెరిగిన ఎఫ్‌డీఐలు...

ఇదిలాఉండగా, మన దేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల కాలంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) స్వల్పంగానే పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–డిసెంబర్ కాలానికి 3,594 కోట్ల డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయని పారిశ్రామిక విధాన, ప్రోత్సాహక విభాగం (డీఐపీపీ) వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇవి 3,584 కోట్ల డాలర్లుగా ఉన్నాయని, ఆ లెక్కన చూస్తే వృద్ధి కేవలం 0.27 శాతం మాత్రమే నమోదైందని పేర్కొంది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–డిసెంబర్ కాలానికి సేవల రంగంలో అత్యధికంగా ఎఫ్‌డీఐలు వచ్చాయని డీఐపీపీ వెల్లడించింది.

చైనా ఆధిపత్యానికి 'మందు'


- భారీ అవకాశాలతో ఊరిస్తున్న డ్రాగన్
- నియంత్రణ పరంగానూ పలు అనుకూలతలు
- ప్రాధాన్యాన్ని మార్చుకుంటున్న కంపెనీలు
- చైనా మార్కెట్లోకి కొత్త ఔషధాల విడుదల

న్యూఢిల్లీ: ప్రపంచంలో రెండో అతిపెద్ద ఫార్మా మార్కెట్ అయిన చైనాను మన కంపెనీలు ఇప్పటిదాకా పెద్దగా పట్టించుకోలేదనే చెప్పాలి. కాకపోతే స్వీయ రక్షణలతో అమెరికా మార్కెట్లో అమ్మకాలు తగ్గటం... కొత్త మార్కెట్లు, కొత్త అవకాశాల కోసం అన్వేషించాల్సి రావటంతో వీటి దృష్టి డ్రాగన్ దేశంపై పడింది. ఫలితం... 100 బిలియన్ డాలర్ల విలువైన చైనా మార్కెట్‌లో వాటా పెంచుకునేందుకు, బలోపేతం అయ్యేందుకు ఇవి ప్రయత్నాల్ని తీవ్రం చేశాయి. ఇప్పటికే సిప్లా, లుపిన్ సంస్థలు చైనా మార్కెట్లో నూతన అవకాశాల అన్వేషణలో ఉండగా, ఈ జాబితాలో డాక్టర్ రెడ్డీస్ కూడా చేరిపోయింది. ప్రపంచంలో అతిపెద్ద ఫార్మా మార్కెట్ అమెరికాలో భారత కంపెనీల హవా కొనసాగుతుండగా... రెండో అతిపెద్ద చైనా మార్కెట్‌లో మాత్రం స్థానిక కంపెనీలు, బహుళజాతి కంపెనీల ఆధిపత్యమే కొనసాగుతోంది. 100 బిలియన్ డాలర్ల విలువైన చైనా మార్కెట్లో (సుమారు రూ.6.4 లక్షల కోట్లు) భారత ఫార్మా కంపెనీల ఎగుమతుల వాటా 160 మిలియన్ డాలర్లు (రూ.1,024 కోట్లు) మాత్రమే. ఇటీవల నియంత్రణల పరంగా చేసిన మార్పులతో ఉత్పత్తులకు అనుమతులు వేగవంతం కావడం మొదలైంది. దీంతో చైనా మార్కెట్ భారత ఔషధ కంపెనీలను భారీ అవకాశాలతో ఊరిస్తోంది.

విదేశీ ట్రయల్ డేటాను (ఔషధ పరీక్షల సమాచారం) గుర్తించడంతోపాటు, ఔషధ అనుమతులను వేగవంతం చేసేందుకు మరింత మందిని నియమించుకోవాలని చైనా ఆహార, ఔషధ నియంత్రణ మండలి ఇటీవలే నిర్ణయించింది. ఇది భారత ఔషధ కంపెనీలకు మేలు చేసేదేనని నిపుణులు చెబుతున్నారు. భారత కంపెనీలు ఇప్పటి వరకు ప్రధానంగా అమెరికా, యూరోప్ మార్కెట్లపైనే ఎక్కువగా ఆధారపడ్డాయి. అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి ఆమోదించిన ఔషధాలను చైనాలోనూ వేగంగా అనుమతిలిచ్చేందుకు వీలుగా కొత్త నియంత్రణలు రావడం భారత కంపెనీలు డ్రాగన్ మార్కెట్‌లో పాతుకుపోవడానికి వీలు కల్పిస్తాయని ఎర్నెస్ట్ అండ్ యంగ్‌కు చెందిన శ్రీరామ్ శ్రీనివాసన్ పేర్కొన్నారు.

భారత కంపెనీల ప్రయత్నాలు

కొత్త అవకాశాల నేపథ్యంలో చైనా మార్కెట్లో యాంటీ కేన్సర్ ఔషధాలను ప్రవేశపెట్టేందుకు డాక్టర్ రెడ్డీస్ ప్రయత్నిస్తోంది. సిప్లా, వోకార్డ్ యాంటీ బయోటిక్స్, రెస్పిరేటరీ ఔషధాలను విడుదల చేయాలనుకుంటున్నాయి. ''అంకాలజీ ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన విభాగం. చైనాలో మా స్థానం మరింత బలోపేతం అయ్యేందుకు వీలుగా భాగస్వామ్య ఒప్పందాల కోసం చూస్తున్నాం'' అని డాక్టర్ రెడ్డీస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ రమణ తెలిపారు. వాస్తవానికి డాక్టర్ రెడ్డీస్ 20 ఏళ్ల నుంచి చైనా మార్కెట్లో ఉంది. 2 కోట్ల డాలర్ల (రూ.130 కోట్లు) విలువైన ఔషధాలను మార్కెట్ చేస్తోంది. ఇందులో యాక్టివ్ ఫార్మాస్యూటిక్ ఇంగ్రేడియెంట్స్ అమ్మకాలు కలిపిలేవు. రోటమ్ గ్రూపుతో కలసి జాయింట్ వెంచర్ కింద ఉత్పత్తులను మార్కెట్ చేస్తోంది. చైనాలోని 5,000 ఆస్పత్రులను కవర్ చేసే మార్కెటింగ్ బృందం కూడా ఉంది. ఇతర భారతీయ కంపెనీల పాత్ర డాక్టర్ రెడ్డీస్‌తో పోలిస్తే నామమాత్రమే. ర్యాన్‌బ్యాక్సీ (2014లో సన్ ఫార్మా సొంతమైంది) చైనా మార్కెట్లోకి ప్రవేశించినప్పటికీ 2009లో జాయింట్ వెంచర్ నుంచి తప్పుకుని, తన వాటాను భాగస్వామ్య కంపెనీకే అమ్మేసింది. కఠిన నియంత్రణల వల్ల చైనా మార్కెట్లో ఔషధాల విడుదల ప్రణాళికలను టోరెంట్ అటకెక్కించేసింది. 2013లో ఓ చైనా కంపెనీతో చర్చలు ప్రారంభించగా, తర్వాత అర్ధంతరంగా ఆగిపోయాయి. ఇక సిప్లా సైతం చైనాలో రెండు పెట్టుబడుల నుంచి పక్కకు తప్పుకుంది. అయినప్పటికీ ఈ సంస్థ కోర్ థెరపీ ఔషధాల విడుదలతో మరోసారి పోటీపడే ప్రయత్నాలు చేస్తోంది. కొనుగోలు లేదా భాగస్వామ్యం ద్వారా రెస్పిరేటరీ ఔషధాలను విడుదల చేయాలనుకుంటోంది. వోకార్డ్ యాంటీ బయోటిక్ ఔషధాలను ఎగుమతి చేసే ఆలోచనతో ఉంది. ఇందుకోసం స్థానిక కంపెనీలతో క్లినికల్ ట్రయల్స్ కోసం చర్చలు జరుపుతోంది. ఐదు యాంటీ బయోటిక్ ఔషధాలను అభివృద్ధి చేస్తోంది.




ఇప్పటికీ సవాలే?

చైనాలో నిర్వహణ వాతావరణం ఇప్పటికీ సవాళ్లతో కూడినదేనని అంతర్జాతీయ వైద్య సేవల సంస్థ ఐక్యూవీఐఏ పేర్కొంది. అయితే, బలమైన డిమాండ్, ఇన్నోవేటివ్ ఉత్పత్తులకు సత్వర అనుమతులు అన్నవి ఔషధ కంపెనీలను ఆకర్షిస్తున్నాయని తెలిపింది. సంస్కృతికి సంబంధించిన సవాళ్లు, మార్కెట్ ఏకీకృతంగా లేకపోవడం అవరోధమన్న అభిప్రాయాలున్నాయి. యూరోప్, జపాన్ మార్కెట్లో అధిక అవకాశాలు ఉండటం, చైనా మార్కెట్లో ఇబ్బందుల వల్ల ఆదేశ మార్కెట్‌పై భారత కంపెనీలు ఇప్పటి వరకు పెద్దగా దృష్టి పెట్టలేదని భారత ఫార్మాస్యూటికల్ అలియన్స్ జనరల్ సెక్రటరీ డీజీషా చెప్పారు. దీనిపై వోకార్డ్ ఛైర్మన్ హబిల్ ఖొరాకివాలా స్పందిస్తూ... ''చైనాలో అవకాశాలు వెదుకుతున్నాం. ఎందుకంటే యాంటీ బయోటిక్స్‌కు ఇది భారీ మార్కెట్'' అని చెప్పారు. విలువ పరంగా అమెరికాతో పోలిస్తే చైనా యాంటీ బయోటిక్స్ ఔషధ మార్కెట్ విలువ రెట్టింపు స్థాయిలో ఉంది.



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	-- / --	
మిర్చి (వరంగల్, తేజ)	-- / --	
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	-- / --	
ఉల్లి (కర్నూలు)	రూ.800 (కనిష్టం) / రూ.1,720 (గరిష్టం)	
చక్కెర (చెన్నై)	రూ.3,600	
బియ్యం (కరీంనగర్)	రూ. 3,800 (హెచ్ఎంటీ)	
కందిపప్పు (చెన్నై)	రూ.7,200	
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)	
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--	

ఐడియా క్యూఐపీ ఇష్యూ ధర రూ.82.50

రూ.3,500 కోట్లు సమీకరణ



న్యూఢిల్లీ: ఐడియా సెల్యులర్ కంపెనీ క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా రూ.3,500 కోట్లు సమీకరించింది. రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేర్‌ను రూ.72.50 ప్రీమియమ్‌తో రూ.82.50కు జారీ చేశామని ఐడియా సెల్యులర్ తెలిపింది. క్యూఐపీలో అర్హులైన క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు మొత్తం 42.42 కోట్ల షేర్ల జారీ ద్వారా రూ.3,500 కోట్లు నిధులు సమీకరించామని పేర్కొంది.

ట్యాబ్స్ మార్కెట్.. లెనొవొ టాప్..



బెంగళూరు: ప్రముఖ కన్సూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీ 'లెనొవొ ఇండియా' ఆండ్రాయిడ్ ట్యాబ్లెట్ వ్యాపారంలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. తాజాగా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 30.8 శాతం మార్కెట్ వాటాతో మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. కంపెనీ మొదటి స్థానంలో ఉండటం ఇది వరుసగా మూడో త్రైమాసికం. లెనొవొ ఇండియా.. ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) తాజా నివేదికను ఉటంకిస్తూ.. 2017–18 ఆర్థిక సంవత్సరపు మూడో త్రైమాసికంలోనూ శాంసంగ్, ఐబాల్ కంపెనీలను వెనక్కు నెట్టామని ప్రకటించింది. ఇక లెనొవొ ఇండియా ప్రధాన ప్రత్యర్థులైనా శాంసంగ్, ఐబాల్ మార్కెట్ వాటా వరుసగా 19.9 శాతంగా, 17.7 శాతంగా ఉంది.

భారత్ వృద్ధి 7% పైనే: యూబీఎస్



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు సమీప భవిష్యత్తులో చూస్తే, 7 శాతం ఎగువనే ఉండే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ– యూబీఎస్ తాజా నివేదిక తెలిపింది. విధానపరమైన సంస్కరణలు, అధిక పెట్టుబడులు, స్థిర అంతర్జాతీయ వృద్ధి ధోరణి వంటి అంశాలు ఇందుకు దోహదపడతాయని విశ్లేషించింది. మధ్యకాలికంగా చూస్తే, భారత్ వృద్ధి ధోరణి అంచనా ఇతర వర్ధమాన మార్కెట్లు– బ్రెజిల్ (వృద్ధి అంచనా 2.2 నుంచి 2.8 శాతం శ్రేణి), రష్యా (1.6–2.0), ఇండోనేషియా (5.4–5.8), చైనా (5.5–6.0) కన్నా బాగుంది.

మూడు రోజుల నష్టాలకు బ్రేక్

ఐటీ షేర్లకు లాభాలు

- ఎఫ్ అండ్ ఓ ముగింపు నేపథ్యంలో షార్ట్ కవరింగ్
- 141 పాయింట్ల లాభంతో 33,845కు సెన్సెక్స్
- 37 పాయింట్ల లాభంతో 10,397కు నిఫ్టీ



ఐటీ షేర్లలో కొనుగోళ్లు, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు రికవరీ కావడంతో బుధవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. దీంతో వరుస మూడు ట్రేడింగ్ సెషన్ల నష్టాలకు బ్రేక్ పడింది. ఐటీ షేర్లతో పాటు ఎఫ్ఎమ్‌సీజీ, ఆయిల్, గ్యాస్ షేర్లు పుంజుకున్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 141 పాయింట్ల లాభంతో 33,845 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 37 పాయింట్ల లాభంతో 10,397 పాయింట్ల వద్ద ముగిశాయి.

సానుకూలముగా అంతర్జాతీయ సంకేతాలు

ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియడం, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు దిగిరావడం, గురువారం నాడు ఫిబ్రవరి సిరీస్ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ కాంట్రాక్టులు ముగియనుండటంతో షార్ట్ కవరింగ్ చోటు చేసుకోవడం సానుకూల ప్రభావం చూపాయి. కొనుగోళ్ల జోరుతో సెన్సెక్స్ ఇంట్రాడేలో 208 పాయింట్లు లాభంతో 33,911 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 1 పాయింటు నష్టంతో 33,703 పాయింట్ల కనిష్ట స్థాయికి పడిపోయింది. ఆర్థిక రంగ, పీఎస్‌యూ, ప్రైవేట్ బ్యాంక్ షేర్లు లాభపడటంతో చివరకు 141 పాయింట్ల లాభంతో ముగిసింది.

ఐటీ షేర్లు అప్..

డిజిటల్ టెక్నాలజీల జోరుతో ఐటీ కంపెనీలకు మంచి అవకాశాలు అందనున్నాయన్న నాస్కామ్ అంచనాలు ఐటీ షేర్లను లాభాల బాట వైపు నడిపించాయి. టీసీఎస్ 3.3 శాతం లాభంతో రూ.3,043 వద్ద ముగిసింది. ఐటీసీ 2 శాతం, ఓఎన్‌జీసీ 1.6 శాతం చొప్పున పెరగ్గా, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, కోటక్ బ్యాంక్, యస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, మారుతీ సుజుకీ, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, విప్రో, డాక్టర్ రెడ్డీస్, కోల్ ఇండియా షేర్లు 1 శాతం వరకూ లాభపడ్డాయి. సన్‌ఫార్మా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, టాటా మోటార్స్, బజాజ్ ఆటో, ఎన్‌టీపీసీ, ఎల్ అండ్ టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్తాన్ యూనిలివర్, పవర్ గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టపోవడంతో లాభాలు పరిమితమయ్యాయి.

గీతాంజలి జెమ్స్ మరో 10 శాతం డౌన్..

గీతాంజలి జెమ్స్ నష్టాలు వరుసగా ఆరో ట్రేడింగ్ సెషన్‌లోనూ కొనసాగాయి. కంపెనీని మూసివేస్తున్నట్లు ఉద్యోగులకు వర్తమానం అందిందన్న వార్తల నేపథ్యంలో ఈ షేర్ 10 శాతం లోయర్ సర్క్యూట్‌తో రూ.27.46కు పడిపోయింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,465
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	28,622
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	9,27,430
ఎఫ్ఐఐ	-1,214
డీఐఐ	1,375

ఇంటర్నెట్ యూజర్లు @ 50 కోట్లు!



న్యూఢిల్లీ: దేశంలో ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య 2018 జూన్ నాటికి 50 కోట్లకు చేరుతుందని అంచనా. ఐఎంఏఐ–కంటర్ ఐఎంఆర్‌బీ సంయుక్త సర్వేలో ఈ విషయం వెల్లడయ్యింది. సర్వేలోని ముఖ్యాంశాలను పరిశీలిస్తే..

- 2017 డిసెంబర్‌లో ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 11.34 శాతం వృద్ధితో 48.1 కోట్లకు చేరింది.
- పట్టణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య 2017 డిసెంబర్ నాటికి వార్షిక ప్రాతిపదికన 9.66 శాతం వృద్ధితో 29.5 కోట్లకు చేరి ఉంటుందని అంచనా. ఇక ఇదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో వీరి సంఖ్య 14.11 శాతం వృద్ధితో 18.6 కోట్లకు పెరిగి ఉండొచ్చు.
- దేశీ మొత్తం ఇంటర్నెట్ యూజర్లలో విద్యార్థులు, యువత వాటా దాదాపు 60%.
- ఇంటర్నెట్‌ను ప్రతి రోజూ వినియోగిస్తున్న వారి సంఖ్య 18.29 కోట్లుగా ఉండొచ్చు.

నోయిడాలో పల్సస్ సెంటర్: శ్రీనుబాబు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తెలుగు రాష్ట్రాలకు చెందిన మెడికల్, హెల్త్‌కేర్ పబ్లిషింగ్ రంగంలోని పల్సస్ గ్రూప్... ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రం ద్వారా 1,000 మందికి ఉపాధి కల్పిస్తామని లక్నోలో జరిగిన ఉత్తర ప్రదేశ్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కంపెనీ సీఈఓ గేదెల శ్రీనుబాబు ప్రకటించారు. నైపుణ్య శిక్షణతోపాటు శాస్త్రీయ, ఆరోగ్య రంగ సాహిత్య సమాచారాన్ని ఇంగ్లీషు నుంచి భారతీయ భాషల్లోకి అనువదిస్తారు. సంస్థకు భారత్‌లో హైదరాబాద్‌తో పాటు చెన్నైలో కార్యాలయాలున్నాయి. త్వరలో గుర్గావ్‌లో కొత్త కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు శ్రీనుబాబు తెలియజేశారు.

వృద్ధి రేటు, ద్రవ్యోల్బణంపైనే దృష్టి

ఫిబ్రవరి 6–7 ఆర్‌బీఐ విధాన సమావేశం మినిట్స్‌లో వెల్లడి



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ఈ నెల 6–7 తేదీల్లో జరిపిన కీలక పరపతి సమీక్షలో దేశంలో ప్రస్తుత వృద్ధి, ద్రవ్యోల్బణంపైనే ప్రధాన చర్చ జరిగింది. ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలు కనబడుతున్నా, ఇప్పుడే ప్రారంభమైన ఆర్థిక రికవరీల నేపథ్యంలో ప్రస్తుతానికి రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణంపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6 శాతం) యథాతథంగా కొనసాగించడమే మంచిదన్న అంశానికి మెజారిటీ సభ్యుల మద్దతు లభించింది. ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీలో ఐదుగురు రేటు యథాతథ స్థితికి మద్దతు పలుకగా, ఒక్క ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ దేబబ్రత మాత్రం పావుశాతం రేటు పెంపునకు ఓటు చేశారు. పొంచిఉన్న ద్రవ్యోల్బణం సవాలును దీనికి ఆయన కారణంగా చూపారు. రేటు యథాతథ స్థితి 6 నెలల్లో ఇది వరుసగా మూడోసారి.

వచ్చే సమావేశంలోనూ రేటు యథాతథమే?

ద్రవ్యోల్బణం పెరిగేతే... రేటు పెంపు ఖాయమన్న సంకేతాలను ఫిబ్రవరి 6–7 పాలసీ సమావేశం ఇచ్చిందనే భావించవచ్చు. అయితే ఈ సమావేశం తరువాత, జనవరికి సంబంధించి రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు ఫిబ్రవరి 12వ తేదీన, టోకు ద్రవ్యోల్బణానికి సంబంధించి జనవరి గణాంకాలు 15న వెలువడ్డాయి. టోకు ద్రవ్యోల్బణం ఈ నెలలో ఆరు నెలల కనిష్ట స్థాయిలో 2.84 శాతంగా నమోదయ్యింది. రిటైల్ ద్రవ్యోల్బణం 5.07 శాతంగా నమోదయ్యింది. డిసెంబర్‌లో ఈ రేటు 17 నెలల గరిష్ట స్థాయిలో 5.21 శాతంగా ఉంది. ఇదే తీరున ద్రవ్యోల్బణం అదుపులో ఉంటే, వృద్ధికి ఎటువంటి విఘాతం కలగకుండా ఏప్రిల్ జరిగే పరపతి సమీక్షలో కూడా రెపో రేటును యథాతథంగా కొనసాగించే అవకాశం ఉంది. ప్లస్ 2, మైనస్ 2తో ద్రవ్యోల్బణాన్ని 4 శాతం వద్ద కట్టడి చేయాలన్నది ఆర్‌బీఐ లక్ష్యం.

మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక సెల్



వాషింగ్టన్: దేశీయంగా మహిళా వ్యాపారవేత్తల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారికి తోడ్పాటునిచ్చే దిశగా త్వరలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నట్లు నీతి ఆయోగ్ సభ్యురాలు ఆనా రాయ్ తెలిపారు. మహిళా ఎంట్రప్రెన్యూర్స్‌కి అందుబాటులో ఉన్న వివిధ పథకాలు, భాగస్వామ్య అవకాశాలు మొదలైన వాటిపై అవగాహన కల్పించడంపై ఇది ప్రధానంగా దృష్టి పెడుతుందని ఆమె వివరించారు. భారతీయ మహిళా వ్యాపారవేత్తలతో అమెరికాలో పర్యటిస్తున్న ఆనా రాయ్.. ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఈ విషయాలు తెలిపారు. ఉమెన్ ఎంట్రప్రెన్యూరల్ అండ్ ఇన్నోవేషన్ సెల్ ఆఫ్ నీతి ఆయోగ్ పేరిట ఏర్పాటు చేసే ఈ విభాగానికి ఆనా రాయ్ సారథ్యం వహిస్తారు. దాదాపు రూ. 10,000 కోట్ల ఫండ్ ఆఫ్ ఫండ్స్, ముద్రా స్కీమ్ మొదలైన వాటి ద్వారా ఇది మహిళా వ్యాపారవేత్తలకు ఆర్థిక తోడ్పాటు అందించడంతో పాటు వ్యాపార వృద్ధికి తగు సలహాలు కూడా ఇస్తుంది.

సీవోఏఐ ఆరోపణలకు అర్థం లేదు: ట్రాయ్

చట్టపరమైన మార్గాలను పరిశీలిస్తాం: సీవోఏఐ



న్యూఢిల్లీ: టెలికం రెగ్యులేటర్ ట్రాయ్ తాజాగా సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీవోఏఐ) ఆరోపణలను కొట్టిపారేసింది. నిరూపించలేని ఆరోపణలు చేయడం సరికాదని హెచ్చరించింది. జియో పేరు ప్రస్తావించకుండానే ట్రాయ్ ఆర్డర్లు ఒక ఆపరేటర్‌కు మాత్రమే లబ్ధి కలిగించేలా ఉన్నాయని సీవోఏఐ ఆరోపించిన విషయం తెలిసిందే. 'రెగ్యులేటరీ పారదర్శకంగా పనిస్తోంది. సీవోఏఐకి ట్రాయ్‌కు వ్యతిరేకంగా ఆరోపణలు చేయడం అలవాటుగా మారింది. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి' అని ట్రాయ్ సెక్రటరీ ఎస్‌కే గుప్తా చెప్పారు. సీవోఏఐ చేసిన ఆరోపణలకు అర్థం లేదని, నిరాధారమైనవని తెలిపారు.

తగిన మార్గాలను అన్వేషిస్తున్నాం: సీవోఏఐ

ట్రాయ్ రియాక్షన్‌పై సీవోఏఐ స్పందించింది. 'చట్టపరమైన మార్గాలను అన్వేషిస్తున్నాం. ప్రిడేటరీ ప్రైసింగ్‌కు (ఒక కంపెనీ ఇతర కంపెనీలు పోటీపడలేని స్థాయిలో తన సర్వీసులను తక్కువ ధరకు అందించడం. దీని వల్ల మిగిలిన కంపెనీలు చివరకు బలవంతంగా వాటి కార్యకలాపాలు మూసివేయాల్సి వస్తుంది) సంబంధించి ట్రాయ్ నిర్ణయాలకు వ్యతిరేకంగా మేం చేసిన ఫిర్యాదుల విషయమై వీలైతే టెలికం విభాగం, పీఎంవో కార్యాలయాలను సంప్రదిస్తాం' అని పేర్కొంది. భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి తమ ఆపరేటర్లు ఒకటి లేదా రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటారని సీవోఏఐ డైరెక్టర్ జనరల్ రాజన్ మాథ్యూస్ తెలిపారు. కాగా సీవోఏఐ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.. గత 12–18 నెలల్లో ట్రాయ్ తీసుకున్న నిర్ణయాలు ఒక ఆపరేటర్‌కు మాత్రమే అనుకూలముగా, మిగిలిన వాటికి ప్రతికూలముగా ఉన్నాయని ఆరోపించింది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,585	▼	200
బంగారం (99.5, 10గ్రా)	30,435	▼	200
వెండి (కిలో)	38,180	▼	130
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	29,120	▼	150
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,580	▼	150
బంగారం (22 క్యారెట్లు)	29,120	▼	150
వెండి (కిలో)	41,300	▼	100
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,300	▲	100
బంగారం (22 క్యారెట్లు)	28,980	▲	40
వెండి (కిలో)	39,400	▼	100
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,300	▼	729
బంగారం (22 క్యారెట్లు)	29,110	▼	250
వెండి (కిలో)	39,900	▼	1,100
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,500		
బంగారం (22 క్యారెట్లు)	29,150		
వెండి(కిలో)	39,500		
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,480	▼	170
బంగారం (22 క్యారెట్లు)	29,120	▼	150
వెండి (కిలో)	39,300	▼	100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.54 (రాత్రి 11.00కు)	$61.79 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	64.92 (రాత్రి 11.00కు)	$65.25 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 22-2-2018

విశాఖ	375-00
చిత్తూరు	403-00
వరంగల్	357-00
ముంబై	400-00
చెన్నై	410-00
విజయవాడ	375-00
గోదావరి	375-00
నమక్కల్	395-00
21-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	355-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	395
కోల్‌కతా	415
ఢిల్లీ	380

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	395.6	394.9
AMBUJA CEME	261.7	263.7
ASIAN PAINT	1127.2	1126.4
AXIS BANK L	535.8	531.7
BAJAJ AUTO	3012.6	3049.85
BAJAJ FINAN	1596.45	1638.75
BHARTI AIRT	419.65	418.1
[illegible]	[illegible]	[illegible]

A B C D

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
20 MICRONS	50.35	51
3M INDIA LI	20543.45	20497.95
5PAISA CAPI	350.6	333.95
63 MOONS TE	93.75	94.75
8K MILES SO	766.9	776.8
A AND M JUM	65.05	65.05
AARTI DRUGS	607.7	629.05
AARTI INDUS	1167.25	1169.95
ABAN OFFSHO	168.75	171.35
ABBOTT INDI	5640.3	5611.35
[illegible]	[illegible]	[illegible]
BAYER CROPS	3828.3	3834.95
BEARDSELL L	55.85	57.75
BEML LIMITE	1204.6	1222.35
BERGER PAIN	246.35	242.4
BETA DRUGS	146.5	147.5
BF INVESTME	318.45	320.75
BF UTILITIE	439.95	442.65
BGR ENERGY	118.75	119.05
BHAGERIA IN	290.15	288.75
BHANSALI EN	163.95	166.25
BHARAT BIJL	1427.9	1430.1
BHARAT FIN	969.2	988.7
BHARAT FORG	757.55	738.8
[illegible]	[illegible]	[illegible]
DHUNSERI TE	327.35	330.7
DIC INDIA L	520.35	528
DILIP BUILD	936.15	915.85
DISH TV IND	72.9	72.85
DISHMAN CAR	337.2	335.6
DIXON TECHN	3229.4	3114.15
DOLLAR INDU	422.4	424.35
DOLPHIN OFF	89.65	91.65
DONEAR IND.	62.35	63.4
DR. LAL PAT	905.1	906.1
DYNAMATIC T	1617.45	1663.05
DYNEMIC PRO	202.5	202.95

E F G H

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]
GUJ NAR VAL	462.1	463.8
GUJ STATE F	129.2	130.5
GUJ. APOLLO	215.75	222
GUJARAT ALK	757.25	748.7
GUJARAT AMB	233.75	234.35
GUJARAT FLU	748.1	767.95
GUJARAT GAS	860.75	854.15
GUJARAT MIN	139.55	140.15
GUJARAT PIP	142.7	142
GUJARAT STA	198.4	196.25
GULF OIL LU	1000.3	1010.15
GULSHAN POL	78.75	79.75
HARITA SEAT	914.75	913.45
[illegible]	[illegible]	[illegible]

I J K L

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]
JAYSHREE TE	100.9	101.9
JBF INDUSTR	159.8	163.9
JBM AUTO LI	435.9	438.1
JET AIRWAYS	745.9	751.75
JET KNITWEA	105	112
JHS SVEND.	68	69.05
JIND POL IN	65.2	65.5
JINDAL DRIL	161.45	160.55
JINDAL PHOT	62.9	63.05
JINDAL POLY	341.8	341.35
JINDAL SAW	136.4	133.8
JINDAL STAI	100.95	102.75
JINDAL STAI	184.5	190.65
[illegible]	[illegible]	[illegible]

M N O P

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
MANAPPURAM	105.8	106.75
MANG.CHEM.F	68.5	68.6
MANGALAM CE	334.45	336.75
MANGALAM DR	159.8	161.65
MANPASAND B	389.4	385
MARATHON NX	471.45	479.55
MAS FINANCI	603.15	617.65
MASTEK LTD	495.7	480.2
MATRIMONY.C	863.5	858.3
MAWANA SUGA	60.2	61.05
MAX FINANCI	499.7	499.35
MAX INDIA L	97.7	96.6
MAX VENTURE	77.75	79.3
[illegible]	[illegible]	[illegible]
PIONEER DIS	180.95	183.7
PLASTIBLEND	198.55	199.3
PNB HOUSING	1207.95	1202.85
PNC INFRATE	167	167.9
PODDAR HOUS	1171.1	1150
PODDAR PIGM	283.1	286.95
POKARNA LIM	210.2	212
POLY MEDICU	244.3	244.9
POLYPLEX CO	485.2	485.75
PONNIE SUGA	167.8	169.95
POWER MECH	903.7	887.15
PPAP AUTOMO	544.95	553.2
PRABHAT DAI	175.7	176
[illegible]	[illegible]	[illegible]

R S T U

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]
SHANKARA BL	1716.1	1707.3
SHANTHI GEA	138.9	140.1
SHARDA CROP	392	391.05
SHARDA MOTO	2281.5	2285.7
SHEELA FOAM	1599.9	1602.15
SHEMAROO EN	514.35	523.55
SHILPA MEDI	456.4	461.7
SHIPPING CO	74.65	76.9
SHIRPUR GOL	153.5	153.15
SHIVA TEXYA	537.65	535.1
SHIVAM AUTO	77.75	79.3
SHOPPERS ST	526.2	518.25
SHRE PUSH C	224.85	232.05
[illegible]	[illegible]	[illegible]
THE HI-TECH	431.8	438.2
THE INDIA C	158	158.55
THE INDIAN	132.65	135.8
THE MANDHAN	133.55	131.8
THE NEW IND	705	705.2
THE PHOENIX	585	594.15
THE RAMCO C	730.7	732.1
THE RUBY MI	324.25	331.7
THE STATE T	150.7	151.8
THE TINPLAT	232.05	233.05
THEMIS MEDI	558.45	567.55
THERMAX LTD	1147.45	1153.45
THIRUMALAI	2012.05	2012.85
[illegible]	[illegible]	[illegible]

V W X Z

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

బీఎస్ఈ ఎస్ఎంఈ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

రోడ్డెక్కితే గుండె దడే..

సాక్షి, అమరావతి

అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరిగిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. రెండేళ్ల క్రితం 7వ స్థానంలో ఉన్న ఏపీ 2017 నాటికి మూడో స్థానానికి చేరుకుంది. ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంద సంస్థలు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నా ప్రమాదాలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నా ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయని సుప్రీంకోర్టు కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అధిక వేగం, హెల్మెట్ వాడకపోవడం, సీటు బెల్ట్ పెట్టుకోకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

- రాష్ట్రంలో ఏటా పెరుగుతున్న రోడ్డు ప్రమాద మృతులు
- దేశంలోనే ఏడో స్థానం నుంచి మూడో స్థానానికి ఎగబాకిన రాష్ట్రం
- గతేడాది రహదారి భద్రత ఉల్లంఘన కేసులు 14 లక్షలకు పైగానే..
- ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు రోడ్ సేఫ్టీ కమిటీ

భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నివేదిక ప్రకారం గతేడాది (2017)లో అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో రహదారి భద్రతపై ఏర్పాటైన సుప్రీంకోర్టు సాధికారత కమిటీ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మరణాల విషయానికొస్తే.. ఏపీలో గతేడాది సంభవించిన మరణాలను 7.55 శాతంగా తేల్చారు. అదే 2015లో ఇది 5.7గా నమోదైంది. 2015లో రహదారి భద్రతపై అంతర్జాతీయ ప్రమాణాల కమిటీ, రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ సంయుక్తంగా ఓ నివేదిక వెల్లడించాయి. ఈ నివేదిక ప్రకారం ఉత్తరప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తర్వాత ఏపీ ఉండేది. అయితే, గతేడాది వెల్లడించిన నివేదిక ప్రకారం.. యూపీ, తమిళనాడు తర్వాత ఏపీ మూడో స్థానానికి చేరడం గమనార్హం. గణాంకాల ప్రకారం గతేడాది దేశవ్యాప్తంగా 30,045 రోడ్డు ప్రమాదాలు జరగగా.. 8,847 మంది మృత్యువాత పడ్డారు. కాగా, రాష్ట్రంలో రహదారి భద్రత కేసులు కూడా బెంబేలెత్తిస్తున్నాయి. గతేడాది 14 లక్షల కేసులు నమోదు చేసినట్లు సుప్రీంకోర్టు కమిటీకి రవాణా శాఖ నివేదిక సమర్పించింది. ఓవర్ స్పీడ్, ఓవర్ లోడింగ్, హెల్మెట్ లేకుండా బండి నడపడం, సీటు బెల్టు పెట్టుకోకపోవడం తదితరాలకు గాను కేసులు నమోదు చేసింది. కాగా, రహదారి భద్రతలో పోలీస్, రవాణా, ఆర్ అండ్ బీ, వైద్య, విద్యా శాఖలు కలిసి పనిచేస్తున్నాయని ఏపీ రోడ్ సేఫ్టీ కౌన్సిల్ తెలిపింది. ఇందుకోసం ప్రత్యేకంగా 18 మంది డీఎస్పీలను నోడల్ అధికారులుగా నియమించామని సుప్రీంకోర్టు కమిటీకి తెలిపింది. రోడ్ సేఫ్టీపై ఇన్ని చర్యలు చేపడుతుంటే ప్రమాదాల సంఖ్యతో పాటు మరణాల రేటు ఎందుకు పెరుగుతోందని ప్రశ్నించిన కమిటీ, దీనిపై సమగ్ర నివేదిక పంపించాలని ఆదేశించినట్లు సమాచారం.



	2014	2015	2016	2017
ప్రమాదాలు	23,512	23,178	23,726	30,045
మరణాలు	7,862	8,297	8,543	8,847
క్షతగాత్రులు	29,791	29,893	30,245	30,672

2017లో ఏ వాహనాలవల్ల ప్రమాదాలు.. మరణాలు సంభవించాయంటే..

వాహనం కేటగిరీ	ప్రమాదాలు	మరణాలు
ద్విచక్ర వాహనం	7,715	2,205
ఆటో రిక్షాలు	5,283	946
కార్లు, జీపులు	4,969	1,243
బస్సులు	3,254	784
ట్రక్కులు, టెంపోలు, ట్రాక్టర్లు	6,263	2,408
ఇతర మోటారు వాహనాలు	1,758	918
ఇతర వాహనాలు	803	343
మొత్తం	30,045	8,847

గతేడాది ఏ రోడ్డుపై ఎన్ని ప్రమాదాలు జరిగాయంటే..

రోడ్డు కేటగిరీ	ప్రమాదాల సంఖ్య	మృతులు	గాయపడిన వారు
జాతీయ రహదారి	10,477	3,335	10,816
రాష్ట్ర రహదారి	8,351	1,972	7,950
ఇతర రోడ్లు	11,217	3,540	11,906
మొత్తం	30,045	8,847	30,672

కేంద్రంపై ఒత్తిడి తెచ్చి న్యాయం చేస్తా

బాధిత రైతులకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హామీ



మీడియాతో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల/వేముల: యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) టెయిలింగ్ పాండ్ వ్యర్థాలు.. సాగు, తాగునీటిలో కలిసి కలుషితమవుతున్నా కంపెనీ పట్టించుకోకపోతే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి న్యాయం చేస్తానని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బాధిత రైతులకు హామీ ఇచ్చారు. బుధవారం వైఎస్సార్ జిల్లా కె.కె.కొట్టాల, కనంపల్లె గ్రామాల్లో కలుషిత సాగునీటితో దెబ్బతిన్న పంటలను, టెయిలింగ్ పాండ్‌ను కంపెనీ సీఎండీ హస్నానీతో కలిసి ఎంపీ పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ టెయిలింగ్ పాండ్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలా జరుగుతోందన్నారు. వ్యర్థ పదార్థం ఎండిపోయి తెల్లని పదార్థం ఏర్పడి గాలిలో కలుస్తుండటంతో ప్రజల ఆరోగ్యాలపై ప్రభావం పడుతోందన్నారు. ఇప్పుడు సీఎండీ పర్యటన నేపథ్యంలో కంపెనీ అధికారులు టెయిలింగ్ పాండ్‌లోకి నీటిని వదిలి తేమ ఉండేలా చేశారన్నారు. వ్యర్థ పదార్థం ఎప్పుడూ తేమతోనే ఉండాలని సీఎండీ అంటున్నారని, అయితే ఇక్కడ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వ్యర్థాలు తాగు, సాగునీటిలో కలుస్తున్నాయని చెప్పారు. ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సీఎండీ దృష్టికి తీసుకెళ్లడంతో పరిశీలించారన్నారు. వ్యర్థ జలాలు సాగునీటితో కలుషితం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం ఇవ్వాలని కోరామన్నారు. యురేనియం గ్రామాలైన కె.కె.కొట్టాల, మబ్బుచింతలపల్లె, తుమ్మలపల్లె, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె, కనంపల్లె గ్రామాలకు పార్నపల్లె తాగునీటిని అందించాలన్నారు. వచ్చే నెల 9 నాటికి సాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, ఈలోగా పరిష్కారం చూపకపోతే రైతులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

సమస్య పరిష్కరిస్తాం: యూసీఐఎల్ సీఎండీ హస్నానీ

టెయిలింగ్ పాండ్ వ్యర్థాలతో సాగునీరు కలుషితం కాకుండా చూస్తామని యూసీఐఎల్ సీఎండీ హస్నాని రైతులకు హామీ ఇచ్చారు. ఆయా గ్రామాల రైతులు రోడ్డుకు అడ్డంగా కూర్చొని సీఎండీ హామీ ఇవ్వాలని నిరసన తెలిపారు. పార్నపల్లె తాగునీటిని అందించాలని, దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలని, భూములను, ఇళ్లను తీసుకుని పునరావాసం కల్పించాలని తదితర డిమాండ్లను ఆయన ముందుంచారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పగా.. ప్రజలను మభ్యపెట్టవద్దని ఎలాంటి చర్యలు తీసుకుంటారో స్పష్టమైన హామీ ఇవ్వాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సూచించారు.

తెలుగులో తీర్పు చెప్పిన అమరరంగేశ్వరరావు



అవనిగడ్డ: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కృష్ణాజిల్లా అవనిగడ్డ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.అమరరంగేశ్వరరావు రెండు కేసులకు సంబంధించి తెలుగులో తీర్పు చెప్పారు. కోడూరు మండలం సాలెంపాలెంలో స్థల వివాదం కేసు, కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో నేరం రుజువు కాకపోవడంతో అమరరంగేశ్వరరావు వీటిని కొట్టివేస్తున్నట్టు ప్రకటించారు. వీటితో పాటు మరో మూడు రిమాండ్లను కూడా తెలుగులోనే తీర్పిచ్చారు.

నిర్వాసితులకు న్యాయం చేయకపోతే ఆమరణ దీక్ష: మధు

ఆమదాలవలస/సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లాలోని వంశధార రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేయకపోతే జిల్లా కేంద్రంలో ఆమరణ నిరాహారదీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు వెల్లడించారు. ఆమదాలవలసలోని సివిల్ జడ్జికోర్టుకు ఓ కేసు విషయమై బుధవారం హాజరైన ఆయన గాజులకొల్లివలస గ్రామానికి వెళ్లారు. అక్కడి వంశధార నిర్వాసితులను కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు.

'పశ్చిమ'లో నకిలీ నోట్ల మార్పిడి!

దేవరపల్లి: పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లిలో నకిలీ నోట్లు మార్పిడి చేస్తున్న ఇద్దరిని పోలీసులు సినీ ఫక్కీలో పట్టుకున్నారు. దేవరపల్లి-గోపాలపురం రోడ్డులోని టుబాకో బోర్డు సమీపంలో ఓ హోటల్ వద్ద నకిలీ నోట్లు మార్పిడి చేసే ముఠా ఉన్నట్లు బుధవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై పి.వాసు అప్రమత్తమై సిబ్బందితో హోటల్ వద్దకు చేరుకుని ముఠా సభ్యులను (ఇద్దరిని) చుట్టుముట్టారు. నిందితులు పోలీసులపై ఎదురుదాడికి దిగి తప్పించుకొనే ప్రయత్నం చేయగా, ఎస్సై వాసు గాల్లోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. దీంతో అక్కడున్న ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఎట్టకేలకు చాకచక్యంగా ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులన నుంచి రూ.2,000, 500, 200, 100 నకిలీ కరెన్సీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.2,10,900లని ఎస్సై తెలిపారు. వీరి వెనుక పెద్ద ముఠా ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల అదుపులో ఉన్న ఇద్దరు ముఠా సభ్యులు తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన వారుగా తెలిసింది.

శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ శంకర్‌నారాయణ



శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ శంకర్ నారాయణ

సాక్షి, తిరుమల: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శంకర్‌నారాయణ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆయన కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి విచ్చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. అనంతరం వారు శ్రీవారిని, వకుళమాతను దర్శించుకుని.. హుండీలో కానుకలు సమర్పించారు. జస్టిస్ శంకర్‌నారాయణకు ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్ ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ, ప్రసాదాలు అందజేశారు.

వన్డే సిరీస్‌లో భారత్ ఏకైక ఓటమికి కారణమైన హెన్రిక్ క్లాసెన్ టి20 మ్యాచ్‌లో మరోసారి విశ్వరూపం చూపించాడు. భారీ స్కోరు చేసిన తర్వాత గెలుపుపై భారత్ ఆశలు పెంచుకున్న మ్యాచ్‌ను ఒంటి చేత్తో లాగేశాడు. సప్త సిక్సర్లతో చెలరేగి తన జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. క్లాసెన్ జోరుకు చేతులెత్తేసిన యజువేంద్ర చహల్ రికార్డు స్థాయిలో పరుగులిచ్చి పరాభవంలో కీలక పాత్రగా మారాడు. క్లాసెన్‌కు తోడుగా కెప్టెన్ డుమిని కూడా జోరు ప్రదర్శించడంతో మిగతా భారత బౌలర్లు అసహాయంగా ఉండిపోయారు. అంతకుముందు పాండే చక్కటి బ్యాటింగ్, ధోని మెరుపు ప్రదర్శన కూడా తుది ఫలితం తర్వాత వెనక్కి వెళ్లిపోయాయి. ఇక పర్యటనలో ఆఖరి వేదికలాంటి చివరి టి20తోనే సిరీస్ విజేత ఎవరో తేలనుంది.

క్లాసెన్ కొట్టేశాడు


మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ క్లాసెన్


ధోని


పాండే

64 చహల్ 4 ఓవర్లలో ఇచ్చిన పరుగులు. అంతర్జాతీయ టి20ల్లో భారత్ తరఫున ఇదే అత్యంత చెత్త ప్రదర్శన. గతంలో జోగిందర్ శర్మ (57) పేరిట ఉన్న రికార్డును చహల్ సవరించాడు.

73 పేసర్ శార్దుల్ ఠాకూర్ ఈ మ్యాచ్‌తో టి20ల్లో అరంగేట్రం చేశాడు. భారత్ తరఫున అంతర్జాతీయ టి20 మ్యాచ్ ఆడిన 73వ ఆటగాడు శార్దుల్.

- రెండో టి20లో దక్షిణాఫ్రికా ఘనవిజయం
- ఆరు వికెట్లతో భారత్ ఓటమి
- రాణించిన పాండే, ధోని
- చివరి టి20 శనివారం

సెంచూరియన్: టి20 సిరీస్‌లో దక్షిణాఫ్రికా కోలుకొని కీలక గెలుపును అందుకుంది. బుధవారం ఇక్కడ జరిగిన రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఆరు వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. మనీశ్ పాండే (48 బంతుల్లో 79 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్సర్లు), మహేంద్ర సింగ్ ధోని (28 బంతుల్లో 52 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 56 బంతుల్లోనే అభేద్యంగా 98 పరుగులు జోడించడం విశేషం. అనంతరం దక్షిణాఫ్రికా 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 189 పరుగులు చేసింది. వికెట్ కీపర్ హెన్రిక్ క్లాసెన్ (30 బంతుల్లో 69; 3 ఫోర్లు, 7 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడగా... జేపీ డుమిని (40 బంతుల్లో 64 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) కూడా చెలరేగాడు. తాజా ఫలితంతో సిరీస్ ప్రస్తుతం 1–1తో సమమైంది. చివరిదైన మూడో టి20 ఈ నెల 24న కేప్‌టౌన్‌లో జరుగుతుంది.

మెరుపు భాగస్వామ్యం...

రెండు మెయిడిన్ ఓవర్లు... మూడు వికెట్లు... అద్భుతమైన స్వింగ్ బౌలింగ్... బౌండరీల జోరు... ఇవన్నీ భారత ఇన్నింగ్స్ పవర్‌ప్లేలో విశేషాలు. మోరిస్ వేసిన తొలి ఓవర్‌లో ధావన్ పరుగులేమీ చేయక పోగా, డాలా వేసిన రెండో ఓవర్ తొలి బంతికే రోహిత్ శర్మ (0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. అయితే తర్వాతి రెండు ఓవర్లలో భారత్ చెలరేగి 32 పరుగులు చేసింది. మోరిస్ వేసిన మూడో ఓవర్లో ధావన్ 2 సిక్సర్లు, 2 ఫోర్లతో 20 పరుగులు రాబట్టి లెక్క సరి చేయగా... తర్వాతి ఓవర్లో రైనా మూడు ఫోర్లు బాదాడు. కానీ ఎనిమిది బంతుల వ్యవధిలో ధావన్ (14 బంతుల్లో 24; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), కోహ్లి (1) వికెట్లు కోల్పోయి భారత్ ఇన్నింగ్స్ తడబాటుకు గురైంది. కోహ్లి వెనుదిరిగాక తర్వాతి 18 బంతుల్లో భారత్ ఒక ఫోర్ మాత్రమే కొట్టగలిగింది. ఈ దశలో షమ్సీ ఓవర్లో పాండే 2 భారీ సిక్సర్లు, ఫోర్ కొట్టి మళ్లీ ఊపు తెచ్చాడు. రైనా (24 బంతుల్లో 31; 5 ఫోర్లు)ను ఫెలుక్‌వాయో అవుట్ చేయడంతో 45 పరుగుల (31 బంతుల్లో) నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడిన పాండే 33 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అనంతరం మరో ఎండ్‌లో ధోని తనదైన శైలిలో చెలరేగాడు. చాలా కాలంగా దూకుడుకు దూరమైన ఈ మాజీ కెప్టెన్ చివరి రెండు ఓవర్లలో తన ప్రతాపం చూపించాడు. 19వ ఓవర్లో ఒక ఫోర్, సిక్సర్ కొట్టిన అతను... ప్యాటర్సన్ వేసిన ఆఖరి ఓవర్లో వరుసగా 6, 4, 4తో విరుచుకు పడ్డాడు. ఈ క్రమంలో 27 బంతుల్లోనే కెరీర్‌లో రెండో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తొలి 10 ఓవర్లలో 85 పరుగులు చేసిన భారత్... తర్వాతి పది ఓవర్లలో ఏకంగా 103 పరుగులు సాధించడం విశేషం. అనారోగ్యానికి గురైన బుమ్రా స్థానంలో భారత్ ఈ మ్యాచ్‌లో శార్దుల్ ఠాకూర్‌ను జట్టులోకి తీసుకుంది.

క్లాసిక్ ఇన్నింగ్స్...

ఛేదనలో దక్షిణాఫ్రికాకు కూడా సరైన ఆరంభం లభించలేదు. తొలి రెండు ఓవర్లలో ఆ జట్టు 3 పరుగులు మాత్రమే చేసింది. ఆ తర్వాత హెన్‌డ్రిక్స్ (17 బంతుల్లో 26; 5 ఫోర్లు) తాను ఆడిన ఆరు బంతుల్లో నాలుగు ఫోర్లు బాది జోరు పెంచే ప్రయత్నం చేశాడు. అయితే స్మట్స్ (2), హెన్‌డ్రిక్స్ తక్కువ వ్యవధిలోనే వెనుదిరగడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. ఈ దశలో డుమిని, క్లాసెన్ భాగస్వామ్యం సఫారీని ముందంజలో నిలిపింది. ముఖ్యంగా క్లాసెన్ అద్భుతమైన షాట్లతో చెలరేగాడు. ఉనాద్కట్ వేసిన ఓవర్లో రెండు భారీ సిక్సర్లు కొట్టిన అతను, చహల్ బౌలింగ్‌లో విరుచుకు పడ్డాడు. చహల్ తొలి ఓవర్లో సిక్సర్ కొట్టిన క్లాసెన్, అతని రెండో ఓవర్లో మరో రెండు సిక్సర్లు బాదాడు. ఈ క్రమంలోనే 22 బంతుల్లోనే క్లాసెన్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాత కూడా చహల్‌ను వదలకుండా మరుసటి ఓవర్లో వరుసగా 6, 6, 4తో బెంబేలెత్తించాడు. అదే ఓవర్లో డుమిని కూడా మరో సిక్సర్ కొట్టడంతో మొత్తం 23 పరుగులు వచ్చాయి. అయితే తర్వాతి ఓవర్ తొలి బంతికే క్లాసెన్‌ను అవుట్ చేసిన జైదేవ్ ఉనాద్కట్ భారత్‌కు కీలక వికెట్ అందించాడు. అయితే డుమిని, బెహర్దీన్ (16 నాటౌట్) ఐదో వికెట్‌కు 48 పరుగులు జత చేసి మరో 8 బంతులు మిగిలి ఉండగానే దక్షిణాఫ్రికాను గెలిపించారు.


చహల్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: శిఖర్ ధావన్ (సి) బెహర్దీన్ (బి) డుమిని 24; రోహిత్ శర్మ (ఎల్బీడబ్ల్యూ) (బి) డాలా 0; రైనా (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫెలుక్‌వాయో 31; కోహ్లి (సి) క్లాసెన్ (బి) డాలా 1; పాండే (నాటౌట్) 79; ధోని (నాటౌట్) 52; ఎక్స్‌ట్రాలు 1; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 188.

వికెట్ల పతనం: 1–0, 2–44, 3–45, 4–90.

బౌలింగ్: మోరిస్ 4–1–42–0, డాలా 4–1–28–2, ప్యాటర్సన్ 4–0–51–0, డుమిని 2–0–13–1, షమ్సీ 2–0–24–0, ఫెలుక్‌వాయో 2–0–15–1, స్మట్స్ 2–0–15–0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: హెన్‌డ్రిక్స్ (సి) పాండ్యా (బి) శార్దుల్ ఠాకూర్ 26; స్మట్స్ (సి) రైనా (బి) ఉనాద్కట్ 2; డుమిని (నాటౌట్) 64; క్లాసెన్ (సి) ధోని (బి) ఉనాద్కట్ 69; మిల్లర్ (సి) ఠాకూర్ (బి) పాండ్యా 5; బెహర్దీన్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (18.4 ఓవర్లలో 4 వికెట్లకు) 189.

వికెట్ల పతనం: 1–24, 2–38, 3–131, 4–141.

బౌలింగ్: భువనేశ్వర్ 3–0–19–0, శార్దుల్ ఠాకూర్ 4–0–31–1, ఉనాద్కట్ 3.4–0–42–2, పాండ్యా 4–0–31–1, చహల్ 4–0–64–0.



ప్రిక్వార్టర్స్‌లో సాయి ఉత్తేజిత

బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ గ్రేడ్–5 అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలుగు అమ్మాయి చుక్కా సాయి ఉత్తేజిత రావు శుభారంభం చేయగా... కుదరవల్లి శ్రీకృష్ణప్రియ, జక్కా వైష్ణవి రెడ్డి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సాయి ఉత్తేజిత 25–23, 21–16తో వైవోని లీ (జర్మనీ)పై విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. శ్రీకృష్ణప్రియ 11–21, 15–21తో లిన్నీ అలెజాండ్రా మైనకి (ఇండోనేసియా) చేతిలో... వైష్ణవి రెడ్డి 19–21, 17–21తో జూలీ జాకబ్సన్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో గురుసాయిదత్ 21–16, 21–11తో మూడో సీడ్ వైగోర్ కోలో (బ్రెజిల్)పై, సౌరభ్ వర్మ 21–11, 21–18తో మిషా జిల్బెర్మన్ (ఇజ్రాయెల్)పై, సమీర్ వర్మ 22–20, 21–10తో థామస్ రూక్సెల్ (ఫ్రాన్స్)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు.

'వింటర్'లో టాపర్‌గా...

జోర్జెన్ ఖాతాలో 14వ పతకం



ప్యాంగ్‌చాంగ్: వింటర్ ఒలింపిక్స్ చరిత్రలో అత్యధికంగా 14 పతకాలు గెలిచిన ప్లేయర్‌గా నార్వేకు చెందిన మారిట్ జోర్జెన్ చరిత్ర సృష్టించింది. తాజా ఒలింపిక్స్‌లో ఆమె ఖాతాలో నాలుగో పతకం చేరింది. స్కీయింగ్‌లో మెరిక అయిన జోర్జెన్ క్రాస్ కంట్రీ టీమ్ స్ప్రింట్ ఫ్రీ ఈవెంట్‌లో మైకెన్ కాస్పెర్సన్ ఫల్లాతో కలిసి కాంస్య పతకం గెలుచుకుంది. దాంతో 13 పతకాలతో నార్వే క్రీడాకారుడు ఒలె ఇనార్ జోర్న్‌డాలెన్ (నార్వే) పేరిట ఉన్న రికార్డును ఆమె తెరమరుగు చేసింది. ఏ ఒలింపిక్స్ (వింటర్, సమ్మర్)లోనైనా అత్యధిక పతకాలు గెలిచిన రెండో మహిళా అథ్లెట్‌గా 37 ఏళ్ల జోర్జెన్ ఘనత వహించింది. అలనాటి సోవియెట్ (ఇప్పటి ఉక్రెయిన్) జిమ్నాస్ట్ దిగ్గజం లారిసా లాతినినా సమ్మర్ ఒలింపిక్స్‌లో అత్యధికంగా 18 పతకాలు సాధించింది.

హైదరాబాద్‌కు నిరాశ

క్వార్టర్స్‌లో కర్ణాటక చేతిలో ఓటమి • విజయ్ హజారే ట్రోఫీ

న్యూఢిల్లీ: లీగ్ దశలో అద్భుతంగా రాణించిన హైదరాబాద్ జట్టు విజయ్ హజారే ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లో మాత్రం చేతులెత్తేసింది. కర్ణాటకతో బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్ 103 పరుగుల తేడాతో ఓడింది. తొలుత కర్ణాటక 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 347 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (111 బంతుల్లో 140; 12 ఫోర్లు, 7 సిక్సలు), వన్ డౌన్ బ్యాట్స్‌మన్ సమర్థ్ (124 బంతుల్లో 125; 13 ఫోర్లు) సెంచరీలు చేయడంతోపాటు రెండో వికెట్‌కు 242 పరుగులు జోడించారు. హైదరాబాద్ బౌలర్లలో సిరాజ్ (5/59) మినహా మిగతావారు విఫలమయ్యారు. 348 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ 42.5 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. అంబటి రాయుడు (62 బంతుల్లో 64; 6 ఫోర్లు, 2 సిక్సలు), టి.రవితేజ (57 బంతుల్లో 53; 9 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. ఒకదశలో 202/3తో పటిష్టంగా కనిపించిన హైదరాబాద్ శ్రేయస్ గోపాల్ (5/31), స్టువర్ట్ బిన్నీ (3/45) ధాటికి 42 పరుగులకే చివరి ఏడు వికెట్లు చేజార్చుకుంది. మరో క్వార్టర్ ఫైనల్లో మహారాష్ట్ర ఏడు వికెట్ల తేడాతో ముంబైను బోల్తా కొట్టించింది. గురువారం న్యూఢిల్లీలోనే జరిగే మిగతా రెండు క్వార్టర్ ఫైనల్స్‌లో ఢిల్లీతో ఆంధ్ర; సౌరాష్ట్రతో బరోడా తలపడతాయి.


మయాంక్

సిరీస్ చేజారదిక...

భారత్, దక్షిణాఫ్రికా మహిళల నాలుగో టి20 రద్దు

సెంచూరియన్: ఇప్పటికే దక్షిణాఫ్రికాపై వన్డే సిరీస్‌ను సొంతం చేసుకున్న భారత మహిళల జట్టు... టి20 సిరీస్‌నూ దక్కించుకునే అవకాశాన్ని సజీవంగా ఉంచుకుంది. ఇరు జట్ల మధ్య బుధవారం జరిగిన నాలుగో టి20 వర్షం కారణంగా రద్దయింది. భారత్ ప్రస్తుతం సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలో ఉంది. చివరిదైన ఐదో టి20 24న కేప్‌టౌన్‌లో జరగనుంది. ఒకవేళ ఆ మ్యాచ్‌లో భారత్ ఓడిపోయి నా సిరీస్ 2–2తో ముగుస్తుంది. భారత్ గెలిస్తే మాత్రం దక్షిణాఫ్రికా పర్యటనలో ఏకకాలంలో వన్డే, టి20 సిరీస్ నెగ్గిన జట్టుగా గుర్తింపు పొందుతుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా స్కోరు 15.3 ఓవర్లలో 130/3తో ఉన్న దశలో వర్షం వచ్చింది. వాన తగ్గకపోవడంతోఆట సాధ్యపడలేదు. దాంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. దక్షిణాఫ్రికా ఓపెనర్లు కెప్టెన్ నికెర్క్ (55; 2 సిక్సలు, 6 ఫోర్లు), లీజెల్లి లీ (58; 5 సిక్సలు, 2 ఫోర్లు) దూకుడుగా ఆడారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ రెండు వికెట్లు తీసింది.

సిక్సర్ వయా బౌలర్ హెడ్!

న్యూజిలాండ్ క్రికెట్‌లో అనూహ్య ఘటన

ఆక్లాండ్: క్రికెట్‌లో ఇకపై బౌలర్లు కూడా హెల్మెట్ పెట్టుకొని బంతులు వేయాల్సిన సమయం వచ్చిందేమో! న్యూజిలాండ్ దేశవాళీ క్రికెట్‌లో జరిగిన తాజా సంఘటన అలాంటి ఆందోళనకు కారణంగా మారింది. బ్యాట్స్‌మన్ ఆడిన బంతి నేరుగా బౌలర్ తలకు తగిలి ఆ తర్వాత సిక్సర్‌గా మారిన అనూహ్య ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఫోర్డ్ వన్డే ట్రోఫీలో భాగంగా ఆక్లాండ్, కాంటర్‌బరీ జట్ల మధ్య జరిగిన మూడో ప్రిలిమినరీ ఫైనల్లో ఇది జరిగింది. ఆక్లాండ్ బ్యాట్స్‌మన్ జీత్ రావల్ క్రీజ్‌లో ఉన్న సమయంలో కాంటర్‌బరీ కెప్టెన్ ఆండ్రూ ఎలిస్ ఇన్నింగ్స్ 19వ ఓవర్ బౌలింగ్ చేసేందుకు వచ్చాడు. మూడో బంతిని భారీ సిక్సర్ బాదిన రావల్, తర్వాతి బంతిని లాఫ్టెడ్ డ్రైవ్ ఆడాడు. అది నేరుగా బౌలర్ తల ముందు భాగంలో తగిలి బౌండరీ దాటింది. అంపైర్ దానిని ముందు ఫోర్‌గా ప్రకటించినా... ఆ తర్వాత అది సిక్స్‌గా తేలింది! ఆ వెంటనే ఎలిస్ ముందు జాగ్రత్తగా వైద్య పరీక్షల కోసం మైదానం వీడాడు. ప్రమాదం లేదని తేలడంతో తిరిగొచ్చి ఆ తర్వాత మరో ఆరు ఓవర్లు బౌల్ చేయడంతో పాటు బ్యాటింగ్‌లో 25 బంతులు ఎదుర్కొని 14 పరుగులు కూడా చేశాడు. ఎలిస్‌కు పెద్ద ప్రమాదం జరగకపోవడంతో బ్యాట్స్‌మన్ రావల్ ఊపిరి పీల్చుకున్నాడు. 'ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అతను మ్యాచ్‌లో కొనసాగడం నా బెంగ తీర్చింది. అయితే ఇలాంటి గాయం తగిలిన సందర్భాల్లో కాస్త ఆలస్యంగా తలకు సంబంధించిన సమస్యలు బయటపడతాయి. అయితే అది కూడా జరగకూడదని ప్రార్థిస్తున్నా' అని అతను చెప్పాడు. జీత్ రావల్ 149 పరుగుల సహాయంతో ఈ మ్యాచ్‌లో ఆక్లాండ్ 107 పరుగుల తేడాతో కాంటర్‌బరీపై విజయం సాధించింది.



ఆసీస్... అజేయంగా

ముక్కోణపు టి20 టోర్నీ ఫైనల్లో న్యూజిలాండ్‌పై విజయం

ఆక్లాండ్: అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్న ఆస్ట్రేలియా ముక్కోణపు టి20 టోర్నీలో విజేతగా నిలిచింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచి అజేయంగా ఫైనల్ చేరిన ఆసీస్... బుధవారం న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్లో 19 పరుగులతో గెలుపొందింది. తద్వారా కనీసం మూడు దేశాలు పాల్గొన్న టోర్నీలో ఆసీస్ మొదటిసారి చాంపియన్‌గా నిలిచింది. తొలుత న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. అనంతరం ఆస్ట్రేలియా 14.4 ఓవర్లలో 3 వికెట్లకు 121 పరుగులతో ఉన్న సమయంలో భారీ వర్షం కారణంగా ఆట సాధ్యపడలేదు. వర్షంవల్ల ఆట నిలిచే సమయానికి డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఆసీస్ విజయ సమీకరణం 102 పరుగులు. ఆసీస్ ఆ స్కోరుకంటే 19 పరుగులు ఎక్కువగానే చేయడంతో విజయం ఖాయమైంది. అంతకుముందు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అగర్ (3/27) ధాటికి కివీస్ ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది. గప్టిల్ (21; 2 ఫోర్లు, 1 సిక్స్), మున్రో (29; 3 ఫోర్లు, 2 సిక్సలు), రాస్ టేలర్ (43 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ప్రత్యర్థి బౌలర్లలో రిచర్డ్సన్, ఆండ్రూ టైలకు చెరో రెండు వికెట్లు దక్కాయి. ఓపెనర్లు వార్నర్ (25; 2 ఫోర్లు), షార్ట్ (30 బంతుల్లో 50; 6 ఫోర్లు, 3 సిక్సలు) చెలరేగడంతో ఆసీస్ సునాయసంగా లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. కానీ మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించడంతో తుది ఫలితం ఆసీస్ ఖాతాలోకి వెళ్లింది. మ్యాక్స్‌వెల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు దక్కింది. తాజా విజయంతో ఐసీసీ టి20 టీమ్ ర్యాంకింగ్స్‌లో పాకిస్తాన్, ఆసీస్ 126 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాయి. అయితే దశాంశాల్లో స్వల్ప తేడాతో పాక్ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది.



క్వార్టర్స్‌లో వికాస్



సోఫియా (బల్గేరియా): స్ట్రాండ్‌జా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లు వికాస్ కృషన్ (75 కేజీలు), అమిత్ పంఘల్ (49 కేజీలు), మనీశ్ పన్వర్ (81 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. రెండో రౌండ్ బౌట్‌లలో అమీర్ గినిఫిడ్ (మొరాకో)పై వికాస్... శర్విన్ (మారిషస్)పై అమిత్... ఆమిన్ (మొరాకో)పై మనీశ్ గెలుపొందారు. మరోవైపు మనోజ్ (69 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో అబ్దుల్ కబీర్ (మొరాకో) చేతిలో ఓడిపోయాడు.

పేస్ జంట ఓటమి

న్యూఢిల్లీ: డెల్‌రే బీచ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో లియాండర్ పేస్–పురవ్ రాజా (భారత్) జంట తొలి రౌండ్‌లోనే ఓడింది. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీ తొలి రౌండ్‌లో పేస్–పురవ్ ద్వయం 3–6, 2–6తో జాక్ సాక్–జాక్సన్ (అమెరికా) జోడీ చేతిలో ఓటమి పాలైంది.

నాకది పునర్జన్మ: సెరెనా

లాస్‌ఏంజెల్స్: మహిళలకు తొలి కాన్పు పునర్జన్మతో సమానం అనేది మనదగ్గర చెప్పుకొనే మాట. సరిగ్గా ఇలాంటి పరిస్థితినే అమెరికా టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ కూడా ఎదుర్కొంది. ఆమె గతేడాది సెప్టెంబర్‌లో అమ్మాయి (ఒలింపియా)కి జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా తీవ్ర ఆరోగ్య సమస్య ఎదురైనట్లు సెరెనా వివరించింది. 'బిడ్డ పుట్టాక నేను దాదాపు చనిపోయినంత పనైంది. నాకది నిజంగా పునర్జన్మే. గుండె స్పందన క్రమేపీ పడిపోతుండటంతో అత్యవసరంగా సిజేరియన్ చేయాల్సి వచ్చింది. అదృష్టవశాత్తూ శస్త్రచికిత్స విజయవంతమైంది. అంతకుముందే పాప పుట్టినట్లు తెలిసింది' అని వివరించింది. ధమనుల్లో గడ్డకట్టిన రక్తం ఊపిరితిత్తుల్లోకీ చేరనుండటం సెరెనాకు ఇబ్బంది తెచ్చిపెట్టింది. 'శస్త్రచికిత్స అనంతరం శ్వాస సమస్య తలెత్తింది. విపరీతమైన దగ్గు వచ్చింది. ఆస్పత్రివారు సీటీ స్కాన్ చేయించారు. ఉదర ప్రాంతంలో రక్త ప్రసరణ సమస్యను గుర్తించారు. ప్రాణాలు నిలిపే పరికరాలు బిగించారు. ఈ కారణంగా ఆరు వారాలపాటు మంచంపైనే ఉంటూ మాతృత్వ మధురిమలను ఆస్వాదించాల్సి వచ్చింది' అని వివరించింది. సెరెనా... ఈ నెలలో టెన్నిస్‌లోకి పునరాగమనం చేసింది. అక్క వీనస్‌తో కలిసి ఫెడ్ కప్ బరిలో దిగింది.



రాష్ట్రం పాలిట విలన్

- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్ సీపీ నేత పార్థసారథి మండిపాటు
- ప్రజలను వెన్నుపోటు పొడవటంలోనే చంద్రబాబు సీనియార్టీ
- నాడు విభజనకు సహకరించి నేడు హోదాను అడ్డుకుంటున్నారు



విజయవాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను నాశనం చేస్తున్న సీఎం చంద్రబాబు రాష్ట్రం పాలిట నంబర్ – 1 విలన్‌లా మారారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. గతంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి అన్యాయం చేసినా, నేడు బీజేపీ అన్యాయం చేస్తున్నా కారణం చంద్రబాబేనన్నారు. నాడు లేఖ రాసి రాష్ట్ర విభజనకు సహకరించిన చంద్రబాబు ఇప్పుడు ప్రత్యేక హోదా ఇవ్వొద్దంటూ కేంద్రానికి వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. బుధవారం విజయవాడలోని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు స్వార్థంతో రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు.

సీనియార్టీ వెన్నుపోటుకే: చంద్రబాబు ప్రత్యేక హోదాను పదేళ్లు సాధిస్తామని చెప్పి వెన్నుపోటు పొడిచారని పార్థసారథి విమర్శించారు. చంద్రబాబు సీనియార్టీ ప్రజలకు వెన్నుపోటు పొడిచేందుకు ఉపయోగపడిందని వ్యాఖ్యానించారు. నిన్నటి వరకు ప్యాకేజీ మేలు అని మాట్లాడిన ఆయన ఇప్పుడు ఎన్నికల భయంతో హోదా అంటూ కొత్త నాటకం ఆడుతున్నారని మండిపడ్డారు. 14వ ఆర్థిక సంఘానికి ప్రత్యేక హోదా అంశంపై మాట్లాడే అధికారం ఉందో లేదో కూడా తెలియని దౌర్భాగ్యస్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. ప్రత్యేక హోదా విషయంలో 14వ ఆర్థిక సంఘానికి ఎలాంటి సంబంధం లేదని ప్రతిపక్షనేత వైఎస్ జగన్ వందలసార్లు చెప్పినా పట్టించుకోలేదని మండిపడ్డారు.

ప్రజలకు క్షమాపణ చెప్పి తప్పుకోవాలి: నాలుగేళ్లుగా రకరకాల మాటలతో ప్రజలను ఎందుకు మభ్యపెట్టారో చంద్రబాబు సమాధానం చెప్పాలని పార్థసారథి డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ దీనిపై నిజ నిర్ధారణ కమిటీ వేయాలని సూచించారు. తన చేతగానితనం మూలంగా రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ప్రజలకు క్షమాపణ చెప్పి చంద్రబాబు వెంటనే రాజీనామా చేయాలన్నారు. 2014 ఎన్నికల్లో ఓటమి చెందినా ప్రత్యేక హోదా మంజూరు చేసి విభజన చట్టంలోని అంశాలను నెరవేర్చాలని వైఎస్ జగన్ నాయకత్వంలో ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిశామని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా కోసం గుంటూరులో వైఎస్ జగన్ వారం పాటు నిరాహార దీక్ష చేశారన్నారు.

విజయవాడకు షి'కారు'!

హైదరాబాద్ నుంచి విజయవాడ.. 250 కిలోమీటర్ల దూరం.. బస్సుల్లో వెళ్తే 6 గంటల ప్రయాణం. అమరావతి, గరుడ ప్లస్ వంటి ఆర్టీసీ ఏసీ బస్సుల్లో అయితే ఐదు గంటల్లో గమ్యం చేరవచ్చు. వీటికి రూ.580 వరకు టికెట్ ధర భరించాల్సి ఉంటుంది. మరి అదే ఏసీ ప్రయాణం, కేవలం మూడున్నర గంటల్లోనే గమ్యం చేరే అవకాశం, ప్రయాణ ఖర్చు రూ.500 మాత్రమే అయితే..!

మూడున్నర గంటలు.. రూ.500 చార్జి

- హైదరాబాద్–విజయవాడ మధ్య దూసుకుపోతున్న కార్లు
- ప్రైవేటు బస్సుల తరహాలో స్టేజి క్యారియర్ల అవతారం
- దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్ నుంచి ప్రయాణికుల రవాణా
- నెల రోజుల నుంచి మొదలైన దందా.. భారీ డిమాండ్..
- గంటకు 15 కార్ల వరకు పరుగులు.. ఆర్టీసీ ఏసీ బస్సుల కంటే తక్కువ ఖర్చు
- వేగంగా గమ్యానికి తీసుకెళుతుండటంతో ఆకర్షితులవుతున్న ప్రయాణికులు
- ప్రమాదాలు జరిగే అవకాశం.. పట్టించుకోని రవాణా శాఖ

సాక్షి, హైదరాబాద్

ప్రైవేటు బస్సులను మించిన ట్రావెల్ దందా మొదలైంది. కార్లు స్టేజీ క్యారియర్లుగా అవతారమెత్తాయి. హైదరాబాద్–విజయవాడ మధ్య ప్రయాణికులను భారీగా తరలిస్తున్నాయి. గరుడ ప్లస్, అమరావతి వంటి ఏసీ బస్సులకంటే వేగంగా గమ్యం చేరటంతోపాటు, తక్కువ ధర కావటంతో ప్రయాణికులు వాటికే ఎగబడుతున్నారు. దీంతో తవేరా, ఇన్నోవా, ఫార్చునర్ వంటి మూడు వరస సీట్లు ఉండే కార్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కొందరు వాహన యజమానులు సిండికేట్‌గా మారి సిబ్బందిని నియమించి ప్రయాణికులను వాటిలోకి ఎక్కేలా చేస్తున్నారు. నెల రోజులుగా ఈ తంతు జరుగుతున్నా ఇప్పటి వరకు అటు రవాణా శాఖ కానీ ఆర్టీసీ కానీ దృష్టి సారించలేదు.

మూడు గంటల్లోనే..

ఎంత తొందరగా ప్రయాణికులను గమ్యానికి చేరిస్తే.. ఆదరణ అంత ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశంతో కార్లలో ప్రయాణికులను ఎక్కించుకుని వాయువేగంతో దూసుకుపోతున్నారు. అర్ధరాత్రి వేళ అయితే కేవలం మూడు గంటల్లోనే గమ్యం చేరుస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్న ఆందోళన కలుగుతోంది. మరోవైపు ఆర్టీసీ బస్సులకు రావాల్సిన ప్రయాణికులు వీటికి మళ్లుతుండటంతో రవాణా శాఖ భారీగా నష్టపోతోంది. గతంలో ప్రైవేటు బస్సుల వల్ల తీవ్ర నష్టం జరుగుతోందని గగ్గోలు పెట్టిన ఆర్టీసీకి ఇప్పుడు వీటి రూపంలో మరో పెద్ద ప్రమాదం ముంచుకొచ్చింది.

ఉదయం అటు.. మధ్యాహ్నం ఇటు..

ఉదయం ఏడు గంటల నుంచి కార్ల హవా మొదలవుతోంది. ఉదయం వేళ ఎక్కువగా హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే వాహనాలు, మధ్యాహ్నం తర్వాత తిరిగి విజయవాడ నుంచి బయలుదేరుతున్నాయి. మూడు వరసల సీట్లు ఉండే ఈ కార్లలో ఏడు నుంచి ఎనిమిది మందిని ఎక్కించుకుంటున్నారు. దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్ల నుంచి ఇవి మొదలవుతున్నాయి. ముందస్తు సీటు రిజర్వు చేసుకునే అవసరం లేకపోవటం, రోడ్డు మీదకు రాగానే సిద్ధంగా ఉంటుండటంతో ప్రీమియం కేటగిరీ బస్సుల్లో ఎక్కే ప్రయాణికులు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ఉదయం విజయవాడకు వెళ్లి పని చూసుకుని తిరిగి సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చేవారు ముందే వాహనంలో సీటు రిజర్వు చేసుకునే వెసులుబాటు కూడా వీటిలో కల్పిస్తున్నారు. గతంలో హైదరాబాద్‌లో ట్రావెల్స్‌లో తమ వాహనాన్ని ఉంచిన కొంతమంది సిండికేట్‌గా మారి ఈ దందా ప్రారంభించారు. దీంతో వారి మధ్య మంచి అవగాహన ఉంది. ఏ కారు ఎక్కడుందనే సమాచారం వారి మధ్య ఉంటోంది. ఉదయం తన కారులో వచ్చిన ప్రయాణికులు తిరిగి విజయవాడలో బయలుదేరేప్పుడు ఏ కారులో వెళ్లవచ్చో ఆ డ్రైవరే చెబుతున్నాడు. సంబంధిత కారు డ్రైవర్ ఫోన్ నంబర్ కూడా ఇస్తుండటంతో పని సులవవుతోంది.



ఎల్బీ నగర్ చౌరస్తా వద్ద విజయవాడకు వెళ్లే కారు ఎక్కుతున్న ప్రయాణికులు

గంటకు 12 నుంచి 15 కార్లు

దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, అటు విజయవాడల్లోని ప్రధాన ప్రాంతాల్లో ఈ కార్లను వరుస ప్రకారం నియంత్రించేందుకు కొందరు సిబ్బందిని కూడా నియోగించారు. ఆ సిబ్బంది ముందు వచ్చిన కారులో ప్రయాణికులను ఎక్కించిన తర్వాత వెనక కారుకు మళ్లిస్తారు. బస్సు కోసం వేచి చూసే ప్రయాణికుల వద్దకు వెళ్లి ఏసీ కార్లు అందుబాటులో ఉన్నాయని, ఆర్టీసీ బస్ చార్జి కంటే తక్కువ ధరకే సిద్ధమని, గంటన్నర ముందే గమ్యం చేరుకోవచ్చంటూ ప్రయాణికులను మళ్లిస్తున్నారు. గంటకు 12 నుంచి 15 వరకు కార్లు వరస కడుతున్నాయి.

దృష్టి సారించని రవాణా శాఖ

పలు ప్రైవేట్ బస్సులు, తుఫాన్ వాహనాలు కూడా ఎల్‌బీ నగర్ బస్టాండ్‌లోనే తిష్టవేసి ప్రయాణికులను పిలిచి ఎక్కించుకుంటున్నా రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీని వల్ల ఆర్టీసీ భారీగా నష్టపోతుందని, దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఓ డిపో మేనేజర్ వ్యాఖ్యానించారు. 'నెల రోజులుగా ఈ కార్ల హవా పెరిగిందని సిబ్బంది నుంచి సమాచారం అందింది. వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నాం' అని విజయవాడకు ఎక్కువగా ప్రీమియం కేటగిరీ బస్సులు తిప్పే డిపో మేనేజర్ వ్యాఖ్యానించారు.

మార్కాపురం విద్యార్థికి గ్రూప్-1లో ఫస్ట్ ర్యాంక్

- సెకండ్ ర్యాంక్ దక్కించుకున్న శ్రీకాకుళం యువతి
- మహిళా విభాగంలో గుంటూరు యువతికి రెండో ర్యాంక్



ఆకుల వెంకట రమణ



హేమలత



దామరచర్ల శైలజ

మార్కాపురం/రాచర్ల/సాక్షి ప్రతినిధి శ్రీకాకుళం/దాచేపల్లి (గురజాల): 2011 గ్రూప్– 1 ఫలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ఇందులో 489.5 మార్కులు సాధించి ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన ఆకుల వెంకట రమణ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. రమణ బీటెక్ చదివేటప్పుడే తండ్రి శ్రీరాములు మృతి చెందగా, తల్లి లక్ష్మీనరసమ్మ రెండేళ్ల కిందట మరణించింది. ప్రస్తుతం రమణ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. కాగా, ఇదే జిల్లా గిద్దలూరు మండలం సూరేపల్లెకు చెందిన ఖాజావలి బీసీ–ఈ కేటగిరీలో మొదటి ర్యాంక్ సాధించారు.

మహిళల్లో మొదటి ర్యాంక్ సాధించిన హేమలత

శ్రీకాకుళం జిల్లా ఇప్పిలి గ్రామ శివారు కనుగులవానిపేటకు చెందిన కనుగుల హేమలత 470 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్, మహిళా విభాగంలో మొదటి ర్యాంక్ పొందారు. ప్రస్తుతం ఆమె విజయనగరం జిల్లా పార్వతీపురంలో పంచాయతీరాజ్ విభాగం డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె విజయంతో తల్లిదండ్రులు ప్రసాదరావు, సుజాత ఆనందం వ్యక్తం చేశారు. హేమలత భర్త నర్సీపట్నం డివిజన్‌లో రేంజ్ ఆఫీసర్‌గా ఉన్నారు.

మహిళల విభాగంలో రెండో ర్యాంక్ శైలజ సొంతం

గ్రూప్–1 (2011) పరీక్ష ఫలితాల్లో 434 మార్కులు సాధించి గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన దామరచర్ల శైలజ మహిళల విభాగంలో రెండో ర్యాంక్, జనరల్ విభాగంలో 15వ ర్యాంక్ సాధించారు. పెదయలమంద, లక్ష్మీదేవి దంపతుల రెండో కుమార్తె అయిన శైలజ తండ్రి 11 ఏళ్ల కిందట మరణించడంతో తల్లి కష్టపడి చదివించింది.

హోదాతోనే భవితకు బంగారు బాట

- చంద్రబాబు ఊసరవెల్లిలా మాటలు మార్చుతున్నారు
- రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు, ప్రజా సంఘాలు
- ప్రత్యేక హోదా... ఆంధ్రుల హక్కు అని నినదించిన విద్యార్థులు



'హోదా కోసం ఎందాకైనా' కార్యక్రమంలో మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

సాక్షి, విజయవాడ: రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోనే యువతకు బంగారు భవిష్యత్ ఉంటుందని, అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఊసరవెల్లి రంగులు మార్చినట్లు మాట మార్చుతూ తన కేసులతో కేంద్రానికి లొంగి హోదాను తాకట్టు పెట్టారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. 'సాక్షి' ఆధ్వర్యంలో 'హోదా కోసం ఎందాకైనా' పేరిట కేఎస్ఆర్ లైవ్ షో రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం విజయవాడ పటమటలోని రఘురామ కళ్యాణ వేదికలో జరిగింది. ప్రముఖ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లైవ్‌షోలో పలు రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రెండున్నర గంటలపాటు జరిగిన ఈ లైవ్‌షో ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగింది. 'ప్రత్యేక హోదా... ఆంధ్రుల హక్కు' అంటూ విద్యార్థులు, ప్రజలు నినదించారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు పదేళ్లు కావాలన్న నాయకులు నేడు మొహం చాటేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రత్యేక హోదాతో రాష్ట్రాభివృద్ధి చెందుతుందన్న చంద్రబాబు, ముడుపులు దండుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించారని దుయ్యబట్టారు.

రాజధానితో రియల్ ఎస్టేట్ వ్యాపారం

తనపై ఉన్న వ్యక్తిగత కేసులతో హోదాను కేంద్రానికి తాకట్టు పెట్టిన చంద్రబాబు, రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని రాజధాని రైతు, రైతుకూలీ సంఘం పరిరక్షణ సమితి కన్వీనర్ అనుమోలు గాంధీ ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదా వస్తేనే రాష్ట్రానికి పరిశ్రమలు తరలివస్తాయని, యువత, విద్యార్థులకు ఉద్యోగాలు వస్తాయని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం కృష్ణాజిల్లా అధ్యక్షులు డాక్టర్ మోహబూబ్ షేక్ చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా చంద్రబాబు అసమర్థతతోనే రావడం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ తాతినేని పద్మావతి ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా అంశంపై చంద్రబాబు ఊసరవెల్లి రంగులు మార్చినంత సులభంగా తన మాటలను మారుస్తున్నాడని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ దుయ్యబట్టారు. తిరుపతిలో నరేంద్ర మోడి, చంద్రబాబునాయుడు కలిసి ప్రత్యేకహోదా ఇస్తామని ప్రకటన చేశారని రాజధాని ప్రాంత సీపీఎం కార్యదర్శి సీహెచ్ బాబూరావు గుర్తుచేశారు. ఆ సమయంలో 14 ఫైనాన్స్ కమిషన్, నీతి అయోగ్‌లు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు.

ఉద్యోగాల కోసం పొరుగు రాష్ట్రాలకు..

'జాబు రావాలంటే బాబు రావాలని గత ఎన్నికల్లో ప్రచారం హోరెత్తించారు. అధికారంలోకి వచ్చి నాలు గేళ్లయింది. ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలి. ఇక్కడ కంపెనీలు లేక ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తుంది. ప్రత్యేక హోదా వస్తే కంపెనీలు ఏర్పాటవుతాయి. ఉద్యోగాలు లభిస్తాయి' అని పలువురు విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త బొప్పన భవకుమార్, విద్యార్థి విభాగం నగర అధ్యక్షులు దొడ్డా అంజిరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఎం నగర కార్యదర్శి దోనేపూడి కాశీనాథ్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు పోతిన వెంకటరామారావు, మహిందర్ సింగ్, కాంగ్రెస్ నాయకులు కొలనుకొండ శివాజీ, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు గంగాభవానీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర నేత ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరాజు, విష్ణుకుమార్, తుమ్మల పద్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏసుబాబు, నాయకులు ప్రవీణ్, కోటి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ ఉల్లంఘనులపై చర్యలు

21 మందిని డిస్క్వాలిఫై, డిబార్ చేసిన ఏపీపీఎస్సీ

సాక్షి, అమరావతి: గ్రూప్2–2016 మెయిన్స్ పరీక్షల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చర్యలు ఖరారు చేసింది. మొత్తం 21 మంది అభ్యర్థులపై డిస్క్వాలిఫై, డిబార్ వంటి చర్యలు చేపట్టింది. మెయిన్స్ పరీక్షలో కొన్ని కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడం, తరువాత ఆయా కేంద్రాల్లో కొంత గందరగోళ పరిస్థితులు ఏర్పడడం తెలిసిందే. మాస్ కాపీయింగ్ వంటి ఆరోపణలు కూడా కమిషన్‌పై వచ్చాయి. స్క్రీన్ షాట్లు బయటకు వచ్చాయని, తద్వారా కాపీయింగ్‌కు అవకాశం కల్పించారన్న విమర్శలు అభ్యర్థుల నుంచి వచ్చాయి. చివరకు దీనిపై న్యాయవివాదాలు కూడా నడిచాయి. ఇటీవల న్యాయస్థానాల నుంచి తీర్పుల అనంతరం ఫలితాలను కమిషన్ విడుదల చేసింది. అప్పట్లో గందరగోళం ఏర్పడిన కేంద్రాల్లోని కొందరు అభ్యర్థులపై అందుక కారకులుగా గుర్తించి చర్యలు చేపట్టాలని కమిషన్ భావించింది. వీటిపై ఈనెల 3న ఆయా అభ్యర్థుల వాదనలు కూడా కమిషన్ ఆలకించింది. అనంతరం ఆయా కేంద్రాల్లోని సీసీ పుటేజీలను కూడా పరిశీలించింది. దీనిపై గురువారం కమిషన్ సమావేశమై చర్యలపై తుది నిర్ణయం తీసుకుంది. అభ్యర్థుల వారీగా తీసుకున్న చర్యలతో కూడిన జాబితాను కమిషన్ తన వెబ్‌సైట్లో పొందుపరిచింది. కొందరిని డిస్క్వాలిఫై చేయగా కొందరిని నిర్ణీత కాలపరిధిమేర డిబార్ చేసింది.

నరిశెట్టి రాజుకు ఎన్ఆర్ చందూర్ జగతి పురస్కారం

ఢిల్లీలో ప్రదానం చేసిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నరిశెట్టి రాజు

సాక్షి, న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయి మీడియా సంస్థల్లో ఉన్నతస్థాయిలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న తెలుగుతేజం, ప్రముఖ జర్నలిస్టు, అమెరికాకు చెందిన గిజ్‌మోడో మీడియా గ్రూప్ సీఈవో నరిశెట్టి రాజు ఈ ఏడాదికిగానూ ఎన్ఆర్ చందూర్ జగతి పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి నివాసంలో జరిగిన కార్యక్రమంలో వెంకయ్యనాయుడి చేతుల మీదుగా నరిశెట్టి రాజు పురస్కారాన్ని అందుకున్నారు. ప్రముఖ జర్నలిస్టు ఎన్ఆర్ చందూర్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు, అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు స్మారక సమితి ఏటా ఉత్తమ జర్నస్టులకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. తెనాలి పాత తాలూకాలోని చేబ్రోలుకు చెందిన నరిశెట్టి రాజు జర్నలిజంలో చేరిన కొత్తలో తెలుగు, ఆంగ్ల పత్రికల్లో పని చేశారు. అనంతరం అమెరికాలోని డేటన్ డైలీ న్యూస్, వాల్ స్ట్రీట్ జర్నల్, వాషింగ్టన్ పోస్ట్‌ల్లో రిపోర్టర్ స్థాయి నుంచి మేనేజింగ్ ఎడిటర్ స్థాయికి ఎదిగారు. అనంతరం స్వదేశానికి వచ్చి మింట్ పత్రికను స్థాపించిన రాజు ప్రస్తుతం గిజ్‌మోడో మీడియా గ్రూప్‌కు సీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తుండడంతోపాటు వికీమీడియా ఫౌండేషన్ బోర్డులో ట్రస్టీగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు, ఉపరాష్ట్రపతి సతీమణి ఉషా, కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.